# తాళ్ళపాక పద సాహిత్యం

**నాలుగవ సంపుటం**

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం,

గుంటూరు

రేకు: 0301-01 రామక్రియ సం: 04-001 కృష్ణ

పల్లవి: ఎక్కడికంసుడు యిఁక నెక్కడిభూభారము
చిక్కువాప జనియించె శ్రీకృష్ణుఁడు

చ. 1: అదివో చంద్రోదయ మదివో రోహిణిపొద్దు
అదన శ్రీకృష్ణుఁడందె నవతారము
గదయు శంఖచక్రాలు గల నాలుగుచేతుల
నెదిరించి యున్నాఁడు ఇదివో బాలుఁడు

చ. 2: వసుదేవుఁడల్ల వాఁడే వరుస దేవకి యదే
కొసరే బ్రహ్మాదుల కొండాట మదే
పొసఁగఁ బొత్తులమీఁదఁ బురుఁటింటి లోపల
శిసువై మహిమ చూపె శ్రీకృష్ణుఁడు

చ. 3: పరంజ్యోతిరూప మిదె పాండవుల బ్రదికించె
అరిది కౌరవులసంహారమూ నిదె
హరికర్యము లీరో జయంతి పండుగ సేయరో
కెరలి శ్రీవేంకటాద్రి కృష్ణుఁడితఁడు

రేకు: 0301-02 దేసాళం సం: 04-002 అధ్యాత్మ

పల్లవి: నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించఁ జెయ్యెగ్గేఁగాని

చ. 1: సేయరాని పాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో నింద్రియకింకరుఁడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను

చ. 2: వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి
యేగతిఁ గొసరి నీపై నేఁట వేసేము
అగడపు బంగారుకాతుమనే నమ్ముకొని
భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము

చ. 3: కలుపుట్టుగుబదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేఁడెట్టు నీవార మయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమిసేసి నీకెట్టు భారము వేసేము

రేకు: 0301-03 శంకరాభరణం సం: 04-003 శరణాగతి

పల్లవి: అచ్చుతు శరణమే అన్నిటికిని గురి
హెచ్చుకుందు మరి యెంచఁగనేది

చ. 1: యోనిజనకమగు యొడ లిది
యేనెల వైనా నేఁటి కులము
తానును మలమూత్రపుఁ జెలమ
నానాచారము నడచీనా

చ. 2: పాపపుణ్యముల బదుకిది
యేపొద్దు మోక్షం బెటువలె దొరకు
దీపనబాధల దినములివి
చూపట్టి వెదకఁగ సుఖ మిందేది

చ. 3: మరిగినతెరువల మనసుయిది
సరవినెన్న విజ్ఞానంబేది
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁడే
వెరవని కంటే వెలితిఁక నేది

రేకు: 0301-04 బౌళి సం: 04-004 అధ్యాత్మ

పల్లవి: నిజమో కల్లో నిమిషములోననె
భజించు వారల భాగ్యము కొలఁది

చ. 1: వొకఁడు కనుదెరచి వున్నది జగమను
వొకఁడు కన్నుమూశొగి లేదనును
సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును
వెకలినరులు భావించినకొలఁది

చ. 2: కడుపు నిండొకఁడు లోకము దనిసె నను
కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు
తడవిన నిట్లనే దైవమిందరికి
వెడగునరులు భావించిన కొలఁది

చ. 3: ముదిసి యొకఁడను మోక్షము చేర్వని
తుదఁ బుట్టొకఁడది దూరమనును
యెదుటనే శ్రీవేంకటేశ్వరుఁ డిట్లనే
వెదకి నరులు భావించిన కొలఁది

రేకు: 0301-05 వసంతవరాళి సం: 04-005 అంత్యప్రాస

పల్లవి: ఏమందు మిందుకు నెఱిఁగినదే తొల్లి
శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి

చ. 1: వొక మానఁ జేఁదూ వొక మానఁ దీపూ
కకిపికలై రెండూ గలవే తొల్లి
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము
సకలానఁ గలుగుట సహజమే తొల్లి

చ. 2: పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి
నిగిడి లోకములను నిజమే తొల్లి
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకుఁ గీడు
తగిలి నోసలివ్రాఁత తప్పదిది తొల్లి

చ. 3: వెన్నెలలు చంద్రునందు వెడ యెండసూర్యునందు
కన్నుల లోకమువారు గన్నదే తొల్లి
యెన్నఁగ శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవు
వున్నవారు నీకింద నున్నవారు తొల్లి

రేకు: 0301-06 లలిత సం: 04-006 కృష్ణ

పల్లవి: ఆతఁ డితఁడా వెన్న లంతట దొంగలినాఁడు
యేతులకు మద్దులు రెండిలఁ దోసినాఁడు

చ. 1: యీతఁడా దేవకిగన్నయింద్రనీలమాణికము
పూతకిచన్ను దాగి పొదలినాఁడు
యీతఁడా వసుదేవుని యింటిలో నిధానము
చేతనే కంసునిఁ బుట్టచెండు సేసినాఁడు

చ. 2: మేటియైన గొంతిదేవి మేనల్లుఁ డీతఁడా
కోటికిఁ బడెగెగాను కొండ యెత్తెను
పాటించి పెంచే యశోదపాలి భాగ్య మీఁతఁడా
వాటమై గొల్లెతలను వలపించినాఁడు

చ. 3: ముగురువేలుపులకు మూలభూతి యీతఁడా
జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను
మిగుల శ్రీవేంకటాద్రిమీఁది దైవమితఁడా
తగి రామకృష్ణావతార మందె నిప్పుడు

రేకు: 0302-01 లలిత సం: 04-007 గురు వందన, నృసింహ

పల్లవి: పనిగొను వారల భాగ్యమిది
వెనక ముందరికి వివేక మొకటే

చ. 1: బలు పుణ్యములకుఁ బాపములకు గురి
కలియుగ మొకటే కలది
చెలఁగి సేయటకు సేయించుటకును
తలఁపూ నొకటే తనలోఁ గలది

చ. 2: మోదపు భోగము మోక్షమునకు గురి
యీదేహ మొకటే యెత్తినది
గోదిలి కడుఁ గుంగుటకు నెక్కుటకు
యీదెస విజ్ఞానమిదియే కలది

చ. 3: ఆర్మిలి దుఃఖము నతిసుఖములకు గురి
కర్మం బొకటే కలది
కూర్మి శ్రీవేంకట గురుదైవముఁ గను-
ధర్మమున కతని దాస్యమే కలది

రేకు: 0302-02 మంగళకౌశిక సం: 04-008 విష్ణు కీర్తనం

పల్లవి: ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు
చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని

చ. 1: నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని
నీ నామము వినక నెరవేరె నొకఁడు
పూని నిన్ను నుతియించి భోగియాయ నొకఁడు
మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకఁడు

చ. 2: మతిలో నిన్నుదలఁచి మహిమందె నొకయోగి
తతి నిన్ను దలఁచకే తగిలె నిన్నొకఁడు
అతిభక్తిఁ బని సేసి అధికుఁడాయ నొకఁడు
సతతము బనిగొని సఖుఁడాయ నొకఁడు

చ. 3: కాఁగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు
ఆఁగి నిన్ను వెంటఁదిప్పి ఆవులు మేలందెను
దాఁగక శ్రీవేంకటేశ దగ్గరైన దవ్వయిన
మాఁగి నిన్ను దలపోసే మనసే గుఱుతు

రేకు: 0302-03 ముఖారి సం: 04-009 వైష్ణవ భక్తి

పల్లవి: గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు
పరమపద మొక్కటే ఫలమింతే కాక

చ. 1: పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు
దాఁప నవి నిమిషమాత్రములే కాక
లోపలేడ వెలియాడ లోకులకింతే కాక
మోపినదంతా యేకముఖమే కాక

చ. 2: రాతిరేది పగలేది రమించు సాత్త్వికులకు
యీతల నింతా వెలుఁగింతే కాక
ఘాతలఁ గర్మాకర్మగతులు యీసంది వింతే
పోతరించి యెక్కనెక్కఁ బోడవే కాక

చ. 3: చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని
వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు
జంతువుల పురుఁడులు జడులకింతేకాక
వింతవింత సుద్దులేల విభవమే కాక

రేకు: 0302-04 గుండక్రియ సం: 04-010 అధ్యాత్మ

పల్లవి: అనాది జీవుఁడన్నియుఁ గన్నవే
వినోదమిందలి విరతే వలయు

చ. 1: వెలిఁ దోఁచిన యీ విశ్వంబెల్లా
కలసిన మనోగతములివి
పలు విషయేంద్రియ భావములెల్లా
వెలయుఁదా ననుభవించినవే

చ. 2: సహజపు వర్ణాశ్రమము లివెల్లా
యిహమునఁ దాధరియించినవే
బహువేదశాస్త్రపఠన లివెల్లా
వహి కెక్కఁగఁదా వచియించినవే

చ. 3: దినదిన సంసార తిమిరం బెల్లా
ఘనముగఁ దను మున్ను గప్పినవే
అనయము శ్రీవేంకటాధిపుఁ డాత్మకు
ననిచి తొల్లి కల నాయకుఁడే

రేకు: 0302-05 సామంతం సం: 04-011 విష్ణు కీర్తనం

పల్లవి: ఇతర మేదియు లేదు యెఱఁగ మింతేకాని
రతికెక్కేపనులెల్లా రామచంద్రుఁడే పో

చ. 1: ధనమై చేరేవాఁడు దైవమై కాచే వాఁడు
మనసులోదలఁచేటి మాధవుఁడే
మునుకొన్న గ్రామములై ముందర నుండే వాఁడు
కొననాలుక మీఁదటి గోవిందుఁడే పో

చ. 2: తల్లియై పెంచేవాఁడు తండ్రియై పుట్టించే వాఁడు
వెల్లవిరిఁ దాఁగొలిచే విష్ణుమూరితి
ఇల్లాలై సుఖమిచ్చి యెంచఁ బుత్రులైన వాఁడు
చెల్లుబడిఁ దామొక్కేటి చేతిపై శ్రీహరియే

చ. 3: దేహమై వుండేటివాఁడు దినభోగమైన వాఁడు
యీహల శ్రీవేంకటేశుఁడితఁ డొక్కఁడే
మోహాచారమైన వాఁడు మోక్షమై నిలిచే వాఁడు
సాహసించి నమ్మఁగల సర్వేశుఁడితడే

రేకు: 0302-06 భవుళి సం: 04-012 వైరాగ్య చింత

పల్లవి: విడిచితి మనరాదు అవి మరి విడువమవఁగరాదు
అడరిన శ్రీహరి అనుమతికొలఁదే

చ. 1: పెంచినఁ బెరుగును పెను యింద్రియములు
కొంచము సేసినఁ గుందును
పంచిన దిందును పాపముఁ బుణ్యము
యెంచఁగ నీశ్వరుఁడిచ్చిన కొలఁదే

చ. 2: తెలిసినఁ దేటగు తిరమగు మనసిది
కలఁచిన లోలోఁగలఁగును
తొలఁచిన దిందునె దుఃఖము సుఖమును
యిల నంతర్యామిచ్చిన కొలఁదే

చ. 3: చేసినఁ జెలఁగును చేఁతల కర్మము
పాసినఁ బాయును బంధముతో
ఆసల శ్రీవేంకటాధీశుఁడిందుకు
యీసరి గర్తఁడిచ్చిన కొలఁదే

రేకు: 0303-01 శంకరాభరణం సం: 04-013 విష్ణు కీర్తనం

పల్లవి: అతఁడేమి సేసినా మాకదే గురి
మతిలో నాతఁడుండఁగా మాయలు మాకేఁటికి

చ. 1: ఆసలకెల్లా గురి హరి యొక్కఁడేకాని
వేసరక కన్నవారి వేఁడనోపను
చేసేటిసేఁతకు గురి శ్రీవిభుఁడే కాని
వాసి దప్పి హీనుల సేవలు సేయ నోపము

చ. 2: ముచ్చటకెల్లా గురి మురహరుఁడే కాని
చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్పనోపము
నిచ్చలు మాబ్రదుకెల్లా నీలవర్ణునికే కాని
రచ్చల దుష్టులతోడిరాఁపులకు నోపము

చ. 3: పరము నిహమునకు పరమాత్ముఁడే గురి
పరులకధీనమైన బాఁతి యేఁటికి
సిరులకెల్లా గురి శ్రీవేంకటేశుఁడేకాని
అరపిరికితనపుటలమట లేదు

రేకు: 0303-02 దేశాక్షి సం: 04-014 శరణాగతి

పల్లవి: ఎన్నఁడుఁ జెడనియీవు లిచ్చీని మాధవుఁడు
పన్నినయాస లితనిపైపై నిలుపవో

చ. 1: కొననాలుకా హరిగుణములే నుడుగవో
మనసా అతని దివ్యమహిమెంచవో
తనువా శ్రీపతితీర్థ దాహమే కోరవో
యెనలేని అడియాస లేఁటికి నీ కిఁకను

చ. 2: వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో
ఆనిన చేతులితని కంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో
యీనేటి పాపాలబారి నేల పడేవిఁకను

చ. 3: నలిఁ బాదాలాల హరినగరికే నడవరో
కలభక్తి యాతనిపై ఘటియించవో
చలమా శ్రీవేంకటేశు సంగతినే వుండవో
యెలయింపుఁ గోరికల కేల పారే విఁకను

రేకు: 0303-03 సామంతం సం: 04-015 శరణాగతి

పల్లవి: కొసరి కొసరి యిఁకఁ గోరఁగనేఁటికి
అసురవైరి శరణనుటే చాలు

చ. 1: సంతతభోగము జననబంధములు
జంతురాసులకు సహజము
వంతురక్షకత్వము కరుణ భువి
నంతర్యామికి నది సహజము

చ. 2: కలకాలంబును గామముఁ గ్రోధము
చలమును బ్రాణుల సహజము
సులభత్వంబును సొరిది వదాన్యత
అల లక్ష్మిపతికది సహజము

చ. 3: వుడుగనికర్మము లొడలోముటలును
జడులము మాకిది సహజము
యెడయక శ్రీవేంకటేశ నీకు మము
నడరి కాచుటే అది సహజము

రేకు: 0303-04 శుద్ధవసంతం సం: 04-016 శరణాగతి

పల్లవి: ఇహపరసాధన మిది యొకటే
సహజపుమురారిసంకీర్తన నొకటే

చ. 1: భవసాగరములఁ బాపెడిది తేప
భువి నజ్ఞానముపులివాకట్టిది
జవళి నాశాపాశములకుఁ గొడువలి
నవనీతచోరునామం బొకటే

చ. 2: చింతాతిమిరముఁ జెరిచేటి సూర్యుఁడు
అంతట దరిద్రహతపు నిధానము
వింతమరణభయ వినాశమంత్రము
మంతుకు హరినామంబిది యొకటే

చ. 3: మించు దుఃఖములమృత సంజీవని
అంచలఁ బంచేంద్రియములు కంకుశము
యెంచగఁ శ్రీవేంకటేశు దాసులకు
బంచిన పాళ్లఁ బరగినదొకటే

రేకు: 0303-05 సాళంగనాట సం: 04-017 దశావతారములు

పల్లవి: ఏమని పొగడుదు నిట్టి నీగుణము
యీ మహిమకుఁ బ్రతి యితరులు గలరా

చ. 1: నిండెను జగముల నీ ప్రతాపములు
చెండిన బాణునిచేతులతో
కొండలంతలై కుప్పలువడియెను
వండఁదరగు రావణుతలలయి

చ. 2: పూడెను జలధులు పొరిఁ గోపించిన
తోడ బ్రహ్మాండము తూఁటాయ
చూడఁ బాతాళము చొచ్చె బలీంద్రుఁడు
కూడిన కౌరవకులములు నడఁగె

చ. 3: యెత్తితివి జగము లీరేడు నొకపరి
యిత్తల నభయం బిచ్చితివి
హత్తిన శ్రీవేంకటాధిప నీకృప
నిత్తెమాయ నీనిజదాసులకు

రేకు: 0303-06 దేపాళం సం: 04-018 శరణాగతి

పల్లవి: నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్ము
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్యా

చ. 1: పాపమూల మటు తొల్లి పైకొన్న దేహము
పాపము సేయకుండితే పక్కున నేల మాను
కోపమే కూడుగఁ గుడిచిన యీబుద్ధి
కోపము విడువుమంటే గుణమేల మాను

చ. 2: అప్పు దీర్ప వచ్చినట్టి ఆయపు సంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను
తప్పు వేయవచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు
తప్పులు వేయక సారెఁ దా మేల మాను

చ. 3: పంచమహాపాతకాలే పట్టుకొనే యింద్రియాలు
పంచమహాపాతకాలే బారిఁ దోయ కేల మాను
అంచెల శ్రీవేంకటేశ ఆత్మలో నీవుండఁగాను
పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను

రేకు: 0304-01 లలిత సం: 04-019 గురు వందన, నృసింహ

పల్లవి: భావించు వారలపాలి భాగ్య మితఁ
డా వలనీ వల నంతర్యామి

చ. 1: యీశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు
విశ్వాత్మకుఁడీ వివిధ జీవులకు
ఐశ్వర్యము మా యంతర్యామి

చ. 2: నిత్యుఁడితఁ డొకఁడె నెరిఁ గాలములకు
సత్యం బితఁడు చదువులకు
ప్రత్యక్షం బిదె భక్తకోటికిని
అత్యంతము మా యంతర్యామి

చ. 3: గుణి నిర్గుణితఁడు గురుముని జనులకు
ప్రణవము వేదాంతపంక్తులకు
ప్రణుతి శ్రీవేంకటపతి లోకులకితఁ
డణురేణు పూర్ణుఁడంతర్యామి

రేకు: 0304-02 సాళంగనాట సం: 04-020 కృష్ణ

పల్లవి: జగములెల్లా నీడేరె జయ వెట్టి రిందరును
తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో

చ. 1: అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతారమాయ నిదివో

చ. 2: గోవిందుఁడు జనియించె గోకులష్టమిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో

చ. 3: అనంతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు జనియించె
ఘనశిశుపాలాదులు గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో
అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో

రేకు: 0304-03 మాళవి సం: 04-021 విష్ణు కీర్తనం

పల్లవి: పారిరి దానవులెల్లా పంచబంగాళమై
తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి

చ. 1: గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై
అరదము దోలవో చయ్యన దారకా
ధరయెల్లఁ గుమ్మెలై పాతాళ మదే కానవచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను

చ. 2: దనుజాంతకుని సేన దగ్గరి నడవఁజొచ్చె
చొనిపి రోప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి పగ్గములు బిగించవో పయిపైన

చ. 3: శ్రీవేంకటేశుబలము చిమ్మిరేఁగి మించఁజొచ్చె
సేవించలమేల్మంగను సేనాపతీ
దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యములాయ
తావుకు మరలించవో తానకముగాను

రేకు: 0304-04 లలిత సం: 04-022 శరణాగతి

పల్లవి: ఘనుఁడాతఁడే మముఁ గాచుఁగాక హరి
అనిశము నే మిఁక నతనికె శరణు

చ. 1: యెవ్వనినాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి
యెవ్వనిమూలము యీ సచరాచర-
మవ్వలనివ్వల నతనికే శరణు

చ. 2: పురుషోత్తముఁడని పొగడి రెవ్వరిని
కరి నెవ్వఁడు గక్కనఁ గాచె
ధర యెవ్వఁడెత్త దనుజులఁ బొరిగెను
అరుదుగ మే మిఁక నతనికె శరణు

చ. 3: శ్రీపతి యెవ్వనిఁ జేరి వురమునను
భాసిల్లె నెవ్వఁడు పరమంబై
దాసుల కొరకై తగు శ్రీవేంకట
మాస చూపె నితఁ డతనికె శరణు

రేకు: 0304-05 మంగళకౌశిక సం: 04-023 శరణాగతి

పల్లవి: ఔలే నే నొకపనికి నవుదు నీకును
కూళలలో నెంచి చూడ గురి యవుదును

చ. 1: పసురము వంటివాఁడ పాపపుబందెలు దెత్తు
శిసువు వంటివాఁడ సిగ్గు నెగ్గు నెరఁగ
వసుధలో రాయి వంటివాఁడను దయదలఁచ
యెసఁగ నన్నేరీతి నీ వేలితివి దైవమా

చ. 2: మాఁకువంటివాఁడ నే మతి లేదు; పుచ్చిన-
పోఁక వంటివాఁడ నెప్పుడు కొరగాను
రోఁకలి వంటివాఁడ రోటిలోనిపోట్లకు
యేఁకట నన్నెటువలె నేలితివి దైవమా

చ. 3: పాముపంటివాఁడనే పట్టినవారిఁ గరతు
గాముపంటివాఁడ లోకమువారిఁ బీడింతు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను బంటంటా-
నేమిటికిఁ గృపతోడ నేలితివి దైవమా

రేకు: 0304-06 వరాళి సం: 04-024 వైరాగ్య చింత

పల్లవి: దేహముతోడిది లంకె తీరదిది హరిమాయ
సాహసపు జీవులకు సహజమెప్పుడును

చ. 1: నెట్టనఁ బెక్కిండ్లవిందు నిండుకొన్నయాఁకలి
వొట్టి నిచ్చకల్యాణి కామోద్రేకము
కట్టినవోడదూలము కాయపుసంసారము
దట్టమైన ప్రాణులకుఁ దనివేడదయ్యా

చ. 2: పొద్దొకబై రూపము పొదలేటి యీవయసు
తిద్దుబడి గుఱ్ఱము హత్తినగుణము
వొద్దనుండినట్టి నీడ వుడివోనియట్టి నిద్ర
అద్దుకొని వుండుఁగాక అదియేల మానును

చ. 3: పచ్చిగరికెకాలము ప్రపంచములో బ్రదుకు
తచ్చి చూచెటి సూత్రము తన జ్ఞానము
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాత్మలో నిధానము
యిచ్చ నెరుఁగుకొంటేనే యిహమే పరము

రేకు: 0305-01 రామక్రియ సం: 04-025 అంత్యప్రాస

పల్లవి: భావించరో వేదములు పలికేటి వునికి
జీవులు బ్రహ్మానందముఁ జెందేటి వునికి

చ. 1: నిచ్చలు నిద్దురలకు నెలవైన వునికి
యిచ్చలఁ గలలు గన నిరవైన వునికి
కుచ్చిన నిట్టూర్పులకొన దాఁకే వునికి
తచ్చిన మాటలధ్వని దాఁకేటి వునికి

చ. 2: మునుకొన్న చూపులకు మొదలైన వునికి
అనిశము కతలెల్ల నాలకించే వునికి
వెనుకొన్న చవులెల్లా వెలవెట్టే వునికి
గునిసి మేల్కనుటకు గురియైన వునికి

చ. 3: వావిరి నింద్రియపరవశమందే వునికి
కైవశమై పదియారుకళలుండే వునికి
చావకుండా నమృతము జాలువారే వునికి
శ్రీవేంకటేశుపాదాలు చింతించే వునికి

రేకు: 0305-02 దేవగాంధారి సం: 04-026 కళ్యాణ కీర్తనలు

పల్లవి: అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు

చ. 1: గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు

చ. 2: యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు

చ. 3: అలమేల్మంగతో నటు శ్రీవేంకట
నిలయుఁ డరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారాదాదులును
పొలుపు మిగులఁ గడుఁ బొగడేరు

రేకు: 0305-03 దేపాళం సం: 04-027 కృష్ణ

పల్లవి: అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు
వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు

చ. 1: దేవకి కొడుకుఁగన్న దినమిది శ్రీజయంతి
భావించ మన కన్నులపండుగులాయ
దేవునిఁ బూజించితిమి తేరో నైవేద్యాలు
కైవసమై కృష్ణునికి గంపల కొలఁదులు

చ. 2: వసుదేవుఁ డెత్తెను శ్రావణబహుళాష్టమిని
పసగాఁ దొట్లే నూఁచి పాడఁగలిగె
సిసువితనికి మొక్కి చేసేము జాగరాలు
కొసరరో వరములు కోట్ల కొలఁదులు

చ. 3: బలభద్రుతమ్ముఁ డాయ పతి యలమేల్మంగకు
నెలమితో మనకెల్ల నేలికాయ
తలఁచి శ్రీవేంకటాద్రిఁ దానే యవతారమందె
అల సంతోషమందరో అబ్బినకొలఁదులు

రేకు: 0305-04 ముఖారి సం: 04-028 గురు వందన, నృసింహ

పల్లవి: ఏ బలిమి నమ్మి వెరపెరఁగరు దేహులాల
గాబువలెఁ బెరిగేరు కాలము మీఁచుట్టమా

చ. 1: చెలరేఁగి దానములు సేసినట్టి బలిమో
అలరి కర్మము సేసినట్టి బలమో
చలపట్టి తపము లాచరించిన బలిమో
కొలఁదిలేక సురలఁ గొలిచిన బలిమో

చ. 2: ధీరత సుజ్ఞానము దెలిసిన బలిమో
కోరక విరక్తి గైకొన్నబలిమో
శూరత లోకానకెల్లఁ జుట్టమైన బలివమో
వూరకే బ్రహ్మకల్పము లుండేటట్టి బలిమో

చ. 3: పరగ శ్రీపతినామపఠనము బలిమో
హరిదాసుల శరణన్నట్టి బలిమో
సిరుల శ్రీవేంకటేశు సేవచేసిన బలిమో
గురుభక్తితోడ నెక్కువయైన బలిమో

రేకు: 0305-05 నారాయణి సం: 04-029 భగవద్గీత కీర్తనలు

పల్లవి: అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము

చ. 1: హరినివాస మీ యౌభళము
అరిది పరమపద మౌభళము
అరిదైత్యాంతక మౌభళము
హరముఖసేవిత మౌభళము

చ. 2: అమలరమాకర మౌభళము
అమితమునీంద్రం బౌభళము
అమరవందితం బౌభళము
అమరెఁ బుణ్యముల నౌభళము

చ. 3: అగరాజంబీ యౌభళము
అగణితతీర్థం బౌభళము
తగు శ్రీవేంకటధామవిహారం-
బగు శుభాంచితం బౌభళము

రేకు: 0305-06 మాళవిగౌళ సం: 04-030 భగవద్గీత కీర్తనలు

పల్లవి: విచారించుకొనేవారి వివేకాల కొలఁదులు
పచారించి వున్నవెల్ల భావనమాత్రములు

చ. 1: జగములన్ని నీశరీరమేకనక
తగు వైకుంఠాలే వుండేతావు లెల్లాను
పొగరు స్వర్గ నరకభూములనే లోకాలెల్ల
పగటున తమలోని భావనమాత్రములు

చ. 2: అన్ని పదార్థాలు నీయందే పుట్టివచ్చేఁగాన
తిన్నని నీప్రసాదాలే దినభోగాలు
వన్నెల నిష్టానిష్ట వస్తుభేదము లెల్లాను
పన్నుకొన్న యటువంటి భావనమాత్రములు

చ. 3: అంతరాత్మవు శ్రీవేంకటాధిప నీవేకాన
చెంతల నీ కైంకర్యాలే చేఁతలెల్లాను
వింతలైన సంసార విహారములెల్లాను
బంతినే నానావిధ భావనమాత్రములు

రేకు: 0306-01 భౌళి సం: 04-031 తేరు

పల్లవి: ఎత్తరే ఆరతులు యియ్యరేకానుకలు
యిత్తల నేఁగివచ్చీని యిందిరానాధుఁడు

చ. 1: గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదములచేరుల తేరు
సురలు మునులుఁ బట్టి సొంపుతోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగివచ్చీ నిందిరానాధుఁడు

చ. 2: జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువఁగా
యీవల నేఁగివచ్చీ నిందిరానాథుఁడు

చ. 3: పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రి మీఁదటి తేరు
కొంచక యలమేల్మంగఁ గూడి వచ్చీ నదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుఁడు

రేకు: 0306-02 నాట సం: 04-032 నృసింహ

పల్లవి: కదిరి నృసింహుఁడు కంభమున వెడలె
విదితముగా సేవించరో మునులు

చ. 1: ఫాలలోచనము భయదోగ్రముఖము
జ్వాలామయ కేసరములును
కాల రౌద్ర సంఘటిత దంతములు
హేలాగతి ధరియించుక నిలిచె

చ. 2: ముడివడు బొమ్మలు ముంచిన వూర్పులు
గడగడ నదరెటి కటములును
నిడుద నాలికెయు నిక్కుఁ గర్ణములు-
నడియాలపు రూపై తా వెలసె

చ. 3: సకలాయుధములు సహస్ర భుజములు
వికట నఖంబులు వెఁస బూని
వెకలి యగుచు శ్రీ వేంకటేశ్వరుఁడె
ప్రకటపు దుష్టుల భంజించె నిదివో

రేకు: 0306-03 దేసాళం సం: 04-033 వైష్ణవ భక్తి

పల్లవి: చదివి బతుకరో సర్వ జనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షర మిదియే

చ. 1: సాదించి మున్ను శుకుఁడు చదివినట్టి చదువు
వేద వ్యాసులు చదివినచ దువు
అది కాలపు వైష్ణవులందరి నోటి చదువు
గాదిలి నారాయణాష్టాక్షర మిదియే

చ. 2: సతతము మునులెల్ల చదివినట్టి చదువు
వెత దీర బ్రహ్మ చదివినచదువు
జతనమై ప్రహ్లాదుఁడు చదివి నట్టి చదువు
గతిగా నారాయణాష్టాక్షర మిదియే

చ. 3: చలపట్టి దేవతలు చదివినట్టి చదువు
వెలయ విప్రులు చదివేటి చదువు
పలుమారు శ్రీ వేంకటపతినామమై భువిఁ
గలుగు నారాయణాష్టాక్షర మిదియే

రేకు: 0306-04 భైరవి సం: 04-034 భగవద్గీత కీర్తనలు

పల్లవి: శరణ మాతనికే సర్వభావాల
యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు

చ. 1: వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు
చొచ్చెటి త్రోవెఱఁగము సోదించి మీఁద
కుచ్చిన కర్మములతో గుదియై వేలుకాడేము
హెచ్చి మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెరుఁగు

చ. 2: నన్ను నేనే యెఱఁగను నానాచందములను
అన్నిటా నాలోనున్న హరిఁ గానను
కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ
యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెరుఁగు

చ. 3: మొదలు దెలియను ముంచి కొన దెలియను
చదువుచు నున్నవాఁడ సర్వవేదాలు
హృదయములోనుండి యిటు నన్ను గావఁగ
యిదివో శ్రీవేంకటాద్రి యీశ్వరుఁడే యెఱుఁగు

రేకు: 0306-05 పాడి సం: 04-035 తేరు

పల్లవి: అప్పడైనహరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు

చ. 1: సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపైఁ బరపెఁదేరు
తిమురుచు రుక్మకుపైఁ దిరుగఁ దోలెఁ దేరు
ప్రమదాన సృగాలునిపైఁ దోలెఁ దేరు

చ. 2: కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁ దేరు
బమ్మరపో దంతవక్త్రుపైఁ దోలెఁ దేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాఁ దోలినతేరు
దొమ్మి రుక్మిణిపెండ్లికిఁ దోలినట్టితేరు

చ. 3: మీఱి హంసడిబికులమీఁదఁ దోలినట్టితేరు
తూఱి సంధిమాటలకుఁ దోలినతేరు
అఱడి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చూఱలుగొన నెక్కెను శోభనపుతేరు

రేకు: 0306-06 గౌళ సం: 04-036 నృసింహ

పల్లవి: మొదలివేల్ప మా మొఱ యాలించవె
యెదుటఁ గావు మము నిదివో దేవా

చ. 1: ధరపైఁ దపసుల తపములు చెరిచెను
నిరతపుణ్యముల నీరుసేసె నదె
పరకామినులను భంగ పెట్టె నదె
హిరణ్యకశిపుఁ డిదివో దేవా

చ. 2: మునులజడ లవిగో మోఁపులుకొలఁదులు
ఇనచంద్రాదుల నెక్కువగెలిచెను
చనవరి యింద్రుని స్వర్గము చేకొనె
యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా

చ. 3: పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను
బలిమినే పహ్లాదుఁ బరచీని
యెలమిని శ్రీవేంకటేశ నీవలన
యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా

| | | | | | |
|---|---|---|---|---|---|
| రేకు: | 0307-01 | సామంతం | సం: | 04-037 | వైరాగ్య చింత |

పల్లవి: మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే
తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే

చ. 1: ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకమే

చ. 2: యెందు నెండఁబడ్డఁ గాని ఇంపునీడఁ గోరఁడు
కందువ సంసారియైనఁ గాని మోక్షము గోరఁడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువబద్ధున కదే కట్టినట్టి కట్లు

చ. 3: కలయఁ జీఁకటియైతేఁగాని దీప మిడుకోఁడు
ఇల నజ్ఞుఁడైనఁగాని యెరుక వెదకఁడు
తలఁచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే
బలిమిఁ జంచలునికి బహళ దుఃఖములే

రేకు: 0307-02 లలిత సం: 04-038 నామ సంకీర్తన

పల్లవి: ఇదియే సులభం బిందరికి
కదియఁగ వసమా కరుణనే కాక

చ. 1: నగధరుండు పన్నగశయనుడు భూ-
గగనాంతరిక్షగాత్రుడు
అగణితుఁడితని నరసి తెలియఁగాఁ
దగు నా కనెడిది దాస్యమే కాక

చ. 2: కమలజజనకుఁడు కామునిజనకుఁడు
కమలాసతిపతి ఘనగుణుఁడు
విమలుఁడీహరి వెదకి కానఁగను
అమరునా శరణాగతిఁగాక

చ. 3: దేవుఁడు త్రిగుణాతీతుఁ డనంతుఁడు
కైవల్యమొసగుఘనుఁడు
శ్రీవేంకటపతి జీవాంతరాత్ముఁడు
భావించవసమా భక్తిన కాక

రేకు: 0307-03 ధన్నాసి సం: 04-039 శరణాగతి

పల్లవి: హరి నీవు మాలోన నడఁగు టరదుగాక
శరణని నీకు నే జయ మందుటరుదా

చ. 1: పాపపుణ్యలంపటమైనది మేను
కూపపు యోనులఁ గుంగేటిది మేను
దీపనాగ్నిగల దిష్టము యీమేను
మోపు మోచిన నేము ములిగేది యరుదా

చ. 2: పొలసి పొద్దొకచాయఁ బొరలేటిమనసు
కొలఁదిలేని యాసఁ గుదురైన మనసు
మలిసి సంసారమే మరిగిన మనసు
కలనేము, తిమ్మటలు గైకొనేది యరుదా

చ. 3: పెనచి యింద్రియములఁ బేఁడినభవము
పనివడి చింతలకే పాలైనభవము
యెనలేని శ్రీవేంకటేశ నీకే శరణని
మనెఁ గాన యిఁక మీఁద మంచిదౌటరుదా

రేకు: 0307-04 గుండక్రియ సం: 04-040 వైష్ణవ భక్తి

పల్లవి: కోటికిఁ బడగయెత్తి కొంకనేల
యీటులేని పదమెక్కి యిఁకనేల చింత

చ. 1: పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలఁ జిన్నకౌపీనము
పట్టినది శ్రీహరిపాదపద్మ మూలము
యెట్టయినా మాకు మేలే యిఁకనేల చింత

చ. 2: చిక్కి నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
తొక్కినది భవముల తుదిపదము
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగ
యెక్కువ కెక్కువే కాక యిఁక నేల చింత

చ. 3: చిత్తములోనిండినది శ్రీపతిరూపము
హత్తినది వైరాగ్య మాత్మధనము
యెత్తలఁజూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుఁ-
డెత్తి మముఁ గావఁగాను యిఁక నేల చింత

రేకు: 0307-05 దేవగాంధారి సం: 04-041 శరణాగతి

పల్లవి: ఒహో వొడలుమాని వోపికె గడుమేలు
యిహల నీవుపకారమేమని నుతింతు

చ. 1: పుట్టినచోటంటినా అది భూతములనెలవు
నెట్టన మూసిన మేను నిఖిల హేయమయము
యిట్టి నా యాతుమలోన హరి యెట్టుంటివి నీవు
అట్టె నీచేఁతలు దలఁచి అరుదయ్యీ నాకు

చ. 2: మించుల మనసంటిమా అది మిగులఁ జంచలంబు
పంచల నా సంపదలు పాపపుణ్య విధులు
యెంచఁగా యిటువంటి నన్ను యెట్టు ధరియించితి
నించిన నీ చేఁతలు విని నివ్వెరగయ్యీని

చ. 3: పాయ మిది యంటిమా పంచేంద్రియముల వశము
ఆయము నాకంటిమా అది అయిదుభూతముల మొరఁగు
యీయెడ శ్రీవేంకటేశ యీడా యెట్టేలితి నన్ను
మాయల నీశరణంబిందుకే మనసయ్యీ నాకు

రేకు: 0307-06 శుద్ధవసంతం సం: 04-042 అంత్యప్రాస

పల్లవి: విత్తొకటి వెట్టఁగా వేరొకటి మొలచునా
యెత్తి హరి నీవు నను నీడేర్తుగాక

చ. 1: మోహబాంధవములకు మూలంబు తనువు
వూహాపోహలకు వునికి యీ తనువు
దాహమున కాఁకటికి తగులు యీ తనువు
యీహీ వైరాగ్య మిందెట్టు గలుగు

చ. 2: పంచేంద్రియములకు పాదు యీ తనువు
చంచలపుటాసలకు జంట యీ తనువు
అంచె దుర్గణములకు నాకరము తనువు
యెంచి చూడ వివేక మిందెట్టు నిలుచు

చ. 3: యీహలోకసుఖములకు హేతువీ తనువు
బహుపుణ్యపాపాలకు ఫలము యీ తనువు
యిహమునకు శ్రీవేంకటేశ నీదాస్యమున
విహరించెఁ దనువు యిఁక వెఱపేల కలుగు

రేకు: 0308-01 లలిత సం: 04-043 శరణాగతి

పల్లవి: హీనాధికము లింక నేడ నున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికి నొకటే

చ. 1: నానావర్ణములవారు నరహరిఁ దలఁచేటి-
ఆనామమంత్రజప మది యొకటే
పూని యాతనిఁ గొలిచి భువి నేజాతైనాను
మోనమునఁ బొందేటిమోక్షమూ నొకటే

చ. 2: వెనకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తి యొక్కటే
వునికి నాదేవుఁడు వొకఁడే అంతర్యామి
మనెడి వైష్ణవకుల మతమెల్లా నొకటే

చ. 3: భేదాభేదము లేదు పెక్కు మరఁగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మ లొక్కటే
శ్రీదేవుఁడై నట్టి శ్రీవేంకటేశ్వరుని-
యాదరానఁ బొందు శరణాగతియు నొకటే

రేకు: 0308-02 గౌళ సం: 04-044 శరణాగతి

పల్లవి: హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను
గరిమ నీమాయలోనే కలగంటిఁగాక

చ. 1: యీమేనే కాదా హేయమెల్లా మోచినది
ఆమీఁదఁ బుణ్యతీర్థము లాడీఁగాక
కామించి యీరెంటి సంగాతంబు నేఁజేసి
గామిడినై యెందువాఁడాఁ గానైతిఁగాక

చ. 2: చిత్తమిదే కాదా చింతించెఁ బాపాలు దొల్లి
పొత్తుల పుణ్యాలు దలపోసీఁగాక
రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపు రొంపి లోని కంబ మైతిఁగాక

చ. 3: యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది
తానకపు వేదములు తడవీఁగాక
పూనిన శ్రీవేంకటేశ వొంటి నీకు శరణని
తోనే యీ రెండుఁ గడచి తుద కెక్కేఁగాక

రేకు: 0308-03 వరాళి సం: 04-045 భగవద్గీత కీర్తనలు

పల్లవి: యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాదిఫలరూప మిటు నీవై వుండవే

చ. 1: పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతిఁ బ్రాణప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ముఁగాచెడికొరకు
హరి నీమూర్తి ప్రాణ మావహించవే

చ. 2: జగతికి నీపాదజలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేఁడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేకమందవే

చ. 3: వేదములు దెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేదమంత్రముల పూజావిధి సేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁ గాచుటకు
వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే

రేకు: 0308-04 సౌరాష్ట్రంసం: 04-046 విష్ణు కీర్తనం

పల్లవి: నేము సేసేయందు మారు నీవే చేకొంటివి
నేమపు నాపూజలెల్లా నీకు నెక్కెనయ్యా

చ. 1: పాలజలనిధిలోనఁ బవ్వళించినది యేపో
వాలిన నీకు జలాధివాసము
కోలు ముందై బ్రహ్మయజ్ఞ కుండములాహుతి గొని
వోలినుండే అది నీకు హోమము

చ. 2: ఆడన `నాపోనారామణుఁడ` వయిన నీకు
ఆదియపో మంత్రకలశాభిషేకము
మొదల నంతర్యామిమూర్తివయిన నీకు
పదవిమీర నదియే ప్రాణప్రతిష్ఠ

చ. 3: అక్కున శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వొక్కటై వుండినదే నిత్యోత్సవము
లెక్కలేని వరములు లీలతో మా కిచ్చితివి
యిక్కడ నేపొద్దు మాయింట నుండవయ్యా

రేకు: 0308-05 శ్రీరాగం సం: 04-047 అంత్యప్రాస

పల్లవి: ఎందుఁ గాఁపురము సేతు నేది నిజ మేది గల్ల
ముందర నొక్కదినమే మూఁడు గాలములు

చ. 1: తనుభోగముల నివే తగ నొక లోకము
మనసులో తలపోఁత మరి యొక్క లోకము
యెనసిన కలలోని దిది యొక్క లోకము
మునుపు వెనకలివే మూఁడు లోకములు

చ. 2: పంచభూతముల చేతిబంధ మొక్క దేహము
యెంచఁగ నూరుపుగాలి యిది యొక్క దేహము
కొంచక త్రిగుణములగురి సూక్ష్మ దేహము
ముంచె నిదె వొకటిలో మూఁడు దేహములు

చ. 3: జీవునిలోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు
తావై వెలినున్నవాఁడు తా నొక్కఁడే
శ్రీవేంకటాద్రిమీదఁ జెలఁగినాతఁ డీతడే
మూవంకల మముఁ గాచె మొక్కితి మాతనికి

రేకు: 0308-06 లలిత సం: 04-048 అంత్యప్రాస

పల్లవి: బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మఁ గన్న తండ్రియైన పరమాత్మ చింత

చ. 1: మూఁడు లోకములకెల్లా మొదలి చింత
మేడెపుఁ గర్మములకు మీఁది చింత
తోడ జనించిననాటి తొల్లిటి చింత
వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత

చ. 2: అంగములోవెదకేటి యానంద చింత
నింగివలెఁ బొడచూపే నిర్మల చింత
కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁగలిగె మాకు నోహో యీచింత

చ. 3: కింది మీఁదు నేకమైన కేవలచింత
సందు లేక నిజమైన సహజ చింత
కందువ శ్రీవేంకటేశుఁ గన్నచింత
యిందునే మాకుఁ గలిగే నితఁడే చింత

రేకు: 0309-01 ముఖారి సం: 04-049 శరణాగతి

పల్లవి: ఆదిమూలమే మాకు నంగరక్ష
శ్రీదేవుఁడే మాకు జీవరక్ష

చ. 1: భూమిదేవిపతి యైన పురుషోత్తముఁడె మాకు
భూమిపై నేడ నుండినా భూమిరక్ష
ఆమని జలధిశాయి అయిన దేవుఁడే మాకు
సామీప్యమందున్న జలరక్ష

చ. 2: మ్రోయుచు నగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుఁడే
ఆయములు దాఁకకుండా నగ్నిరక్ష
వాయుసుతు నేలినట్టి వనజనాభుఁడే మాకు
వాయువందుఁ గందకుండా వాయురక్ష

చ. 3: పాదమాకసమునకుఁ బారఁజాఁచే విష్ణువే
గాదిలియై మాకు నాకాశరక్ష
సాదించి శ్రీవేంకటాద్రి సర్వేశ్వరుఁడే మాకు
సాదరము మీరినట్టి సర్వరక్షా

రేకు: 0309-02 దేశాక్షి సం: 04-050 శరణాగతి

పల్లవి: ఎంచి సేయుపను లిఁక లేవు
కొంచక యాతనిఁ గొలుచుటే కలది

చ. 1: తప్పదు కర్మము తా నెందున్నా
చెప్పఁగ దీనికిఁ జింతేలా
అప్పుడు తొల్లే అనుమతించె నివి
తప్పక యాతనిఁ దలఁచుటే కలది

చ. 2: ఆయము నన్నము నందొక లంకె
వేయుట దీనికి వెతలేలా
కాయములో హరి గలఁడంతరాత్మ
యీయెడఁ దను నుతియించుటే కలది

చ. 3: వెలిని లోన శ్రీవేంకటేశుఁడే
తెలియని మతి నందియమేలా
యిలలో మనముల నేలె నాతఁడే
సలిగె మనకతని శరణమే కలది

రేకు: 0309-03 దేవగాంధారి సం: 04-051 దశావతారములు

పల్లవి: అన్నివిధములుఁ దానై యాతుమలో మరి వీఁడే
పన్నిన యీ పరమాత్మభావనే మా బ్రదుకు

చ. 1: గోపాలకృష్ణునిచూపే కోరిన పనులపాఁడి
గోపికావల్లభుకృపే కూర్మివనిత
శ్రీపతిదయే మాకుఁజేరే ధనధాన్యములు
చేపట్టిన బ్రహ్మతండ్రిచిత్తమే మాపుత్రులు

చ. 2: జలధిశాయికరుణే సర్వరత్నములసొమ్ము
అల పీతాంబరువాత్సల్యమే వస్త్రములు
మలయు గరుడధ్వజుమన్ననే వాహనములు
యిల నచ్యుతనామమే యిదే మాకాయుష్యము

చ. 3: అమృతమథను మహిమదె మా గాదెల కొల్చు
విమతదైత్యారి యావేశమే భయహరము
అమర శ్రీవేంకటేశు నడుగులే మాకు నిండ్లు
తమితో నాతనిదేవే తల్లియుఁ దండ్రియును

రేకు: 0309-04 సామంతం సం: 04-052 దశావతారములు

పల్లవి: తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము

చ. 1: నిండినట్టి మడుగుల నీరువంక పొలము
కొండలు మోఁచినపెద్ద గొబ్బరపుఁబొలము
అండనే పొలము రాజులుండేటి పొలము
చెండివేసి మాకులెల్లా సెలగినపొలము

చ. 2: అసపడి వరదానమడిగిన పొలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైనపొలము
రాసికెక్కేమునులకు రచ్చైన పొలము
వేసరక నాఁగేట వేగిలైన పొలము

చ. 3: మంచి గురుతైన రావిమానిచేని పొలము
వంచిన గుఱ్ఱముఁ దోలే వయ్యాళి పొలము
యెంచఁగ శ్రీవేంకటేశు నిరవైన పొలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటి పొలము

రేకు: 0309-05 గుండక్రియ సం: 04-053 వైరాగ్య చింత

పల్లవి: నే నేమి సేయుదును నిన్నుఁ బో వివేకము
శ్రీనాథుమహిమలు చిమ్మి రేఁచఁగాను

చ. 1: జీవుఁడేమి సేయును; చిత్తము వసముగాక
యీవల నావలఁ బరువెత్తఁ గాను
చేవల నాచిత్తమేమి సేయు; నందులోన నున్న-
శ్రీవల్లభుని మాయ చిమ్మిరేఁచఁగాను

చ. 2: దేహ మేమిసేయును ; దేహము లోపల నున్న-
దాహపుటాసలు వెఱ్ఱి దవ్వఁగాను
యీహల నాయాసలును యేమిసేయు; నన్నిటికి
శ్రీహరి యానాజ్ఞ లిటు చిమ్మిరేఁచఁగాను

చ. 3: పుట్టు గేమిసేయును ; పురాకృతము వెంటఁ
గట్టిన బంధములై కలఁచఁగాను
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గొలువఁగా నన్నతఁడు
మట్టుమీరఁ బదవిచ్చి మన్నించఁగాను

రేకు: 0309-06 లలిత సం: 04-054 దశావతారములు

పల్లవి: సిరిమగఁడే మొగసిరి రక్ష
మరుగురుఁడే మా మర్మపు రక్ష

చ. 1: పులుగు నెక్కినవాఁడే పులుగుదోషపు రక్ష
బలు బాలుఁడైనవాఁడే బాలగ్రహ రక్ష
మొలచి పిన్నై మిన్నుముట్టఁబెరిగినవాఁడే
తొలఁగఁ దోసేటి ముట్టుదోషపు రక్ష

చ. 2: బూతకిఁ జంపినవాఁడే బూతకి వాకట్టు రక్ష
పాతాళానఁ గూర్మమైనపతి గుంతదోష రక్ష
ఘాతఁగరుణాకరుఁడై కరుణా ధృష్టివాఁడే
మా తరతరము ద్రిష్టిమంత్రపు రక్ష

చ. 3: పాముపైఁ బండేటివాఁడే పాములవాకట్టు రక్ష
సేమపు సర్వజీవాత్మ జీవ రక్ష
నేమపు శ్రీవేంకటాద్రి నిలయుఁడై యున్నవాఁడే
యేమిటాను మా పురుఁటియింటి రక్ష

రేకు: 0310-01 మాళవిగౌళ సం: 04-055 తేరు

పల్లవి: నానావర్ణముల నడగొండవలెను
దానవారి తేరదె తగ తిరువీధుల

చ. 1: కదలె కదలె నదె గరుడధ్వజునితేరు
అదె మిన్నుమోచిన నీలాద్రివలెను
యెదిరె నెదిరె నదె యిందిరాధిపుని తేరు
కదిసి చుక్కలు మోచే కనకాద్రివలెను

చ. 2: తిరిగె తిరిగె నదె దేవుదేవునితేరు
అరుదైన ఘనమందరాద్రివలెను
పరువులిడీ నదె పట్టపు శ్రీపతితేరు
విరివి గైలాసపు వెండికొండవలెను

చ. 3: దగ్గరె దగ్గరె నదె దైవశిఖామణితేరు
అగ్గలపు శ్రీవేంకటాద్రివలెను
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
తగ్గులేని మొత్తపు దొంతరకొండవలెను

రేకు: 0310-02 శ్రీరాగం సం: 04-056 వైష్ణవ భక్తి

పల్లవి: కాకున్న మాపాటు కడమున్నదా
నీకృపవంకనే నిలిచితిఁగాక

చ. 1: యీ నాలికేకాదా యిందరి నిందించినది
శ్రీనిధి నిన్నుఁ బొగడి చెలఁగెఁ గాక
నానాపాపములు విన్న నా వీనులే కావా
దానవారి నీ కథల ధన్యమాయఁగాక

చ. 2: యీ మేనేకాదా హేయపుటింతులఁ గూడె
నీముద్రలు ధరియించి నిక్కెఁగాక
యీ మనసేకాదా యిన్నిటిపైఁ బారినది
కామించి నిన్నుఁ దలఁచి కట్టువడెఁ గాక

చ. 3: యీ పుట్టుగేకాదా హీనాధికములఁ బొందె
వోపి నీ దాస్యము చేరి వొప్పెఁగాక
యేపున శ్రీవేంకటేశ యిన్నినేరములు నాకుఁ
బాపఁగా నే నిన్ను నమ్మి బ్రదికితిఁగాక

రేకు: 0310-03 దేసాళం సం: 04-057 శరణాగతి

పల్లవి: నేనే పో ఘనుఁడను నీకంటెను
దానవారి నీవు నాకు దైవమవు గాన

చ. 1: నేరుపున నాకైతే నీ దిక్కు గలదుగాని
చేరి నీ కావల దిక్కు చెప్పి చూపఁగలదా
అరయ నీవైతే నాకు నాధారము గలవు గా
నూరకే నీకాధారము వున్నదా యెక్కడను

చ. 2: నిన్నుఁ గొల్చిన సలిగె నేఁడు నాఁకు గద్దుగాని
సన్నుతి నీకు నొకరి సలిగున్నదా
పెన్నిధి నిన్నుఁ దలఁచే పేరు నాకుఁ గద్దుగాని
వున్నదా నీకుఁ దలఁచ నొకరి పేరైనను

చ. 3: యీవులెల్లా నాకైతే నియ్యఁగలవు గాక
ఆవల నీకీవులియ్య నన్యులున్నారా
శ్రీవేంకటేశ నాకు జీవాంతరాత్మవు నీవు
భావించ నంతరాత్మ యప్పటి నీకు నున్నదా

రేకు: 0310-04 గుండక్రియ సం: 04-058 వైరాగ్య చింత

పల్లవి: కాయము నాదే ఆట కర్తను నే నట నా-
చాయకవి రావు నన్నే జరసీఁగాని

చ. 1: తలఁచినట్టుండదు తలఁపు నాదైనాను
కులికి నన్నే పనిగొనీఁగాని
నిలిపిన యట్టుండవు నేఁడు నా మాటలే నాకు
పొలసి నన్నే కడు బొంకించీఁగాని

చ. 2: కలిమి లేమెరఁగదు కాయము నాదైనాను
కొలఁదికి నేమైనాఁ గోరీఁగాని
యిల నాయంకెకు రావు యింద్రియములు నావైనా
కలసి నామర్మములే కాఁడిపారీఁగాని

చ. 3: పంపు నాకుఁ జేయదు భవమిది నాదైనా
తెంపున కర్మవీధులఁ దిప్పీఁ గాని
యింపుల శ్రీవేంకటేశ యిది యరాజికమాయ
పంపున నీకిదె మొఱ ప్రతిపాలించఁగదే

రేకు: 0310-05 గుండక్రియ సం: 04-059 శరణాగతి

పల్లవి: అతఁడు లక్ష్మీకాంతుఁ డన్నియు నొసఁగుఁగాక
యితరుల వేఁడుకొంటే నేమి గలదు

చ. 1: మోదముతో నొకమాని మొదలఁ బోసిన నీరు
పాదుకొని కొనకెక్కి ఫలించుఁగాక
ఆదిమూలమగుహరి నాతుమ సేవించక
యే దైవములఁగన్నా నేమి సెలవు

చ. 2: తల్లి భుజించినవెల్లా తగు గర్భము శిశువు-
కెల్లగాఁగఁ బరిణామ మిచ్చుఁగాక
వుల్లము లోపలి హరి కొసగని పూజలెల్లా
వెల్లిఁ జింతపంటివలె వృథా వృథా

చ. 3: వోలి నెంత జారిపడ్డా నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై నిలుచుఁగాక
తాలిమి శ్రీవేంకటేశుఁదలఁచక తలఁచినా
పాలించ నాతఁడేకాక పరులకు వశమా

రేకు: 0310-06 బౌళి సం: 04-060 అధ్యాత్మ

పల్లవి: గోనెలె కొత్తలు కోడెలెప్పటివి
నానిన లోహము నయమయ్యీనా

చ. 1: మున్నిటి జగమే మున్నిటి లోకమే
యెన్నఁగ బుట్టు గులివె వేరు
నన్ను నెవ్వ రున్నతి బోధించిన
నిన్న నేటనే నేనెఱిఁగేనా

చ. 2: చిత్తము నాఁటిదే చింతలు నాఁటివే
యిత్తల భోగములివె వేరు
సత్తగు శాస్త్రము చాయ చూపినా
కొత్తగ నేనిఁక గుణినయ్యేనా

చ. 3: జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడే
యీవల భావనలివె వేరు
ధావతి కర్మము తప్ప దీసినా
దైవము గావక తలఁగీనా

రేకు: 0311-01 శుద్ధవసంతం సం: 04-061 శరణాగతి

పల్లవి: ఊలు దింటా మలిగండ్లాఅడి రాసిగా నేరేము
తేలుచు శ్రీహరి నీవే దిక్కౌటగాక

చ. 1: ఆసలేల మానుఁ దన ఆఁకలి లో నుండఁగాను
బేసబెల్లి దేహముతోఁ బెరుగుఁగాక
గాసి బంధమేలఁమానుఁ గాముఁడు లో నుండఁగాను
వేసట సంసారమై వెన్నడించుఁగాక

చ. 2: ధావతులేఁటికి మానుఁ దనుభోగాలుండఁగాను
మోవరాని చింతలతో ములుగుఁగాక
కావరములేల మాను కంతల మేనుండఁగాను
తోవ చేసుకొని వెళ్లఁదోయుచుండుఁగాక

చ. 3: వొొక్కచిత్తమేలయౌను పూర్పుగాలి విసరఁగా
చిక్కి గుణత్రయముచేఁ జెదరుఁగాక
నిక్కి శ్రీవేంకటపతి నీకు నేనే శరణంటి
గక్కన నీజీవమును గరుణింతుగాక

రేకు: 0311-02 మాళవిగౌళ సం: 04-062 విష్ణు కీర్తనం

పల్లవి: పొందగు "నాత్మాపుత్రనామ "మను-
చందపువేదమె సరి నిలిపితివి

చ. 1: పుత్రుఁడు మరుఁడట పుత్రుఁడు బ్రహ్మట నీ-
పుత్రపౌత్రులే భువినెల్లా
పుత్రకామేష్టిని బొడమితి దశరథ-
పుత్రుఁడవై యిది పొగడఁగ నరులు

చ. 2: మనుమఁడు రుద్రుఁడు మనుమఁడు వశిష్టు
మనుమని మనుమలే మహి యెల్లా
మనుమఁడవై యదితిమాన్య గర్భమున
జననమందితివి జగమున కరుదు

చ. 3: యిదె నీగోత్రం బీచరాచరం-
బెదుట మెరసె నిదె యిహమెల్లా
కదిసిటు శ్రీవేంకట గోత్రంబున
నుదయించి మెరసితో హరి నీవు

రేకు: 0311-03 శుద్ధవసంతం సం: 04-063 అధ్యాత్మ

పల్లవి: ఏమి సేయువాఁ డ నివి విరసమొకటొకటి
తామసంబొకవంక తత్త్వమొకవంక

చ. 1: యితరోపాయరాహిత్యుండు గాఁడేని
అతిశయంబగు మోక్ష మది యబ్బదు
సతతోద్యోగానుచరితుండు గాఁడేని
వితతసంసారసుఖవిధి నడవదు

చ. 2: వివిధేంద్రియ విషయ విముఖుఁడు గాఁడేని
యివల వైష్ణవధర్మమిది యబ్బదు
అవిరళంబగు దేహానుభరణములేక
భవమాత్రమున సుకృతఫల మబ్బదు

చ. 3: పరమానందసంపన్నుండు గాఁడేని
చరమవిజ్ఞాన నిశ్చలుఁడు గాఁడు
యిరవయిన శ్రీవేంకటేశ యిటువలె నీవు
కరుణించకున్న దుర్గతులచే భ్రమసీ

రేకు: 0311-04 ముఖారి సం: 04-064 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నియుఁ జదువనేల యింతా వెదకనేల
కన్ను దెరచుటొకటి కనుమూయుటొకటే

చ. 1: వలెననే దొకమాఁట వలదనే దొకమాఁట
సిలుగులీ రెంటికిని చిత్తమే గురి
వలెనంటే బంధము వలదంటే మోక్షము
తెలిసే విజ్ఞానులకు తెరువిది యొకటే

చ. 2: పుట్టెడిదొకటే పోయెడిదొకటే
తిట్టమై యీ రెంటికిని దేహమే గురి
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము
వొట్టిన విజ్ఞానులకు నుపమిది యొకటే

చ. 3: పరమమనేదొక్కటే ప్రపంచమొక్కటే
సిరుల నీ రెంటికిని జీవుఁడే గురి
యిరవై శ్రీవేంకటేశుఁ డిహపరములకర్త
శరణాగతులకెల్ల సతమీతఁ డొకఁడే

రేకు: 0311-05 దేసాళం సం: 04-065 శరణాగతి

పల్లవి: తక్కిన చదువులొల్ల తప్ప నొల్లా
చక్కఁగ శ్రీహరి నీశరణే చాలు

చ. 1: మోపులు మోవఁగనొల్ల ములుగఁగ నేనొల్ల
తీపు నంజనొల్ల చేఁదు దినఁగనొల్ల
పాపపుణ్యాలవి యొల్ల భవమునఁ బుట్టనొల్ల
శ్రీపతినే నిరతము చింతించుటే చాలు

చ. 2: వడిగాఁ బరువులొల్ల వగిరింపనేనొల్ల
వెడఁగుఁజీఁకటి యొల్ల వెలుఁగూనొల్ల
యిడుమల వేఁడనొల్ల యెక్కువ భోగములొల్ల
తడయక హరి నీదాస్యమే చాలు

చ. 3: అట్టె పథ్యములొల్ల అవుషధము గొననొల్ల
మట్టులేని మణుఁగొల్ల మైల గానొల్ల
యిట్టె శ్రీవేంకటేశుఁ నిరవుగ సేవించి
చుట్టుకొన్న యానందసుఖమే చాలు

రేకు: 0311-06 రామక్రియ సం: 04-066 వైరాగ్య చింత

పల్లవి: ముందే తొలగఁవలె మోసపోక సంగమెల్ల
కందువఁ బోయిననీళ్లు కట్ట గట్టవచ్చునా

చ. 1: అనలముఁబొడగంటే నండనున్నమిడుతలు
పనిలేకున్నా నందుఁ బడకుండీనా
పొనిఁగి చెలులఁగంటే పురుషుల చూపులెల్లా -
నవిశము నందుమీఁద నంటఁబారకుండునా

చ. 2: గాలపుటెఱ్ఱలఁగంటే కమ్మి నీటిలో మీలు
జాలి నాపసలఁ జిక్కి చావకుండీనా
అలరిబంగారుగంటే నందరిమనసులూను
పోలిమి నాపసఁ జిక్కి పుంగుడు గాకుండునా

చ. 3: చేరి ముత్యపుఁజిప్పల చినుకులునినిచితే
మేరతేటముత్యములై మించకుండీనా
ధారుణి శ్రీవేంకటేశుదాసులసంగతి నుంటే
పోరచి నే జీవులైనఁ బుణ్యులుగాకుందురా

రేకు: 0312-01 దేశాక్షి సం: 04-067 అంత్యప్రాస

పల్లవి: నిరంతరంబును నీమాయే పరం-
పరములాయ పాపవే నీమాయ

చ. 1: మును తల్లిగర్భమున ముంచెను నీమాయ
వెనక జనించినట్టే వెలసె నీమాయ
అనుగు కౌమార బాల్య యవ్వనములు నీమాయ
జనులకు దాఁటరానిజలధి నీమాయ

చ. 2: ఆస నీమాయ అంగము నీమాయ
యీసునఁ గామక్రోధము లివి నీమాయ
వాసుల సంసారమున వలఁబెట్టీ నీమాయ
గాసిఁబడి యిఁక నెట్టు గడచే నీమాయ

చ. 3: యెదురెల్ల నీమాయ యిహమెల్ల నీమాయ
పొదలి స్వర్గ నరక భోగము నీమాయ
అదన శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవె
యిదె నీకే శరణంటి నిఁకనేల మాయ

రేకు: 0312-02 లలిత సం: 04-068 శరణాగతి

పల్లవి: ఏతపములు నేల యేదానములు నేల
శ్రీతరుణీపతినిత్యసేవే జన్మఫలము

చ. 1: దేహపుటింద్రియముల దేహమందే యణఁచుటే
దేహముతోనే తాను దేవుఁడౌట
సోహలను వెలిఁ జూచేచూపు లోను చూచుటే
ఆహా దేవతలఁ దనందే తాఁ గనుట

చ. 2: వెలి నిట్టూరుపుగాలి వెళ్ళకుండా నాఁగుటే
కులికి తపోధనము గూడపెట్టుట
తలఁపు తనందే తగ లయము సేయుట
లలిఁ బాపబంధముల లయము సేయుట

చ. 3: వెనక సంసారమందు విషయ విముక్తుఁడౌటే
మునుపనే తా జీవన్ముక్తుఁడౌట
పనివి శ్రీవేంకటేశుపదములు శరణంటే
అనువైన దివ్యపదమప్పుడే తా నందుట

రేకు: 0312-03 గుండక్రియ సం: 04-069 శరణాగతి

పల్లవి: పంతపుటాసలు బండ్ల రాఁగా
దొంతుల యలమటఁ దొలఁగేనా

చ. 1: మును దీపనాగ్ని మోఁచిన దేహిని
అనిశముఁ గ్రోధాగ్ని నణఁచేనా
మనసిజుకతమున మహి జన్మించితి
విను మరునాజ్ఞకు వెలి యయ్యేనా

చ. 2: సటలోభపు సంసారము చొచ్చితి
ఘటన విడుము డిఁకఁ గలిగీనా
నటించు చపలపు నాలుక గల నే
మటమాయపు చవి మానేనా

చ. 3: పాపపుణ్యముల భవముల జీవిని
తోపడ కర్మము దొబ్బేనా
యేపున శ్రీవేంకటేశ్వరు శరణమే
పైపయి భజించి బ్రదికితిఁగాక

రేకు: 0312-04 బౌళి సం: 04-070 వైరాగ్య చింత

పల్లవి: తెలియుట యెన్నఁడు దేహి తనంతట
తెలియఁగ హరి నీదిక్కే కలది

చ. 1: రాపుగ రేపేమూత్రపురీషంబులు
ఆపై నాఁకటి యలమటలు
కైపుగ నింతటఁ గామవికారము
మాపు నిద్దురలమంపులె కలది

చ. 2: కొన్నాళ్లు బాల్యము కొన్నాళ్లు కౌమార
మన్నిటఁ గొన్నాళ్లు యౌవ్వనము
పన్నిన ముదిమియుఁ బైపైఁ గొన్నాళ్లు
వున్నతి నంతట నుడుగుట కలది

చ. 3: జంతువులకు యీసరవులు నీవే
పొంతలఁ గల్పించి పొదిపితివి
యింతట శ్రీవేంకటేశ్వర నీకృప
చింతించి కావవే చేకొని నన్ను

రేకు: 0312-05 బౌళిరామక్రియ సం: 04-071 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇదివో శ్రుతిమూల మెదుటనే వున్నది
సదరముగా హరి చాటీ నదివో

చ. 1: యెనసి పుణ్యముసేసి యే లోకమెక్కిన
మనికై భూమియందు మగుడఁ బొడముటే
పానిగి "యా బ్రహ్మభువనా లోకాః
పునరావృత్తి " యనెఁ బురుషోత్తముఁడు

చ. 2: తటుకున శ్రీహరి తన్నునే కొలిచిన
పటుగతితో మోక్షపదము సులభమనె
ఘటన "మాముపేత్యతు కౌంతేయ " మహిని
నటనఁ "బునర్జన్మ న విద్యతే "

చ. 3: యిన్నిటా శ్రీవేంకటేశ్వరు సేవె
పన్నినగతి నిహపరసాధన మదే
మన్నించి యాతఁడే " మన్మనా భవ " యని
అన్నిటా నందరి కానతిచ్చెఁగాన

రేకు: 0312-06 ధన్నాసి సం: 04-072 వైరాగ్య చింత

పల్లవి: అందులకు నందులకు హరిసేసినలంకే
కందువసంసారమందే కలదు మోక్షము గాన

చ. 1: దేహ మోన్నాళ్లు దిరిగె భూమిమీఁద
దాహపులంపటములతగు లన్నాళ్లు
వూహించి విసుగవద్దు వొల్లనన్నఁ బోవవి
శ్రీహరి నందే తలఁచి చెలఁగఁగవలెఁగాన

చ. 2: దీపనమోన్నాళ్లు మేనఁ దిరమై మెలఁగుచుండు
తాపపుటాసల మీఁదితగు లన్నాళ్లు
పైపైఁ గోపించరాదు పాయుమన్నఁ బాయ వవి
శ్రీపతి నందే తలఁచి చెలఁగఁగవలెగాన

చ. 3: యెఱుక యెన్నాళ్లు మతి నెనసి పాయకయుండె
తఱమేయింద్రియములతగు లన్నాళ్లే
వొఱలి బంధించవద్దు వున్నతి శ్రీవేంకటేశు-
మఱఁగు చొచ్చి మఱచి మట్టుపడవలెఁగాన

రేకు: 0313-01 పాడి సం: 04-073 అధ్యాత్మ

పల్లవి: తొల్లి కలవే ఇవియు తొల్లి తానుఁ గలఁడే
కల్లయునుఁ గాదు ఇది కడు నిజము గాదు

చ. 1: కనుదెరచినంతనే కలుగు నీ జగము
కనుమూసినంతనే కడుశూన్యమౌను
కనురెప్ప మరఁగుననె కలిమియును లేమియును
తన మనోభావనలఁ దగిలి తోఁచీని

చ. 2: తలఁచినంతనె యెంతదవ్వయినఁ గాన్పించు
తలఁపు మరచినమతికి దట్టమౌఁ దమము
పొలసి మతిమరఁగుననె పుట్టుటలుఁ బోవుటలు
పలు చంచల వికారభావ మీ గుణము

చ. 3: ముందు దాఁగలిగితే మూఁడు లోకములుఁ గల-
వెందుఁ దా లేకుంటే నేమియును లేదు
అంది శ్రీవేంకటేశుఁ డాత్మలోననె వీఁడె
కందువల నితనిసంకల్ప మీపనులు

రేకు: 0313-02 శ్రీరాగం సం: 04-074 భగవద్గీత కీర్తనలు

పల్లవి: చదివితిఁ దొల్లి కొంతచదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను యెంతైనా నయ్యో

చ. 1: వొరుల దూషింతుఁగాని వొకమారైన నా-
దురితకర్మములను దూషించను
పరుల నవ్వుదుఁగాని పలుయోని కూపముల
నరకపు నామేను నవ్వుకోను

చ. 2: లోకులఁ గోపింతుఁగాని లోని కామాదులనేటి-
కాకరి శత్రులమీఁదఁ గడుఁ గోపించ
ఆకడ బుద్దులు చెప్పి అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ దెలుసుకోలేను

చ. 3: యితరుల దుర్గణము లెంచి యెంచి రోతుఁగాని
మతిలో నా యాసలు మానలేను
గతిగా శ్రీవేంకటేశుఁ గని బ్రదికితిఁగాని
తతి నిన్నాళ్లదాఁకా దలపోయ లేను

రేకు: 0313-03 బౌళి సం: 04-075 అధ్యాత్మ

పల్లవి: ఉన్నదిందునే వొక్క విచారము
కన్నది గానుపు ఘనపుణ్యులకు

చ. 1: అగపడి పవిత్ర మపవిత్రంబును
జగమొక్కటనే జరగెడిని
పగటున నిది నా భావవికారమొ
జగదీశ్వరుని రచన నేరుపులో

చ. 2: అలరిన జ్ఞానము నజ్ఞానంబును
తలఁ పొక్కటనే తగిలెడిని
చలమున నిది నా సహజపు గుణమో
పెలుచగు శ్రీహరి పెరిరేఁపనలే

చ. 3: దాహపు నాలో ధర్మ మధర్మము
దేహ మొక్కటనె తిరిగెడిని
శ్రీహరి నాయాత్మ చేరిన ఫలమో
యీహల శ్రీవేంకటేశ్వరు కరుణో

రేకు: 0313-04 గుజ్జరి సం: 04-076 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇహమే పరము మరి యింతా నీ మయముగాన
సహజపుసంసారమే మోక్షము సరుసవిరక్తికి నెడమేదయ్యా

చ. 1: నీయందే బ్రహ్మ మరి నీయందే రుద్రుఁడు
నీయందే సచరాచరమును నీయందే యీజగము
చాయలనే యెడనెడ నే నేమిచూచినా సర్వము నీధ్యానమేకాక
యీయెడ నీయర్థములో నితరంబిది యోఁగాదన నెడమేదయ్యా

చ. 2: నీ చేఁతలే రాత్రులుఁబగళ్లు నీ చేతఁలే కాలత్రయము
నీ చేఁతలే సర్వజంతువుల నిశ్చల చైతన్యములు
చేచేత నే చేసినవెల్లా శ్రీపతి నీయాజ్ఞావిధులే
యేచాయలఁ బుణ్యపాపములకును యెంచఁగఁ బంచఁగ నెడమేదయ్యా

చ. 3: నీశరణా గతి యొక్కటి గలిగిన నిజము గల్లలకు వెఱపేలా
ఆశల నీవంతర్యామివిగన అందిన దేహమె వైకుంఠము
రాసికి నెక్కిన శ్రీవేంకటగిరిరమణుఁడ నీ వుపదేశమిది
యీశ పరాత్పర తనిసితి మిందే యిఁక నొకటి గోర నెడమేదయ్యా

రేకు: 0313-05 శుద్ధవసంతం సం: 04-077 శరణాగతి

పల్లవి: హరి "సర్వపాపేభ్యో ఆహం త్వా " యనె
గరిమ నా వాక్యమే ప్రమాణమైనట్టిగతి యొక్కటే నాకు

చ. 1: యిన్ని జన్మములఁ బుట్టి యేఁ జేసినపాపములు యిఁక
నన్నిజన్మములఁ బుట్టి అట్టె పుణ్యములు సేసి అవి పాపుకోఁగలనా
పన్నినదొంతులపైఁ బడ నొక్క గుదియపెట్టు
వున్నతి మోఁదినయట్టు హరిశరణాగతి యదియొక్కటే నాకు

చ. 2: యింతగాల మింద్రియముల నిట్టె సాఁగినతలఁపు యిఁక
నంతగాలము చిత్త మాఁగి నే నది దిప్పుకోఁ గలనా
చెంతఁ బంటెఁడుపాలలో నొక చల్లబొట్టు చేమిరివెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యది యొక్కటే నాకు

చ. 3: పలు శాస్త్రములు చూచి బహుదేవతలఁ గొలిచి పఱచైన యీదేహము
పలుసందేహములను వచ్చినతెరువునను పాపుకో నేఁ గలనా
యిల నంధకారపుటింటిలో నొకదీప మెత్తి మెఱసినట్టు
వొలసి శ్రీవేంకటపతి శరణాగతి వొకటే గతి నాకు

రేకు: 0314-01 లలిత సం: 04-078 ఇతర దేవతలు

పల్లవి: నిత్యసుఖానంద మిదె నీ దాస్యము
సత్యములేని సుఖాలు చాలుఁ జాలు నయ్యా

చ. 1: కన్ను చూపుల సుఖము కడు నీచక్కనిరూపె
యెన్నఁగ వీనులసుఖమిదె నీపేరు
పన్ని నాలుకసుఖము పాదపు నీతులసి
వున్న సుఖముల తెరు వొడఁబడమయ్యా

చ. 2: తనువుతోడిసుఖము తగు నీకైంకర్యము
మనసులోసుఖము నీ మంచిధ్యానము
పనివి యూర్పుసుఖము పాదపద్మమువాసన
యెనయని పెరసుఖ మేమి సేసేనయ్యా

చ. 3: పుట్టుగు కెల్లసుఖము పొల్లులేనినీభక్తి
తొట్టి కాళ్లసుఖము పాతురలాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలి చెన్నుఁడవై
వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా

రేకు: 0314-02 మంగళకౌశిక సం: 04-079 గురు వందన, నృసింహ

పల్లవి: జీవములు దవ్వువోయ చీమలునుఁ బుట్టచొచ్చె
వేవేలయిన నిది విడువనయ్యా

చ. 1: చింతలన్నియుఁ బాసె చిత్తమింతట రోసె
యెంత లే దీయాసలు యిఁకనేలయ్యా
అంతలో గురునిగంటి హరికే శరణంటి
దొంతులభవములాల తొలఁగరో

చ. 2: గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె
యెక్కడి పలురుచులు యిఁకనేలయ్యా
చిక్కె విజ్ఞానము నేఁడె జిహ్వ నారాయణుఁగూడె
వుక్కునఁ బాపములాల వుడుగరో

చ. 3: జీవుఁడు పాపనమాయ దేవుఁడే జీవనమాయ
యీవలి యావని కర్మమిఁక నేలయ్యా
శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను
భావపుబంధములాల పారరో

రేకు: 0314-03 తోడి సం: 04-080 ఉపమానములు

పల్లవి: ఇంతే యింతే యీంకా నెంత చూచినా
చింతలఁ జిగురులెక్కి చేఁగదేరినట్లు

చ. 1: వుల్లములో నెంచనెంచ నుద్యోగములే పెక్కు
పొల్లకట్టు దంచదంచఁ బోగులైనట్టు
బల్లిదుని హరినాత్మ భావించుటొకటే
ముల్ల ముంటఁ దీసి సుఖమున నుండినట్లు

చ. 2: అనిన సంసారమున నలయికలే పెక్కు
చానిపిఁ జవి వేఁడితేఁ జప్పనైనట్టు
పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే
నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు

చ. 3: వెనకఁ దలఁచుకొంటే విజ్ఞానములే పెక్కు
తినఁ దిన వేమేల్లాఁ దీపైనట్టు
చనవై శ్రీవేంకటేశు శరణను టొక్కటే
పనివడి చెఱకునఁ బండువండినట్లు

రేకు: 0314-04 నారాయణి సం: 04-081 శరణాగతి

పల్లవి: హరిశరణాగతి యాతుమది
సరుస నిదియపో సతమయ్యెడిది

చ. 1: దినదినరుచులివి దేహమువి
చెనకేటికోరిక చిత్తమిది
యెనసేటికాంతలు యింద్రియంబులవి
పనివి యాత్మకివి పనిలేదయ్యా

చ. 2: పదరేటికోపము పాపమిది
అదనఁ గాలములు అనాదివి
నిదుర తమోగుణ నిలయమిది
యెదుట నాత్మకివి యెరవెరవయ్యా

చ. 3: కాయపు జననము కర్మమిది
మాయలంపటము మమతలది
యేయెడ శ్రీవేంకటేశుఁ డితనికృప
పాయనియాత్మకుఁ బ్రమాణమయ్యా

రేకు: 0314-05 దేశాక్షి సం: 04-082 గురు వందన, నృసింహ

పల్లవి: ఎదిరికి మాకును యెక్కుడుతక్కువ లివి
పదిలపుజ్ఞానముచేఁ బవిత్ర మాయ

చ. 1: మహిఁ బొడమినవెల్లా మంచివే యందులోఁ
దహతహ దేహమే తగనిది
యిహములో తృణములుయెండినా యోగ్యములాయ
బహి నిర్జీవపు మేను పనికిరాదాయ

చ. 2: పుడమిఁ జల్లినవెల్ల పురుషార్థపదములే
కడుపున నిడుకొంటేఁ గానివి
గుడికొని యితరపు గోమయమే శుద్ధి యాయ
అడరి మానుషధర్మ మతి హేయ మాయ

చ. 3: హరిసేవ గురుసేవ నాత్మజ్ఞానమున కెక్కె
పొరలింపుఁగర్మమే పుణ్యమంటెకే
అరిది శ్రీవేంకటేశుడంతరాత్మకుఁ డితని
శరణనుటే సర్వసాధన మాయ

రేకు: 0314-06 దేసాళం సం: 04-083 వైరాగ్య చింత

పల్లవి: గుల్ల గుల్లే రాయి రాయే గురి యెంతవేసినాను
అల్లనాఁడే అడియాస లవియేల విడుతు

చ. 1: మహిలోన రోగములు మాన మందు గద్దుగాక
సహజగుణము మాన్పఁజాలుమందు గలదా
బహుబంధములు నీవే పాపితే నేమోకాని
అహరహమును నేనే అవియేల విడుతు

చ. 2: తనరూపమద్దములో తగఁ జూడవచ్చుఁగాక
మనసు దా నద్దములో మరి చూడవచ్చునా
దినచంచలము నీవే తీర్చితేనేమో కాని
అనుఁగు సంశయము నేనదియేల విడుతు

చ. 3: నాలుకచే రుచులెల్ల నంజి చూడవచ్చుఁగాక
జాలిఁబడ్డ కన్నులచేఁ జవి గానవచ్చుఁగాక
యేలి శ్రీవేంకటేశ నీవిట్టే కాతువుగాక
వేళ జీవుఁడను నా విధమేల విడుతు

రేకు: 0315-01 సామంతం సం: 04-084 శరణాగతి

పల్లవి: పట్టినవ్రతమే పంతము హరితో
గుట్టున శరణని కొంకఁగఁదగవా

చ. 1: అవ్వల రోసినయన్నము గుడిచిన
నెవ్వరు నవ్వరు యిఁకనేలా
రవ్వగ నొల్లక రాజసము విడిచి
దవ్వులఁ జేకొనఁదగవా మనకు

చ. 2: విడిచినభూతము వెస మరలించిన
యెడయని యేహిత విఁకనేలా
యిడుమలఁ బిలుచుచు నిచ్చిన నొల్లక
అడుగఁ బోయితే నమరునె మనకు

చ. 3: శ్రీవేంకటపతి సేవ వారమై
యీవిధిఁ బరులసే విఁకనేలా
కైవస మీతఁడు కంటి మితనికృప
యీవల నావల నెదురా మనకు

రేకు: 0315-02 సాళంగనాట సం: 04-085 హనుమ

పల్లవి: ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు
వొక్కఁడే నిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు

చ. 1: పెట్టినజంగదండ పిడికిటి మొలచేయి
అట్టె వలచేయెత్తిన యాయితము
తొట్టిన పెంజమటలు తోడనె బుసకొట్టులు
వుట్టిపడీఁ జూడరమ్మ వుగ్రహనుమంతుడు

చ. 2: నిక్కినకర్ణములు నింగిమోఁచినబొమ్మలు
చక్కశిరసుపైఁ బారఁజూచిన తోఁక
చుక్కలు మొలపూసలు సూదుల వాఁడి రోమాలు
వుక్కుమీరెఁ జూడరమ్మ వుగ్రహనుమంతుడు

చ. 3: పుట్టుఁగౌపీనము మహద్భుత యజ్ఞోపవీతము
గుట్టుచూపని కనకకుండలములు
పట్టపు శ్రీవేంకటేశు బంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజయనగరపు వుగ్రహనుమంతుడు

రేకు: 0315-03 శంకరాభరణం సం: 04-086 వైష్ణవ భక్తి

పల్లవి: పరమవైష్ణవుల భాగ్యంబిదివో
నిరతి వారలకే నే మొక్కెదను

చ. 1: తలఁచ రొకప్పుడు ధరణి భోగములు
తలఁచ రితరమతదైవముల
తలఁతు రొకటి హరిదాసులదాస్యము
తలఁపు మోక్షములతగులమిగాన

చ. 2: కోరరు బ్రహ్మాదిగురుతరపదములు
కోరరు మేరువుకొనసుఖము
కోరుదురు తదియ్య కోట్ల సంగము
కోరిక భక్తితోఁ గూఁడీగాన

చ. 3: వొల్లరు కర్మము లొల్లరు పుణ్యము
లొల్లరహంకార మొకపరియు
వుల్లము శ్రీవేంకటోత్తము శరణని
యెల్లందుఁ దుదిపద మొక్కిరిగాన

రేకు: 0315-04 ముఖారి సం: 04-087 నామ సంకీర్తన

పల్లవి: ఇందులోనఁగల సుఖమింతే చాలు మాకు
నిందు వెలియైన సిరులేమియు నొల్లము

చ. 1: ఆదిదేవు నచ్యుతు సర్వాంతరాత్మకుని
వేదవేద్యుఁ గమలాక్షు విశ్వపూర్ణుని
శ్రీదేవు హరి నాశ్రిత పారిజాతుని
అదిగొని శరణంటి మన్యము నేమొల్లము

చ. 2: పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము

చ. 3: అనుపమ గుణదేహు నణురేణు పరిపూర్ణు
ఘనుఁ జింరంతనుని కలిభంజను
దనుజాంతకుని సర్వధరు శ్రీవేంకటపతిఁ
గని కొలిచితిమి యేగతులు నేమొల్లము

రేకు: 0315-05 వరాళి సం: 04-088 శరణాగతి

పల్లవి: హరికే మొఱవెట్టు టంతేకాక
గరిమ వేరోకటను గతి గానవచ్చునా

చ. 1: పాపపుణ్యాలంపటాలఁ బరగిన జీవునికి-
నోపనవచ్చునా వొడలి మోపు
కోపపు శాంతము చేతఁ గొట్టువడ్డప్రాణికి
తాపపు కర్మపువెట్టి తప్పంచుకోవచ్చునా

చ. 2: ఆఁకటి నీరువట్టుల కగపడ్డదేహికి
తోఁకసంసారపుటాజ్ఞ తోయవచ్చనా
సోఁకుసుఖదుఃఖములఁ జొచ్చినజంతువునకు
మూఁకల లోకపులగ్గములఁ బాయవచ్చునా

చ. 3: సారె రాత్రిఁ బగటాను చచ్చిపుట్టేజంతువుకు
భారపుటాసల లోనఁ బాయవచ్చునా
యీరీతి శ్రీవేంకటేశు నిటు శరణన్నఁగాక
ధారుణిఁ బంచబాణము దప్పుకొనవచ్చునా

రేకు: 0315-06 బౌళి సం: 04-089 కృష్ణ

పల్లవి: అడ్డములేనినాలిక నాడుదురుగాక భూమి
దొడ్డవాఁడేమి సేసినా దోస మందు నేది

చ. 1: ఆతుమలో మదనుఁడవయ్యే వాఁడవు నీవే
ఆతల నాలిమగఁడువనే వాఁరలు నీవే
ఘాతల పరాంగనఁ గలసితివని నిన్ను
తోతో మునుల కిఁక దూరఁ జోటేదయ్యా

చ. 2: దేహము లోపలనున్న దీపనాగ్నియు నీవే
దాహము నాఁకలి నీవే తగురుచులెల్ల నీవే
ఆహా శబరియెంగి లారగించి తనుమాట
సోహల నిందించి నవ్వఁ జోటిందు నేది

చ. 3: పుట్టుగు లోపలనున్న భోగము లన్నియు నీవే
ఇట్టే ఆచారములు హీనాధికములు నీవే
గుట్టున శ్రీవేంకటేశ గొల్లఁడవై పుట్టినందు-
కుట్టిపడి యెవ్వరికి నూహించఁజోటేది

రేకు: 0316-01 గుజ్జరి సం: 04-090 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సర్వం విష్ణుమయం బను భావము సత్యం బిన్నిటను
సర్వేశ్వరుఁడే పొందేటి వస్తువు శరణాగతి యే వుపాయము

చ. 1: తానని యెడి బుద్ధి దైవంబందు నునిచి
తానే తనమతి మరచిన సుఖ తత్వానందమిది
మేనని యెడి బుద్ధి యీ మేదిని ప్రకృతి యందు
ఆనింపుచుఁ దా మమతలు విడిచిన నాత్మజ్ఞానంబు

చ. 2: పొరలి జగమనే బుద్ధి మాయపై నునిచి
పరగిన యింద్రియముల గెలిచినదే పరమపు యోగంబు
పొరిఁ గర్మపు బుద్ధి పుట్టువుపై నునిచి
వెరపునఁ బాపము బుణ్యము విడుచుట వివేకమగు దుదిపదము

చ. 3: వెలి దోఁచిన బుద్ధి వేగమే లోనునిచి
చలమున చంచల ముడిగి యుండుటే సమాధి లక్షణము
పలు భావపు బుద్ధి భక్తి వొకట నునిచి
యెలమి శ్రీ వేంకటపతి గలయుటే యిది తుర్యావస్థ

రేకు: 0316-02 లలిత సం: 04-091 అధ్యాత్మ

పల్లవి: తలఁపులోని వెలితే దైవము వెలితౌ
కలగిన ఇదియే కారణము

చ. 1: యెదిటి యాసలకు నెడిసి తొలఁగుటే
తుద నరకములకుఁ దొలఁగుట
వదలక ఇంద్రియవర్గము గెలుచుటే
పదపడి తనపాపముల గెలుచుట

చ. 2: మగటిమి సంసారమాయ దాఁటుటే
తగుభవవారిధి దాఁటుట
జగములోపలను శాంతిగలుగుటే
అగణిత మోక్షమునందుఁ బొందుట

చ. 3: మహి ఇంతా హరిమయముగఁ గనుటే
విహితపు జ్ఞానము వెసఁ గనుట
ఇహమున శ్రీవేంకటేశు శరణనుటే
సహజపు జన్మము సఫలం బనుట

రేకు: 0316-03 రామక్రియ సం: 04-092 వైరాగ్య చింత

పల్లవి: మరుగుచుఁ జేసీ మానదుద్యోగము
నరహరి నీ కృపే నాగతి గలదు

చ. 1: అనుపమ మైన భయంబున నరకము
వినియెదఁగాని వెరచి విడువను
మనియెడి జీవుల మరణ భవంబులు
కనియెదఁగాని కలంగదు మనసు

చ. 2: రాసుల మలమూత్రపు సోదనలిటు
సేసీఁగాని ఛీ యనదు తనువు
ఆసల నర్థపుటార్జన యలపుల
వేసరదుఁగాని విరతి నిలుపను

చ. 3: నిరతముఁ దలపఁగ నిదురయుఁ దెలివియు
తొరలీఁగాని తారలనీదు గుణము
యిరవగు శ్రీవేంకటేశ్వర నీవే
పరమాత్మవు ననుఁ బాలించఁగదే

రేకు: 0316-04 సాళంగనాట సం: 04-093 భగవద్గీత కీర్తనలు

పల్లవి: వెలినుండు లోనుండు విశ్వమింతటనుండు
జలజాక్షు శరణమే సాధనము సుండీ

చ. 1: మిక్కిలిఁ జేసే పాపమే మీఁద నరకమై తోఁచు
నిక్కి తానే అద్దములో నీడైనట్లు
వొక్కటి మొదలులేక వుంటేఁ గొనాలేదు
గుక్కకిహపరములు కోరినంతే సుండీ

చ. 2: మహిఁ దొల్లి చూచినూరే మతిలోన దోఁచీని
గహనపు కాఁపురమే కలయైనట్లు
సహజమై పుట్టులేక చావులేదెవ్వరికి
విహిత సుఖ దుఃఖములు వేఁడినంతే సుండీ

చ. 3: యెండగాసే బయటనే యెక్కువ వెన్నెలగాసీ
దిండురేయిఁ బగలొక్క దినమైనట్లు
నిండు జీవుఁడు లేకుంటే నిక్కపు దేవుఁడు లేఁడు
అండ శ్రీవేంకటేశుఁడే అంతరాత్మ సుండీ

రేకు: 0316-05 పాడి సం: 04-094 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పుట్టుభోగులము నేము భువి హరి దాసులము
నట్ట నడమి దొరలు నాకియ్యవలెనా

చ. 1: పల్లకీలు నందలాలు పడివాగెతేజీలు
వెల్లవిరి మహలక్ష్మివిలాసములు
తల్లి యాకె మనినే దైవమని కొలిచేము
వొల్లఁగే మాకేసిరులు వొరు లియ్యవలెనా

చ. 2: గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామిని యాకెమగని ప్రాణధారి లెంకలము
వోమి మాకాతఁడే యిచ్చీ వొరులియ్యవలెనా

చ. 3: పసగల పదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీ వేంకటేశుఁడు
యెసఁగి యాతఁడే మమ్ము నేలి ఇన్నియు నిచ్చె
వొసగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా

రేకు: 0316-06 రామక్రియ సం: 04-095 వైరాగ్య చింత

పల్లవి: దైవము నీవే దయదలఁచుట గా
కావలఁ బ్రాణికి యాసే దయ్యా

చ. 1: ఆస వొకటి యెంతయినాఁ దనియదు
వాసి యొకటి తనవంతులు మానదు
యీసొకటి శాంతమెరఁగని దిదె
మోసపుదేహికి ముక్తి యే దయ్యా

చ. 2: పాపమొకటి భవబంధముఁ బాపదు
దీపమొక్కటి ధీరత యొల్లదు
చూపొక టింద్రియసుఖముల గెలువదు
యేపునఁ బ్రాణికి యెఱకే దయ్యో

చ. 3: పాయమొకటి చాపలములు మానదు
కాయమొకటి తనకర్మము విడువదు
యీయెడ శ్రీవేంకటేశ్వర నీసేవ
సేయని యాత్మకు సెలవే దయ్యా

రేకు: 0317-01 మలహరి సం: 04-096 నృసింహ

పల్లవి: కటకట యీమాయ గడచుట యెట్లో
ఘటనల హరికృప గలిగినఁగాక

చ. 1: యిరవగుజీవుల కెంతగలిగినా
పరధనకాంతలే బలుప్రియము
ధరఁ గర్మాపుఁజేతలలోనెల్లా
సొరదిఁ బాపమే సులభము

చ. 2: నానారుచులు యనంతము గలిగిన
కానిపదార్థమె కడుఁ దీపు
పానిన చదువుల పఠన లుండగా
మానని దుర్భాషమాఁటలే హితవు

చ. 3: యెదలో శ్రీవేంకటేశ్వరుఁడుండఁగ
సదరపు దివిజులు చవులయిరి
అదనను శ్రీగురుయానతి గలుగఁగ
పొదిగొని యివి తలపోయఁగ వలెసె

రేకు: 0317-02 దేవగాంధారి సం: 04-097 నామ సంకీర్తన

పల్లవి: ఆహా నమో నమో ఆదిపురుష నీకు
యీహల నేనెంతవాఁడ నెట్టు గాచితివి

చ. 1: లోకాలోకములు లోన నించుకొన్న నీవు
యీకడ నాత్మలోన నెట్టణఁగితి
ఆకడ వేదములకు నగోచరమైన నీవు
వాకుచే నీనామములఁ వడి నెట్టణఁగితి

చ. 2: అన్నిటా బ్రహ్మాదుల యజ్ఞభోక్తవైన నీవు
అన్నపానములివి యెట్టారగించితి
సన్నుతి పూర్ణుఁడవై జనియించిన నీవు
వున్నతి నాపుట్టుగులో వాకచో నెట్టుంటివి

చ. 3: దేవతలచే పూజ తివిరి కొనిన నీవు
యీవల నాచే పూజ యెట్టు గొంటివి
శ్రీవేంకటాద్రి మీఁద సిరితోఁ గూడిన నీవు
యీవిధి నాయింట నీవు యెట్టు నిలచితివి

రేకు: 0317-03 బౌళి సం: 04-098 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీవే నీదాసులని నినుగంటిఁ గంటిని
ఆవలనీవే అంతర్యామివి గాన

చ. 1: నీదాసుల శిరసులే నీదివ్యశిరసులు
నీదాసులపాదములే నీదివ్యపాదములు
నీదాసులకన్నులే నీదివ్యనేత్రములు
నీదాసులరూపమే నీవిశ్వరూపము

చ. 2: నీకింకరులగుణాలే నీదివ్యగుణములు
నీకింకరులున్నచోటే నీకు నిత్యవైకుంఠము
నీకింకరుల సేవే నీవు మెచ్చునిజసేవ
నీకింకరుల కూటమే నీకు సర్వాంగములు

చ. 3: యిందరిలో శ్రీవేంకటేశ నీవే పో యంటే
అంది తల్లిముట్టే యుంటే నంటవచ్చునా
యెందు నజ్ఞానపు ముట్టు యెడసినాత్మలుగాన
నిందలేని నీదాసులే నీవని సేవింతును

రేకు: 0317-04 ధన్నాసి సం: 04-099 అధ్యాత్మ

పల్లవి: ఆయంబిది తెలియంగల దీయాత్మజ్ఞానంబు
మాయలు యీకాలము కర్మము మాధవునాధీనము

చ. 1: దేహమునకు నీడ తిరిగినయటువలెనే
శ్రీహరికి కళావిధమై జీవుఁడటు దిరుగు
దేహమునకుఁ గల చైతన్యము తెగి నీడకులేదు
శ్రీహరికిని గల స్వతంత్రము జీవునికిలేదు

చ. 2: కలలోపలఁ గల సుఖము ఘనసంతోషము కొరకే
యిల లోపలఁ గలిగిన సుఖము ఇది సంతోషము కొరకే
కలలోపలి విజీవుని సంకల్పన లిన్నియును
ఇల లోపలి ప్రపంచ మింతయు నీశ్వరుసంకల్పము

చ. 3: చెదరిని బాహ్యపునిషయములు జీవునిపాలిటివి
పదిలంబగు అంతరంగమే పరమపువైకుంఠము
అదనెరిఁగి కాలగాలమున ఆతుమ శ్రీవేంకటపతికి
పొదిగియాతనికి శరణనికొలిచిన పొందగుముక్తికియిదిగీలు

రేకు: 0317-05 పాడి సం: 04-100 నామ సంకీర్తన

పల్లవి: పాప పుణ్యముల పక్వమిదెరఁగను
నాపాలిటి హరి నమో నమో

చ. 1: మానసవాచక మరి కర్మంబుల
తానకముగ నీదాసుఁడను
పూని త్రిసంధ్యల భోగభోగ్యముల
నానాగతులను నమోనమో

చ. 2: వలనుగ జాగ్రస్వప్నసుషుప్తుల
యిలలో నీకేమి హితభటుఁడ
వెలుపల లోపల వేళావేళల
నలినాక్ష నీకే నమోనమో

చ. 3: పుట్టుకతొలుతను పుట్టినమీఁదట
అట్టె నీశరణాగతుఁడ
గట్టిగ శ్రీవేంకటపతి నీకృప
నట్టనడుమైతి నమోనమో

రేకు: 0317-06 రామక్రియ సం: 04-101 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇందరిపై భిన్నభక్తులేఁటికి మాకిఁక
అందరిలో అంతరాత్మ యాతని రూపే

చ. 1: తల్లియై యుండేవాఁడు తగ నితనిరూపే
యెల్లగాఁ దండ్రైనవాఁడు నితనిరూపే
యిల్లాలై సుఖమిచ్చు నితనిమహిమరూపే
వెల్లవిరిఁ దనము లీవిష్ణునిరూపే

చ. 2: గ్రామదేశకులములు ఘనుఁడితనిరూపే
కామించునర్థ మీతఁడై కలుగు నీరూపే
దీమపాన నిహపరద్రిష్టము లితనిరూపే
యేమేర దాతయు దైవ మీతనిరూపే

చ. 3: కాలము నితనిరూపే కర్మము నితనిరూపే
యేలి యాచార్యుఁడు చెప్పే దితనిరూపే
శ్రీలలనాపతి శ్రీవేంకటేశ్వరుఁడే
పాలించఁగాఁ గంటి నే నీపరమాత్మురూపే

రేకు: 0318-01 గుండక్రియ సం: 04-102 శరణాగతి

పల్లవి: ఏపను లెవ్వరికిఁగల దెంత యంతేకాని
శ్రీపతియాణాజ్ఞలు మీఁఱగ చింతింపఁగఁ దరమా

చ. 1: సులభంబున సుఖయించుటఁబోలదు సొంపుగ భిక్షాన్నముతోడ
పలు లంపటములఁబడి ఘడియించేటి బహుధన మిగదియేల
తొలుతే జంతువులను వ్రాసెను తొడఁగి నుదిట బ్రహ్మ
కలది దైవికములఁ గడచెదమని కడుబడలెదరేలో నరులు

చ. 2: పాపము సేయక మానుటఁ బోలదుపరమశాంతితోను
కోపము మానక బహుపుణ్యంబులు కోట్లు చేసినను
దీపింపఁగ వేదశాస్త్రములు తెలిపెడి యర్థ మిదే
కైపుగ నిది దెలియక జీవులు కడుబడలెదరేలో నరులు

చ. 3: సహజము జగమున యీపనులెల్లను జరగుచు నుండుట స్వభావము
గహనము ప్రాణులకే పనులను ననఁ గాదన కర్తన్య మింతేది
యిహమేల శ్రీవేంకటేశ్వరు నమ్మిన యీతనిశ రణాగతులు
మహిలోఁజూతురు నవ్వుదు రిటునలె మానరేటికో నరులు

రేకు: 0318-02 భవుళి సం: 04-103 విష్ణు కీర్తనం

పల్లవి: నీకంటే నితరము మరి లేదు నేనెవ్వరితో భాషింతు
యేకో నారాయణుఁడవు నీవని యెన్నచు నున్నవి వేదములు

చ. 1: యెక్కడచూచిన నీరూపంబులే యెవ్వరిఁజూచినఁ దోఁచిని
వెక్కసముగ నీమహిమ యనంతము విశ్వాత్మకుఁడవుగాన
నిక్కి యెవ్వరిని బేర్కొని పిలిచిన నీనామములై తోఁచీని
వక్కణించఁగా సకలశబ్దములవాచ్యుఁడవటు గాన

చ. 2: యేపనిచేసిన నీపనులే అవి యివ్వలనవ్వలఁ దోఁచీని
పాపపుణ్యమని తోఁచదు నీవే పరచైతన్యమవటు గాన
దాపుగ మతిలోనేమి దలఁచినా ధాన్యము నీదైతోఁచీని
లోపల వెలుపల నిండుక వుండెది లోకపూర్ణుఁడవు గాన

చ. 3: యీ యర్థమునకు నేననువాఁడను యెక్కడ నున్నాఁడ నీలోనే
కాయధారినై యేర్పడి నీలోఁగాక చరించితి యిన్నాళ్లు
యీ యపరాధము యెంచకుమీ నను యిందునె పో నీశరణంటి
పాయక నిన్నిఁక శ్రీవేంకటపతి పరబ్రహమవుఅటు గాన

రేకు: 0318-03 సామంతం సం: 04-104 శరణాగతి

పల్లవి: అచ్చుతుడనియెడి నామముగలిగినయట్టి నీవేకాక
కుచ్చి నీకు నేశరణని కొలిచితి గురుతుగఁ గావఁగదే

చ. 1: అణురూపగుమశకములోపల నణఁగిన నీకంటే
గుణించి యెంచి చూచినను కొంచె మింకనేది
ప్రణుతింపంగ బ్రహ్మాండకోట్లు భరియించునీకంటే
గణనకు నెక్కుడు నీవేకాక ఘన మిఁకనేది
చ. 2 దాకొని జగములు పుట్టించు బ్రహ్మకు తండ్రివి నీవే
కైకొని చదువులఁ దెలిసిచూడ రక్షకులిఁక మరి వేరి
యేకోదకముగ వటపత్రమున యీఁదేటినీకంటే
దీకొనిపలికిన కాలంబుల కొనదేవుఁడు మరివేఁడీ

చ. 3: శ్రీవేంకటమున వరములొసఁగేటి శ్రీపతి నీకంటే
తావుఁన గన్నులఁజూడఁగ బ్రత్యక్షదైవము మరివేఁడి
వేవేలకు వైకుంఠవిభుఁడవై వెలిసిన నీకంటే
భావించి చూచిన నంతరంగమునఁ బరోక్షదైవముమరివేఁడీ

రేకు: 0318-04 దేవగాంధారి సం: 04-105

పల్లవి: హరి నే నిన్నిందులకుఁగా దర్చించి కోరెడిది
గరిమల నాయంతరంగమున నినుఁ గానఁగ నడిగెదను

చ. 1: మునుపే యీజగమెల్లా నీవు మెలవఁగ బెట్టినది
వెనుకొని నేను నీవాఁడనే యని విన్నవించనేల
నినుపై యీజీవరాసులన్నియు నీరక్షణలోనివి
కనుఁగొని నన్నునురక్షించుమని మరి కమ్మరఁజెప్పఁగనేల

చ. 2: యిహమునఁగర్మాధీనంబయి సిరులియ్యఁగ నినునింకా
మహిలో నివి యవి నాకు నిమ్మనుచు మరి యడుఁగనేల
సహజపుఁ దల్లియుఁదండ్రియు బంధులు సంతతి నీవై యుండఁగను
విహితముగా నిను నక్కడ నిక్కడ వెదకఁగ మరి యేల

చ. 3: శ్రీవేంకటపతి వరము లొసంగుచు చేరువ నీవై యుండఁగను
ఆవల నీవల నితరదేవతల యాసలఁ బడనేల
దైవశిఖామణి వాదిమూరితివి తగిన స్వతంత్రుఁడవు
యేవిధులు నేనెఱఁగను నీవే యింతాఁ జూమ్మీదాఁచఁగనేల

రేకు: 0319-01 సామంతం సం: 04-106 శరణాగతి

పల్లవి: పరమాత్మ నాజాడ భావించ నిట్టిది, నీవు
నిరుహేతుకాన నాకు నీవు బుద్దియ్యఁగదె

చ. 1: అపరాధములు పెక్కు లటు నాయందున్నఁగాని
వుపమఁ బుణ్యముత్రోవ లూహించలేను
విపరీత పాపములు వేవేలు సేసినఁగాని
చపలగర్వము మాని శరణనలేను

చ. 2: పలులంపటాలఁ బడి బడలినఁగాని, నాకు
పలవి నిన్నుఁ దలఁచేభక్తి లేదు
పులుసు నంజినఁగాని భూమిలో మిక్కిలి తీపు
తలపోయ నోటికి నితవు గానరాదు

చ. 3: వేవేలు నేరాలు సేసి వెరపు పుట్టినఁగాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరదు మతి
వావిరి లోకపుమాయవలలఁ జిక్కినఁగాని
వేవేగ వెడలి ముక్తి వెదకఁడు జీవుడు

రేకు: 0319-02 గుజ్జరి సం: 04-107 శరణాగతి

పల్లవి: శ్రీపతి నీ సేవ చిత్తము గోరదు
పాపముల వెంటనే పారీ నయ్యా

చ. 1: తెగనికర్మము దేహములు గోరు
వగలయీపిఁగ ప్రణాలు గోరు
నగుచుఁ దొల్లింటి నా పూర్వకర్మములు
పొగరుభోగములే పొందించె నయ్యా

చ. 2: సొకిరివయసు సంసారము గోరు
చీకురువాయులు జీడిమాను గోరు
దీకొని నాతోడి తీరనింద్రియములు
కైకొని మర్మములు గలఁచీ నయ్యా

చ. 3: వేదవిజ్ఞానము విరతియే కోరు
నీదాసుఁడైతేనే నీశరణు గోరు
యీదెస శ్రీవేంకటేశ నీవు నాలో
పాదైయుండి నన్ను బ్రదికించే నయ్యా

రేకు: 0319-03 లలిత సం: 04-108 అధ్యాత్మ

పల్లవి: అతనిభజియించరో ఆతుమలాల శ్రీ-
పతి యితనికరుణే ఫలమింతేకాని

చ. 1: సంగమే భంగమే సుండి సకలవిరక్తులాల
వెంగలివిషయములే విషము సుండీ
అంగపుబందువులెల్ల అంటుబంధములు సుండీ
సంగతి హరి యొక్కఁడే సతమింతేకాని

చ. 2: మోహమే దాహముసుండి మోక్షోపాయకులాల
సాహస సంసారమే నిస్సారము సుండి
దేహము గొన్నాళ్ళకు సందేహమై తోఁచు సుండి
శ్రీహరి సేవొక్కటే వచ్చినదింతేకాని

చ. 3: కోపమే తాపముసుండి కోరని సాత్వికులాల
రూపులేని భోగమెల్ల రుణము సుండి
కైపుసేసి యన్నిటాను గడిచిశ్రీవేంకటేశు-
నోపి శరణని మనేదక్కటే సుండి

రేకు: 0319-04 మాళవి సం: 04-109 దశావతారములు

పల్లవి: ఆతఁడోపో మాయేలిక ఆతఁడే జగన్మూల-
మాతఁడే శ్రీవేంకటాద్రి యందు మీఁది దైవము

చ. 1: కమలవాసిని యైన కాంతఁ బెండ్లాడినాఁడు
కమలములో బిడ్డఁ గన్నవాఁడు
కమలాప్తునిలోనఁ గలిగి మెరయువాఁడు
కమలనాభుఁడేపో కలుగు మాదైవము

చ. 2: జలధి బంధించి లంక సంహరించినవాఁడు
జలధిచొచ్చినదైత్యుఁజంపినవాఁడు
జలధిసుతునకు వరుస బావైనవాఁడు
జలధి శయనుఁడేపో చక్కని మాదైవము

చ. 3: కొండ గొడుగుగనెత్తి గోవులఁగాచినవాఁడు
కొండవంటి రాకాసిఁ గొట్టినవాఁడు
కొండలకు నెక్కుడైన గురుతు శ్రీవేంకటాద్రి-
కొండరూపు దానేపో కోరిన మాదైవము

రేకు: 0319-05 నాట సం: 04-110 కృష్ణ

పల్లవి: వొద్దునీవు నాకెదురా వోరి కంసుఁడా
కొద్దిగాదు పెనఁగఁగ గోవిందుతోఁ గంసుఁడా

చ. 1: పెరిగీ రేపల్లె నదె బిరుదునీవైరి వాఁడే
వొరసి నన్నేలపట్టే వోరికంసుఁడా
విరసాన వెరవను విష్ణుమాయను నీ-
గొరబైనవెడబుద్ధి గొలుపద వోరా

చ. 2: వెదకీ నీవైరి వాఁడె వీరదానవులనదె
వుదుటు నాతోనేల వోరికంసుఁడా
చిదుమనా నిన్నిపుడే సెలవీఁడుగా కతఁడు
పెదవుల చేటింతే పేదవానికోపము

చ. 3: వెన్నలుఁ బాలారగించి వెసఁవాడె సత్యగూడ-
నున్నవాఁడు, నిన్నుగెల్వ నోరి కంసుఁడా
వెన్నుఁడు శ్రీవేంకటాద్రి విభుఁడు లోకులఁగాచె-
నన్నిటాఁ గృష్ణావతార మందఁబట్టి నేఁడు

రేకు: 0319-06 సామంతం సం: 04-111 గురు వందన, నృసింహ

పల్లవి: ఈతఁడే బ్రష్టవరము లియ్యఁగాఁ గాఁక
ఆతలీతలీ సుద్దులవి నమ్మఁగలమా

చ. 1: హరి రూపెరుఁగుదుమా అరసి ఇంతకతొల్లి
సొరది శ్రీవేంకటేశుఁ జూచి కాక
గురుమంత్రము నేర్తుమా గోవిందుఁడితని నామ
మురుటై లోకాలనెల్ల నుండఁగా గాక

చ. 2: వైకుంఠ మెరుఁగుదుమా వర్ణించి ఇంతకతొల్లి
దీకొని శ్రీవేంకటాద్రిఁ దిరిగి కాక
యేకడ దేవతల నేమెందునైనాఁ గంటిమా
చేకొని హరిదాసులఁ జేరి మొక్కే కాక

చ. 3: పుట్టు నేఁ గంటినా పొంచి శ్రీవేంకటపతి
వొట్టి నాయంతరాత్మై యుండఁగాఁగాక
కొట్టఁగొనపర మేడ కొంచెపు దేహి నేనేడ
అట్టె యాతనికి శరణని కొలిచి కాక

రేకు: 0320-01 శుద్ధవసంతం సం: 04-112 శరణాగతి

పల్లవి: హరి నీవే సకలలోకారాధ్యుడఁవు గాక
ధర నీకు శరణంటే తలఁపిదే చాలును

చ. 1: కింది నేఁజేసినయట్టికీడు నీవు వాపఁగాను
అందుమీఁదు నడిగేదా అది చాలక
పొంది పుట్టించేట్టి బ్రహ్మపుత్రుఁడు నీకైవుండఁగ
ఇందరిఁగొలిచేదా యెంత కూళతనము

చ. 2: దీకొని నాలో నీవు దిక్కై వుండగాను
నాకొక స్వతంత్రమా నాఁడు చాలక
కైకొని లోకములు నీకడుపులో నుండఁగాను
నీ కంటేఁ బరులున్నారా నేరమింతే కాక

చ. 3: ఇహపరముసిరులు ఇన్నియు నీవియ్యఁగాను
సహజాన నుండవొద్దా చాలదా యింత
విహితమైన శ్రీవేంకటేశ వొక్కండవే
బహళమై వుండఁగాను బంటనంటగాక

రేకు: 0320-02 గుండక్రియ సం: 04-113 శరణాగతి

పల్లవి: జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము
శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను

చ. 1: అరుతఁ గట్టినతాళి యవె వనమాలికలు
సరుస మోఁచిన డాగు శంఖచక్రములు
వరుస నొసల గురివ్రాసినది తిరుమణి
ఇర వెరిఁగితి మిఁక నెపుడైనఁ గావుము

చ. 2: పళ్ళెము ప్రసాద మింతే పసగా నారుచు లివె
పిల్లు నేఁ బొగడేవి నీబిరుదులు
యెల్లపుడుఁ బూజించేది ఇది నీరూపుపతిమ
కల్లలే దిందుల నీవు గన్నదింతే కానుపు

చ. 3: నిక్కము నేఁ జొచ్చినది నీలెంకతనము
చక్కనాజీవనము నీశరణాగతి
యెక్కువ శ్రీవేంకటేశ యెదలో నున్నాఁడ నిదె
చిక్కిన దేమియులేదు చిత్తమింతే ఇఁకను

రేకు: 0320-03 సాళంగనాట సం: 04-114 శరణాగతి

పల్లవి: నిన్ను నీవే తెలుసుకో నిరుహేతుకబంధుఁడ -
వన్నిటాఁ బరతంత్రుఁడ నంతేపో నేను

చ. 1: యేమి గూడీ నీఁ గర్మ మిలపైఁ జేయఁగ నీకు
యేమి మానె వేఁగర్మ మిటు మానఁగ
భూమినీనాటక మేల పూర్ణ కాముఁడవు నీవు
కామించి కాతువుగాక కరుణానిలయ

చ. 2: యెంత గూడపెట్టితి నే నిలమీఁదఁ బుట్టఁగాను
యెంత నష్టినే జనించ కిట్టుండగా
వింతగుయీ యుక్తులెల్ల వృథావాదము లింతే
సంతతము ననుఁ గావు సర్వేశ్వరా

చ. 3: యెవ్వరు విన్నవించేరు ఇటు నాదెస నీకు
యెవ్వరు వద్దనేరు నీ విలఁ గావఁగా
రవ్వల శ్రీవేంకటేశ రక్షింతువుగాక
అవ్వల వివ్వల శరణాగతరక్షకుఁడా

రేకు: 0320-04 బౌళి సం: 04-115 గురు వందన, నృసింహ

పల్లవి: కనియెడి దిదియే వినియెడి దిదియే కడలఁ జదివెడిదిదియపో
నినుపు నీరై సర్వజగముల నిలిచె శ్రీహరిమాయ

చ. 1: తలఁపు నొక్కటే తాను నొక్కఁడే దైవ మొక్కఁడే పో
కలిసి పెక్కుముఖంబులై లోకంబు దోఁచెనేని
తెలియఁ జిల్లుల కడవ లోపలి దీపమువలెనే
అలరి వెలిఁగెడి చూడఁజూడఁగ హరిప్రపంచపుమాయ

చ. 2: దేహ మొక్కటే జీవుఁ డొక్కఁడే దినము నొక్కటేపో
మోహ జాగ్రత్స్వప్ననిద్రలు మొనపె భేదములై
వూహఁ బెక్కులయద్దముల చంద్రోదయమువలెను
సాహసంబున భ్రమలఁబెట్టెడి చదల నిదె హరిమాయ

చ. 3: గురువు నొక్కఁడే మంత్ర మొక్కటే కొలువు నొక్కటేపో
అరయ భక్తియ వేరు వేరై యలరుచున్న దిదే
గరిమ శ్రీవేంకటగిరీశ్వరు కల్పితమువలెనే
వెరసి వారికి వారికే ఇది వింతవో హరిమాయ

రేకు: 0320-05 పాడి సం: 04-116 మనసా

పల్లవి: సచరాచర మిదె సర్వేశ్వరుఁడే
పచరించి యీతని భావింపు మనసా

చ. 1: కదలెటి దంతయు కమలారమణుని-
సదరపు సత్యపు చైతన్యమే
నిదిరించెటి యీనిశ్చేష్టజగమును
వుదుటున నాతఁడు వుండేసహజమే

చ. 2: కలిగివుండినదె కల దింతయు హరి-
నలుగడఁ బరిపూర్ణపుగుణమే
మలల్పి లేనిదియు మహిమల నాతని-
నిలుకడగలిగిన నిర్గుణమే

చ. 3: జీవరాసులగు సృష్టియింతయును
శ్రీవేంకటపతి చిత్తంబే
కైవల్యమె లోకపు టిహముఁ బరము
భావించ నేర్చిన పరమవిదులకు

రేకు: 0320-06 సామంతం సం: 04-117 గురు వందన, నృసింహ

పల్లవి: అందుల కిదె ప్రతియౌషధము
ఇందిరాపతికి నెక్కినచింత

చ. 1: పంచబాణములబాసట మంటిన-
చంచలమౌ నిశ్చలమనసు
పంచబాణగురుపాదము దలఁచిన
కంచుఁజంచలము గక్కన మాను

చ. 2: కనకపుటాసలగరళం బంటిన
ననిచినవిజ్ఞానము చెదరు
కనకగర్భు నటు గన్నతండ్రిపై
మనసిడితే నిర్మలమౌ గుణము

చ. 3: మునుకొని మొదలను మొలచిన ససికిని
పనివడి కొననే ఫలియించు
అనయము శ్రీవేంకటాధిపుకృపగల -
జనుని కిహపరము సఫలంబు

రేకు: 0321-01 సాళంగం సం: 04-118 శరణాగతి

పల్లవి: వెన్న చేతఁబట్టి నేయి వెదకినట్టు
యెన్నఁగ నీవుండఁగాను యెక్కడో చూచేను

చ. 1: కన్నులు మిన్నులు దాఁకీ కాయ మీఁడ వున్నఁగానే
తిన్నని వీనులు మెట్టీ దిక్కులనెల్ల
యిన్నిటి కొడయఁడవై యిందిరేశ నీవు నాలో
నున్నరూపు గానలేను వూహించి ఇపుడు

చ. 2: కాయము పాయము గీరీ కాల మీఁడ నుండఁగానే
ఆయపు మనసు ముంచీ నన్నిటియందు
యేయెడ నాలోనున్న యీశ్వర నీ నిలయము
పాయకుండఁ గోరలేను పాయము నాకెట్టిదో

చ. 3: ఇహమే పరము గోరీ యీడ నిట్టె వుండఁగాను
మహిలో శ్రీవేంకటేశ మహిమెట్టిదో
అహరహమును నీ వంతర్యామివై
సహజమై యుండఁ గంటి చాలు నిఁక నాకు

రేకు: 0321-02 లలిత సం: 04-119 శరణాగతి

పల్లవి: నేఁడుగాక దొరనైతి నేను నారాయణుఁ గొల్చి
పోఁడిమి నాచార్యుని బోధవంకను

చ. 1: దీనవృత్తి నేఁ దిరుగని చోటేది
నానాచంచలము నామనసు
పూని నేఁగొనని భువిలోని రుచు లేవి
హీనజన్మము లెత్తిన దీమేను

చ. 2: చేరి నేఁజేచేతఁ జేయనిపాప మేది
ధారుణి మోపైన సంసారమునను
ఆరయ మున్ను నేనాడని కల్లలేవి
సారెకు నుదురుపోషణమునకు

చ. 3: సూటిదప్పక నేఁ జూడని చూపేది
చేటులేని చిరకాల జీవుఁడనే
చాటువ శ్రీవేంకటేశు శరణు చొరకతొల్లి
బూటకము లెన్ని లేవు పొలయదు కాలము

\రేకు: 0321-03 దేసాళం సం: 04-120 శరణాగతి

పల్లవి: అన్నిటా నిట్టే కాని యగపడదు
అన్నమదమున జిత్త మగపడదు

చ. 1: సొలసి సంసారములో సుఖముఁ బొందేనంటే
అలమటలేకాని యగపడదు
పలుచదువులవంకఁ బరము గనేనంటే
అల సంశమోకాని యగపడదు

చ. 2: వెడదేహము మోఁచి విరతిఁ బొందేనంటే
అడియాసలేకాని యగపడదు
సడిఁ గోపమే యుండఁగ శాంతిఁ బొందేనంటే
అడవిఁ బడుటేకాని యగపడదు

చ. 3: నేరిచి నీ మాయలోన నిజభక్తి గనేనంటే
అరీతి నాఉడేకాని యగపడదు
మేరతో శ్రీవేంకటేశ మించి నీకే శరణంటే
ఆరి తేరి కర్మబంధ మగపడదు

రేకు: 0321-04 బౌళి సం: 04-121 శరణాగతి

పల్లవి: చదివి చదివి వట్టిజాలిఁబడు టింతేకాక
యెదుట నిన్ను గానఁగ నితరులవశమా

చ. 1: ఆకాశముపొడవు ఆకాశమే యెరుఁగు
ఆకడ జలధిలోఁతు ఆ జలధే యెరుఁగు
శ్రీకాంతుఁడ నీ ఘనము చేరి నీవే యెరుఁగుదు-
నీకడ నింతంతన నితరుల వశమా

చ. 2: నదులయిసుకలెల్ల నదులే యెరుఁగును
కదలి గాలియిరవు గాలికే తెలుసు
అదన నాత్మగుణము లంతరాత్మ నీవెరుగు-
దిదియదియనిచెప్ప నితరులవశమా

చ. 3: శ్రీవేంకటేశ యిన్నిచింతలకు మొదలు
యీ నీ శరణంటే యిటు నీవే యెరిగింతు
దైవమా నీ కల్పనలు తగ నీవే యెరుఁగుదు-
వీవల నొఁగాదన నితరుల వశమా

రేకు: 0321-05 శ్రీరాగం సం: 04-122 వైష్ణవ భక్తి

పల్లవి: ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము
సత్యరూప జోలిదవ్వి జాలిఁబడ నోపము

చ. 1: కన్న వారెవ్వరు నిన్ను కన్నుల యెదుటను
పన్ని నీదాసులు చూచే భావమువలె
విన్న వారెవ్వరు నీవిభవపు మాటలు
అన్నిటా నాచార్యుని యానతివలె

చ. 2: తొడఁగి నీ ప్రసాదము దొరకని వారెవ్వరు
జడియు నీ దాసుల ప్రసాదమువలె
కడు నీ పాదతీర్థము కడగన్నవారెవ్వరు
బడిబడి నీ భక్తపాదజలమువలె

చ. 3: యేచి పరంధామమున కేఁగిన వారెవ్వరు
చాచిన నీ దాసుల సన్నిధివలె
చాచితి శ్రీవేంకటేశ సొంపుల నీ మహిమెల్ల
తాచిన నీ దాసానుదాసులయందే

రేకు: 0321-06 దేవగాంధారి సం: 04-123 శరణాగతి

పల్లవి: తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి-
రిల నిదెరఁగనిది యేఁటిదోకాక

చ. 1: కరుణానిలయుఁడట కరుణకు వెలితా
వెరవుతో నేఁగొల్వని వెలితి గాక
నరహరి ఇతఁడట నరులఁ గాచుటరుదా
శరణనని వెలితి జనములది గాక

చ. 2: వెస లక్ష్మీపతియట వితరణము లేదా
పసఁదన్నే కోరని మాపాపము గాక
యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
ససువై మొక్కని వెల్తి జగములది గాక

చ. 3: శ్రీవేంకటేశుఁడచిత్తములో లేఁడా
భావించి నమ్మినది మాభాగ్యముగాక
వావాత నింతటివాఁడు వరములీలేఁడా
వోవలఁ గొలగొనే దేవోటి కింతే కాక

రేకు: 0322-01 నారాయణి సం: 04-124 శరణాగతి

పల్లవి: అన్నిటి పై నున్నట్లు హరిపై నుండదు మతి
కన్నులఁ బ్రహ్మాదులవలె కనుఁగొను టరుదా

చ. 1: పులుగు నర్చించొకఁడు పూఁచెనాగతమెరిగి
వెలసి ఘనుఁడనంటా విఙ్ఞవీఁగీని
జలజాక్షుపాదములు సారె నర్చించేటివారు
ఇలలోనఁ బరమార్థ మెరుఁగుటయరుదా

చ. 2: మానివోడ నమ్మొకఁడు మహాజలధి దాఁటి
నానార్థములు గూర్చి నటియించీని
శ్రీనాథుపాదములు చేకోనినమ్మినవాఁడు
పూని భవవార్థి దాఁటి పుణ్యమందు టరుదా

చ. 3: దీపమువట్టి యొకఁడు తెగనిచీఁకటిఁ బాసి
చూపులనిన్నిటిఁ గని సుఖమందీని
చేపట్టి పరంజ్యోతి శ్రీవేంకటేశుభక్తుఁ-
డోపి ముక్తి కడగని వున్నతుఁడౌ టరుదా

రేకు: 0322-02 గుండక్రియ సం: 04-125 విష్ణు కీర్తనం

పల్లవి: హరి పరతత్వంబగుటకు గురి యిది
నరుల మితఁడే యని నమ్మితిమిదివో

చ. 1: కవగూడిన భూకాంతుఁ దలఁచిపో
దివి వెలుఁగందిరి దేవతలు
జవమున రఘుపతి శరణని మని రిదె
భువి విభీషణాది పుణ్యులు

చ. 2: శ్రీతరుణీపతి సేవనే చెలఁగిరి
పాతాళాధిపబలిముఖులు
భాతిగా వైకుంఠభక్తినే బ్రదికిరి
ఘాతల ననంత గరుడాదులు

చ. 3: శ్రీవేంకటపతి చింతనే పొదలిరి
సోవ ముక్తిగల శుకాదులు
వావిరి నీతని వరముల వెలసెను
తోవలఁ బరుష సందోహములు

రేకు: 0322-03 లలిత సం: 04-126 శరణాగతి

పల్లవి: కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన
దేవ నీ బంట్లము మా తెరువేఁటి తెరువు

చ. 1: బండుబండై వూరఁగల పనులెల్లాఁ జేసేము
యెండాతా నీడౌతా నెఱఁగము
కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు
బెండువంటి వారము మా బిగు వేఁటిబిగువు

చ. 2: దీనుఁడనై యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము
కాని దెందో మంచి దెందో కానము
శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండఁగాను
మానువంటి వారము మా మనసేటి మనసు

చ. 3: బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా
యెందుకాతా నేడకౌతా నెఱఁగము
యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే
చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత

రేకు: 0322-04 పాడి సం: 04-127 మాయ

పల్లవి: కామధేనువు దేవకల్పితము భువిలోన
వోముచును భోగించ యుక్తివలెఁ గాని

చ. 1: తలఁచినట్లనౌ దైవము వ్రాసిన వ్రాఁత
పలికినట్లనౌ పలుమంత్ర జపములు
నిలిపినట్లనౌ నిర్మల చిత్తము కీలు
నెలవునఁ బనిగొన నేర్పువలెఁ గాని

చ. 2: యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము
కమ్మన్నట్లనౌ ఘనతపముల శక్తి
తెమ్మనినయట్లఁ దెచ్చు దృష్టము యక్షిణీవిద్య
చిమ్ములను దనకంత చింతవలెఁగాని

చ. 3: వునిచినట్లనుండు నొక్కడే దేహగుణము
యెనలేని శ్రీవేంకటేశ్వరుమాయ లివి
పెనచిన యిహమేపో బీజము వుద్యోగులకు
తనివి నలమేల్మంగదయ వలెఁగాని

రేకు: 0322-08 శ్రీరాగం సం: 04-128 వైష్ణవ భక్తి

పల్లవి: గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁగాని
యీవల సంసారమైన యిది ధ్రువపట్టమే

చ. 1: తలఁపు లోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాపుఁరముఁ గైవల్యమే
బెళకు నాలుకకు నీపేరు వచ్చితేఁజాలు
పలికిన వన్నియు పరమవేదములే

చ. 2: తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు
పడుచుల బొమ్మరిండ్లు బ్రహ్మలోకమే
కడలేని నీభక్తి గలిగితేనే చాలు
కడజన్మమయినా నిక్కపు విప్రకులమే

చ. 3: కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు
పాయపు రతిసుఖము పరతత్వమే
యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే

రేకు: 0322-06 సామంతం సం: 04-129 వైరాగ్య చింత

పల్లవి: దినమట రాతిరట తీరుచున్నదా
కవగూడఁ బాయఁ గాక కాణాచి వున్నదా

చ. 1: మానుష జన్మమట మలమూత్రదేహమట
సోనల హేయమేకాక శుద్ధి వున్నదా
మానని కోరికలట మాయల సంసారమట
దీనవృత్తేకాక యిందుఁ దేజమున్నదా

చ. 2: చంచలపుఁ జిత్తమట సకలేంద్రియములట
పొంచిన పాపమేకాక పుణ్యమున్నదా
సంచితపుఁ గర్మమట జనన లయములట
ముంచిన తీదీపేకాక మోదమున్నదా

చ. 3: శ్రీవేంకటేశుఁడట జీవుఁడనేనట యిందు
దైవపుదాస్యమే కా కితరమున్నదా
యీవల నావలన ట యిహముఁ బరమునట
కైవశము లాయఁగాక కడమున్నదా

రేకు: 0323-01 భూపాళం సం: 04-130 మేలుకొలుపులు

పల్లవి: రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో
రీతిగాదు హరి నెచ్చరికె సేయరే

చ. 1: పైపై బొద్దువొడచి పంకజములు విరిసె
గోప గోవిందుని మేలుకొన మనరే
దీపములు దెల్లఁబారె తిమిరమింతయు జారె
శ్రీపురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే

చ. 2: కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ
నెలఁతలు దేవదేవు నిద్ర దెల్పరే
జలనిధి పొంగణగె చాయలచుక్కలు మాసె
వలరాచగురు నుప్పవడము గమ్మనరే

చ. 3: జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు
భావించి యచ్యుతునిట్టె పలికించరే
కావిరింతయు విరిసె కడు సంధ్యకు బొద్దాయ
శ్రీవేంకటేశుని విచ్చేయ మనరే

రేకు: 0323-02 బౌళి సం: 04-131 మాయ

పల్లవి: పుట్టెడి దింతా బూటకంబులే
గట్టిమాయ హరిఁ గానఁగ నీదు

చ. 1: ముక్కున నున్నది ముందటఁ బ్రాణము
యెక్కడ నమ్మెదిఁకఁ దనువు
చుక్కలు మోఁచీఁ జూపులెదుటనే
నెక్కొను మతికిని నిలుకడ యేది

చ. 2: నాలుక నున్నవి నానారుచులును
వేళావేళకు వెరవేది
తోలున నున్నది దొరకొని బ్రతుకిది
కాలంబెటువలెఁ గడపేది

చ. 3: ఆతుమనున్నది యఖిలజ్ఞానము
ఘాతల నెటువలెఁ గనియేది
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
యాతనిఁగొలిచితి మడ్డంబేది

రేకు: 0323-03 సాళంగనాట సం: 04-132 వైష్ణవ భక్తి

పల్లవి: ఉమ్మడికర్మములాల వుండఁ జోటు మీకు లేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివి లేనిచోటికి

చ. 1: పెట్టినది నుదుటను పెరుమాళ్ళ లాంఛనము
దట్టమై భుజములందు దైవశిఖామణిముద్ర
నెట్టన నాలుకమీఁద నీలవర్ణునామమిదె
అట్టె హరిదాసులకంటునా పాపములు

చ. 2: మనసునఁ దలచేది మాధవుని పాదములు
దినముఁ గడుపునించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసిపద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు

చ. 3: సంతతముఁ జేసేది సదాచార్యసేవ
అంతరంగమున శరణాగతులసంగ మిదే
యింతటాను శ్రీవేంకటేశుఁడు మమ్మేలినాఁడు
అంతటా హరిదాసుల నందునా అజ్ఞానము

రేకు: 0323-04 శ్రీరాగం సం: 04-133 విష్ణు కీర్తనం

పల్లవి: ఇలువేల్పితఁడే ఇందరికిని మరి
పలు వేల్పులతో పని యిఁకనేలా

చ. 1: కమలారమణుని కరుణేకాదా
అమరులు గొనియెడి యమృతము
అమితపు శ్రీహరి యాధారముగాదా
నెమకేటి ప్రాణులు నిలిచినభూమి

చ. 2: దనుజాంతకు బొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు
మనికై హరిసతి మహిమే కాదా
నినుపై భువిలో నిండినసిరులు

చ. 3: యితనికొడుకు రచనింతాఁగాదా
సతుల పతుల సంసారరతి
గతి శ్రీవేంకటపతిలోకమె వు-
న్నతి వైకుంఠపు నగరపు ముక్తి

రేకు: 0323-05 భవుళి సం: 04-134 మాయ

పల్లవి: పురుషుఁడే యధముఁడు పొంచి యెందు దగులక
పురుషోత్తమునికంటే పుణ్యుఁడవు నపుడే

చ. 1: పురుషజంతువులెల్ల పొంచి యాఁడుజంతువుల
తరవాయి గొని వెంటఁ దగులుఁగాని
ధర నాఁడు జంతువులు తగ పురుషజంతువుల
యిరవు వెదకఁజోవు యిది యెట్టిమాయో

చ. 2: సారెకు నర్థమునకు జనులెల్ల దాసులై
కోరి వెదకుచు దిరుగుదురు గాని
చేరువ యర్థములెల్ల జీవులకు దాసులై
యీరీతి వెదకవు యిది యెట్టిమాయో

చ. 3: లోకమునడవ డిది లోనుగాక యిందుకెల్లా
యేకచిత్తమున నుంటే యెక్కుడుగాని
దాకొని శ్రీవేంకటేశు దాసుఁడైన వానికిని
యేకముగఁ బంపుసేసు నేమిమాయోకాని

రేకు: 0323-06 మలహరి సం: 04-135 వైరాగ్య చింత

పల్లవి: మఱి విచారించఁబోతే మంచముకిందే నూయి
మెఱయఁగ హరిఁ గెల్చి మించరో ప్రజలు

చ. 1: యేల మాను దేహమెప్పటి తనగుణము
యేల మాను మనసెడలేనియాసలు
ఆలు దింటా మలిగండ్లేఱఁగనేల హరి మన-
పాలఁ బెట్టుక కొలచి బ్రతుకరో ప్రజలు

చ. 2: పొమ్మంటేనేలపోవు పూర్వకర్మములు
పొమ్మంటేనేలపోవు పొంచిన యింద్రియములు
కుమ్మరావమునఁ జెంబు కోరి వెదకనేల
పమ్మిని శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు

చ. 3: భోగించకేల పోవుఁ బుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలుపెంచనేల
వేగిరమేఁటికి శ్రీవేంకటేశుమాయ లివి
బాగుగ నాతనిఁగొల్చి బ్రదుకరో ప్రజలు

రేకు: 0324-01 భవుళి సం: 04-136 శరణాగతి

పల్లవి: కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతి నీవే కావఁగదవయ్యా

చ. 1: పుడమిఁ బుట్టితిమి బుద్ది నెరిఁగితిమి
కడుపే చెరువవుత గానమయ్యా
వొడలు మోఁచితిమి వున్నతిఁ బెరగితిమి
వెడఁ జిల్లులఁ గారేది విడిపించ లేవయ్యా

చ. 2: నిన్న నిద్రించితిమి నేఁడే మేలుకొంటిమి
తిన్న వెల్లఁ దీరినటే తెలియమయ్యా
కన్నులఁ జూచితిమి కమ్మర మూసితిమి
వున్నచే నుండదు మతి పూరట లేదయ్యా

చ. 3: సరిఁ జదివితిమి శాస్త్రముఁ జూచితిమి
గురుఁడే రక్షకుడౌత గురుతౌనయ్యా
నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడిపని మాకు లేదయ్యా

రేకు: 0324-02 దేశాక్షి సం: 04-137 వైష్ణవ భక్తి, నృసింహ

పల్లవి: ఇందే వున్నది కానమెందో వెదకితిమి
కందర్పగురుభక్తి గంటిమి నే మిదివో

చ. 1: కోటికోటి వేదముల కొన యర్థము
సాటి వేదముల లోని సకలార్థము
సూటిగా గురుఁడు మాకుఁ జూపినర్థము
గాటపు మనసు దవ్వి కనుగొంటి మిదివో

చ. 2: పరమయోగీంద్రులు పట్టీన యర్థము
సురలు మునులు నెంచి చూచి నర్థము
సరి మూఁడులోకములఁ జూటి నర్థము
గరిమ నీదేహమెత్తి కంటిమి మే మిదివో

చ. 3: పలుశరణాగతుల పాలి యర్థము
మలయుచుండేటి తిరుమంత్రార్థము
నిలచి శ్రీవేంకటాద్రి నిండినర్థము
కలసి విజ్ఞానవీధిఁ గనుఁగొంటిమయ్యా

రేకు: 0324-03 ధన్నాసి సం: 04-138 శరణాగతి

పల్లవి: తొల్లిటివారు వెట్టినతోవ యిది
బల్లిదులై యిందునే బదుకుటే మేలు

చ. 1: కలఁడు సర్వేశ్వరుఁడొక్కఁడు దిక్కందరికిని
సులభుఁడు శరణము చొచ్చితేఁ గాచు నతఁడు
బలుతపములు చేసి పాట్లఁ బడ నోప మని
బలువుఁడాతని నమ్మి బ్రదుకుటే మేలు

చ. 2: వున్నాఁడు మనసులోనే వొక్కచో వెదకవద్దు
ఇన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చు నిహముఁ బరము
కన్నచోట్ల వెదకి కడు నలయనోపము
పన్నుగ నితనిఁ గొల్చి బ్రదుకుటే మేలు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిలుచున్నవాఁడు
సేవించిన యంతలోనే చేకొని యేలు నీతఁడు
దేవతలఁ బ్రార్థించి తెలియఁగ నేరము
భావించితని నుతించి బ్రదుకుటే మేలు

రేకు: 0324-04 సాళంగనాట సం: 04-139 కృష్ణ

పల్లవి: శ్రావణ బహుళాష్టమి జయంతి నేఁడు
సేవించరో నరులాల శ్రీకృష్ణుఁడితఁడు

చ. 1: భావింప వసుదేవుని పాలిటి భాగ్యదేవత
దేవకి గనినయట్టి దివ్యరత్నము
చేవమీర సురల రక్షించే కల్పతరువు
యీవేళ జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు

చ. 2: హర విరంచాదులకు నాదిమూల కారణము
పరమమునుల తపఃఫల సారము
గరుడోరగేంద్రులకుఁ గలిగిన నిధానము
యిరవుగా నుదయించెనిదె కృష్ణుఁడు

చ. 3: బలుయోగీశ్వరుల బ్రహ్మానందము
చెలఁగు భాగవతుల చింతామణి
అలమేల్మంగకు బతియట్టె శ్రీవేంకటాద్రి-
నిలపై జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు

రేకు: 0324-05 రామక్రియ సం: 04-140 నృసింహ

పల్లవి: వెలసె నహోబలాన విదారణసింహము
సురల నరుల దయజూచీని వీఁడివో

చ. 1: సరి వలకేలను చక్రము పీటఁగాఁ బెట్టీ
గరిమ నొకచేత శంఖము వట్టి
హిరణ్యకశిపుని నిరుచాతులాఁ జించి
అరిదిఁ బేగులు జందెలవే వేసుకొనెను

చ. 2: ఘనమైన కోరలతో కహకహ నవ్వుకొంటా
దనుజు ముంద రొకచేతనుఁ బట్టి
పెనఁగకుండా రొమ్ము పెడచేతుల నడిచి
నినువు వంకరగోళ్ళ నెత్తురు చిమ్మీని

చ. 3: అంతటఁ బ్రహ్లాదుని నటు దయఁజూచి లక్ష్మీ
కాంతఁ దొడపై నిడుక కడు శాంతుఁడై
చింత దీర గరుడాద్రి శ్రీవేంకటాద్రిని
పంతము మెరసి నిల్చి ప్రతాపించీనీ

రేకు: 0324-06 శంకరాభరణం సం: 04-141 హనుమ

పల్లవి: ఆతడాఁ యీతఁడు పెద్దహనుమంతుఁడు
చేతులారా నక్షునిఁ జెండివేసినాఁడట

చ. 1: తొలుత రాముని గాంచి తోడనే సుగ్రీవుని
కొలువఁ బెట్టి యాతనికొమ్ము నిప్పించి
జలనిధి దాఁటి లంక సాధించి చొచ్చి సీతకు-
నలర నుంగర మిచ్చె నతిసాహసమున

చ. 2: సీతాదేవి యానవాలు శ్రీరామునికి నిచ్చి
నీతి విభీషణుని మన్నించఁజేసి
చేతులనే పోట్లాడి చెండివేసి రాక్షసుల
ఘాతల సంజీవికొండ గక్కనఁ దాఁ దెచ్చెను

చ. 3: గక్కన రావణుఁ గొట్టి కాంతను రాముని గూర్చి
అక్కడ నయోధ్యఁ బట్ట మటుగట్టి
నిక్కి కలశాపురిని నిండి శ్రీవేంకటాద్రిని
వుక్కమీరి హరిఁగొల్చి వున్నాఁడు వేడుకల

రేకు: 0325-01 వరాళి సం: 04-142 శరణాగతి

పల్లవి: ఎవ్వరివాఁడాఁగాను యేమందు నిందుకు
నవ్వుచు నాలోని హరి నన్నుఁ గావవే

చ. 1: కోపులరాజులనెల్ల కొలిచి కొన్నాళ్ళు మేను
చూపుడుఁబూఁట వెట్టితి సొగసి నేను
యేపున సంసారమున ఇదిగాక కమ్మఁటాను
దాపుగ తొర్లుఁబూఁట తగిలించుకొంటిని

చ. 2: మొదలఁ గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువపెట్టితి నే గురి గానక
వెదకి కామునికి విషయములకు నే
అదివో నావయసెల్ల నాహివెట్టితిని

చ. 3: ఇప్పుడే శ్రీవేంకటేశ యీడేర్చి నామనసు
కప్పినగురుఁడు నీకు క్రయమిచ్చెను
వొప్పించి రిందరు బలువుఁడు చేపట్టెననుచు
అప్పులెల్లఁబాసి నీసొమ్మైతినేనయ్యా

రేకు: 0325-02 దేసాళం సం: 04-143 శరణాగతి

పల్లవి: వాసుదేవ నీవు నెలవరివి మగుడునేల
యీసరి నీవద్దనుండే యెట్టైనఁ జేయవయ్యా

చ. 1: మాయదెచ్చి నాబదుకు మనుజలోకాన వేసె
కాయము సంసార వార్ధిగడ్డపై వేసె
పాయపు నాతమకము భామలవలల వేసె
చాయ నేనుండి వచ్చినడ జాడెఱఁగనయ్యా

చ. 2: ఘనమైనయింద్రియాలు కర్మములవాత వేసె
మనసు సంసదయామనిలో వేసె
పనులెల్ల లంపటాల పయిఁ బక్కలా వేసె
కొనకెక్కె నేనె నాగురుతు గానవయ్యా

చ. 3: అంచెల నాదినములు ఆఁకటి బారి వేసె
ముంచిన నాగుణములు మోహములు వేసె
యోంచఁగ శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో
పొంచి నీకు శరణంటి బోధించవయ్యా

రేకు: 0325-03 బౌళి సం: 04-144 రామ

పల్లవి: నమో నమో దశరథనందన రామ
కమనియ్య యాగభాగకర్త రామ

చ. 1: కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకరగుణోన్నత శ్రీరామ
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ
భీకరతాటకాంతకబిరుద రామ

చ. 2: వారిధిబంధన రామ వాలిహరణ రామ
చారుహరకోదండభంజన రామ
ధారుణీజపతి రామదశకంఠహర రామ
సారవిభీషణాభిషేచన రామ

చ. 3: అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ సర్వజ్ఞ రామ
విమల రామ శ్రీవేంకటగిరి రామ
రమణ శరణాగతరక్షక రామ

రేకు: 0325-04 సాళంగనాట సం: 04-145 హనుమ

పల్లవి: హరికి లంకిణీహంత కంతర మిట్టున్నది
కరుణ నింత మన్నించె కమలావిభుఁడు

చ. 1: విశ్వరూపు చూపినాడు విష్ణుఁడు దొల్లి యట్టె
విశ్వరూపాంజనేయుఁడు వీఁడె చూపెను
శాశ్వతుఁడై యున్నవాఁడు సర్వేశ్వరుఁడు వీఁడే
శాశ్వతుఁడై యున్నవాఁడు జగములో నీతఁడు

చ. 2: ప్రాణవాయుసంబంధి పరమాత్ముఁడు అట్టె
ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు
రాణింప రవివంశుఁడు రామచంద్రుడు తాను
నాణెపు రవిసుతుని నమ్మిన ప్రధాని

చ. 3: దేవహితార్థముసేసఁ ద్రివిక్రముఁడు అట్టె
దేవహితార్థమే జలధిలంఘనుఁడు
శ్రీవేంకటేశుఁడు చిన్మయమూర్తి తాను
కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్పహనుమంతుఁడు

రేకు: 0325-05 పాడి సం: 04-146 నృసింహ

పల్లవి: సుగ్రీవ నారసింహుని జూడరో వాఁడె
అగ్రపూజ గొన్నవాఁడు ఆది సింహము

చ. 1: దేవతలు జయవెట్టి దివినుండి పొగడఁగ
దేవులతోఁ గూడున్నాఁడు దివ్య సింహము
భావింప నెట్టనెదుట ప్రహ్లాదుఁడుండఁగాను
వేవేలు నవ్వులు నవ్వీ విజయ సింహము

చ. 2: అసురలను గెలిచి అదె సింహాసనముపై
వెసఁగొలువున్నాడు వీర సింహము
పసిడివర్ణముతోడ బహుదివ్యాయుధాలతో
దెసల వెలుగొందీని ధీర సింహము

చ. 3: నానాభరణాలు వెట్టి నమ్మినదాసులనెల్ల
ఆనుకొని రక్షించీఁ బ్రత్యక్ష సింహము
పూని శ్రీవేంకటాద్రిని బుధులెల్లాఁ గొలువఁగా
నానావరము లొసఁగీ మానవ సింహము

రేకు: 0325-06 శ్రీరాగం సం: 04-147 రామ

పల్లవి: రామచంద్రుఁ డితఁడు రఘు వీరుఁడు
కామిత ఫలము లియ్యఁ గలెగె నిందరికి

చ. 1: గౌతము భార్య పాలిటి కామధేనువు వితఁడు
ఘాతలఁ గౌశికు పాలి కల్పవృక్షము
సీతాదేవి పాలిటి చింతామణీతఁడు
యీతఁడు దాసుల పాలి యిహ పర దైవము

చ. 2: పరగ సుగ్రీవు పాలి పరమ బంధుఁడీతఁడు
సరి హనుమంతు పాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము
గరిమ జనకు పాలి ఘన పారిజతము

చ. 3: తలఁప శబరి పాలి తత్వపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలఁడన్నవారి పాలి కన్ను లెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటేద్రి విభుఁడీతడు

రేకు: 0326-01 గుండుక్రియ సం: 04-148 మాయ

పల్లవి: కైకొంటే కాక కమలనాభునియాజ్ఞ
పైకొని ఇన్నిటాను బాసివుండ ఇనేది

చ. 1: హరినిర్మితములే అఖిలప్రపంచము
తొరలి యేమిటి నిందు దూషించేది
ధరణిధరునికి దాసులే జీవులెల్లా
గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది

చ. 2: వాసుదేవు కల్పితమే వరసంసార బంధము
దోసమంటా యెందెందు దొలఁగేది
శ్రీసతీశు రచనలే చేకొన్న రుచులెల్ల
యీసుతోడ నిందుమీఁద నెట్టురోసేది

చ. 3: గోవిందుమాయలే కూడినట్టి పనులెల్ల
వేవేలై యిందునెట్టు వేసరేది
శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా
పావనమైతిమి యిఁక బరచింత యేది

రేకు: 0326-02 లలిత సం: 04-149 విష్ణు కీర్తనం

పల్లవి: విష్ణుదేవు పాదములే విద్యాబుద్ధీ మాకు
వైష్ణవులమైతి మింక వదలవో కర్మమా

చ. 1: గోవిందుని పాదములే కోరి యిహపరములు
శ్రీవిభుని పాదములే చేరు వేదశాస్త్రములు
దేవదేవు పాదములే దిక్కును దెసయు మాకు
భావములో నిలిపితిఁ బాయరో పాపములు

చ. 2: హరి పాదములే మాకు నన్నపాన భోగములు
పరమాత్ము పాదములే పాఁడీ బంటా మాకు
మురహరు పాదములే ముందరవెనకా మాకు
శరణంటి మెందైనాఁ జనరో దుఃఖములు

చ. 3: అనంతుని పాదములే ఆయుష్య భౌష్యములు
దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు
యెనలేని శ్రీవేంకటేశుడితని పాదాలే
మనసున గొలిచితి మానరో భవములు

రేకు: 0326-03 దేశాక్షి సం: 04-150 గురు వందన, నృసింహ

పల్లవి: ఇందుకేది వుపాయ మోయీశ్వర నీకే తెలుసు
మందలించ నశక్తుఁడ మరి నీదాసుఁడను

చ. 1: ధీరుఁడనై ధరలోన దేహము నే మోచితి
కోరి పుణ్యపాపాలకు గురియు నైతి
వూరట యేమిటా లేదు వోపనని మానరాదు
తీరదు భోగించక దినదినకర్మము

చ. 2: గరిమ సంసారినైతి కంటిఁ బెక్కుసుతులను
యిరవుగఁ గట్టుకొంటి నీలంపటాలు
వెర వేమీ నెరఁగను విడువ వెంతైనాను
హరిహరి రాచినా సమయపు బలుకాంక్షలు

చ. 3: అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి
జట్టిగొని నీపాదాలే శరణంటిని
గట్టిగా నలమేల్మంగకాంతుఁడ శ్రీవేంకటేశ
యిట్టె నిన్నెరఁగలేని దిన్నాళ్ళు నానేరమి

రేకు: 0326-04 ధన్నాసి సం: 04-151 వేంకటగానం

పల్లవి: దేవుదేవుఁ డితడే దివ్యమూరితి
యేవలఁ జూచినఁ దానే యీరూపై వున్నాఁడు

చ. 1: వేంకటాచలము మీఁది విశ్వరూప విశేషము
అంకెల ననంతావతారాలైన విశేషము
లంకె సింగారాది సర్వాలంకార విశేషము
యింకనిమహిమలతో నీరూపై వున్నాఁడు

చ. 2: అందరిలో నంతర్యామియైన విశేషము
కందర్పుఁబుట్టించిన ఘన విశేషము
ముందు జగముసృష్టించి మూలమైన విశేషము
యిందరితోఁ గూడుకొని యీరూపై వున్నాఁడు

చ. 3: పరము యోగీంద్రులెల్ల భావించిన విశేషము
అరుదైన వేదవేదాంతార్థ విశేషము
పరగ నలమేల్మంగపతియై శ్రీవేంకటేశుఁ-
డిరవై దాసులఁ గావ నీరూపై వున్నాఁడు

రేకు: 0326-05 వరాళి సం: 04-152 వేంకటగానం

పల్లవి: మఱి తను భోగములు మాయా విలాసములు
యెఱిఁగి నట్లనుండు మఱపించుఁ దలఁపు

చ. 1: అనిశము నీకొలువు అది యొకటే నిజము
నినుఁదలఁచుటొకటే నిజము
పనివడి నీదాసుఁడై బ్రదుకుటొకటే నిజ-
మొనర నిన్ను నుతించేదొక్కటే నిజము

చ. 2: పరగ నీమీఁదఁజేయు భక్తియే నిలిచినది
నిరతపువైరాగ్యమే నిలిచినది
శరణని నీకుమొక్కే జ్ఞానమే నిలిచినది
అరసి నిన్నుఁబూజించినదే నిలిచినది

చ. 3: చదివి నిన్ను వెదకి సాధించుటే ఫలము
అదన నీకృపాపాత్రుఁడౌటే ఫలము
యెదుట నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
యెదలోన నీధ్యాన మిన్నిటికి ఫలము

రేకు: 0326-06 సామంతం సం: 04-153 వేంకటగానం

పల్లవి: ఏది మాకు గతియిక నీశ్వరేశ్వరా
యీదెస మము గరుణ నీడేర్చవయ్యా

చ. 1: పొంచిమున్ను భోగించిన భోగములు దలఁచి
అంచెల నాలుబిడ్డల నటు దలఁచి
కంచపుటాహరములు కన్నవెల్లాను దలఁచి
యెంచి నిన్నుఁ దలఁచక యిట్లున్నారమయ్యా

చ. 2: కన్నులఁజూచినందెల్లా కడునాసలఁ దగిలి
విన్న వినుకులకెల్లా వేడ్కఁదగిలి
పన్నిన సుఖములకుఁ బైకొని వెనుతగిలి
వున్నతి నిన్నుఁ దగులుకున్నారమయ్యా

చ. 3: చెంది గృహారామ క్షేత్రములు మరిగి
పొందగు సంసారమిప్పుడు మరిగి
అందపు శ్రీ వేంకటేశ అలమేల్మంగపతివి
కందువ మరిగీ మరుగకున్నారమయ్యా

రేకు: 0327-01 దేశాక్షి సం: 04-154 అధ్యాత్మ

పల్లవి: ఇన్నిటికి మూలము యెప్పుడు నీవే
పన్ని మామీఁద నేరాలు పచరించకువయ్యా

చ. 1: కోటానఁగోటులు మదిఁ గోరికలు
చీటికి మాటికి నివే చిగిరించీని
వాటమై యెవ్వరికిని వసముగావు
పాటించి వీటిని వొప్పనగొనవయ్యా

చ. 2: లక్షోపలక్షలు కర్మలంపటములు
అక్షయపు తీగెలై అల్లుకొనీని
వీక్షించ నెన్నేఁ గలవు వింతవింతలు
రక్షించ నిన్నిటికి భారము నీదేయయ్యా

చ. 3: నానాముఖములు పుణ్యములెల్లాను
తానక భోగములై తగిలించీని
మానుపరా దలమేలుమంగపతివి
శ్రీనాథ శ్రీవేంకటేశ చిత్తగించవయ్యా

రేకు: 0327-02 మాళవి సం: 04-155 హనుమ

పల్లవి: అందరికి నెక్కుడైన హనుమంతుఁడు
అందుకొనె సూర్యుఫలమని హనుమంతుఁడు

చ. 1: బల్లిదుఁడై లంక చొచ్చి బలురాకాసులఁ గొట్టి
హల్ల కల్లోలముచేసె హనుమంతుఁడు
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీతకిచ్చె
అల్లదె నిలుచున్నాఁడు హనుమంతుఁడు

చ. 2: దాకొని యాకె ముందర తన గుఱుతెరుఁగించి
ఆకారమటు చూపె హనుమంతుఁడు
చేకొని శిరోమణి చేతఁబట్టి జలనిధి
ఆకసాన దాఁటివచ్చె హనుమంతుఁడు

చ. 3: కొంకకిట్టె సంజీవికొండ దెచ్చి రిపులకు
నంకకాఁడై నిలిచెను హనుమంతుఁడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాఁడు
అంకెఁగలశాపుర హనుమంతుఁడు

రేకు: 0327-03 పాడి సం: 04-156 రామ

పల్లవి: రామా దశరథరామా నిజ సత్య-
కామా నమో నమో కాకుత్థ్సరామ

చ. 1: కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతిరామ
శరధి బంధన రామ సవన రక్షక రామ
గురుతర రవివంశ కోదండ రామ

చ. 2: దనుజహరణ రామ దశరథసుత రామ
వినుతామర స్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణరామ
అనిలజప్రియ రామ అయోధ్యరామ

చ. 3: సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుషరావణభయంకర రామ
విలసితరఘురామ వేదగోచర రామ
కలితప్రతాప శ్రీవేంకటగిరిరామ

రేకు: 0327-04 ముఖారి సం: 04-157 నృసింహ

పల్లవి: సేవించరో జనులాల చిత్తజగురుఁ డీతఁడు
కేవలదయానిధి సుగ్రీవనారసింహుఁడు

చ. 1: వేయిచేతులతోడ వెన్నెలనవ్వులతోడ
చాయలు దేరేటి శంఖచక్రాలతోడ
అయితమై వున్నవాఁడు అదె సింహాసనముపై
శ్రీయుతుఁడై యెదుట సుగ్రీవనారసింహుఁడు

చ. 2: కుంకుమగోళ్ల తోడ కోరదౌడలతోడ
అంకెలరవిచంద్రనయనములతో
తెంకి నసురలఁ గొట్టి దేవతలకందరికి
కింకలెల్లాఁ బాపెను సుగ్రీవనారసింహుఁడు

చ. 3: బిరుదు పెండేలతోడ పీతాంబరముతోడ
సరిఁ గిరీటాదిభూషణములతో
సిరులకెల్లా నెలవై చెలఁగి శ్రీవేంకటాద్రి-
గిరిమీఁద వెలసెను సుగ్రీవనారసింహుఁడు

రేకు: 0327-05 నాట సం: 04-158 హనుమ

పల్లవి: ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నావాఁడు
పిక్కటిల్లి సంతోసానఁ బెద్దహనుమంతుఁడు

చ. 1: తూరుపుఁ బడుమరాను దొడ్డగా జంగ చాఁచి
సారెకుఁ నర్కునివద్దఁ జదివీ వాఁడే
ధీరతతోఁ దనమేను దిక్కులెల్లాఁ బిక్కటిల్ల
బీరముచూపీ వాఁడె పెద్దహనుమంతుఁడు

చ. 2: మిన్ను నేల నేకముగా మించినవాల మెత్తి
సన్నుతిగా వలకేల చాఁచినవాఁడు
పన్నుగడై రాఘవునిబంట్లలోపలనెల్లా
పెన్నిధియై యున్నవాఁడు పెద్దహనుమంతుఁడు

చ. 3: మరిగి రేయుఁబగలు మతంగపర్వతమాడ
బిరుదులతోడను బెరసీ వాఁడే
యిరవై శ్రీవేంకటేశుహితుఁడై యెప్పుడుఁ బెచ్చు-
పెరుగుచు నున్నవాఁడు పెద్దహనుమంతుఁడు

రేకు: 0327-06 బౌళి సం: 04-159 రామ

పల్లవి: ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుడు
రతికెక్కఁ గొలిచిన రక్షించు నితఁడు

చ. 1: తరణివంశజుడై తాటకను హరియించి
అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లియాడి
పరశురాముని నిజబలిమి చేకొనెను

చ. 2: మునులకభయమిచ్చి మొగి నసురలఁ ద్రుంచి
ఘనమైన మాయామృగముఁ జంపి
కినిసి వాలిఁ గొట్టి సుగ్రీవునిఁ బట్టముగట్టి
వనధి బంధించి లంక వడిఁ జుట్టుముట్టెను

చ. 3: బలురావణునిఁ జంపి పుష్పకముపైఁ దాఁ జేకొని
లలి విభీషణునకు లంక ఇచ్చి
చెలఁగి యయోధ్య యేలి శ్రీవేంకటాద్రిమీఁద
వెలయ రాముఁడు దానై విశ్వమెల్లా నేలెను

రేకు: 0328-01 రామక్రియ సం: 04-160 కృష్ణ

పల్లవి: అడర శ్రావణబహుళాష్టమి నేఁ డితఁడు
నడురేయి జనియించినాఁడు చూడఁగదరే

చ. 1: గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు
పంతపుపాండవులకు బావమరఁది
వంతుతో వసుదేవదేవకులకుమారుఁడు
ఇంతటికృష్ణుఁడు జనియించినాఁడుగదరే

చ. 2: బలరామునితమ్ముఁడు పంచసాయకునితండ్రి
మలసి మేటైనయభిమన్యునిమామ
లలి సాత్యకిసుభద్రలకుఁ దోఁబుట్టినయన్న
ఇలపైఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే

చ. 3: సూరసేనుమనుమఁ డచ్చుగ ననిరుద్ధుతాత
పౌరవయాదవలోకబాంధవుఁడు
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్మంగకుఁ బతి
యీరీతిఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే

రేకు: 0328-02 లలిత సం: 04-161 కృష్ణ

పల్లవి: చూడవమ్మ కృష్ణుఁడు నీ సుతుఁడోయమ్మ
ఆడీ వీధుల వెంట యశోదమ్మా

చ. 1: కోలలు చాఁచీ వుట్లు గొట్టఁగా బాలుఁ బెరుగు
కాలువలు గట్టి పారెఁ గదవమ్మా
మేలములాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మ యశోదమ్మా

చ. 2: చక్కిలాల కుండలెల్లా చలాన దొండ్లు వొడిచి
దిక్కన దోఁటికోలలఁ దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాత వేసితే
అక్కడ జోరునఁ గారె యశోదమ్మా

చ. 3: అల్లంత నుండి తన కందరాని తెంకాయలు
వల్లె తాళ్ళు వేసి వంచీనమ్మా
బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అల్లిబిల్లై యున్నాఁడమ్మ యశోదమ్మా

రేకు: 0328-03 గౌళ సం: 04-162 నృసింహ

పల్లవి: ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు
కొంచఁ డేమిటికి వీఁడె ఘోర నారసింహుఁడు

చ. 1: గక్కన నహోబలాన కంబములోన వెడలి
వుక్కుమీరి హిరణ్యుని నొడిసిపట్టి
చెక్కలువార గోళ్లఁ జించి చెండాడినయట్టి-
వెక్కసీఁడు వీఁడివో వీర నారసింహుఁడు

చ. 2: భవనాసి యేటిదండఁ బాదుకొని కూచుండి
జవళి దైత్యుపేగులు జందేలు వేసి
భువియుదివియు నొక్కపొడవుతో నిండుకొని
తివురుచున్నాఁడు వీఁడె దివ్య నారసింహుఁడు

చ. 3: కదిసి శ్రీసతి గూడి గద్దెమీఁదఁ గూచుండి
యెదుటఁ బ్రహ్లాదుఁడు చేయెత్తి మొక్కఁగా
అదన శ్రీవేంకటాద్రి నందరికి వరాలిచ్చి
సదరమైనాఁడు వీఁడె శాంత నారసింహుఁడు

రేకు: 0328-04 ధన్నాసి సం: 04-163 నృసింహ

పల్లవి: కొలువైతా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద
బలవంతుఁ డితఁడు ప్రహ్లాదవరదుఁడు

చ. 1: చిడుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
కడలేనినవ్వుతోడ కడురాజసముతోడ
అడరించీఁ బంతము ప్రహ్లాదవరదుఁడు

చ. 2: సంకుఁజక్రములతోడ చాయలమేనితోడ
సంకెదేర్చేయభయహస్తముతోడ
బింకపుమీసాలతోడ పెనువదనముతోడ
అంకె వరములిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 3: వనితకౌఁగిటతోడ వామకరముతోడ
ననుపైన తమలోనానందముతోడ
యెనయుచు శ్రీవేంకటేశుఁడై యీడా నాడా
అనిశము వెలసెఁ బ్రహ్లాదవరదుఁడు

రేకు: 0328-05 లలిత సం: 04-164 నృసింహ

పల్లవి: జూటుఁదనాలవాఁడవు సుగ్రీవనారసింహ
పాటించి నిన్ను నేము పంగించేవారమా

చ. 1: మొగము సింహపురూపు మొగి మై మానిసిరూపు
జిగిఁ దొడమీఁదట శ్రీమహాలక్ష్మి
తగు నీకు నిటువంటి తగవులెల్లాఁ జెల్లు
యెగ సక్కేలాడ మాకు నేలయ్య నిన్నును

చ. 2: కట్టినది పైఁడికాశ కంబములోన వునికి
నెట్టుకొన్ననవ్వులు నీలోనివే
యిట్టివల్లా నీకమరు యెన్నిలేవు నీచేఁతలు
అట్టిట్టని నిన్ను మాకు నడుగనేమిటికి

చ. 3: అమరుల కేలికవు అసురలకు వైరవి
రమణఁ బ్రహ్లాదునకు రక్షకుఁడవు
కొమరై శ్రీవేంకటాద్రిఁ గొత్తలు నీగుణములు
సముకానఁ బలుమారు సంతోసించే మిఁకను

రేకు: 0328-06 లలిత సం: 04-165 వేంకటగానం

పల్లవి: మతంగపర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీవేంకటేశ్వరుడున్నవాఁడు

చ. 1: కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి
తలచిఁనవారినెల్లా ధన్యులఁజేసి
పొలుపుమిగుల మంచిపువ్వుల తోఁటలనీడ
విలసిల్లీనదివో శ్రీవేంకటేశ్వరుఁడు

చ. 2: శరణన్నవారికి చనవిచ్చి రక్షించి
గరిమఁ బూజించువారిఁ గరుణఁ జూచి
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు

చ. 3: తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి
కని నుతించేవారికిఁ గామధేనువై
కనకమయములైన ఘనమైనమేడలలో
వినుతికెక్కెను శ్రీవేంకటేశ్వరుఁడు

రేకు: 0329-01 రామక్రియ సం: 04-166 జానపదము

పల్లవి: లెండో లెండో మాటాలించరో మీరు
కొండలరాయనినే పేర్కొన్న బిదె జాలి

చ. 1: మితిమీరెఁ జీకట్లు మేటితలవరులాల
జతనము జతనము జాలో జాలి
యితవరులాల వాయించే వాద్యాలకంటె-
నతిఘోషములతోడ ననరో జాలి

చ. 2: గాములువారెడిపొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమసపు పారివార దీవెపంజులు చేఁబట్టి
యేమరక వమీలో మీరు యియ్యరో జాలి

చ. 3: కారుకమ్మె నడురేయి గడచెఁ గట్టికవార
సారెసారెఁ బలుకరో జాలో జాలి
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టె మేలుకొన్నాఁడు
గారవాన నిఁక మానఁ గదరో జాలి

రేకు: 0329-02 వరాళి సం: 04-167 హనుమ

పల్లవి: పదియారు వన్నెల బంగారుకాంతుల తోడ
పొదలిన కలశాపుర హనుమంతుఁడు

చ. 1: యెడమచేతఁ బట్టె నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసిగుంపుల గొట్టె
తొడిఁబడ నూరుపులతోఁ దూరుపుమొగమైనాఁడు
పొడవైన కలశాపుర హనుమంతుఁడు

చ. 2: తొక్కి యక్షకుమారునిఁ దుంచి యడగాళ సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవఁ బెరిగి సుతు వద్ద వేదాలు
పుక్కిటఁ బెట్టెఁ గలశాపుర హనుమంతుఁడు

చ. 3: గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశుబంటు తానాయ
అట్టె వాయువుకును అంజనిదేవికిని
పుట్టినాడు కలశాపుర హనుమంతుఁడు

రేకు: 0329-03 శ్రీరాగం సం: 04-168 ఇతర దేవతలు

పల్లవి: నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకు మరి యిన్నిటాఁ బ్రసన్నుడు

చ. 1: కమలావరుడు శ్రీకర మదనగురుఁడు
సమర దానవకుల సంహారుఁడు
విమల గుణాకరుఁడు విజయచక్రధరుఁడు
కమనియ్య భక్తజన కరుణాకరుఁడు

చ. 2: వేదాంతవేద్యుఁడు విశ్వహితాపాద్యుఁడు
ఆదియునంత్యములేని యనవద్యుఁడు
సాదితయోగిహృద్యుఁడు శమితోగ్రచైద్యుఁడు
సోదించి చూచితేను సురలకు నాద్యుఁడు

చ. 3: కామితఫల శక్తుఁడు ఘనమహిమ యుక్తుఁడు
ఆముకొన్న లోకరక్షణ సక్తుఁడు
నేమాన శ్రీవేంకటాద్రి నిలిచి మమ్మేలినాఁడు
కోమలుఁడు వీఁడిగో గోపకాస రక్తుఁడు

రేకు: 0329-04 పాడి సం: 04-169 రామ

పల్లవి: రాముఁడు రాఘవుఁడు రవికులుఁ డితఁడు
భూమిజకుఁ బతియైన పురుషనిధానము

చ. 1: అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపఁగ నసురల శిక్షింపఁగ
తిరమై యుదయించిన దివ్యతేజము

చ. 2: చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకి కనేయట్టి-
కాంతులఁ జెన్నుమీరిన కైవల్యపదము

చ. 3: వేదవేదాంతములందు విజ్ఞానశాస్త్రములందు
పాదుకొనఁ బలికేటి పరమార్థము
పోదితో శ్రీవేంకటాద్రిఁ బొంచి విజనగరాన
ఆదికి సనాదియైన అర్చావతారము

రేకు: 0329-05 కన్నడగౌళ సం: 04-170 రామ

పల్లవి: శరణు శరణు దేవ సర్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యనందన

చ. 1: వారిధిబంధన రావణ శిరశ్ఛేదక
మారీచను బాహుబలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజ సంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ

చ. 2: సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధ సప్తతాల విధ్వంసన చతుర
భువనేశ సాకేతపురవాస రామ

చ. 3: హరచాపహర అహల్యాశాప విమోచక
ఖరశర వాలినిగ్రహ బిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్తరక్షక
ధరణిజా సమేత దశరథరామా

రేకు: 0329-06 శంకరాభరణం సం: 04-171 ఇతర దేవతలు

పల్లవి: వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా

చ. 1: పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాల వయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయలెల్లా యివె విఠలేశ్వరా

చ. 2: వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విఠలేశ్వరా
చన్ను దాగి రాకాసిపీఁచము హరించితివి
యెన్నికకెక్కె నీబిరు దిటు విఠలేశ్వరా

చ. 3: గొల్లెతలఁగూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విఠలేశ్వరా
బల్లిదపు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా

రేకు: 0330-01 దేవక్రియసం: 04-172 కృష్ణ

పల్లవి: విచ్చనవిడినీ యాడీ వీఁడె కృష్ణుఁడు
వొంచ్చములేనివాఁడు వుద్దగిరికృష్ణుఁడు

చ. 1: గల్లుగల్లుమనఁగాను గజ్జలు నందెలతోడ
బిల్లఁగోట్లాడీని పిన్నకృష్ణుఁడు
కెల్లురేఁగి వీధులనుఁ గేరి పుట్టచెండులాడీ
బల్లిదుఁడు గదవమ్మ బాలకృష్ణుఁడు

చ. 2: తమితోడ గోపాలులు తానుఁ గూడి ముంగిటను
సముద్రబిల్లలాడీ సాధుకృష్ణుఁడు
చెమటలుగార సిరసింగనవత్తి యాడీ
గుమితాన వీఁడే యమ్మా గోపాలకృష్ణుఁడు

చ. 3: వుదుటునఁ బారి పారి వుడ్డగచ్చకాయలాడీ
ముదముదొలఁకఁగాను ముద్దుకృష్ణుఁడు
అదివో శ్రీవేంకటేశుఁ డాటలెల్లాఁ దానే యాడీ
పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుఁడు

రేకు: 0330-02 మేఘరంజి సం: 04-173 శరణాగతి

పల్లవి: వట్టిజాలిఁ బడవలదిఁకను
గట్టి విచారముగల వారికిని

చ. 1: దేవుఁడు సులభుఁడు తెలియఁగనేర్చిన
వేవేలు లాభము విరతి
భావించు జ్ఞానమె పాదైన సౌఖ్యము
తావగు శాంతమె ధనధాన్యములు

చ. 2: గురుఁడె సాధనము కోరి వెదకినను
పరగు నాచారమె బ్రదుకెల్లా
శరణాగతియె సామ్రాజ్యపదవి
ధర జితేంద్రియత్వమె వైభవము

చ. 3: తననిజభ క్తియె దండయు దాపును
మనసు నిలుపుటే మరి శుభము
యెనయఁగ శ్రీవేంకటేశుమహిమ లివి
కని మని యండుటె ఘనవివేకము

రేకు: 0330-03 కురంజి సం: 04-174 భక్తి

పల్లవి: చేపట్టుఁ గుంచము శ్రీవిభుఁడు
వై పెరిఁగి పొగడవలెఁ గాక

చ. 1: మనసులోనిహరి మరవక తలఁచిన
యెనయ నిహపరము లేమరుదు
పెనగొన నాతనిపేరు నుడిగినను
తనకు మహానందము లేమరుదు

చ. 2: పుట్టించినాతని పొసఁగఁగ గొలిచిన
యిట్టె వివేకం బేమరుదు
చుట్టి యతనిదాసులకుమొక్కినను
పుట్టగు గెలుచుట భువి నేమరుదు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జేరి భజించిన
యేవేళ సాత్త్విక మేమరుదు
భావించి యాతనిపై భక్తి నిలిపినను
కైవశముగఁ దనుఁ గను టేమరుదు

రేకు: 0330-04 జౌళిరామక్రియ సం: 04-175 నృసింహ

పల్లవి: ఎంత పరాక్రమము యీసింహము
చెంతనే దివిజులు సేవించేరు

చ. 1: కొండమీఁదఁ గూచుండి దైత్యుమై
చెండివేసె నీ సింహము
నిండునగవుతో నెలఁత దనతొడపై
నుండఁగ నెరసీ నుదుటుఁదనమున

చ. 2: తటుకనఁ బ్రహ్లాదుఘటనచేఁ గంభము
చిటిలి వెడలె నీ సింహము
చటులకరంబులఁ గుటిలదానవుని
బటుగతిఁ బట్టెను పశుబంధముగా

చ. 3: పగయెల్ల నడఁచి జగములేలుచును
జిగిమించిన నరసింహము
నిగిడి శ్రీవేంకటనిధి యహోబలము
తగు నివాసముగఁ దనరీ నిదివో

రేకు: 0330-05 నాదరామక్రియ సం: 04-176 దేవుడు-జీవుడు

పల్లవి: కొసరనేల నాగుణము లివి
రసికత నీవిన్నిటా రక్షించుకొనుమీ

చ. 1: నేరమి నాది నేరుపు నీదే
దూరు నాది బంధుఁడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమీ

చ. 2: నేను యాచకుఁడ నీవేదాతవు
దీనుఁడ నేఁ బరదేవుఁడవు
జ్ఞానరహితుఁడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిఁక నను( జేరి కావుమీ

చ. 3: అరయ నే జీవుఁడ నంతర్యామివి
యిరవుగ దాసుఁడ నేలికవు
చిరజీవిని నే శ్రీవేంకటపతివి
వరదుఁడ ననుఁ జేవదలకుమీ

రేకు: 0330-06 హిందోళవసంతం సం: 04-177 వేంకటగానం

పల్లవి: ఎన్నిమహిమలవాఁడె యీదేవుఁడు
కన్నులపండువులెల్లాఁ గదిసినట్టుండెను

చ. 1: పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి
యేలీల నుండెనని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవళింపగా మేన
మేలిమిమీఁగఁడంటిన మెలుపుతో నుండెను

చ. 2: తట్టుపునుఁగు కాపు దైవశిఖామణికి
యెట్టుండెనని మరి నెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టె రాత్రులు మేననంటి నట్టుండెను

చ. 3: అలమేలుమంగతోడ నట్టె సొమ్ము ధరించఁగ
యెలమి శ్రీవేంకటేశునెంచి చూచితే
కలిమిగలయీకాంతకాఁగిటఁ బెనఁగఁగాను
నిలువెల్లా సిరులై నిండినట్టుండెను

రేకు: 0331-01 ఆందోళి సం: 04-178 తేరు

పల్లవి: కన్నులపండుగలాయఁ గన్నవారి కిందరికి
వెన్నుఁడేఁగీ నిల్లిదివో వీధుల వీధులను

చ. 1: అదె యెక్కెఁ దిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదచల్లుఁ గాంతులతో వీధుల వీధులను

చ. 2: తోలి యాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్టులెల్ల జయవెట్టఁగ
గాలికిఁ బడగలెల్లాఁ గడు నల్లాడఁగఁ జొచ్చె
వేలేటి పువుదండలతో వీధుల వీధులను

చ. 3: తావు చేరెఁ దిరుతేరు ధర్మములు నిలువఁగ
యీవల నలమేల్మంగ ఇచ్చగించఁగా
శ్రీవేంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను

రేకు: 0331-02 భల్లాటి సం: 04-179 కృష్ణ

పల్లవి: జగతిలో మనకెల్ల జయంతి నేఁడు
పగటున నందరికి పండుగ నేఁడు

చ. 1: అదివో శ్రావణ బహుళాష్టమి నేఁడు
పొదిగొన్న రోహిణి సంపూర్ణము నేఁడు
కదిసి యద్దమరేత్రికాడ నేఁడు
ఉదయించెఁ గృష్ణుఁడు చంద్రోదయాన నేఁడు

చ. 2: వసుదేవదేవకుల వరము నేఁడు
పసగా ఫలియించె రేపల్లెలో నేఁడు
కొసరి యశోదనందగోపుఁడు నేఁడు - యీ
సిసువును సుతుఁడంటాఁ జెలఁగిరి నేఁడు

చ. 3: హరిమాయ కంసుమద మడఁచె నేఁడు
పొరుగిరుగులవా రుప్పొంగిరి నేఁడు
సిరి నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడై నిల్చె
అరుదుగా గొల్లెతలు ఆడుకొనేరు నేఁడు

రేకు: 0331-03 ఆహిరి సం: 04-180 కృష్ణ

పల్లవి: కొలిచితే రక్షించే గోవిందుడితడు
యిలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు

చ. 1: గోవర్ధనమెత్తినట్టి గోవిందుడితడు
వేవేలుగొల్లెతల గోవిందుడితడు
కోవిదుడై ఆలఁగాచే గోవిందుడితడు
ఆవలఁగంసుఁజంపిన ఆగోవిందుడితడు

చ. 2: క్రూరకాళింగమర్దన గోవిందుడితడు
వీరచక్రాయుధపు గోవిందుఁ డితడు
కోరి సముద్రాలు దాఁటే గోవిందుడితడు
ఆరీతి బాలురఁ దెచ్చేయా గోవిందుడితడు

చ. 3: కుందనపుకాశతోడి గోవిందుడితడు
విందుల రేపల్లె గోవిందుడితడు
పొంది శ్రీవేంకటాద్రిపై పొసఁగఁ దిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుడితడు

రేకు: 0331-04 కౌశి సం: 04-181 వేంకటగానం

పల్లవి: కొండంతపాడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు

చ. 1: పాతాళవాసులైన బలురక్కసుల మీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధిచొచ్చినట్టి దానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున

చ. 2: ఆకాశము దూరినట్టి యదటు దైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి

చ. 3: ధరమీఁదఁ గలిగిన దనుజకోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పారఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరముకొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి

రేకు: 0331-05 వరాళి సం: 04-182 నృసింహ

పల్లవి: నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము

చ. 1: నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము
నగముపై యోగానందనరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము

చ. 2: నాఁటుకొన్న భార్గవూటునరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమళ్లనరసింహము
నాఁటి యీ కానుగమానినరసింహము వీఁడె
మేఁటి వరాహపు లక్ష్మీనారసింహము

చ. 3: పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన
నలిరేఁగిన ప్రహ్లాదనరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీవేంకటాద్రిమీఁద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము

రేకు: 0331-06 శంకరాభరణం సం: 04-183 వేంకటగానం

పల్లవి: కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు
తెలియ నీతఁడే సుండీ దేవదేవోత్తముఁడు

చ. 1: పుడిమికాధారము పురుషోత్తముఁడె
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి
విడువుఁ డేటికి బారవేసినగుంటికినెల్ల
వొడయ డీతఁడే సుండీ వున్నతోన్నతుఁడు

చ. 2: అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడే
సములై జీవించువారు సతానసంఖ్య
భ్రమయకుఁ డెండమావిబయళ్లు చెరువులంటా
అమర నీతఁడే సుండీ హరి వాసుదేవుఁడు

చ. 3: చెలువుఁ డీతఁడె సుండీ శ్రీవేంకటేశుఁడె
పలుకుఁ బంతాలవారు పదివేగురు
తలఁచకుఁ డీదోమ దంతితోను సరిగా
జలజనాభుఁడే సుండీ సకలలోకేశుఁడు

రేకు: 0332-01 వసంతం సం: 04-184 వైరాగ్య చింత

పల్లవి: రంటదెప్పరపురచన మా బదుకు
జంటల శ్రీపతిశరణమే నిజము

చ. 1: కన్నులయెదుటను గలిగిన జగమే
మిన్నక మనసున మెరసేది
తిన్నఁగ రేయి నిద్రించినవాఁడనే
యెన్నఁగ రేపే యెరిఁగినవాఁడ

చ. 2: బాయట నూరక పారెటిగాలే
కాయములోపలఁ గలిగేది
పోయిన జన్మపుఁబొరుగులవాఁడనే
యీయెడ నిటు జనియించితిఁగాని

చ. 3: పుడమివెలు పలను బుట్టినరుచులే
కడుపులోపలను గరఁగేది
కడఁగి శ్రీవేంకటపతి నాలోననే
యెడయఁడు యతనినే యిటు గొలిచితిని

రేకు: 0332-02 సాళంగనాట సం: 04-185 గురు వందన

పల్లవి: వైష్ణవులసొమ్ము నేను వారు నీసొమ్ములింతే
విష్ణుఁడ నీవెట్లైన వివరించుకోవయ్యా

చ. 1: నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన-
తఱి నీదాసులకే నే దాసుఁడగాక
గుఱుతెరుఁగుదునా నేఁ గోరి యింతకతొల్లి
గుఱుతు చూపిన మాగురువునేకాక

చ. 2: ముంచి నీకు మొక్కేఁగాక ముందే నీశరణులు
పెంచి పాదాలు నా నెత్తిఁబెట్టిరయ్య
పొంచి నీవేడ నేనేడ బుజముల ముద్రవెట్టి
సంచితమై సేసినట్టిసంబంధమేకాక

చ. 3: శ్రీవేంకటేశ నీసేవే సేసేఁగాక నే డీ-
సేవకుఁ దెచ్చెను వారిసేవేకాదా
భావమొక్కటిగా నాకుఁ బట్టిచ్చిరి నిన్ను వారు
ఆవలీవలికిఁ బరమార్థమేకాక

రేకు: 0332-03 రామక్రియ సం: 04-186 ఉపమానములు

పల్లవి: విత్తొకటి వెట్టఁగాను వేరొకటి మొలచీనా
హత్తి దేహగుణములు ఆతుమకయ్యీనా

చ. 1: చెంది చేఁదుదిన్ననోరు చేఁదేయయివుండుఁగాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంసారికి బలు లంపటాలేకాక
అందు హరిఁజేరి సుఖ మందఁ దీరీనా

చ. 2: యెంగిలిఁ బుట్టినమేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనమ సేసుకోనీనా
ముంగిటిదేహికిఁ గర్మములు ముంచుకొనుఁగాక
రంగుగ శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా

చ. 3: చేతికి వచ్చినసొమ్ము చేరిదాఁచుకొనుగాక
యేతులఁ దా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవేంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నాదా

రేకు: 0332-04 మలహరి సం: 04-187 భక్తి

పల్లవి: అందుకు హరికథ యనుతీర్థంబున
నింద వాసె నిఁక నిర్మలమైతి

చ. 1: కంతునిముట్టంటు గలసె మదిలో
యెంతట శుద్ధౌనో యెరఁగమిఁక
సంతత సంసార జలధుల మునిఁగెద
పొంతగర్మము పోదింకాను

చ. 2: మాయపు టాసల మాలు గలసె మది
యేయెడ శుద్ధౌనో యెరఁగమిఁక
ఆయపుభవములయనలము చొచ్చితి
పోయినఁగర్మము పోదింకాను

చ. 3: చక్కఁగఁ గలిదోసము గలసెను మది
నెక్కడ వోయెనో యెరఁగమిఁక
దక్కి శ్రీవేంకటదైవముఁ గొలిచితి
పుక్కట గర్వము పోదింకాను

రేకు: 0332-05 దేశాక్షి సం: 04-188 అధ్యాత్మ

పల్లవి: కర్మమూలము జగము గాదనివిడువక
మర్మపుమోక్షము లేదు మానలేరో గర్వము

చ. 1: సకలకర్మాలు మాని సన్యాసి యైతేను
వొకట వెలితిలేనివున్నతుఁడట
ముకెమై వుభయకర్మములు బంధహేతువని
ప్రకటించి వేదాంతపఠనమే యెక్కుడు

చ. 2: బహురూపములు మరచి బ్రహ్మ నిష్ఠుఁడైనయోగి
యిహపరముల కతఁడెక్కుడట
విహితకర్మము దక్క వీరఘోరకర్మములు
సహజపాతకమనేశాస్త్రాలే యెక్కుడు

చ. 3: సంతతకర్మములెల్ల సంసారమూలములు
అంతట నిస్సంగుడైతే నధికుఁడట
చింతించి చింతించి శ్రీవేంకటేశ్వరు
వంతుకుఁజెప్పన హరివాక్యమే యెక్కుడు

రేకు: 0332-06 దేవగాంధారి సం: 04-189 శరణాగతి

పల్లవి: పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు దానే
యిట్టె శ్రీహరి నన్నే ట్టీడేరించీనో

చ. 1: యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని
యించుకవడిలోనే మోహింతు నందుకు
కంచువంటి దీమనసు కటకటా యేది వాటి
చంచలుఁడ హరి నన్నేసంగతి సేసీనో

చ. 2: తలఁతు నేనొకవేళ దైవము గనేనని
కలిమి నంతటిలోనె కడు మరతు
చలపట్టె నిదివో నాజన్మములకేది వాటి
కలుషచిత్తుఁడ నన్నేకందువఁ బెట్టీనో

చ. 3: జ్ఞానినౌదు నొకవేళ సరిఁ గర్మినౌదును
మానువంటిదీగుణము మరేది వాటి
కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మానిసి నింతే యెట్టు మన్నించీనో

రేకు: 0333-01 గుండక్రియ సం: 04-190 మనసా

పల్లవి: అన్నియు నాలో నుండఁగ నవ్వల నేమి చూచేము
యెన్నఁడు గాననిమాయ యెరఁగవో మనసా

చ. 1: యీడనే సంసార మిదె యింద్రజాలమై యుండఁగ
యేడకైనాఁ జూడఁ బోయే మింద్రజాలము
పాడితో నా పట్టుగులే బహురూపాలై యుండఁగ
వేడుకయ్యీ బహురూపవిద్యలు చూడఁగను

చ. 2: నటన దినదినము నాటకమై యుండఁగాను
సటవట నాటకాలు సారెఁ జూచేము
ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను
అటమటపువిద్యలు అన్నియుఁ జూచేము

చ. 3: పాపపుణ్యములు రెండు బారివిద్య లుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము
యేపున శ్రీవేంకటేశు డిటు మమ్ము భ్రమపాపె
నాపనులు నేనే చూచి నవ్వులు నవ్వేను

రేకు: 0335-02 గుజ్జరి సం: 04-191 శరణాగతి

పల్లవి: ఇతరోపాయములెల్ల యీసందివే
అతిశయపదమైతే హరిదాస్యఫలమే

చ. 1: కర్మము సేయ నేరరా కడఁగి సన్యాసులు
కర్మము విడిచి మోక్షముఁ బొందిరి
ధర్మమెరఁగనివారా తత్త్వపుయోగీంద్రులు సర్వ-
ధర్మము విడిచి హరిఁ దమలోనే కనిరి

చ. 2: దానాలు సేయనేరరా తగిలి యోగీంద్రు లన్ని
మాని హరిజపమే నెమ్మడిఁ జేసిరి
నానావిధు లెరఁగరా నాఁడు విభీషణాదులు
శ్రీనాథు శరణని చిరదేహులైరి

చ. 3: సతతసంగములెల్ల జన్మబంధహేతువని
మతిమంతులైనవారు మానిరిగాక
హితవైన శ్రీవేంకటేశ్వరుని శరణని
బ్రతుకరా యిందు నందుఁబ్రపన్నులెల్లను

రేకు: 0333-03 సౌరాష్ట్రంసం: 04-192 అన్నమయ్య స్తుతి

పల్లవి: హరియవతారమె ఆతఁడితఁడు
పరమ సంకీర్తనఫలములో నిలిపె

చ. 1: వున్నాఁడు వైకుంఠమున నున్నాఁడు యాచార్యునొద్ద
వున్నతోన్నతమహిమ నన్నమయ్య
వున్నవి సంకీర్తనాలు వొట్టుక లోకములందు
పన్నిన నారదాదులు పైపైఁ బాడఁగను

చ. 2: చరియించు నొకవేళ సనకాదిమునులలో
హరిఁ బాడుఁ దాళ్ళపాకఅన్నమయ్య
తిరమై యాళువారల తేజము దానైయుండు
గరుడానంతముఖ్య ఘనులంగడిని

చ. 3: శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతికొలువునందు
ఆవహించెఁ దాళ్ళపాకఅన్నమయ్య
దేవతలు మునులును దేవుఁడని జయవెట్టఁ
గోవిదుఁడై తిరిగాడీఁ గోనేటిదండను

రేకు: 0333-04 రామక్రియ సం: 04-193 మాయ

పల్లవి: ఉండినట్టే వుండును వుండకున్న మానును
అండనే శ్రీహరిమాయ నమరినలోకము

చ. 1: యేదైనా మంచిదే యెట్టయినా మంచిదే
సేద దేరినట్టి పూర్ణబిత్తునకును
కాదు గూడదనరాదు కలస్వభావమునకు
ఆదినుండి హరిమాయ నత్తినడి లోకము

చ. 2: యెండైనా మంచిదే యెంతనీడైనా మంచిదే
పండినజ్ఞానభక్తుల ప్రసన్నులకు
నిండె నిండదనరాదు నిచ్చనిచ్చఁబ్రకృతికి
కొండవంటిహరిమాయ గురియైనలోకము

చ. 3: పాపమైన మంచిదే బలుపుణ్యమైన మంచిదే
శ్రీపతిని శరణన్నజీవునికిని
వోప నోపేన రాదు వొద్దిక శ్రీవేంకటేశు
చేపట్టినమాయలోనఁ జిక్కినది లోకము

రేకు: 0333-05 శంకరాభరణం సం: 04-194 శరణాగతి

పల్లవి: నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు
యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నా రిఁకను

చ. 1: కన్నులఁ జంద్రసూర్యులుగలవేలుపవు నీవు
పన్నినలక్ష్మిభూమిపతివి నీవు
అన్నిటా బ్రహ్మకుఁ దండ్రియైన యాదివేలుపవు
యెన్నఁగ నీకంటే ఘన మెవ్వరున్నా రిఁకను

చ. 2: దేవతలందరు నీ తిరుమేనైనమూర్తి
ఆవలఁ బాదాన లోక మణఁచితివి
నీవొక్కఁడవే నిలిచిన దేవుఁడవు
యేవేళ నీకంటే నెక్కుడెవ్వరున్నా రిఁకను

చ. 3: అరసి జీవులకెల్ల నంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముఁడవు భువనరక్షకుఁడవు
యిరవైననీవేకాక యెవ్వరున్నా రిఁకను

రేకు: 0333-06 శుద్ధవసంతం సం: 04-195 శరణాగతి

పల్లవి: కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో
అటు నావశము గాదు హరి నీచేఁ గాని

చ. 1: పాపము నెరుఁగుదు బంధము నెరుఁగుదు
మాపుదాకా నివి నేను మానలేఁగాని
కోపము దుర్గుణమని కొంత గొంత యెరుఁగుదు
తీపుల యాసలఁ బడి తిప్పలేఁగాని

చ. 2: చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి
యీతల నాకు వెరపు యించుక లేదు
గాతల నామనసెల్లఁ గల్పించినట్లవును
చేతనైనా చెప్పినట్టు సేయలేఁగాని

చ. 3: నావంకఁ గడమ గాఁక నా గురుఁడు తొల్లె నన్ను
శ్రీవేంకటేశుఁడ నీచేతికిచ్చెను
దైవమొక్కఁడవే నీ దాసానుదాసుఁడనైతి
యేవిధులు నే నెరఁగ నిటు నిన్నేకాని

రేకు: 0334-01 సామంతం సం: 04-196 శరణాగతి

పల్లవి: ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె వున్నదిదె చెప్పరాని ఫలము

చ. 1: కోపము విడిచితేనె పాపము దానే పోవు
దీపింప సుజ్ఞానముతెరు విదివో
లోపల మనిలుఁడై లోకముమెచ్చుకొరకు
పైపైఁగడిగితేను పావనుఁడౌనా

చ. 2: ముందరికోరిక వోతే ముంచిన బంధాలు వీడు
కందువ నాస మానితే కైవల్యము
బొందిలోన నొకటియు భూమిలోన నొకటియు
చిందు వందు చిత్తమైతే చేరునా వైకుంఠము

చ. 3: కాంతల పొందొల్లకుంటే ఘనదుఃఖమే లేదు
అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁడు
అంతట మాటలె యాడి హరి శరణనకుంటే
దొంతినున్నభవములు తొలఁగునా వివేకికి

రేకు: 0334-02 లలిత సం: 04-197 అధ్యాత్మ

పల్లవి: ఎప్పుడూను నడచేవె యేకాలమైనాను
కప్పి నిష్ఠూరమేల కట్టేరయ్యా

చ. 1: శ్రీపతి యాణాజ్ఞచేతఁ జిక్కనది జగము
యేపున మా యాణాజ్ఞ లేఁటివయ్య
కోపగించుకొనుటింతే కొంకక లోకాలు నేము
మాపుదాఁకా మానుమంటే మానఁబొయ్యీనా

చ. 2: నరహరి రక్షణమే నడచీని లోకము
యిరవై నేము రక్షించే దేఁటిదయ్య
పొరలే గర్వ మింతె బూతులసంసారము
మరలి నేమూరకుంటే మానఁబొయ్యీనా

చ. 3: సృష్టికిఁ గుర్తైనవాఁడు శ్రీవేంకటేశుఁ డింతే
యిష్టానిష్టము మాకు నేఁటిదయ్య
నష్టి లేదు నడచేది నడవక మానరాదు
తప్పి గట్టుకొంటిఁగాక తా మానఁబొయ్యీనా

రేకు: 0334-03 బౌళి సం: 04-198 వైష్ణవ భక్తి

పల్లవి: ఇంత లేకుంటే నది యెక్కడి సుజ్ఞానము
దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా

చ. 1: యెదిటి వారెరిఁగితే యేమీ ననక మరి
చెదరకుండుటే పో శ్రీవైష్ణవం
కదిసినకాంతలను కనకము వొడగంటే
పదరకుండుటే పో పరమసాత్వికము

చ. 2: క్రియయెరఁగనివారు కీడు సేసితేఁ దాను
దయఁ జూచుటే హరిదాస్యఫలము
రయమునఁ దామసము రాజసము గలిగితే
భయపడి తొలఁగుటే ప్రసన్నగుణము

చ. 3: వొరసి యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన
నిరతితో వీఁగనిదే నిచ్చలబుద్ధి
యిరవై శ్రీవేంకటేశ్వరుదాసులఁ గని
శరణని మొక్కుటే సర్వజ్ఞగుణము

రేకు: 0334-04 మలహరి సం: 04-199 హరిదాసులు

పల్లవి: పరమోపకారులు ప్రత్యక్షదైవములు
హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము

చ. 1: పాపుదురు లోకములో పాపపంకమెల్లాను
దీపించ శ్రీపాదతీర్థమున
వోపుదురు హీనుల వున్నతులఁగాఁ జేయ
చేపట్టి కన్నులెదుటిసేవామాత్రమున

చ. 2: చెఱుతు రజ్ఞానమెల్లా జనులు తమ్ముఁజేరిన
మఱియుఁ దమప్రసాదమహిమవల్ల
తెలిచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా
మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున

చ. 3: చెల్లఁబెట్టుదు రెందైనా చిల్లరకులమువారి
తెల్లమిగా మంత్రోపదేశమున
యిల్లిదె శ్రీ వేంకటేశ యెక్కుడుసేసిరి మమ్ము
సల్లాపనల తమసహవాసములను

రేకు: 0334-05 ధన్నాసి సం: 04-200 శరణాగతి

పల్లవి: నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు
శ్రీకాంతుడవు నాకు సిద్ధించుకొరకు

చ. 1: జలధివంటిది సుమీ చంచలపు నామనసు
కల వింద్రియముల నేటిజలచరములు
వొలసి భక్తెనెడి వోడ యెక్కితి నేను
జలశాయి నీవ నేటిసరకు దెచ్చుటకు

చ. 2: కొండవంటిది సుమీ కొనకెక్కు నామనసు
వుండుఁ గామాదులను వురుమృగములు
వుండి నీశరణమను వూఁత గొని యెక్కితిని
కొండలప్ప నీవనేటి కొనఫలముకొరకు

చ. 3: టీవులను ధరణివంటిది సుమీ నామనసు
నీవె శ్రీవేంకటేశ నిక్షేపము
వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి
భూవిభుఁడ నీవనేటి పురుషార్థము

రేకు: 0334-06 కాంభోది సం: 04-201 గురు వందన, నృసింహ

పల్లవి: అంతటనే వచ్చి కాచు నాపద్బంధుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడనంటేఁ జాలు

చ. 1: బంతిఁగట్టి నురిపేటి పసురము లెడ నెడఁ
బొంత నొక్కొక్క గవుక వుచ్చుకొన్నట్టు
చెంతల సంసారము సేయు నరుఁడందులోనె
కొంత గొంత హరి నాత్మఁ గొలుచుటే చాలు

చ. 2: వరుసఁ జేఁదు దినేవాడు యెడ నెడఁ గొంత
సరవితోడుతఁ దీపు చవిగొన్నట్టు
దురితవిధులు సేసి దుఃఖించు మానవుఁడు
తరవాత హరిపేరు దలఁచుటే చాలు

చ. 3: కడుఁ బేదైనవాఁడు కాలకర్మవశమున
అడుగులోనే నిధాన మటు గన్నట్టు
యెడసి శ్రీవేంకటేశు నెరఁగక గురునాజ్ఞ
పొడగన్నవానిభక్తి పొడముటే చాలు

రేకు: 0335-01 నాగవరాళి సం: 04-202 అధ్యాత్మ

పల్లవి: దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే
వావిరి నొఁగాదన నవ్వల నిఁక నెవ్వరో

చ. 1: యెంచఁగ నీదేహమిది యింద్రియాదులకుఁ జరఁ
వంచనతో విడిపించువారలెవ్వరో
పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంత దయఁజూడ నిఁక నెవ్వరో

చ. 2: పోరచి నామన సిది పుణ్యపాపాలకుఁ జర
మారుకొని విడిపించ మరి యెవ్వరో
తీరని నాజన్మ మిది దినభోగాలకుఁ జర
యీరీతి విడిపించ నిఁక నెవ్వరో

చ. 3: ఆతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర
ఆతల నెవ్వరికైనా నరుహమౌనా
యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక
ఘాతల నీదాసులకు గతి యెవ్వరో

రేకు: 0335-02 నారాయణి సం: 04-203 అధ్యాత్మ

పల్లవి: ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేఁతలకుఁ దగవు గాదనరా

చ. 1: ఘనకర్మానుభవమే కావలె నొండె నాకు
వనజాక్ష నీసేవే వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మీ

చ. 2: పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె
తూకొని నీనామముచేఁ దుంచుట యొండె
సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
మేకొని యీవట వింటే మెత్తురా నిన్నును

చ. 3: యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె
సరస రెండును నైన సంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరిబేసి జంటమాట జరపకు మిఁకను

రేకు: 0335-03 బలహంస సం: 04-204 వైరాగ్య చింత

పల్లవి: ఏమి సేతు నిందుకు మందేమైనఁ బోయ రాదా
సామజగురుఁడ నీతో సంగమొల్ల దేఁటికే

చ. 1: మాయలసంసారము మరిగిన కర్మము
ఈయెడ నిను మరుగ దేఁటికో హరి
కాయజకేలిపైఁ దమిగలిగిన మనసు
కాయజుతండ్రి నీపైఁ గలుగ దిదేఁటికే

చ. 2: నాటకపుఁగనకము నమ్మినట్టిబదుకు
యేఁటికి నీభక్తి నమ్మదేలే హరి
గూఁటఁబడే పదవులు గోరేటిజీవుఁడు
కూటువైననిజముక్తి గోరడిఁది యేఁటికే

చ. 3: పాపపుణ్యములకె పాలుపడ్డ నేను
యేపున నీపాలఁ జిక్క నేలకో హరి
శ్రీపతివి నాలోని శ్రీవేంకటేశుఁడ
నీపేరివాఁడ నాకు నిండుమాయ లేఁటికే

రేకు: 0335-04 దేసాళం సం: 04-205 వేంకటగానం

పల్లవి: తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక
యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు

చ. 1: యీ సంసారమునకు యితఁడె దిక్కు నేఁ-
జేసేటిచేఁతలకెల్ల శ్రీపతే లోను
పాసిపోఁడెప్పుడు నన్ను బందువుఁడితఁడే నాకు
దాసుఁడైనవాఁడు హరిఁ దగదు దూరఁగను

చ. 2: చావుఁబుట్టుగులవేళ సతము నీతఁడే
సావి భోగములకు నిచ్చకుఁడీతఁడే
భావములోపల నుండుప్రాణ మీతఁడే నాకు
దైవము దూరగనేల తనకేమి వచ్చినా

చ. 3: తలఁపులోపలికి యీదైవమే తోడు
యిలఁ గలిమిలేములు కీతఁడే తోడు
పలుకులోపల నుండుభాగ్య మీతఁడె నాకు
కొలిచి శ్రీవేంకటేశుఁ గొసరఁగనేఁటికి

రేకు: 0335-05 సౌరాష్ట్రంసం: 04-206 విష్ణు కీర్తనం

పల్లవి: విడువ విడువ నింక విష్ణుఁడ నీపాదములు
కడఁగి సంసారవార్ధి కడుముంచుకొనిన

చ. 1: పరమాత్మ నీవెందో పరాకైయున్నాను
పరగ నన్నింద్రియాలు పరచినాను
ధరణిపైఁ జెలరేఁగి తనువు వేసరినాను
దురితాలు నలువంకఁ దొడికి తీసినను

చ. 2: పుట్టుగు లిట్టె రానీ భువి లేక మాననీ
వట్టి ముదిమైన రానీ వయసే రానీ
చుట్టుకొన్నబంధములు చూడనీ వీడనీ
నెట్టుకొన్నయంతరాత్మ నీకు నాకుఁ బోదు

చ. 3: యీదేహమే యయిన ఇఁక నొకటైనాను
కాదు గూడదని ముక్తి కడకేఁగినా
శ్రీదేవుఁడవైన శ్రీవేంకటేశ నీకు
సోదించి నీశరణమె చొచ్చితి నే నిఁకను

రేకు: 0335-06 భంగాళం సం: 04-207 శరణాగతి

పల్లవి: చెప్పినంతపని నేఁ జేయగలవాఁడ నింతే
అప్పటి నపరాధమా ఆదరించవలదా

చ. 1: నీయాజ్ఞ దేహము నే మోఁచితినింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వోయయ్య కొంతైన వూరడించవలదా

చ. 2: నీవు సేసేకర్మము నేఁజేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవరమై వెంట వెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంత వడైనా దప్పిదీర్చవలదా

చ. 3: మతిలో శ్రీవేంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్యా
యితవై పనిసేసేటి యింటి పసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డు వెట్టఁదగదా

రేకు: 0336-01 నాదరామక్రియ సం: 04-208 వైరాగ్య చింత

పల్లవి: ఏమని విన్నవించేను యెన్నెని కాచేవు నీవు
శ్రీమాధవుడ నీకుఁ జేతికి లోనయ్య

చ. 1: పుట్టినదె వొకతప్పు భువిమీఁద నటమీఁద
నెట్టన సంసారినౌటే నిజము రెండోతప్పు
రట్టుకెక్కి దొరనౌటే నెట్టన మూఁడోతప్పు
యిట్టె కావు కావకుండు మిదివో నాతప్పు

చ. 2: అన్నపానములు గోరినదియే మొదలి బందె
యెన్నఁగఁ గాంతలఁ గూడుటిదివో రాతిటిబందె
కన్నవారి వేఁడేది కడతొడుకుబందె
కొన్నిట నేమి గొనేవు కొనవయ్య బందె

చ. 3: కొనఁ బుణ్యపాపాలే గొడియకట్లు రెండు
కొనిరి నీదాసులే కోరిన తప్పుదండము
వినవయ్య యిదివో శ్రీ వేంకటేశ నామనవి
మనుఁగాఁపుఁ జేసితివి మన్నించవయ్య

రేకు: 0336-02 కేదారగౌళ సం: 04-209 వైరాగ్య చింత

పల్లవి: ఇందిరానాథుఁడవు యిందరికి నేలికవు
చిందరవందరలైన చింతలు మరేలా

చ. 1: వుండుమంటే నుండవీ వూరకే బ్రహ్మాండాలు
నిండుమంటే నిండినవి నీరధులెల్లా
మెండగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె
వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా

చ. 2: పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచినదేవతలెల్ల
అట్టే యణఁగిరిగా అసురలెల్ల
పట్టిన నీచల మిదె బహళస్వతంత్ర మిదె
వెట్టిదైవాలపనులు వేరే మరేలా

చ. 3: కమ్మంటే నాయను కైవల్యపదవులు
రమ్మంటే వచ్చె వేదరాసులెల్లను
కమ్మిన శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీకు
యిమ్ముల నీమహి మిదె యితరములేలా

రేకు: 0336-03 బౌళిరామక్రియ సం: 04-210 విష్ణు కీర్తనం

పల్లవి: పలికేటివేదమె ప్రమాణము
తలఁచిన వారికి తత్వము సుండీ

చ. 1: నరహరి యజాండనాయకుడు
సురలితనినే సంస్తుతించిరి
పురుషోత్తముఁ డిదె భూమికి - యీ
హరిఁ గొలువనివా రసురలు సుండీ

చ. 2: కమలారమణుఁడె ఘనుఁడు
అమరులె మ్రొక్కుదు రాతనికి
విమతులఁ దునిమె విష్ణుఁడు
తమిఁ బూజించక తగు గతి లేదు

చ. 3: భావజజనకుఁడు బ్రహ్మము
సోవగఁ గొలిచిరి శుకాదులు
శ్రీవేంకటపతిచెలువుఁడు
దైవశిఖామణిఁ దలఁచరో బుధులు

రేకు: 0336-04 పళవంజరం సం: 04-211 నామ సంకీర్తన

పల్లవి: ఒక్కమాఁటలోనివే వొగి బంధమోక్షాలు
చిక్కినందాఁకా దేహి చింతఁ బొందీఁగాని

చ. 1: హరి యని నుడిగి రెండక్షరాలఁ బాపేటి-
దురితాలు భూవిలోనఁ దొల్లె లేవు
పురిగొని యందుమీఁద పొంచి విశ్వాసములేక
పెరగఁగఁ బెరుగఁగ పెచ్చు రేఁగీఁగాని

చ. 2: మతిలో గోవింద యన్న మాత్రమున నంటేటి
అతిపుణ్యాలిలమీద నన్ని గలవా
కతగా నట్టి మహిమగానలేక వుండగాను
బతిమాలఁగానే యింత బయలాయఁగాని

చ. 3: శ్రీవేంకటేశ నిన్ను సేవించితే నిచ్చేటి-
యేవల వరాలు లెక్క నెంచవసమా
భావించి తెలిసి చేపట్టెడి యరుదింత
దైవము నా కియ్యఁగాను దక్కె నింతేకాని

రేకు: 0336-05 కన్నడగౌళ సం: 04-212 గురు వందన, నృసింహ

పల్లవి: తలరో లోకాంతపరులు తడవము పుణ్యపాపమును
వలె నని శ్రీవైష్ణవులకు వందనమే సేసెడివాఁడ

చ. 1: తపసిఁ గాను ధర్మిఁ గాను
కృపగల శ్రీపతి కింకరుఁడ
జపితఁ గాను శాస్త్రిఁగాను
వుపదేశపు గురువూళిగకాఁడ

చ. 2: భయము లేదు భక్తి లేదు
జయభాగవతుల దయవాఁడ
ప్రియము న్నెరఁగను పెరిమ న్నెరఁగను
ద్వయాధికారముఁ దగిలినవాఁడ

చ. 3: జ్ఞానము లేదు మోనము లేదు
పూని శ్రీవేంకట పురుషుఁడిదె
నానాటఁ దెలిపి నను మన్నించెను
సానఁదేరి తన శరణమువాఁడ

రేకు: 0336-06 సామంతం సం: 04-213 శరణాగతి

పల్లవి: చలువకు వేఁడికి సరికి సరి
కలదిఁక హరి నీ కరుణే మాకు

చ. 1: కాయము గలిగినఁ గలుగుఁ దోడనే
పాయపుమదములు పైపైనే
రోయదు తనుఁ గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుఁగుట యెపుడో

చ. 2: కడుపు నిండితే ఘనమై నిండును
బడిఁ బంచేంద్రియపదిలములు
విడువ వాసలును వెలయు బంధములు
కడగని మోక్షము గైకొనుటెపుడో

చ. 3: పెక్కులు చదివిన పెనఁగుఁ దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా-
నిక్కపు వేల్పవు నీచిత్త మిఁకను

రేకు: 0337-01 హిందోళవసంతం సం: 04-214 శరణాగతి

పల్లవి: దైవమొకఁడే మాతలఁపు నొకటే
పావనమైతిమి పదరేమా

చ. 1: హరి యెటు దలఁచిన నటయాని
పరుగుఁ గోరికల పనులేలా
ధర నభయ మొసఁగు దైవముబంట్లము
మరలి యితరులకు మఱి వెరచేమా

చ. 2: పురుషోత్తమానతిఁ బుట్టినవారము
అరిదిసిరులకై యలపేలా
సరి లక్ష్మీపతి శరణాగతులము
అరయఁగ నితరుల నడిగేమా

చ. 3: శ్రీవేంకటపతిచేఁత జీవులము
దావతి నితరము తగులేలా
వావిరిని కరివరదుని వారము
తావున బందాలఁ దగిలేమా

రేకు: 0337-02 నాగవరాళి సం: 04-215 శరణాగతి

పల్లవి: చాలుఁ జాలు నీసటలఁ బొరలితిమి
వాలి కొంత వెరవకుమనలేవు

చ. 1: కలవు లోకముల ఘనమంత్రంబులు
అలరి ముక్తి యియ్యఁగలేవు
సులభానఁ గలరు సొరిది దేవతలు
వలగొను పాపము వారించలేరు

చ. 2: వున్నవి పుణ్యము లూరకె యివిగో
పన్నిన హరిఁ జూపఁగలేవు
సన్నితి నున్నవి సకళశాస్త్రములు
కొన్నైన భవములకొన గన నీవు

చ. 3: ధరలో సేనలు ధనధాన్యంబులు
పరమజ్ఞానవిభవ మిదు
అరుదుగ శ్రీవేంకటాధిపుఁడే మము
యిరవై కావఁగ యీడేరితిమి

రేకు: 0337-03 శోకవరాళి సం: 04-216 మనసా

పల్లవి: విడువుము మనసా వీరిడిచేఁతలు
తడయక శ్రీహరిఁ దలఁచవో యిఁకను

చ. 1: నానాఁడే యెనఁబది నాలుగులక్షలు
యోనుల వెడలితి నొక్కఁడనే
ఆనిన భోగములందలివే పో
కానము యిఁకనేమి గడియించేము

చ. 2: నలుగడ నటు పదునాల్గు లోకములు
వెలయఁ జొచ్చితిని వెడలితిని
కలిగినదేదో కలుగనిదేదో
తెలియ దేమిటికిఁ దిరిగేవమో

చ. 3: భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము
కవిసి యాఫలము గైకొంటిని
యివల శ్రీవేంకటేశుఁడింతలో
తవిలి యేలఁగా ధన్యుఁడనైతి

రేకు: 0337-04 గుండక్రియ సం: 04-217 దశావతారములు

పల్లవి: ఇరవుగా నిన్నెఱిఁగిరి యిదివో నీదాసులు
పరదైవములమీఁద నొల వేయనేల పనిలేవు నీమాయలు కరుణానిధీ

చ. 1: ముంచెను నీపాదములు మూఁడులోకములయందును
యెంచెను నీ వేయినామాలు యిలలో వేదవ్యాసుఁడు
చంచులఁ దలఁచిరి నిన్ను మున్నే సనకాదియోగీంద్రులు
పొంచి యింకా నీకు దాఁగఁ జోటు లేదు యిందు బొడచూపవే యింకవెడమాయలేలా

చ. 2: కొనెను నీపాదతీర్థము బ్రహ్మ కోరి నీపాదము గడిగి
వినుతించె నీమహిమ తొల్లె వేయినోళ్లుగల శేషుఁడు
అనిరి నిన్నెక్కుడనుచు మొదల శుకాది మునీంద్రులెల్లా
పొనిగి నీవు మాయ సేయఁ జోటు లేదు మమ్ము పొసఁగి యేలుకోవె పురుషోత్తముఁడా

చ. 3: యెక్కెను ధ్రువుఁడు పట్టము యిదివో నిన్నుఁ గొలిచి
చిక్కెను నీశరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను
గక్కన శ్రీవేంకటేశుఁడా యిట్టె కాచితివి మాటకే మమ్ము
యిక్కడ నీమాయసేయఁ జోటులేదు నిన్నునెఱిఁగిరి నీదాసులిందిరారమణా

రేకు: 0337-05 హిజ్జిజ్జి సం: 04-218 అధ్యాత్మ

పల్లవి: పాపముఁ బుణ్యము పరగ నొకట నదె
వోపినవారలు వొడిఁగట్టెడిది

చ. 1: నాలుకతుదనే నానారుచులును
నాలుకవే హరినామమును
పోలింప నొక్కటి భోగమూలము
మూల నొకటది మోక్షమూలము

చ. 2: మనసున నదివో మగువలమోహము
అనుగుమనసుననె హరిచింత
పనివడి యొక్కటె ప్రపంచమార్గము
కొన నొకటే వైకుంఠమార్గము

చ. 3: వెలుఁగుఁ జీఁకటియు వెస నొకనాఁడే
కలిగె నట్ల నివి కలిగినవి
యిలలో శ్రీవేంకటేశు మా యొకటి
తలఁప నొక టతనిదాసులసుగతి

రేకు: 0337-06 సౌరాష్ట్రంసం: 04-219 నృసింహ, హరిదాసులు

పల్లవి: హరిదాసులే మాకు నడ్డమై కాతురుగాక
శరణంటి వారికి నే సకలోపాయములు

చ. 1: పెరుగఁబెరుఁగఁగానే పెద్దలాయ నింద్రియాలు
యిరవైనమాబుద్ధు లిందుగొల్పీనా
తిరిగితిరిగి మాకు బ్రిష్టమాయ జన్మములు
దురితాలుఁ బుణ్యాలుఁ దోసేమా యిఁకను

చ. 2: కూడఁగూడ నానాఁటఁ గొనకెక్కెఁ గోరికలు
వీడనిబంధము లన్నీ విడిచీనా
పాడితో నీడా నాడఁ బ్రాణములుఁ దీపులాయ
యేడనున్ననేము నేమే యెరిఁగేమా యిఁకను

చ. 3: చింతించఁ జింతించఁ జేతికి వచ్చె మనసు
అంతలో శ్రీవేంకటేశుఁ డంది కాచెను
దొంతులై తిరుమంత్రము తోడనే నాలుక నంటె
మంతనాన గురుసేవ మరచేమా యిఁకను

రేకు: 0338-01 బౌళిరామక్రియ సం: 04-220 అధ్యాత్మ

పల్లవి: కైకొన్నకొలఁది కర్మము
వాకుచ్చి తనతోనే వగవఁగనేలా

చ. 1: తలఁచినకొలఁదేదైవము తన-
కలపుకోలుకొలఁదే కడనరులు
బలువుకొలఁదియే పంతము
తొలఁగర యితరుల దూరఁగనేలా

చ. 2: మచ్చిక నొడివినంతే మంత్రము
అచ్చపుభక్తి కొలఁదే యాచార్యుఁడు
నిచ్చలుఁ గోరినయంతే నిజమైనలోకము
పచ్చివెచ్చిచదువుల భ్రమయఁగనేలా

చ. 3: నెమ్మది జాతెంతే నియమము
సమ్మతించినంతే సంతోసము
యిమ్ముల శ్రీవేంకటేశుఁడిచ్చినంతే యిహపర-
మెమ్మెల కిది మరచి యేమరఁగనేలో

రేకు: 0338-02 వరాళి సం: 04-221వైరాగ్య చింత

పల్లవి: ఇన్నిజన్మము లెత్తిన యిందుకా నేము
పన్నిన సంసారములబంధమే మిగిలెను

చ. 1: తీరెఁ దీరె అన్నములు దినదినకోరికలు
కోరఁబోతే యాసలెల్ల కోటానఁగోటి
సారెఁ గొన్నరుచులెల్ల చవితో మేనిలో లేవు
ఆరితేరిబతుకఁగా నాసలే మిగిలెను

చ. 2: పోయఁబోయ స్వర్గాదిభోగములు వెనకకే
సేయఁబోతే పుణ్యములు సేనాసేన
ఆయమంటి వెతకితే నాతుమలోనా లేవు
కాయముతో వెంట వెంట కర్మమే మిగిలెను

చ. 3: అందెనందె మోక్షము హరిదాసులవల్లను
ముందు వెనకెంచితేను మూలమే హరి
గొందిఁ జిక్కె నరకాలు కోపముఁ బాపముఁబాసె
యిందు నందు శ్రీవేంకటేశుఁడే మిగిలెను

రేకు: 0338-03 బౌళి సం: 04-222 నృసింహ, హరిదాసులు

పల్లవి: ఏమిటికిఁక నితరపుణ్యములు
తాము దామె హరి దాసుఁడ నేను

చ. 1: దురితములు హరి తొల్లే తను
శరణన్నపుడె చాలించినాఁడు
నరకములు మరినాఁడే
తిరుమంత్రముచేఁ దీరిచినాఁడు

చ. 2: పుట్టుగులు హరి భువి మునుపే
గట్టిముద్రలనే కడపినవాఁడు
నట్టుకొను అజ్ఞానము వెనకకే
పట్టి గురునిచేఁ బాపినవాఁడు

చ. 3: యిహపరము లివియును నపుడే
సహజధర్మమున జరపినవాఁడు
విహితముగా శ్రీవేంకటపతి నను
బహుదాసులలోఁ బాలించినాఁడు

రేకు: 0338-04 ఆహిరి సం: 04-223 అధ్యాత్మ

పల్లవి: ఆపదలులేని సుఖ మదియెపో విరతి
వోపితేనే కైకొంట వొల్లకుంటే మానుట

చ. 1: అలిగించు ములిగించు నంతలోనే భ్రమయించు
కొలఁది సంసారపుగుణ మిది
మలసి రాలుదింటా మలిగండ్లననేల
వొలిసితేఁ గైకొంట వొల్లకుంటే మానుట

చ. 2: ఆపపెట్టు మోసపెట్టు నంతలోనే వాసిపెట్టు
గాసిల నీసిరులకు గల దిది
వేసరి చానిపిఁ జవి వెదక నదిఁకనేల
పూసివాసిఁ గైకొంట వొల్లకుంటే మానుట

చ. 3: మరపించుఁ దలపించు మరి యేమైనాఁ జేసు
మరియును దనకర్మమహిమిది
గురిగా శ్రీవేంకటేశుఁ గొలిచినవారి కిది
వుఱకైనఁ గైకొంట వొల్లకుంటే మానుట

రేకు: 0338-05 సాళంగనాట సం: 04-224 శరణాగతి

పల్లవి: నీటముంచు పాలముంచు నీచిత్త మిఁకను
చాటితి నీకృప గురి సంసారమునకు

చ. 1: హరి నీవే గురి నాయాతుమలోపలికి
అరిది శంఖచక్రాలే యంగపుగురి
పరమపదమే గురి పట్టినవ్రతమునకు
తిరుమంత్రమే గురి దిష్టపునాలికకు

చ. 2: గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు
తావుల నాభక్తికి నీదాసులే గురి
ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు

చ. 3: నగుశ్రీపతి గురి నన్ను రక్షించుటకును
తగుసంకీర్తన గురి తపమునకు
తెగనిజ్ఞానమునకు తిరుమణులే గురి
మిగుల శ్రీవేంకటేశ మించి నీవే గురి

రేకు: 0338-06 లలిత సం: 04-225 గురు వందన, నృసింహ

పల్లవి: బంటుకు బంటవుదురా పాపముగాక నీ-
బంటుకు బంట్లమై బదికేము నేము

చ. 1: పాతాళమునన్ను బలివాకిలి గాచేవు
దూతవై పాండవుల పొందున నుంటివి
యీతల యేలిక బంటు యీవరుస దప్పె నిఁక
చేతనే నిన్నుఁగొలువఁ జింతయ్యీ నిందుకే

చ. 2: పాండవులదూతవై పనిసేసితివి వారు
అండ నీదూతలయ్యేది అమరుఁగాక
నిండి గురు దైవమనే నియమము దప్పె నిదే
మెండు నీదాసులకెల్ల మేర మితి యేదయ్యా

చ. 3: పరగ నౌలే నీవు భక్తవత్సలుండ వౌదు
తిరమై యెరఁగకాడితిమి యిందాఁకాను
అరుదైన శ్రీవేంకటాద్రీశుఁడవు నీకు
సిరులనే శరణంటిఁ జేసినట్టు సేయవే

రేకు: 0339-01 మాళవశ్రీ సం: 04-226 విష్ణు కీర్తనం

పల్లవి: వేగిరించనేల విష్ణుఁడే యింతకుఁ గర్త
బాగుగా నాతనియిచ్చఁ బరగుటేకాక

చ. 1: తలపోఁతలేల దైవము గలుగఁగాను
చెలఁగి యాతఁడే యిన్నీఁ జేసీఁగాక
యిల నేఁడె పుట్టెనా యింకాఁ గలది గాదా
పలులోకాలు నడప భారము దేవునిదే

చ. 2: చింత లిఁకనేలా శ్రీపతి గలుగఁగాను
మంతుకుఁ బుట్టించి తానే మనుపుఁగాక
వింతా యీ దేహము వేరా యీ యింద్రియాలు
యింతట బ్రహ్మాండనాథుఁ డిందరికి నొకఁడే

చ. 3: సిలుఁగు గోరికలేల శ్రీవేంకటేశ్వరుఁడు
కలఁ డాతఁడే మనలఁ గాచీఁగాక
వెలసి యాతనిమాయే విశ్వమింతా నిండినది
తెలిపి రక్షించుటకు దిక్కు దెస యితఁడే

రేకు: 0339-02 వరాళి సం: 04-227 వైరాగ్య చింత

పల్లవి: అటు గొన్నాళ్లందాఁక యిటు గొన్నాళ్లిందాఁక
కటకటా శునకపు గతి యాయఁ గావవే

చ. 1: పసిమిఁ బాపమనేటి బందెలు మేసితిని
కసరి దేహపు కట్టుగాడి నుంటిని
కొసరి కర్మపుమెడగుదియ మోఁచితిని
పసురమువంటివాఁడఁ బాలించవే

చ. 2: పంచేంద్రియములనే బాడిగె మోఁచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి
పంచల నాసలచేత బందమ వెట్టించుకొంటి
ముంచినగుఱ్ఱమువంటి మూఢుఁడఁ గావవే

చ. 3: మరిగి `యజ్ఞాన'మనేమద మెత్తి తిరిగితి
`మరుఁ 'డనే మావటీని మాయఁ జిక్కితి
గరిమ శ్రీవేంకటేశ కరిఁ గాచితివిగాన
కరి నైతి నన్ను నీవు కరుణించవే

రేకు: 0339-03 దేసి సం: 04-228 మనసా

పల్లవి: లోకమింతా నిండె లోచూపు వెలిచూపు
శ్రీకాంతుఁడై తోఁచె చిక్కినవి యాలా

చ. 1: సకలజీవులలోన సర్వేశ్వరుఁడు వాఁడె
వొకరి నొఁగాదన నోపను నేను
అకట యాతనిచేఁతే అందరునుఁ జేసేవారే
వికటాలెందుకు నాడ వెరపయ్యీ నాకు

చ. 2: భువియందు దివి యందు పురుషోత్తముఁడు వాఁడె
వివరించ మేలు గీడు వెదక నే నోప
చెవి విన్న మాటలెల్ల శ్రీపతియై తోఁచీని
ఇవల కల్లనిజాలు యెంచఁజాల నేను

చ. 3: పగటందు రేయందు పరమాత్ముఁడు వీఁడె
తగిలి పాసే నన్న తలఁపునోప
జిగి మించ నాలోన శ్రీవేంకటేశుఁడే
బగివాయఁ డెన్నఁడును బదుకవో మనసా

రేకు: 0339-04 లలిత సం: 04-229 నామ సంకీర్తన

పల్లవి: వర్ణాశ్రమములాల వడిఁ జిత్రగుప్తులాల
వర్ణించి మమ్మిఁకఁ దడవకురో మీరు

చ. 1: చదువులు దెచ్చినట్టి సర్వేశుఁ గొలిచితి
చదువు నామారతఁడు చదివీఁ బోరో
అదన యోగీంద్రవంద్యుఁడైన కృష్ణుఁ గొలిచితి
చదల నాయోగములు సాధించు నతఁడే

చ. 2: కూరిమి యజ్ఞకర్తైనగోవిందుఁ దలఁచితి
చేరి నామారతఁ డవి సేసీఁ బోరో
ఆరయ విజ్ఞానమూర్తియైన హరి శరణంటి
వూరకె నాకాతఁడవి వుత్తరువిచ్చీని

చ. 3: దేవతాశిఖామణియైన దేవునిఁ బూజించితిని
దేవఋషిఋణములు తీరిచీఁబోరో
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
చేవఁ బాపాలెల్లఁ బాసె సెలవిచ్చెఁ జేఁతలు

రేకు: 0339-05 దేశాక్షి సం: 04-230 నామ సంకీర్తన

పల్లవి: ఊరకే నోరుమూసుక వొంటి నీకు మొక్కేమయ్య
చేరి నారాయణ నీవు చేసినట్టు సేయవే

చ. 1: హరినామముఁ దలఁచి అణఁచేనంటేనయ్య
సరి నా పాతకములు చాల వందుకు
నరహరినామ మెంచి నాకుఁ గూడపెట్టేనంటే
అరుదైన పుణ్యములు అన్నిలేవు భూమిని

చ. 2: రామనామము నొడిగి రవ్వల బోఁజోఁపే నంటే
తామసపునరకాలు దగ్గరవందు
వామననామమెంచి వరస్వర్గ మెక్కేనంటే
యేమిటా నాకడ వారికెడచా దదియు

చ. 3: గోవిందనామముచేతఁ గుదించే భవములంటే
పావనమాయను నీభక్తివల్లను
శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి
యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము

రేకు: 0339-06 బౌళిరామక్రియ సం: 04-231 వైష్ణవ భక్తి

పల్లవి: జ్ఞానంబొకటే జగమున కధికం మరి
నానావిధములు నటనలు

చ. 1: బహుదానఫలము పడయుటకంటే
యిహమున వైరాగ్య మెక్కుడు
సహజకర్మములు శతములకంటే
అహిశయనుని భక్తధికము

చ. 2: ధరఁ దపములనంతంబులకంటే
గరిమల శాంతము ఘనము
విరసాచారము వేవేలకంటే
హరినామపఠన మధికము

చ. 3: ఆవల వ్రతములు అన్నిటికంటే
శ్రీవైష్ణవమే శేఖరము
శ్రీవేంకటేశ్వరుచేఁతలె యివిగన
సేవ యిదొకటే చింతింప ఘనము

రేకు: 0340-01 మంగళకౌశిక సం: 04-232 భక్తి

పల్లవి: మమ్ముఁజూడనేల నీమహిమే చూతువుగాక
వుమ్మడిఁ బరుస మంటే దొక్కమాఁటేకాదా

చ. 1: పెక్కుమారులు నిన్నుఁ బేరుకొని జపించఁగ
మక్కళించి నీకుఁ గొంత మహిమెక్కీనా
వొక్కమారు జపించి నే నూరకుండినంతలోనే
తక్కక నీమహిమలోఁ దరగి పోయీనా

చ. 2: తగిలి నేఁ గాలమెల్ల ధ్యానము సేయఁగ నీకు
జిగి నీమేనికిఁ గింత చేవ యెక్కీనా
అగపడి యొకవేళ నటు దలఁచి మానితే
చిగురై యంతటిలోనె చిక్కి వాడీనా

చ. 3: యిన్ని యాల శ్రీవేంకటేశ మాయింటిలోననే
వున్నతి నీవారమని వుంటేఁ జాలు
సన్నము దొడ్డెంచనేల సరివలసీచోట
అన్నియు నిత్యమింతే యలమట కోపము

రేకు: 0340-02 మాళవి సం: 04-233 అంత్యప్రాస

పల్లవి: ఇదిగో రూపై తోఁచీ యిందరియెదుట నివి
మది( జేపట్టేదిలేక మానెఁగాని

చ. 1: కోపమై పొడచూపుఁ గొంత పాపము
దీపమై పొడచూపు దేహ పాపము
మాపులు నిద్దురై చూపు మరికొంత పాపము
కైపుగాఁ బరుల నింద కడమ పాపము

చ. 2: శాంతమే పుణ్యము సత్యదయే పుణ్యము
అంతటాను హరిభక్తి యది పుణ్యము
చింతించ వైరాగ్యమే చేతిలోని పుణ్యము
మంతనపుజ్ఞానమే మహిఁగల పుణ్యము

చ. 3: హరినామమే ముక్తి యరసి కైకొంటేను
ధర నాతనిదాస్యమే తగిన ముక్తి
సొరిది శ్రీవేంకటేశుఁడే పరతత్త్వము
యిరవై కొలుచుటే యిహ నిత్యముక్తి

రేకు: 0340-03 పాడి సం: 04-234 కృష్ణ

పల్లవి: అనుచుఁ బొగడఁ జొచ్చెరదె బ్రహ్మాదులు మింట
మొనసి యీ బాలునికే మొక్కేము నేము

చ. 1: వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు
అన్నువ నీ దేవకిగర్భమందు వుట్టెను
మన్నించి యోగీంద్రులమదిలోనుండెడువాఁడు
పన్నిన పొత్తులలోన బాలుఁడై వున్నాఁడు

చ. 2: పాలజలధిలోన పాయనిగోవిందుఁడు
పాలు వెన్న లారగించె పైఁడికోరను
వోలిఁ దన విష్ణుమాయ నోలలాడినట్టివాఁడు
చాలి మంత్రసానులచే జలకమాడీని

చ. 3: ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు
తగుబలభద్రునికి తమ్ముఁడాయను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి
యెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడే

రేకు: 0340-04 శుద్ధవంతం సం: 04-235 భక్తి

పల్లవి: హరిపూజే బ్రహ్మాండ మవ్వలి కవ్వలగాని
యెరవెల్లా నాసందికీసందివే

చ. 1: తపములు జపములు దానధర్మములెల్ల
యెపుడును బ్రహ్మలోక మీసందివే
విపరీతభోగాలు వెలలేనిపుణ్యాలు
కపురులు స్వర్గలోకముకాడివే

చ. 2: వట్టి సటరాజసాలు వర్ణాశ్రమములును
పుట్టుగులిన్నియును యీభూమిమీఁదివే
చుట్టపు సంబంధాలు జోలి వావివర్తనలు
దిట్టతనములెల్ల యీదేహముతోడివే

చ. 3: పూఁటపూఁటకోరికలు పొరలేవుపాయాలు
మాఁటలుఁదేటలునెల్ల మతిలోనివే
గాఁటపు శ్రీవేంకటేశుగని కొలిచినఁజాలు
నాఁటకపు మతములు నవ్వులలోనివే

రేకు: 0340-05 హిందోళం సం: 04-236 నామ సంకీర్తన

పల్లవి: ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు

చ. 1: నగధర నందగోప నరసింహ వామన
జగదేకపతియనే జపము మాది
తగు హరిడింగరీఁడ దాసుఁడ బంటననేటి-
మిగులఁ బెద్దతనము మించేది మాకు

చ. 2: హరి పుండరీకాక్ష ఆదినారాయణయనేటి-
ధర నామమంత్రములే ధనము మాకు
సరుస శంఖచక్రాలు సర్వేశుదాసుల సేవె
మరిగినదె మామతమును మనికె

చ. 3: శ్రీవేంకటేశయని శేషగిరివేదాద్రి
భావించి కొలుచుటే మాబ్రదుకెల్లను
కైవల్యమిదియె కంటి మిట్టి మంచిత్రోవ
పావనమైతిమి మమ్ముఁ బాలించె నితఁడు

రేకు: 0340-06 శంకరాభరణం సం: 04-237 కృష్ణ

పల్లవి: ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ
గాఁటపు దేవతలెల్లఁ గాచుకున్నా రితని

చ. 1: చెక్కుమీఁటి పాలువోయి చేరి నోరు దెరచితే
పక్కననుఁ బొడచూపె బ్రహ్మాండాలు
అక్కున నలముకొంటే నంగజతాపము మోఁచె
మక్కువకు వెరతుము మాయపు బాలునికి

చ. 2: పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగుదోఁచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకొన్న వేకమై యెవ్వరికి వసగాఁడు
హత్తిచూడ వెరతు మీ యారడిబాలునికి

చ. 3: తేఱి వీనితోడిముద్దు దేవలోకము పనులు
మీఱి యేవి చూచినాను మితిలేనివి
ఆఱడిగొల్లెతలము అట్టె కూడి యాడితిమి
వేఱు సేయ వెరతు శ్రీవేంకటాద్రిబాలుని

రేకు: 0341-01 భూపాళం సం: 04-238 విష్ణు కీర్తనం

పల్లవి: కన్నవారివద్ద నెల్లఁగావంగ నేమిగద్దు
యిన్నిటికి నియ్యఁగొన నీతఁడే స్వతంత్రుఁడు

చ. 1: పరిమేష్ఠిగన్నతండ్రిఁ బాటించి కొలువరో
అరుదై లోకాలకెల్ల నతఁడే తండ్రి
సిరిమగఁడైనవానిఁ జేపట్టి తలఁచరో
సిరులిచ్చేమేఁటిదాత సృష్టికెల్ల నతఁడే

చ. 2: అంబరీషుఁ గావఁ జక్రమంపినవానిఁ జేరరో
అంబుజభవాండాన కతఁడే రక్ష
పంబిన భూకాంతపతిఁ బాయక సేవించరో
వుంబళ్లు వూళ్లు నిచ్చేవున్నతుఁడు నతఁడే

చ. 3: మూలమంటేఁ గరిఁగాచేముఖ్యునికి మొక్కరో
మూలధనమైయుండీ ముందర నిట్టె
యీలీలఁ జిత్తజుతండ్రి నెదలోనఁ గొలువరో
పాలించ శ్రీవేంకటాద్రిపతియాయ నితఁడే

రేకు: 0341-02 లలిత సం: 04-239 విష్ణు కీర్తనం

పల్లవి: తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని
యెల్లసందేహాలు బాసె నిఁకనేల చింత

చ. 1: నారదుఁడు సోదించి నారాయణు నెరిఁగె
సారెకు శివుఁ డెరిఁగి చాటె రాముని
చేరి సోదించెఁ బార్వతి శ్రీరామచంద్రుని
యేరీతుల సోదించేము యింతకంటె నేము

చ. 2: వేదవ్యాసులు దెలిసే వెదకి విష్ణునిఁ జెప్పె
సాదించితని యోగిసనకాదులు
యీదెస శుకాదులెల్ల నెరిఁగిరి మాధవుని
కాదని వీరికంటె గతి గానఁగలమా

చ. 3: పెక్కుగాలము చదివి పెక్కేండ్లుబదికి
పెక్కు రుషులిందుననె పెద్దలైరి
దక్కఁగ శ్రీవేంకటేశు ధనముగాఁ జూపి రిదె
తక్కక కొలిచితిమి దైవమని కంటిమి

రేకు: 0341-03 కౌశి సం: 04-240 విష్ణు కీర్తనం

పల్లవి: నీవంటిదైవాలు వేరీ నిఖిలలోకములందు
యీవల నావల నెందు నెంచి చూడ మాకును

చ. 1: తగిలి నీమోముచక్కఁదన మెంచి చూచితిమా
తగిన మరునిఁగన్న తండ్రివి నీవు
అగపడ్డనీగుణము లవి యెంచిచూచితిమా
నిగిడి కల్యాణగుణనిధివనీ శ్రుతులు

చ. 2: గుట్టు నీపెద్దతనము కులమెంచిచూచితిమా
అట్టె బ్రహ్మకులము నీయందుఁ బుట్టెను
దట్టపు నీపనులవర్తన మెంచి చూచితిమా
ముట్టి సర్వరక్షకత్వమున వెలసితివి

చ. 3: బెడిదమైననీబిరు దెంచిచూచితిమా
వడి శరణాగతవత్సలుఁడవు
కడఁగి శ్రీవేంకటేశ కంటిమి నీమహిమలు
బడి నిన్నే సేవించి బ్రదికితి మిదివో

రేకు: 0341-04 మంగళకౌశి (క) సం: 04-241శరణాగతి

పల్లవి: నీవనేనమ్మినయట్టినీవారము
వేవేలువిధాలఁ జేసే విన్నపమిదయ్యా

చ. 1: పండెనుమాకర్మములు పాలు గోరు గొనవయ్య
అండనె నామతిలోని అంతర్యామి
నిండెనునాకోరికలు నినుపువారిధులై
వెండిబంగారాలతోడ విఱవీఁగవయ్యా

చ. 2: మలసె మాపుట్టుగులు మారుమూలసరకులై
కలసుంకము దీరుచు కరుణాకర
వెలసె సంసారాలు వెక్కసపుఁ బౌఁజులై
తొలఁగక యిటు నీవు తోడుచూడవయ్యా

చ. 3: కూడెను మానుతులనే గోకులపుఁ గదుపులు
యీడుగాఁ బుల్లరి గొని యేలవయ్యా
వోడక శ్రీవేంకటేశ వొప్పగించితిమి నీకు
వేడుకలు దైవార విహరించవయ్యా

రేకు: 0341-05 నాగవరాళి సం: 04-242 వైరాగ్య చింత

పల్లవి: వెగ్గల మింతా వృథా వృథా
తగ్గి పరులతో దైన్యములేలా

చ. 1: పెంచఁగబెంచఁగఁ బెరగీ నాసలు
తుంచఁగఁదుంచఁగఁ దొలఁగు నవి
కంచముకూడును కట్టినకోకయు
వంచనమేనికి వలసినదింతే

చ. 2: తడవఁగఁదడవఁగఁ దగిలీబంధము
విడుఁవగఁ విడువఁగ వీడునవి (ది?)
గుడిశలోన నొకకుక్కి మంచమున
వొడలు సగమునను వుండెడిదింతే

చ. 3: మరవఁగమరవఁగ మాయలే యింతా
మురహరుఁదలచితే మోక్షము
నిరతి శ్రీవేంకటనిలయుఁడే కాయపు-
గరిమెల నిలిచిన కాణా చింతే

రేకు: 0341-06 శుద్ధవసంతం సం: 04-243 విష్ణు కీర్తనం

పల్లవి: హరి నీవు లేవా అన్నిచోట్లను తొల్లి
అరయ నీదాసులే యరు దింతేకాక

చ. 1: కంటిమినీదాసులను కన్నులపండుగగాను
కొంటిమి పాదతీర్థము కొల్లలుగాను
వింటిమి నీనామములను వీనులపండుగగాను
అంటిన మోక్షముత్రోవ అడుగనేమిటికి

చ. 2: నుతించి మాటాడితిమి నోరార నీదాసులను
మతిఁజొక్కితిమి దాస్యమహిమచేత
మతిగంటిమి వారిసంగతి కూటములవల్ల
వెతకి విజ్ఞానము వేఁడనేమిటికి

చ. 3: మొక్కితిఁ జాగిల నీమోహపు దాసులకును
యెక్కితిఁ బరమపదమిహమందునే
తక్కక మన్నించిరి నీదాసులె నన్నన్నిటాను
గక్కన శ్రీవేంకటేశ కడమ లేమిటికి

రేకు: 0342-01 సాళంగం సం: 04-244 శరణాగతి

పల్లవి: హరివల్ల కడమలే దంతనంత నున్నవాఁడు
గరిమఁ గాననివారికల్ల యింతే సుండీ

చ. 1: లోనఁ హరిఁ దలచితే లోపలందె పొడచూపు
పూని వెలిఁ దలచితే భూమినల్లాఁ బొడచూపు
తానే యిందరిలోన దైవమయి వున్నవాఁడు
కానకవుండినవారికల్ల యింతే సుండీ

చ. 2: పట్టి విచారించుకొంటేఁ బ్రాణముతోఁ బొడచూపు
జట్టిఁదనదండనల్లా సంసారమై చూపు
పట్టపగలై వున్నాఁడు బాయట నెందు చూచిన
గట్టిగా గాననివారికల్ల యింతే సుండీ

చ. 3: శరణముచొచ్చితేనె చేతిలోనే వున్నవాఁడు
పరమభాగవతులపలుకులో నున్నవాఁడు
యిరవుగ శ్రీవేంకటేశుఁడెదుటనే వున్నాఁ డతని-
కరుణ గాననివారికల్ల యింతే సుండీ

రేకు: 0342-02 ఆహిరి సం: 04-245 వైష్ణవ భక్తి

పల్లవి: మాకు నేమీఁ బనిగాదు మరి యేమిగలిగినా
శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల

చ. 1: ధరణీశుపనులకుఁ దగు బందె లేదట
హరిదాసులకుఁ బాపమంటునా మరి
సరిఁ జక్రపుడాగు లిచ్చుటఁ జూచుకోరో మీరు
అరసి మీఁదటిమాట లాతని నడుగరో

చ. 2: లావరిమన్ననపాత్రులకు వెట్టి లేదట
కావింప వైష్ణవులకుఁ గర్మమున్నదా
దేవునిలాంచన మిదె తిరుమణి చూచుకోరో
ఆవల నేమిగల్లాను ఆతని నడుగరో

చ. 3: సతి రాణివాసమైతే జాతికులమెంచరట
హితశరణాగతులకేది జాతి
తతి శ్రీవేంకటపతిదాస్య మిది చూచుకోరో
యితవై మరేమిగల్లా నీతని నడుగరో

రేకు: 0342-03 లలిత సం: 04-246 శరణాగతి

పల్లవి: ఎంచి చూచితే మాకు నిందే నిత్యసుఖము
కొంచి యనుమానమైతే కొనదాఁకా లేదు

చ. 1: హరి నీగర్భములోన నంగమయి వున్నారము
యిరవై వేరేమోక్ష మెంచ నున్నదా
నిరతిఁ జూచినవెల్లా నీరూపులే మాకు
ధరలోన నింతకంటె ధ్యానమున్నదా

చ. 2: అంతరాత్మవైన నిన్నే యాతుమకు నిచ్చితిని
యింతకంటె నే నడిగేది యిఁకనున్నదా
పొంతనే భూకాంత పుట్టిన నెలవు మాకు
యింతకంటె తల్లిదండ్రు లిఁకనున్నారా

చ. 3: పొరి నెరుకే జ్ఞానము పొంచి మరపే సమాధి
సొరిది నేఁడింతకంటే సుఖమున్నదా
గరిమ శ్రీవేంకటేశ కల్పితమింతా నీదె
శరణంటే యింకా విచారమున్నదా

రేకు: 0342-04 శుద్ధవంతం సం: 04-247 వైరాగ్య చింత

పల్లవి: దైవమా నీచేఁతలు తప్పదు మా రోఁతలు
యేవలఁ జూచిన బాయ దేమందమయ్యా

చ. 1: కాయములో హేయమదె కమ్మఁబూఁత మీఁద నదె
రోయదు చిత్తమునకు రుచియే తోఁచీ
మాయలనే పొరలేది మాఁటలనే విసిగేది
యేయెడఁ గనీ గాన మేమందమయ్యా

చ. 2: పుట్టుగది యెంగిలి పూఁచిన దాచారము
గుట్టు చెడదందునాను గుణమే తోఁచీ
వట్టియాసఁ బొరలేది వంతఁ బడి తిరిగేది
యెట్టు వేగించఁగవచ్చు నేమందమయ్యా

చ. 3: నిక్కిచూచితే నెరుక నిద్దిరించితే మరపు
మక్కళించినబదుకు మంచిదై తోఁచీ
మిక్కిలి శ్రీవేంకటేశ మీకు నేను శరణంటే
యెక్కువాయ నాపదవి యేమందమయ్యా

రేకు: 0342-05 శ్రీరాగం సం: 04-248 మాయ

పల్లవి: అటమీఁదిపనులకు హరి నీవే కలవు
సటలైన నిజమైనా జరపేముగాక

చ. 1: పరమాత్మ నీమాయఁ బాయగ నే నెంతవాఁడ
దొరయైతే రాజాజ్ఞ దోయవచ్చునా
తొరలిన యింద్రియాలఁ దోసిపోవ నెట్టువచ్చు
సిరుల నేలికపంపు సేయు టింతేకాక

చ. 2: శ్రీపతి యీసంసారము సేయకుండ నెంతవాఁడ
మాపుదాఁకా రాచవెట్టి మానవచ్చునా
పాపపుణ్యము లొల్లక పరగ నాకెట్టు వచ్చు
తేపఁ దల్లి వుగ్గువెట్టఁ దినకుండవచ్చునా

చ. 3: దేవ నీవిచ్చినమేను తెగి రోయ నెంతవాఁడ
కావించి రాచయీవికిఁ గడమున్నదా
శ్రీవేంకటేశ నీచిత్తములోవాఁడ నింతే
యేవిధిఁ బెట్టినా నేనియ్యకొంటగాక

రేకు: 0342-06 భైరవి సం: 04-249 కృష్ణ

పల్లవి: అనుచు మునులు ఋషు లంతనింత నాడఁగాను
వినియు విననియట్టె వీడె యాడీఁగాని

చ. 1: ముకుందుఁ డితఁడు మురహరుఁ డితఁడు
అకటా నందునికొడుకాయఁగాని
శకుంతగమనుఁ డితడు సర్వేశుఁ డితఁడు
వెకలి రేపల్లెవీధి విహరించీఁగాని

చ. 2: వేదమూరితి ఇతఁడు విష్ణుదేవుఁ డితఁడు
కాదనలేక పసులఁ గాచీఁగాని
ఆదిమూల మితఁడు యమరవంద్యుఁ డితఁడు
గాదిలిచేఁతల రోలఁ గట్టువడెఁగాని

చ. 3: పరమాత్ముఁ డితఁడే బాలుఁడై వున్నాఁడుగాని
హరి యీతఁడే వెన్నముచ్చాయఁగాని
పరగ శ్రీవేంకటాద్రిపతియును నీతఁడె
తిరమై గొల్లెతలచేఁ దిట్టువడీఁగాని

రేకు: 0343-01 మలహరి సం: 04-250 భక్తి

పల్లవి: మానరో వో లోకులాల మాకు మీకు నేమి దోడు
నాఁటికిఁక మీకు నవ్వుఁబాటు నేము

చ. 1: యిరవై నానోటికి యెన్నెన్ని చదివిన
హరియనేయంతరుచి అందు లేదు
గరిమ నెన్నిరూపులు కన్నుల నేఁ జూచినాను
పురుషోత్తముఁ జూచినపూర్తి యందు లేదు

చ. 2: యెచ్చోట నుండినాను యిందిరేశుమందిరము
చొచ్చి యుండేసుఖ మంత చొప్పడ దందు
కచ్చుపెట్టి వీనులకుఁ గతలెన్ని విన్నాను
అచ్చుతుకీర్తన వినేయందు సరి రాదు

చ. 3: కైపుగాఁగ కన్నవారికాళ్ళకు మొక్కినాను
శ్రీపతికిమొక్కినంత సెలవు గాదు
యేపున శ్రీవేంకటేశు నిటులఁ బూజించినట్టు
మాపుదాఁకా నితరుల మనసురాదు

రేకు: 0343-02 దేవగాంధారి సం: 04-251 విష్ణు కీర్తనం

పల్లవి: పట్టిన ముట్టనుండరు పదరుదు రంతలోనే
యెట్టనెదుటిమిమ్ము నెరిఁగీ నెరఁగరు

చ. 1: గుక్కక మూఁడులోకాలు గొలిచితివని నీకు
మొక్కుదురు; పరులకు మొక్కకుండరు
అక్కరదీర శ్రీపతివని నిన్ను వేఁడుదురు
వెక్కసపుఁ దైవాల వేఁడుకోక మానరు

చ. 2: కందువ బ్రహ్మగన్నట్టి ఘనుఁడవు నీవార-
మందురు; పరులవారమనకుండరు
అంది వేదాలు దెచ్చేయాతఁడవు నీవే యని
యెందు నెంచి, పరులను యెంచకుండరు

చ. 3: యిత్తల నారదాదుల కేలికని నీమరఁగు
చొత్తురు; పరులమాఁటు చొర కుండరు
అత్తిన శ్రీవేంకటేశ యన్నియు నీమాయలింతే
యెత్తిన వెఱ్ఱులు లోకులిట్టే భ్రమతురు

రేకు: 0343-03 లలిత సం: 04-252 శరణాగతి

పల్లవి: ఇంక నేమిసేసేము యిన్నిటాఁ దనిసితిమి
సంకెలెల్లాఁ దీరెఁ దీరె చాలుఁజాలుఁ గర్మము

చ. 1: కోరి పుణ్యము లేమైనాఁ గొన్ని సేసేమంటిమా
కోరిక లిచ్చేటి హరి కూడి మాలోనున్నాఁడు
చేరఁ జోటువెదకి పొంచి తిరిగేమంటిమా
చేరేటివైకుంఠపతి చేతిలో నున్నాఁడు

చ. 2: భవహరముగ వేదపఠన సేసేమంటే
భవహరమగుహరిపాటలు నోట నున్నవి
తవిలి సంపదలకై దానమిచ్చేమంటిమా
భువిలోన శ్రీపతి మాపూజలో నున్నాఁడు

చ. 3: యిహసుఖములకుఁగా యిందరి వేఁడేమంటే
యిహమిచ్చేశ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు
సహజమయినయట్టిసర్వేశఁ డీతడే
మహిమలన్నియుఁ దానె మాకు నిచ్చినాఁడు

రేకు: 0343-04 ధన్నాసి సం: 04-253 మాయ

పల్లవి: నీవే దయసేసి నేఁడు మమ్ముఁ గాతుగాక
శ్రీవల్లభుఁడ నీకు సేవ సేసే వారమా

చ. 1: యిదిపుణ్య మిది పాప మెట్టని తెలిసేమయ్య
అదన నన్నపు నామే యన్నువట్టెను
యిదెదైవ మిదెగురుఁ డెట్టని యెఱఁగేమయ్య
మొదల నానాయోనిముట్టంటువారము

చ. 2: ఆచారమేది యిఁక ననాచారమేదయ్య
కాచినయాఁకటికరిగాపులము
యేచినబంద మిది మోక్ష మిది యనలేమయ్య
పూచినపంచేంద్రియాలపారుగైతి మిదివో

చ. 3: ముంద రిది వెన కిది ముట్టి యేమనెంచేమయ్య
కందువసంసారపుగర్వ మెక్కెను
అందపు శ్రీవేంకటేశ యన్నియు నీమాయ లివి
పొంది నీకొప్పనసేసి భోగించేమయ్య

రేకు: 0343-05 పళవంజరం సం: 04-254 మాయ

పల్లవి: హరినే యడుగరో ఆమాఁట
సరుగ నిందరికి సర్వేశ్వరుఁడు

చ. 1: కామముఁ గ్రోధము కాయపు గుణములు
నేమపుటాత్మకు నిందేది
గామిడి మాయే కర్త యిందుకును
సోమరి మమ్మంటఁ జోటేది

చ. 2: పాపముఁ బుణ్యము భావవికారము
పైపై నాత్మకుఁ బనిలేదు
శ్రీపతి పంపిటు సేసితి మింతే
తాప మమ్ముఁ దగులఁ దగవేది

చ. 3: కాయముఁ బ్రాయము కర్మపు గుణములు
సేయని యాత్మకు సెలవేది
యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి
చాయల నితనికి శరణంటిమి

రేకు: 0343-06 నాదరామక్రియ సం: 04-255 దశావతారములు

పల్లవి: కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక
కలఁడన్న వారిపాలఁ గలిగిన దైవము

చ. 1: యిచ్చెను సంపద లితఁడింద్రాదులకునెల్ల
యిచ్చెను శుకాదుల కిహపరాలు
యిచ్చెను వాయుజునికి యిటమీఁద బ్రహ్మపట్ట-
మిచ్చల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము

చ. 2: కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద
కట్టె విభీషణుకు లంకారాజ్యము
కట్టియిచ్చె నజునికి గతచన్నవేదాలు
కట్టెను శ్రీసతిచేత గంకణసూత్రములు

చ. 3: పెట్టెను దేవతలకు పేరినమృతపువిందు
వెట్టెను భక్తవత్సలబిరు దితఁడు
యిట్టె శ్రీవేంకటాద్రి నిందరికిఁ బొడచూపి
పెట్టెఁ దనపస్రాదము పృథివి జీవులకు

రేకు: 0344-01 దేసాళం సం: 04-256 నామ సంకీర్తన

పల్లవి: ఎదురేది యింక మాకు యెందు చూచినను నీ-
పదము లివి రెండు సంపదలు సౌఖ్యములు

చ. 1: గోపికానాథ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మథా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీపాదములే మాకు నిధినిధానములు

చ. 2: పురుషోత్తమా హరీ భువనపరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుందరక్షకా
ధరణి నీపాదములె తల్లియును దండ్రి

చ. 3: దేవకీనందనా దేవేంద్రవందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీపాదములె గతి యిహముఁ బరము

రేకు: 0344-02 గౌళ సం: 04-257 మాయ

పల్లవి: బాపురే నీమాయ భమ్రయించీ జీవులకు
దాపున నున్నదేకాని దవ్వలకుఁ జొరదు

చ. 1: మోక్షమురుచి గానదు ముందర నుండఁగాను
సాక్షియై జగమిది చవి చూపఁగా
దీక్షకుఁ జొరదు మరి దేవ నీపై భక్తి లేదు
దక్షులై యాలుబిడ్డలు దండనుండఁగాను

చ. 2: జ్ఞానమితవు గాదు సంగడి నుండదుగాన
నానాయోనులమేను ననిచుండఁగా
ఆనకమై వైరాగ్యమంట దలవాటులేక
కానఁబడ కర్మములు గాసిఁ బెట్టఁగాను

చ. 3: మంచిదని నీ తిరుమంత్రము దలఁచుకోదు
పంచేంద్రియములాత్మ బలిశుండఁగా
యెంచుకొని శ్రీవేంకటేశ నీకే శరణని
అంచల నీదాసులైతే నన్నిటా గెలిచిరి

రేకు: 0344-03 పళవంజరం సం: 04-258 కృష్ణ

పల్లవి: వెఱపించబోయి తానె వెఱచెఁ దల్లి యశోద
మఱచి యీబాలు నెట్టు మానిసెంటా నుండెనో

చ. 1: వెంట రాకుమని కృష్ణు వెరపించి యశోద
వొంటి మందలో గొంగ వున్నాఁడనె
అంటి గొంగ యెందునున్నాఁడని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను

చ. 2: చందమామఁ బాడి తల్లి సరిఁ బొత్తుకు రమ్మంటే
చందురుఁ జూచి కృష్ణుఁడు సన్నసేసెను
ముందరఁ జంద్రుఁడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యంటినో యని ముంచి వెరగందెను

చ. 3: పాలార్చి తొట్టెలలోఁ బండఁబెట్టి యశోద
నీలవర్ణుఁ దొంగిచూచె నిద్దురో యని
వోలి శంఖచక్రాలతో నురము శ్రీసతితోడ
యీలీల శ్రీవేంకటేశుఁడై యున్నాఁడు

రేకు: 0344-04 గుజ్జరి సం: 04-259 వైష్ణవ భక్తి

పల్లవి: ఏమన వచ్చును చెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు గొన్ని
శ్రీమాధవ నీ చిత్తము కొలఁదిఁక చెప్పెడిదేఁటికి జీవులకు

చ. 1: కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు మిముఁ దలఁచనివారిది నేరమి
కలుషమెడలి సూర్యోదయమైనా కానవుకొన్నిజంతువులు
తెలిసినవారలు కందురు యీతెరఁగలు రెంటికి దినమొకటే

చ. 2: శరణాగతరక్షణచతుర సర్వాంతరాత్మక యచ్యుత
సరి నిన్నుఁ గొలిచినవారిది పుణ్యము చలమున మానుటే పాపము
సరుగనఁ గాచేటి చల్లని చంద్రుఁడు జారచోరులకుఁ గడు వేఁడి
అరయఁగఁ గలువలకును హితుఁడు అందుకు నిందుకు గురి యితఁడే

చ. 3: శ్రీవేంకటగిరినిలయ శ్రీసతీశ పురుషోత్తమ
మివొద్దనుండితే వైకుంఠము మిమ్ము నెడసితే నరకము
భావములోపల నీవే వుండఁగ భక్తి లేదు కొందరికైతే
శ్రీవైష్ణవులకు నిత్యము యీ చింతలు రెంటికి నీ మహిమే

రేకు: 0344-05 దేసి సం: 04-260 గురు వందన, వైష్ణవ భక్తి

పల్లవి: అజ్ఞానులకివి యరుహము లింతే
సుజ్ఞానులకివి చొరనేలయ్యా

చ. 1: దైవమునమ్మినదాసులకు
కావింపఁగ మరి కర్మము లేదు
దావతిజలనిధి దాఁటినవారికి
వోవల మరియును వోడేలయ్య

చ. 2: గురుకృప గలిగిన గుణనిధికి
అరయఁ బాపపుణ్యము మరి లేదు
విరసపుఁ జీఁకటి వెడలినవారికి
పరగ మరియు దీపంబేలయ్య

చ. 3: జగములెరుఁగు వైష్ణవులకును
తగిలెటి యపరాధంబులు లేవు
అగపడి శ్రీవేంకటాధిపుఁ గొలిచితే
యెగువ దిగువ మాకెదురేదయ్య

రేకు: 0344-06 బౌళి సం: 04-261 వేంకటగానం

పల్లవి: హరి సర్వాత్మకు డాదిమపురుషుఁడు
పొరి నెరుఁగువారి పుణ్యముగాన

చ. 1: నాలుకకొననే నారాయణుఁడిదె
వైళము దలఁచనివారిదె పాపము
నేలయు మిన్నును నిజవైకుంఠము
పోలించి చూడని పురుషుల వెలితి

చ. 2: మనసులోననే మాధవుఁడున్నాఁడు
కనుఁగొనని వారికడ మింతే
తనువే విష్ణుని తత్వసాధనము
వొనరఁగ శ్రీపతి యున్నాఁడుగాన

చ. 3: చేరువ నిదివో శ్రీవేంకటపతి
ధారుణిఁ గొలిచేటి దాసులభాగ్యము
కారణ మితఁడే కలిగినదైవము
కోరినవారల కొంగులపసిఁడి

రేకు: 0345-01 మేఘరంజి సం: 04-262 దశావతారములు

పల్లవి: అని బ్రహ్మాదులెంచేరు హరిబాలలీలలు
వెనక శుకాదులచే వింటిమి నేమిదివో

చ. 1: పొత్తులలోఁ బవ్వళించె పురుషోత్తముఁడు దొల్లి
హత్తి మఱ్ఱాకుపైఁ బండినటువలెనె
వొత్తగిలి బోరగిలి వుండఁజొచ్చెఁ గృష్ణుఁడు
తత్తరానఁ గూర్మావతారమైన గతిని

చ. 2: తప్పుటడుగులు వెట్టె తగఁ ద్రివిక్రముఁడై
గొప్పపాదాలను భూమి గొలచినట్టు
అప్పుడే కొదలు మాఁటలాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
తప్ప నసుర సతులఁ దగఁ బోధించినట్లు

చ. 3: అచ్చపు రేపల్లెలోన నాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
మెచ్చుల వైకుంఠాన మెరసినట్లు
నిచ్చలు శ్రీవేంకటాద్రినిలయుఁడై యున్నవాఁడు
అచ్చుగ జీవులలోన నాతుమైనయట్లు

రేకు: 0345-02 గుండక్రియ సం: 04-263 నృసింహ

పల్లవి: నరరూప ప్రహ్లాదనరసింహా
అవిరళతేజ ప్రహ్లాదనరసింహా

చ. 1: పగరపై కోపము బంటుఁజూచి మరచితి
నగుమొగము ప్రహ్లాదనరసింహా
యెగువ నీకోపమున కితఁడె మాఁటుమందు
అగపడె మాకును ప్రహ్లాదనరసింహా

చ. 2: అంటముట్టరానికోప మంగనఁ జూచిమానితి
నఁటుచెల్లుఁ బ్రహ్లాదనరసింహా
జంట నీ బుద్ది తిప్ప సతియె యంకుశము
అంటు వాయమిఁకను ప్రహ్లాదనరసింహా

చ. 3: ధర మొరవెట్ట దేవతలే మొక్కితే మానితి
గరుడాద్రిఁ బ్రహ్లాదనరసింహా
యిరవై శ్రీవేంకటాద్రి నిందు నందు నీదె సుద్ది
అరసితి మిదివో ప్రహ్లాదనరసింహా

రేకు: 0345-03 లలిత సం: 04-264 వైరాగ్య చింత

పల్లవి: ఏదాయ నేమి హరి యిచ్చినజన్మమే చాలు
ఆదినారాయణుఁడే యఖిలరక్షకుడు

చ. 1: శునకముబతుకును సుఖమయ్యే తోఁచుఁగాని
తన కది హీనమని తలఁచుకోదు
మనసొడఁబడితేను మంచిదేమి కానిదేమి
తనువులో నంతరాత్మ దైవమౌట దప్పదు

చ. 2: పురువుకుండేనెలవు భవనేశ్వరమై తోఁచు
పెరచోటి గుంతయైన ప్రియమైయుండు
యిరవై వుండితేఁజాలు యెగువేమి దిగువేమి
వరుస లోకములు "సర్వం విష్ణుమయ"ము

చ. 3: అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెరఁ దనతిమ్మటే జీవన్ముక్తి
కచ్చుపట్టి శ్రీ వేంకటపతిదాసుఁడైతే
హెచ్చుకుందేమిలేదు యేలినవాఁడితఁడే

రేకు: 0345-04 ఆహిరి సం: 04-265 శరణాగతి

పల్లవి: ఎందరి వెంటల నేఁగేము
చందపు హరి నీ శరణనియెదము

చ. 1: పెంచినఁబెరుఁగును పెక్కుబంధములు
తుంచినఁదునుఁగును దుఃఖములు
యెంచఁగనేటికి యింద్రియమహిమలు
చుంచుల హరి నీ సూత్రములివియే

చ. 2: పఱపినఁ బారును బహళపుటాసలు
తఱపినఁ దరగును తన మదము
వెఱవఁగనేఁటికి వెడకర్మములకు
కఱకులహరి నీ కల్పితమివియే

చ. 3: చేసినఁ జెలఁగును జిగి సంసారము
మూసిన ముణుఁగును మోహములు
యీసులఁ శ్రీవేంకటేశ్వర యివి నీ-
దాసులఁ దడవవు తగు నీమహిమ

రేకు: 0345-05 పాడి సం: 04-266 శరణాగతి

పల్లవి: కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ
యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి

చ. 1: మనసులోనికి గురి మాధవ నీ పాదాలు
తనువుపై గురి నీ సుదర్శనము
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు
పను లెన్నిగలిగినఁ బట్టకు నా నేరమి

చ. 2: చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు
నీతి నా నాలికగురి నీ నామము
కాతరపునుదుటికిఁ గల తిరుమణి గురి
పాతకపు నావలనఁ బట్టకుమీ నేరము

చ. 3: యిహపరాలకు గురి యీ నీ శరణాగతి
సహజ మాత్మకు గురి సంతతభక్తి
మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి
బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి

రేకు: 0345-06 నాదరామక్రియ సం: 04-267 అధ్యాత్మ

పల్లవి: దైవము దూరఁగనేల తమనేర్పు నేర మింతే
యీవలఁ దమకర్మము లెంచరు మనుజులు

చ. 1: మొల్లమి గాలియొకటే ముంచి తూరుపెత్తుచోట
పొల్లకట్టు కడఁబడె పోగువడె గట్టివెల్లా
వుల్లములో శ్రీహరి ఒకఁడై వుండునతని-
నొల్లరైరి యసురలు వొలిసిరి సురలు

చ. 2: మించిన జల్లి యొకటె మీఁదనుండు దొడ్డవెల్ల
చంచుల సన్నములెల్లా సందులఁ గారు
యెంచఁగ హరి యొకఁడే యెరఁగక కొందరైతే
కొంచమై రీతనిఁ గొల్చి కొందరైతె ఘనులు

చ. 3: కోవిలలుఁ గాకులును కోరి యొక్కరీతి నుండు
యీవల వసంతవేళ నేరుపడును
శ్రీవేంకటేశ్వరునిసేవకులు మనుజుల-
భావ మొకరీతి నుండు ఫలములే వేరు

రేకు: 0346-01 సాళంగనాట సం: 04-268 శరణాగతి

పల్లవి: అలబ్రహ్మాదుల కణఁగ దిది
గెలువఁగ వశమా కేశవ మాకు

చ. 1: పాపము మనసునఁ బారకమానదు
కోపము మానఁగఁగూడదు
యేపున దేహం బెన్నాళ్లు మోఁచెను
తీపుల యిది యా దేహపుగుణము

చ. 2: ఆఁకలిదీరదు యటు నానాఁటికి
కాఁకలు మానవు కాంత లేక
మాఁకువంటి జన్మము గలకాలము
చీఁకటి దేహపు చిత్తపుగుణము

చ. 3: నీవు వొసఁగినదె నిర్మలదేహము
నీవె నా నేర్పునేరములు
శ్రీవేంకటేశుఁడ జిగి నీ శరణని
దీవెనఁ బొందితి దేహపుగుణము

రేకు: 0346-02 కేదారగౌళ సం: 04-269 అద్వైతము

పల్లవి: మీ మతము పరిభాష మీవల్లనే పుట్టెఁగాక
యేమునులైనాఁ దొల్లి యెంచిరా యీమాఁట

చ. 1: ముడిగి నాలుగు సూత్రములె మీ వివరణము
కడమ వ్యాససూత్రాలు కల్లలా యేమి
కడు ముఖ్యము మహావాక్యమే చాలుననెను
అడరి వసిష్ఠాదు లాడిరా యీమాఁట

చ. 2: తానె బ్రహ్మమనంటె తగ జీవన్ముక్తినేరు
పూని లోకులెల్లా ముక్తిఁ బొందవలెఁగా
పాని కర్మానుభవాలు బాధితాను వృత్తనేరు
వీనుల సర్వపురాణాలు వింటిమా యీమాఁట

చ. 3: పైకొని బ్రహ్మజ్ఞానము భక్తిరూపము గాదని
చేకొని కొచ్చెదరట్టె శ్రీవేంకటేశు
దీకొనుచుఁ జేసేరు దేవపూజాది యజ్ఞాలు
యేకాత్మవాదులాల యితవా యీమాట-

రేకు: 0346-03 శంకరాభరణం సం: 04-270 అద్వైతము

పల్లవి: చెప్పఁబోతే యీ యర్థము చిత్తము వొడఁబడదు
తప్పులు వెదకకురో తత్వజ్ఞులాల

చ. 1: చెలఁగి మిథ్య యంటాఁ జేసేయజ్ఞాలు ఫలించునా
యిల శూన్యోపాసకుల కేడ దేవుఁడు
లలి మాయా శబళితులకు మోక్ష మెక్కడిది
నలి నభేదవాది కానందానుభవ మేది

చ. 2: హరి శరణుచొరనియట్టివారికి దిక్కేది
గురుఁడు వేరే లేఁడట కోరి వుపదేశమేది
వెరసి శిఖాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరగ భక్తి లేదట భవమేట్టు గడచె

చ. 3: శ్రీవేంకటేశుముద్ర ధరించక వైకుంఠమేది
యీ విభుపేరు జపించకెట్టు పాపా లుత్తరించు
వేవేగ దాసుఁడుగాక వెట్టికేల కరుణించు
సేవించినఁగాక సర్వచింతలేల యుడుగు

రేకు: 0346-04 శ్రీరాగం సం: 04-271నృసింహ

పల్లవి: అహోబలేశ్వరుఁ డఖిలవందితుఁడు
మహి నితనిఁ గొలిచి మనుఁ డీఁక జనులు

చ. 1: మూఁడుమూర్తులకు మూలం బీతఁడు
వేఁడిప్రతాపపు విభుఁ డీతఁడు
వాఁడిచక్రాయుధవరధుఁ డీతఁడు
పోఁడిమిఁ బురాణపురుషుఁ డీతఁడు

చ. 2: అసురలకెల్లఁ గాలాంతకుఁ డీతఁడు
వసుధ దివ్యసింహం బితఁడు
విసువని యేకాంగవీరుఁ డీతఁడు
దెసలఁ బరాత్పరతేజం బితఁడు

చ. 3: నిగిడి శ్రీవేంకటనిలయుఁ డీతఁడు
బగివాయనిశ్రీపతి యితఁడు
సొగిసి దాసులకు సులభుఁ డీతఁడు
తగు నిహపరములదాతయు నీతఁడు

రేకు: 0346-05 మాళవి సం: 04-272 హనుమ

పల్లవి: అంజినీదేవికొడుకు హనుమంతుఁడు
సంజీవినిదెచ్చినాఁడు సారె హనుమంతుఁడు

చ. 1: కలశాపురముకాడ కదళీవనాల నీఁడ
అలవాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండలకోన లందలిగుహలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు

చ. 2: పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురలనెల్లఁ గొట్టీ హనుమంతుఁడు
వసుధ బ్రతాపించి వడిఁ దోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు

చ. 3: వుద్దవిడి లంకచొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవేంకటేశు కటుబంటై వరమిచ్చి
కొద్ది మీర సంతోసాలే గుప్పీ హనుమంతుఁడు

రేకు: 0346-06 వరాళి సం: 04-273 హనుమ

పల్లవి: పంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు
రంతుకెక్కె మతంగపర్వతపవనజుఁడు

చ. 1: వాలాయమై యెంతభాగ్యవంతుఁడో దేవతలచే
బాలుఁడై వరములందెఁ బవనజుఁడు
పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి
యేలికముందరఁ బెట్టె యీ పవనుజుఁడు

చ. 2: సొంటులు సోదించితెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటుగాఁగఁ బొందుసేసెఁ బవనజుఁడు
వొంటినే రామునిముద్ర వొసఁగి సీతముందర
మింటిపొడవై పెరిగె మేఁటి పవనజుఁడు

చ. 3: కిట్టి శ్రీవేంకటేశ్వరుకృపచే ముందరిబ్రహ్మ-
పట్ట మేలనున్నవాఁడు పవనజుఁడు
చుట్టి చుట్టి తనకు దాసులయినవారికి
గట్టి వరములిచ్చె నీ ఘనపవనజుఁడు

రేకు: 0347-01 శ్రీరాగం సం: 04-274 రామ

పల్లవి: ఏడకేడ నీచెరిత లేమని పొగడవచ్చు
యీడులేనిమహిమలయినవంశరామా

చ. 1: పరమాన్నములోఁబుట్టి పక్కనఁ దాటకిఁ జంపి
సరుస విశ్వామిత్రుయజ్ఞము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లాడి
పరశురామునిచేత బలము చేకొంటివి

చ. 2: వైపుగాఁ సుగ్రీవుఁ గూడి వాలి నొక్కకోల నేసి
యేపున జలధి గట్టి యెసగితివి
దీపించు రావణుఁ జంపి దివిజులను మన్నించి
యేపుగా విభీషణుని రాజ్య మేలించితివి

చ. 3: సీతతోఁ బుష్పకమెక్కి జిగి నయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టము గట్టుకొంటివి
యీతల శ్రీవేంకటాద్రి నిటు విజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి

రేకు: 0347-02 ఆహిరి సం: 04-275 నృసింహ

పల్లవి: సులభుఁ డీతఁ డిదివో సుగ్రీవనారసింహుడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో

చ. 1: నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు
రవ్వలుగా దేవతల రక్షించేవాఁడు
వువ్విళ్ళూర కంభములో నుదయించినవాఁడు
నివ్వటిల్లు ప్రతాపాన నెగడినవాఁడు

చ. 2: హేమపుచాయలవాఁడు యెదుటఁగొల్వున్నవాఁడు
కోమలిఁ దొడపై నిడుకొన్నవాఁడు
కోమలపుమేనివాఁడు గొప్పకిరీటమువాఁడు
చేముంచి హిరణ్యదైత్యుఁ జించినవాఁడు

చ. 3: వాలుకగోళ్లవాఁడు వాఁడికోరలవాఁడు
మేలిమికరుణతోడ మించినవాఁడు
వోలిఁ దుంగభద్రకాడనుండి శ్రీవేంకటాద్రిని
లీలతోఁ బ్రహ్లాదుని కేలికెయైనవాఁడు

రేకు: 0347-03 చాయ సం: 04-276 రామ

పల్లవి: శరణు శరణు నీకు జగదేకవందిత
కరుణతో మమ్ము నేలు కౌసల్యనందన

చ. 1: ఘనరణరంగవిక్రమ దశరథపుత్ర
వినుతామనస్తోమ వీరరాఘవ
మునులును రుషులును ముదమునొందిరి నీవు
జననమందినందుకు జానకీరమణ

చ. 2: సులభ లక్ష్మణాగ్రజ సూర్యవంశతిలక
జలధిబంధన విభీషణవరద
తలఁకి యసురలు పాతాళము చొచ్చిరి నీవు
విలువిద్య నేర్చితేనే విజయరామ

చ. 3: రావణాంతక సర్వరక్షక నిర్మలభక్త-
పావన దివ్యసాకేతపట్టణవాస
వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నినుఁ జూచి శ్రీవేంకటేశ

రేకు: 0347-04 నాట సం: 04-277 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడందరికి రక్షకుఁడీతనిఁ దెలిసి కొలువరో
కామితఫలదుఁడు చరాచరములకుఁ గర్తయైనసర్వేశ్వరుడితఁడు

చ. 1: తలఁప దశరథుని తనయుఁడట తానెతారకబ్రహ్మమట
వెలయ మానుషపు వేషమట వెగటుగ హరువిల్లు విరిచెనట
అలరఁగ తానొక రాజట పాదాన నహల్యశాపము మాన్చెనట
సొలవక దైవికమానుషలీలలు చూపుచు మెరసీఁ జూఁడరోయితఁడు

చ. 2: జగతి వసిష్ఠునిశిష్యుఁడట జటాయువుకు మోక్ష మిచ్చెనట
అగచరులే తనసేనలట అంబుధి కొండలఁగట్టెనట
మగువకొరకుఁగానట కమలాసను మనుమనిఁ రావణుఁ జంపెనట
తగ లౌకికి వైదికములునొక్కట తానొనరించీఁ జూడరో యితఁడు

చ. 3: వెస నమరుల వరమడిగెనట విభీషణపట్టము గట్టెనట
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకుఁ గొలువిచ్చెనట
పొసగ శ్రీవేంకటగిరి నివాసమట భువనము లుదరంబున ధరించెనట
సుసరపుసూక్ష్మాధికములు తనందుఁ జూపుచునున్నాఁడు చూడరో యితఁడు

రేకు: 0347-05 గౌళ సం: 04-278 హనుమ

పల్లవి: అటిముటి హనుమంతుఁ డట్టిబంటు
వెఱపు లేని రఘువీరునికి బంటు

చ. 1: యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమిగలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు

చ. 2: తను మనోవంచనలెంతటా లేనివాఁడే బంటు
ధనముపట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురు మాటాడనివాఁడే బంటు
అనిమొనఁ దిరుగనియతఁడే బంటు

చ. 3: చెప్పినట్లనే నడచినయాతఁడే బంటు
తప్పులేక హితుఁడైనాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుఁడే బంటు

చ. 4: అక్కర గలిగి కడు నాప్తుఁడైనవాఁడే బంటు
యెక్కడా విడిచిపోనియిష్టుఁడే బంటు
తక్కక రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తిగలవాఁడే బంటు

చ. 5: కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరనియాతఁడే బంటు
నానాగతి శ్రీవేంకటోన్నతుఁడైనయతనికి
తా నిన్నిటా దాసుఁడైనధన్యుఁడే బంటు

రేకు: 0348-01 దేవక్రియసం: 04-279 రామ

పల్లవి: ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడే మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు

చ. 1: విడిసెఁ గపిబలము వెస సముద్రము దరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని

చ. 2: చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలుగాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
మెచ్చిరందరు సీతాసమేతుఁడాయ నితఁడు

చ. 3: మగుడెఁ బుష్పకముపై మహిమ నీతనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చె నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు

రేకు: 0348-02 మేఘరంజి సం: 04-280 రామ

పల్లవి: ఇందులోనే కానవచ్చె నిన్నిటా నీ మహిమలు
చెంది నీవే దిక్కు మాకు సీతాపతిరామా

చ. 1: దేవ నీకు వలసితే తృణము బ్రహ్మాస్త్రమాయ
భావించితే రాతికిఁ బ్రాణము వచ్చె
కావలసి యేసితే నాకాశముకట్లు దెగె
దైవమవంటే నీవే దశరథరామా

చ. 2: కూరుచుక యేలితేను కోఁతులు రాజ్యముసేసె
కోరితేనే నీటిపైఁ గొండలు దేలె
సారెఁ గదలివచ్చె నీ సన్నల సంజీవికొండ
యేరీతి నీసరి వేరీ యినకులరామా

చ. 3: సూటి నీవు దలఁచితే సురలు పంపుసేసిరి
చాటితేనే నీపేరు జపమాయను
ఆటల నీకతలెల్లా నాచంద్రార్కమై నిలిచె
గాటపు సిరుల శ్రీవేంకటగిరిరామా

రేకు: 0348-03 దేసి సం: 04-281 రామ

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ ప్రతాపము
రామ రామభద్ర సీతారమణ సర్వేశ

చ. 1: వెరవున హరువిల్లు విరుఁగఁ దీసిననాఁడే
అరయ విరిగె వీఁపు లసురలకు
వరుస వనవాసపువ్రతము వట్టినపుడె
పరులమతుల భీతి వట్టె రఘురామ

చ. 2: వచ్చి నీవు దండకావనము చొచ్చిననాఁడే
చొచ్చిరి పాతాళ మసురలెల్లాను
ముచ్చటాడి చుప్పనాతిముక్కు గోసిననాఁడే
కొంచ్చి దైత్యు లాసదెగఁ గోసిరి శ్రీరామ

చ. 3: అడరి మారీచుపై నమ్ము విడిచిననాఁడే
విడిచిరి దానవులు వేడుకలెల్లాను
బడి విభీషణునిఁ జేపట్టితే రక్కసులెల్లా
చిడిసి మల్లెవట్టిరి శ్రీవేంకటరామ

రేకు: 0348-04 ముఖారి సం: 04-282 ఇతర దేవతలు

పల్లవి: కొలువరో మొక్కరో కోరి తలఁచరో
చెలఁగి మనల రక్షించీని వీఁడె

చ. 1: పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు
వేయినామములవెన్నుఁడు
పాయకకొల్చిన భక్తప్రసన్నుఁడు
యీయెడనే వరములు యిచ్చీని వీఁడే

చ. 2: పరిపూర్ణుఁడు మహానుభావుఁడు
తిరమగు దేవాధిదేవుఁడు
పరమానందస్వభావుఁడు
గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె

చ. 3: తెలియుఁ డీతఁడె దేవాగ్రగణ్యుఁడు
వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు
అలరఁగ శ్రీవేంకటాచలేశపుణ్యుఁడు
నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె

రేకు: 0348-05 సామంతం సం: 04-283 రామ

పల్లవి: రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరో
యేమిటికి విచారాలు యిఁక దైత్యులాల

చ. 1: చలమునఁ దాటికిఁ జదిపిన బాణము
లలి మారీచసుబాహులపై బాణము
మెలఁగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో యసురలు

చ. 2: మాయామృగముమీఁద మరి వేసిన బాణము
చేయి చాఁచి వాటి నేసిన బాణము
తోయధిమీఁద నటు తొడిగిన బాణము
చాయలు దేరుచున్నది చనరో దైతేయులు

చ. 3: తగఁ గుంభకర్ణునితల ద్రుంచిన బాణము
జిగి రావణుఁ బరిమార్చిన బాణము
మిగుల శ్రీవేంకటేశు మేఁటిపాదలో నున్నది
పగ సాధించీ నిఁకఁ బారరో రాకాసులు

రేకు: 0348-06 నాదరామక్రియ సం: 04-284 వైరాగ్య చింత

పల్లవి: అప్పటి సుఖమేకాని యటమీఁదెంచు కొనఁడు
ఉప్పతిల్లు జీవుని వుద్యోగా లిట్టివి

చ. 1: తనుభోగపురతులు దలపోయుచుండుఁగాని
తన నరకకూపాలు దలపోయఁడు
కనకభూషణములు గని వెరగందుఁగాని
ఘనకర్మబంధాలకుఁ గడు వెరగందఁడు

చ. 2: యీకడాకడఁదాఁ జేసేటియెమ్మెలే యెంచుఁగాని
పైకొని కూడేటిపాపము లెంచఁడు
దీకొని జగములోని దృష్టములే చూచుఁగాని
భీకరపు జన్మముల పిరివీకు చూడఁడు

చ. 3: వింతవింత మాటలవేడుకలే వినుఁగాని
అంతటఁ దాఁ బడేపాట్లవి వినఁడు
ఇంతటా శ్రీవేంకటేశుఁడేలఁగా నెరిఁగెఁగాని
యెంతచెప్పినాను బుద్ధి యిన్నాళ్ళు నెరఁగఁడు

రేకు: 0349-01 గుండక్రియ సం: 04-285 నృసింహ

పల్లవి: జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార-
మగణితముగఁ గూడె నదె స్వాతియోగము

చ. 1: పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి
చక్కఁగాఁ గడపమీఁద సంధ్యాకాలమున
వక్కలు సేసె నురవడి నరసింహుఁడు

చ. 2: పిప్పిగాఁగఁ జప్పరించి పేగులు జందేలు వేసి
తొప్పఁదోఁగుచు నెత్తురు దోసిటఁ జల్లె
రొప్పుచుఁ గోపముతోఁ గేరుచుఁ బకపకనవ్వి
తప్పక చూచె వాని నుదగ్రనరసింహుఁడు

చ. 3: యెదుటఁ బ్రహ్లాదుఁ జూచి యిందిరఁ దొడపై నుంచె
అదన నందరికి నభయమిచ్చె
కదసి శ్రీవేంకటాద్రిగద్దెమీఁదఁ గూచుండె
వెదచల్లెఁ గృపయెల్ల వీరనరసింహుఁడు

రేకు: 0349-02 సౌరాష్ట్రంసం: 04-286 ఉత్సవ కీర్తనలు

పల్లవి: వీధులవీధుల విభుఁడేఁగీ నిదె
మోదముతోడుత మొక్కరొ జనులు

చ. 1: గరుడధ్వజ మదె కనకరథం బదె
అరదముపై హరి యలవాఁడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరఁగ బగ్గములు పట్టరో జనులు

చ. 2: ఆడే రదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరునుఁ జూడరో జనులు

చ. 3: శ్రీవేంకటపతిశిఖరముచాయదె
భావింప బహువైభవము లవే
గోవిందనామపుఘోషణ లిడుచును
దైవం బితఁడని తలఁచరో జనులు

రేకు: 0349-03 మాళవశ్రీ సం: 04-287 కృష్ణ

పల్లవి: శ్రావణబహుళాష్టమి సవరేత్రికాడను
శ్రీవిభుఁడుదయించెఁ జెలులాల వినరే

చ. 1: అసురల శిక్షించ నమరుల రక్షించ
వసుధ భారమెల్లా నివారింపను
వసుదేవునికిని దేవకీదేవికిని
అసదృశమగు కృష్ణుఁ డవతారమందెను

చ. 2: గోపకలమన్నించ గొల్లలనెల్లాఁ గావఁగ
దాపై మునులనెల్లా దయసేయను
దీపించ నందునికి దేవియైన యశోదకు
యేపున సుతుఁడై కృష్ణుఁ డిన్నిటాఁ బెరిగెను

చ. 3: పాండవుల మనుపఁగ పదారువేలఁ బెండ్లాడఁగ
నిండి శ్రీవేంకటాద్రిపై నిలుచుండఁగా
అండ నలమేల్మంగ నక్కునఁ గాఁగలించఁగ
దండియైయుండఁ గృష్ణుఁడు తగ నుతికెక్కెను

రేకు: 0349-04 వసంతంసం: 04-288 కృష్ణ

పల్లవి: కోలలెత్తుకొని గోపాలులునుఁ దాను
యీలీల సోదించె యీతఁడే కదవే

చ. 1: జన్నెవట్టి వుట్టి జక్కఁగఁ బెట్టిన
వెన్నదిన్నవాఁడు వీఁడు గదె
పన్నారుదొంతులపాలుఁబెరగులు
యిన్ని నారగించె యీతఁడు గదవె

చ. 2: మెఱసి యట్టుగమీఁదిచక్కిలాలు
వెఱఁజి కైకొనె వీఁడె కదె
కఱమి కఱిమి నమలు గంపల నురుగులు
యెఱిఁగి దొంగిలె యీతఁడే కదవె

చ. 3: శ్రీవేంకటాద్రి దాఁచిన తేనెలెల్లా
వేవేగ సాధించె వీఁడే కదె
కావించెల మేలుమంగపతెయి మమ్మేలె
యేవంకఁ జూచినా యీతఁడే కదవే

రేకు: 0349-05 శుద్ధవసంతం సం: 04-289 కృష్ణ

పల్లవి: ఈడ నిందరికి నేలికై వున్నాఁడు
వాడలరేపల్లెవాఁడా వీఁడు

చ. 1: భారపువుట్ల పాలుఁబెరుగులు
వారలు వట్టినవాఁడా వీఁడు
కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలుదీసిన శిశువా వీఁడు

చ. 2: ఆవులఁ బేయల నందరియిండ్ల
వావిరిఁ గాచినవాఁడా వీఁడు
వావు లొక్కటిగా వనితలఁ గూడి
వేవేలునేర్చినవిటుఁడా వీఁడు

చ. 3: అరుదై శ్రీవేంకటాద్రిమీఁదనుండి
వరములిచ్చేటివాఁడా వీఁడు
మరిగెలమేల్మంగతో మమ్మేలె
సరసుఁడై వుండేజాణా వీఁడు

రేకు: 0349-06 శంకరాభరణం సం: 04-290 అద్వైతము

పల్లవి: ధర్మమునకే మము దయఁ గావవే యిఁక
నిర్మలుఁడవు నిను నే మెఱిఁగేమా

చ. 1: కాయధారులము కర్మలోలులము
మాయ కగపడినమనుజులము
పాయపుమదమున భ్రమసే మా మనసు
నీయెడఁ దగులై నిలిచీనా

చ. 2: చాపల్యగుణము జడులమన్నిటాను
పాపపుణ్యసంబద్ధులము
పైపైఁగోర్కుల ప్రబలేమాబ్రదుకు
యేపనులకు నీకెక్కీనా

చ. 3: అతిప్రాకృతులము అహంకారులము
సతతంబునుఁ జంచలులము
హితవుగ శ్రీవేంకటేశ యేలితివి
తతితో నీభక్తి తగ మరచేమా

రేకు: 0350-01 భంగాళం సం: 04-291విష్ణు కీర్తనం

పల్లవి: భావించి తెలుసుకొంటే భాగ్యఫలము
ఆవలీవలిఫలము లంగజజనకుఁడే

చ. 1: దానములలో ఫలము తపములలో ఫలము
మోనములలో ఫలము ముకుందుఁడే
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము
నానాఫలములును నారాయణుఁడే

చ. 2: వినుతులలో ఫలము వేదములలో ఫలము
మనసులోని ఫలము మాధవుఁడే
దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము
ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే

చ. 3: సతతయోగ ఫలము చదువులలో ఫలము
అతిశయోన్నత ఫలము యచ్యుతుఁడే
యతులలోని ఫలము జితకామిత ఫలము
క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుఁడే

రేకు: 0350-02 మధ్యమావతి సం: 04-292 నృసింహ

పల్లవి: చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా
బత్తిసేసేరు మునులు పరికించవయ్యా

చ. 1: సకలదేవతలును జయవెట్టుచున్నారు
చకితులై దానవులు సమసి రదె
అకలంకయగు లక్ష్మి యటు నీ తొడపై నెక్కె
ప్రకటమైన నీ కోపము మానవయ్యా

చ. 2: తుంబురునారదాదులు దొరకొని పాడేరు
అంబుజాసనుఁ డభయమడిగీ నదె
అంబరవీధి నాడేరు యచ్చరలందరుఁ గూడి
శంబరరిపుజనక శాంతము చూపవయ్యా

చ. 3: హత్తి కొలిచే రదె యక్షులును గంధర్వులు
చిత్తగించు పొగడేరు సిద్ధసాధ్యులు
సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె
యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా

రేకు: 0350-03 నారాయణి సం: 04-293 మాయ

పల్లవి: హరి హరి నీ మాయామహిమ
సరవి దెలియ నను( గరుణించ(గదే

చ. 1: తల(తును నా పాలిదైవమవని నిను
తల(తును తల్లివి( దండ్రివని
మలసి యంతలో మఱతును తెలుతును
కలవలె నున్నది కడ గనరాదు

చ. 2: మొక్కుదు నొకపరి మొగి నేలికవని
మొక్కుదు నీ వాదిమూలమని
వుక్కున గర్వించి యుబ్బుదు సగ్గుదు
కక్కసమైనది కడ గనరాదు

చ. 3: చూతును నీమూర్తి సులభు(డవనుచును
చూతు జగములకు సోద్యమని
యీతల శ్రీవేంకటేశ నన్నేలితివి
కౌతుకమొదవెను కడ గనరాదు

రేకు: 0350-04 నాగవరాళి సం: 04-294 శరణాగతి

పల్లవి: దైవము నెరఁగము తత్త్వముఁ దలఁచము
చేపై హరి రక్షించీ నిదివో

చ. 1: పాపముఁ బుణ్యముఁ బైకొను దేహము
కోపము శాంతపుగుణములది
వోపికవోపము లుదుటు చూపెడిది
చేపట్టుక యిటు చెలఁగే మిదివో

చ. 2: వెలికిని లోనికి విడిసేటిప్రాణము
చలువలు వేండ్లు చల్లెడిది
తెలివికి నిదురకుఁ దేపై యున్నది
బలిమిఁ జేపట్టుక బ్రదికే మిదివో

చ. 3: పరమును నిహమునుఁ బట్టినజీవుఁడ
పొరుగుకు నింటికిఁ బొత్తైతి
గరిమల శ్రీవేంకటపతి శరణని
నిరతపు మహిమల నెగడే మిదివో

రేకు: 0350-05 శోకవరాళి సం: 04-295 రామ

పల్లవి: ఓవో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో

చ. 1: జగములో రాముఁడై జనియించె విష్ణుఁడదె
అగపడి లక్ష్మి సీతయై పుట్టెను
తగు శేష చక్ర శంఖ దైవసాధనములెల్ల
జిగి లక్ష్మణభరతాంచితశత్రుఘ్నులైరి

చ. 2: సురలు వానరులైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగిఁ రుద్రుఁడే హనుమంతుఁడాయను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి

చ. 3: కట్టిరి సేతువపుడె ఘనులెల్ల దాఁటిరి
ముట్టిరి లంకానగరము నీదళము
యిట్టె శ్రీవేంకటేశుఁ డితఁడై రావణుఁ జంపె
వొట్టుక వరము లిచ్చీ నొనర దాసులకు

రేకు: 0350-06 బౌళి సం: 04-296 వైరాగ్య చింత

పల్లవి: జీవుఁడూ నొక్కటే చిత్తమూ నొక్కటే
వేవేలు మాయలచే వెలయుఁ గొన్నాళ్లు

చ. 1: వొక్కటే దేహము వూరకే బాల్యావస్థ
యెక్కడౌతా నెరఁగడు యిటు గొన్నాళ్లు
చక్కఁగ నంతటిలోనె జవ్వనసాయమునాఁడు
మిక్కిలి పోకలఁ బోయి మెరయుఁ గొన్నాళ్లు

చ. 2: ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు
వోఁకరెన్నఁడో దాఁగి వుండుఁ గొన్నాళ్లు
కాఁకల నంతటిలోనె కమ్మరఁ బుట్టినప్పుడే
వేఁకమై పలురుచులు వెదకుఁ గొన్నాళ్లు

చ. 3: దేవుఁడూ నొక్కఁడే తెలియుదాఁకాఁ బెక్కు-
దేవతలై భ్రమయించు దేహము గొన్నాళ్లు
చేవమీర నంతలోనె శ్రీవేంకటేశుఁడై
సేవ గొని సుజ్ఞానిఁ జేసుఁ గొన్నాళ్లు

రేకు: 0351-01 శ్రీరాగం సం: 04-297 వేంకటగానం

పల్లవి: చేరి కొల్వరో యాతఁడు శ్రీదేవుఁడు
యీరీతి శ్రీవేంకటాద్రి నిరవైన దేవుఁడు

చ. 1: అలమేలుమంగ నురమందిడుకొన్నదేవుఁడు
చెలఁగి శంఖచక్రాలచేతి దేవుఁడు
కలవరదహస్తముఁ గటిహస్తపు దేవుఁడు
మలసీ శ్రీవత్సవనమాలికల దేవుఁడు

చ. 2: ఘనమకరకుండలకర్ణముల దేవుఁడు
కనకపీతాంబర శృంగార దేవుఁడు
నని బ్రహ్మాదుల నాభిఁగన్నదేవుఁడు
జనించెఁ బాదాల గంగ సంగతైన దేవుఁడు

చ. 3: కోటిమన్మథాకార సంకులమైన దేవుఁడు
జూటపుఁగిరీటపు మించుల దేవుఁడు
వాటపుసొమ్ములతోడి వసుధాపతిదేవుఁడు
యీటులేని శ్రీవేంకటేశుఁడైన దేవుఁడు

రేకు: 0351-02 పళవంజరం సం: 04-298 కృష్ణ

పల్లవి: ఇతఁడొకఁడే సర్వేశ్వరుఁడు
సితకమలాక్షుఁడు శ్రీవేంకటేశుఁడు

చ. 1: పరమయోగులకు భావనిధానము
అరయనింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కాఁగిటిసౌఖ్యము
సిరలొసఁగేటియీ శ్రీవేంకటేశుఁడు

చ. 2: కలిగి యశోదకు కన్నమాణికము
తలఁచినకరికిని తగుదిక్కు
అలద్రౌపదికిని యాపద్బంధుడు
చెలరేఁగినయీ శ్రీవేంకటేశుఁడు

చ. 3: తగిలినమునులకు తపములసత్ఫలము
ముగురువేలుపులకు మూలము
వొగి నలమేల్మంగకొనరిన పతితఁడు
జిగిమించినయీ శ్రీవేంకటేశుఁడు

రేకు: 0351-03 వసంతం సం: 04-299 తేరు

పల్లవి: నిండెను లోకములెల్ల నెరి నితనికరుణ
పండి రాసులాయఁ గీర్తిప్రతాపములెల్లను

చ. 1: గరుడవేగమునఁ గదలె విజయరథ-
మిరవై యందు దేవుడేఁగుచుండఁగా
సొరిదిఁ బట్టుకుచ్చులు చుక్కలతో సందడించ
గరిమఁ బైఁడికుండలు గగనముదాఁకను

చ. 2: అనిలవేగమున నదెవెడలె రథము
అనిమిషులు పగ్గములందుకొనఁగా
తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కులనిండ
సునిసి చక్రము దనుజుల సాధింపఁగను

చ. 3: వెలయ మనోవేగాన వేంచేసీ మగిడి రథ-
మెలమిఁ దమదాసులు యేచి పొగడ
అలమేలుమంగ దనకటు విడెమియ్యఁగాను
బలిమి శ్రీవేంకటాద్రిపతి మించీనిందును

రేకు: 0351-04 బౌళిరామక్రియ సం: 04-300 రామ

పల్లవి: దేవతలఁగాచిన దేవుఁ డితఁడు
వేవులు ప్రతాపముల వీరరాముఁడితఁడు

చ. 1: రావణుఁజంపి పుష్పకరథ మెక్కి సీతతోడ
తావుగా నయోధ్యను పట్టముగట్టుక
వావిరి సుగ్రీవాదివానరకోట్లు గొలువ
చేవమీరి పొగడొందు శ్రీరాముఁ డితఁడు

చ. 2: వసుధ యింతయునేలి వసిష్ఠాదులు వొగడ
యెసగ నశ్వమేధాలెల్లాఁ జేసి
పొసఁగఁ గుశలవుల పుత్రులగా నటుగాంచి
రసికత మించు దశరథరాముఁ డితఁడు

చ. 3: అలర రుద్రునెదుటనటు విశ్వరూపు చూపి
లలి బ్రహ్మపట్ట మనిలజుని కిచ్చి
యిల శ్రీవేంకటాద్రినిరవై నిలిచినాఁడు
చలము సాధించిన జయరాముఁ డితఁడు

రేకు: 0351-05 మాళవశ్రీ సం: 04-301 రామ

పల్లవి: నమో నమో దశరథనందన మమ్మురక్షించు
కమనీయ శరణాగతవజ్రపంజరా

చ. 1: కోదండదీక్షాగరుఁడ రామచంద్ర
ఆదిత్యకుల దివ్యాస్త్రవేది
సోదించుమారీచునితలగుండుగండ
ఆదినారాయణ యసురభంజనా

చ. 2: ఖరదూషణ శిరఃఖండన ప్రతాప
శరధిబంధన విభీషణవరదా
అరయ విశ్వామిత్రయాగసంరక్షణ
ధరలోన రావణదర్పాపహరణ

చ. 3: పొలుపొంద నయోధ్యపుర వరాధీశ్వర
గెలుపుమీరిన జానకీరమణ
అలఘుసుగ్రీవాంగదాది కపిసేవిత
సలలిత శ్రీవేంకటశైలనివాసా

రేకు: 0351-06 కేదారగౌళ సం: 04-302 శరణాగతి

పల్లవి: నిలచినవాఁడవు నీవేకాక దైవమా
నెలవై ప్రకృతి నేను నీలోనిసొమ్ములము

చ. 1: తఱి నిరువదేను తత్వములుండఁగాను
యెఱఁగని యజ్ఞానానకెవ్వరు గురి
నెఱిఁ జైతన్యమెల్లా నీసొమ్మై వుండఁగాను
యెఱుకవొక్కటేకాక యెవ్వరున్నా రీడను

చ. 2: దినలెక్క లూరుపులు తెచ్చి తెచ్చి వొప్పించఁగ
యెనలేని జన్మములకెవ్వరు గురి
వునికై బ్రహ్మాండము వొళ్ళునీకై వుండఁగాను
యేనసే ఆనందమేకా కెవ్వరున్నా రీడను

చ. 3: అచ్చపు సుముద్రవంటాత్మ లణువైయుండగా
యిచ్చఁ గామక్రోథాల కెవ్వరు గురి
నిచ్చలు శ్రీవేంకటేశ నీవేలికవై యుండఁగా
హేచ్చేటిదాస్యమేకాక యెవ్వరున్నా రీడను

రేకు: 0352-01 భూపాళం సం: 04-303 వైరాగ్య చింత

పల్లవి: తెలియఁడుగాక భ్రిష్టము జీవుఁడు
సులభమిదివో యిచ్చోటనే పరము

చ. 1: మనసునఁ దలచిన మర్మములు గరఁగి
చొనుపుచు నింద్రియసుఖ మిచ్చు
అనువుగ నిటువలె హరిఁదలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా

చ. 2: మాటలాడినను మరిగి మానవులు
యీటున మెచ్చిత్తురేమైనను
నాఁట నిట్ల హరినామము నొడివిన
గాఁటపువరములు కలుగునె కాదా

చ. 3: చేసినపుణ్యము చేతఁజుట్టుకొని
రాసి వెనుతగిలి రక్షించు
వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని
ఆసల కైంకర్యము ఫలించును

రేకు: 0352-02 వసంతం సం: 04-304 కృష్ణ

పల్లవి: తల్లియాపె కృష్ణునికిఁ దండ్రి యీతఁడు
చల్లఁగా లోకములెల్లా సంతోసమందెను

చ. 1: అరుదై శ్రావణబహుళాష్టమినాటిరాత్రి
తిరువవతారమందెను కృష్ణుఁడు
యిరవై దేవకిదేవి యెత్తేకొని వసుదేవు -
కరములందుఁ బెట్టితే కడుసంతోసించెను

చ. 2: తక్కక యమునానది దాఁటతఁడు రేపల్లెలో
పక్కన యశోదాదేవిపక్కఁ బెట్టెను
యెక్కువనాపె కృష్ణునినెత్తుక నందగోపుని
గక్కన విని పంచితే కడుసంతోసించెను

చ. 3: మరిగి పెద్దై కృష్ణుఁడు మధురలోఁ గంసుఁజంపి
బెరసి యలమేల్మంగఁ బెండ్లాడి
తిరమై శ్రీవేంకటాద్రిని దేవకీదేవియు
ఇరవై తే వసుదేవుఁ డేఁచి సంతోసించెను

రేకు: 0352-03 హిందోళం సం: 04-305 శరణాగతి

పల్లవి: కరుణానిధివి గట్టుకో యేపుణ్యమైన
శరణాగత వజ్రపంజరుఁడవు నీవు

చ. 1: మన్నించేనంటే నిన్ను మానిపేవా రెవ్వరు
పన్ని కోపగించితే నీపట్టుకెదు రెవ్వరు
చెన్నుమీర నీపెట్టుజెట్లే జీవులెల్లాను
వన్నెగా నీసొమ్ము నీవువలసినట్టు సేయి

చ. 2: కాచేనంటే నిన్నుఁ గాదనేవా రెవ్వరు
ఏచి యాజ్ఞవెట్టేనంటే యిదేలనేవా రెవ్వరు
లాచి పెంపుడుగుఖ్ఖలు లలినీజీవులెల్లాను
చేచేత నీదాసులను సేసినట్టుసేయి

చ. 3: పరమిచ్చేనంటే నడ్డపడేవా రెవ్వరు
సరి నిహమిచ్చేనంటే సాధించేవా రెవ్వరు
సిరుల శ్రీవేంకటేశ చేతిలోవారము నీకు
హరి నీపొంతవారమెట్టైనా దయసేయి

రేకు: 0352-04 భైరవి సం: 04-306 దశావతారములు

పల్లవి: ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాఁడు శ్రీవేంకటేశుఁడు

చ. 1: జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు
చలమునఁ బాతాళము సాధించినాఁడు
బలుభూమిదూరి వొక్కకొలికికిఁ దెచ్చినాఁడు
నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు

చ. 2: చేరి బ్రహ్మాండము తూఁటుసేసి చూచినాఁడు
వీరుఁడై రాచమూఁకల వెదకినాఁడు
ఘోరపుత్రికూటాదికొండలు జయించినాఁడు
వారించి చక్రవాళపర్వతము దాఁటినాడు

చ. 3: మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు
చుట్టువేడెమున యింతా సోదించినాఁడు
యిట్టె శ్రీవేంకటాద్రినిరవై యెక్కినవాఁడు
రట్టుగాఁ దనదాసులనిట్టె రక్షించినాఁడు

రేకు: 0352-05 వరాళి సం: 04-307 మాయ

పల్లవి: జీవుఁ డింంచుకంత చేఁత సముద్రమంత
చేవెక్కి పలుమారుఁ జిగిరించీ మాయ

చ. 1: కోపములైతేను కోటానఁగోట్లు
దీపనములైతేను దినకొత్తలు
చాపలబుద్దులు సమయని రాసులు
రాపాడీఁ గడవఁగరాదు వోమాయ

చ. 2: కోరికలైతేను కొండలపొడవులు
తీరనిమోహాలు తెందేపలు
వూరేటిచెలమలు వుడివోనిపంటలు
యీరీతినే యెలయించీని మాయ

చ. 3: మునుకొన్నమదములు మోపులకొలఁదులు
పెనఁగినలోభాలు పెనువాములు
నినుపై శ్రీవేంకటేశ నీదాసులనంటదు
యెనసి పరులనైతే యీఁదించీ మాయ

రేకు: 0352-06 కాంబోధి సం: 04-308 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడొకో నే నీచెరఁ దగులక
అన్నిటా శ్రీపతికాధీనమౌట

చ. 1: దేహాధీనము తిరిగేటి జీవులు
దేహము యర్థాధీనము
మోహాధీనము ముంచినయర్థము
ఆహా యిది పుణ్యాధీనము

చ. 2: సతతముఁ బురుషుఁడు సతులయాధీనము
అతివలు వయసుకు నధీనము
గతియగు వయసులు కాలాధీనము
అతిశయమిది మాయాధీనము

చ. 3: దైవాధీనము తగినజగ మిది
దేవుఁడు మోక్షాధీనము
చేవల మోక్షము శ్రీవేంకటపతి -
సేవాధీనము సిలుగే లేదు

రేకు: 0353-01 భల్లాటి సం: 04-309 నృసింహ

పల్లవి: పెదయౌబళపుఁగొండఁ బెరిగీనిదే
వదలకకొలిచితే వరములిచ్చీని

చ. 1: పదివేలశిరసుల బలునరసింహము
గుదిగొన్నచేతుల గురుతైనది
ఎదుటఁ బాదాలుఁ గన్నులెన్నైనఁ గలిగినది
యిది బ్రహ్మాండపుగుహ నిరవైనది

చ. 2: ఘనశంఖచక్రాదుల కైదువలతోనున్నది
మొనసి రాకాసిమెకములఁ గొట్టేది
కనకపుదైత్యుని కడుపుచించినది
తనునమ్మిన ప్రహ్లాదుదాపును దండైనది

చ. 3: శ్రీవనితఁ దొడమీఁదఁ జేకొని నిలిపినది
దేవతలు గొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందుఁ జెలఁగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది

రేకు: 0353-02 ముఖారి సం: 04-310 నృసింహ

పల్లవి: నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభములొసఁగెను

చ. 1: సందించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార -
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁ జించెఁ గనక కశిపుని

చ. 2: నరమృగరూపము నానాహస్తముల
అరిది శంఖచక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచిరక్షించి నిలిచె
గురుతర బ్రహ్మాండ గుహలోనను

చ. 3: కాంచనపు గద్దె మీఁద గక్కనఁ గొలువై యుండి
మించుగ నిందిరఁ దొడమీఁద బెట్టుక
అంచె శ్రీవేంకటగిరి నాదిమపురుషుండై
వంచనసేయక మంచివరాలిచ్చీనదివో

రేకు: 0353-03 సామంతం సం: 04-311 వేంకటగానం

పల్లవి: దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు
భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు

చ. 1: హరియే సకలాంతరాత్మకుఁ డటుగాన
తిరమై యొకరి నిందింపఁదగదు
అరయఁగ లోకములనిత్య మటుగాన
మరిగి కొందరిమీఁది మమతయు వలదు

చ. 2: బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన
గహనపుఁదన వుద్యోగము వలదు
సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన
వహిఁ దానేవచ్చినవి వలదనఁదగదు

చ. 3: తపములు జపములు దాస్యమూలమె కాన
వుపమల సందేహమొగి వలదు
యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి
చపలచిత్తమువారి సంగమిఁక వలదు

రేకు: 0353-04 లలిత సం: 04-312 శరణాగతి

పల్లవి: ఏగతి నుద్ధరించేవో యింతటిమీదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసెఁ బో పతులు

చ. 1: పరగి నాలుకసొంపు పరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁబాపములవినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటి కులాచారము

చ. 2: మొక్కలాన పరధనమునకుఁ జాఁచిచాఁచి
ఎక్కువఁజేతులమహి మెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటి ముందటిపుణ్యాలు

చ. 3: యెప్పుడు నీచులయిండ్లకెడతాఁకి పాదములు
తప్పనితపములెల్లఁ దలఁగిపోయె
యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె

రేకు: 0353-05 సాళంగనాట సం: 04-313 సంస్కృత కీర్తనలు

పల్లవి: అయమేవ అయమేవ ఆదిపురుషో
జయకరం తమహం శరణం భజామి

చ. 1: అయమేవ ఖలు పురా అవనీధరస్తు సో
ప్యయమేవ వట దళాగ్రాధి శయనః
అయమేవ దశవిధైరవతారరూపైశ్చ
నయమార్గ భువి రక్షణం కరోతి

చ. 2: అయమేవ సతతం శ్రియః పతిర్దేవేషు
అయమేవ దుష్ట దైత్యాంతకస్తు
అయమేవ సకల భూతాంతరేష్వాక్రమ్య
ప్రియ భక్త పోషణం ప్రీత్యా తోతి

చ. 3: అయమేవ శ్రీ వేంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోపి యాచకానాం
అయమేవ వేద వేదాంతైశ్చ సూచితో
వ్యయమేవ వైకుంఠాధీశ్వరస్తు

రేకు: 0353-06 సామంతం సం: 04-314 నామ సంకీర్తన

పల్లవి: ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నునినామమే వేదంబాయ

చ. 1: నలినదళాక్షునినామకీర్తనము
కలిగి లోకమునఁ గలదొకటే
యిల నిదియే భజియింపఁగఁ బుణ్యులు
చెలఁగి తలఁప సంజీవని యాయ

చ. 2: కోరిక నచ్యుత గోవిందాయని
ధీరులు దలఁపఁగఁ దెరువొకటే
ఘోరదురితహర గోవర్ధనధర
నారాయణ యని నమ్మఁగఁగలిగె

చ. 3: తిరువేంకటగిరి దేవుని నామము
ధరఁదలపగ నాధారమిదే
గరుడధ్వజుని సుఖప్రదనామము
నరులకెల్లఁ బ్రాణము దానాయ

రేకు: 0354-01 రామక్రియ సం: 04-315 వైరాగ్య చింత

పల్లవి: ఎందరు సతులో యెందరు సుతులో
యిందునందు నెట్లెరిఁగే నేను

చ. 1: మలయుచు నాయభవనములని నే
కెలననిపుడు వెదకేనంటే
పలుయోనులలో పలమారుఁబొడమిన
చలమరి నాతొలుజన్మంబులను

చ. 2: గరిమెలఁ బాణిగ్రహణము నేసిన
సిరులచెలులఁ గలసేనంటే
తరుణుల గురుతులు తలఁపున మరచితి
పరగిన బహుకల్పంబులయందు

చ. 3: శ్రీ వేంకటగిరి చెలువుని యాజ్ఞల
భావించియె కరిఁ బైకొంటి
తావులఁజూడగ తగిలికోర్కుల
భావరతుల బెంబడి మనసందు

రేకు: 0354-02 గుండక్రియ సం: 04-316 మాయ

పల్లవి: కటకట హరిమాయాకల్పనెట్టిదో
తటుకునఁ బారవేసేతలఁపెందు లేదు

చ. 1: అనంతకోటియుగాదులనుండియు
తనివోక విషయాలఁ దగిలుండినా
దినమొక్కొక్కరుచియై తీపులై పండీఁగాని
వెనుకొన్న యాత్మకు వెగ టెందు లేదు

చ. 2: కడలేక నాలుకకుఁ గన్నయాహారములెల్ల
వోడలిలోఁ బూఁటపూఁట వొట్టుకొనినా
సడిఁ బైపై వింతవింతచవులే వెదకుఁగాని
విడువని యాత్మకు వెగ టెందు లేదు

చ. 3: కలకాలముననుండి కాపురపు లంపటాలె
కలిమితో మెడఁగుచ్చి కట్టుకొనినా
యెలమితో శ్రీవేంకటేశ్వరునాజ్ఞల -
నలవాటైన యాత్మకలపే లేదు

రేకు: 0354-03 లలిత సం: 04-317 మనసా

పల్లవి: నటనల భ్రమయకు నామనసా
ఘటియించుహరియే కలవాఁడు

చ. 1: ముంచిన జగమిది మోహినీగజము
పొంచినయాస పుట్టించే దిది
వంచనల నిజమువలెనే వుండును
మంచులు మాయలే మారునాఁడు

చ. 2: సరిసంసారము సంతలకూటమి
సొరిదిఁ బచారము చూపే దిది
గరిమ నెప్పుడుఁ గలకలమనుచుండును
మరులగువిధమే మాపటికి

చ. 3: కందువదేహము గాని ముదియదిది
అందినబహురూప మాడేదిది
యెందును శ్రీవేంకటేశ్వరుఁడుండును
డిందుపడఁగనిదె తెరమరఁగు

రేకు: 0354-04 గుండక్రియ సం: 04-318 అధ్యాత్మ

పల్లవి: "నిశ్చింతం పరమం సుఖ"మనుమాటేనిజమునిజముతెలియరుగాని
ఆశ్చర్యంబిది పరమయోగులకు ననుభవులకు దృష్టాంతము సుండీ

చ. 1: కరచరణాదులుగలచైతన్యము గక్కునఁ బానుపుపైనుండి
సరుగన సడిలిన నిద్రామందము సమకూడీ నరులకటువలెనే
పరమాత్మునిపై సకలోద్యోగ వుపాయంబులు దా దిగవిడిచి
ధరఁ దానుండిన బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ

చ. 2: వున్నతిఁ దానొక దేశములోపలనుండి క్రితముచూచిన నవియెల్లా
అన్ని దేశములు నటుదలపోసిన యంతకుగోచరమైనట్లు
యెన్నగఁబూర్వజ్ఞానంబున సర్వేశ్వరుఁడగు హరిఁదలఁచినను
సన్నిధియగు సుజ్ఞానానందము సత్యము సత్యంబది సుండీ

చ. 3: ననిచిన ప్రపంచకత్పములలో నానావిధముల జంతువులు
తనుఁదాఁజూడగరానిరూపు లద్దములోపలఁ గన్నట్లు
ఘనుడగు శ్రీవేంకటపతిరూపము గక్కన నెదుటనె సేవించి
అనయము తనుఁదా సంతసించుటే యాత్మానందంబిది సుండీ

రేకు: 0354-05 సాళంగనాట సం: 04-319 శరణాగతి

పల్లవి: ఒసఁగితివిన్నియు నొకమాఁటే
వెస నిఁకఁ జేసే విన్నపమేది

చ. 1: నారాయణ నీనామము దలఁచిన -
నీరానివరములిచ్చితివి
చేరి నిన్ను నిటు సేవించిననిఁకఁ
గోరి పడయ నిఁకఁ గోరికలేవి

చ. 2: హరి నీకొకమరి యటు శరణంటే
గరిమల నన్నిటు గాచితివి
నిరతముగా నిఁక నిను నుతియింపుచు
అరగొరతనివి నిను నడిగేదేదో

చ. 3: శ్రీవేంకటేశ్వర చేయెత్తిమొక్కిన
భావమే నీవై పరగితివి
యీవరుసల నీవింతటిదాతవు
ఆవలనినుఁ గొనియాడెడిదేమి

రేకు: 0354-06 భౌళి సం: 04-320 తేరు

పల్లవి: దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువఁగా తిరుతేరు

చ. 1: తిరువీధులేగీని తిరుతేరు
తిరుపుగొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజులఁ దిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు

చ. 2: ధిక్కిరించీ మోతలఁ దిరుతేరు
దిక్కరికుంభా లదరఁ దిరుతేరు
తిక్కుముత్తేలకుచ్చుల తిరుతేరు
తెక్కులఁబ్రతాపించీఁ దిరుతేరు

చ. 3: తీరిచెఁ గలకలెల్లఁ దిరుతేరు
ధీర గరుడవాహపుఁ దిరుతేరు
చేరి యలమేలుమంగతో శ్రీవేంకటేశ్వరుని -
తీరున నెలకొన్నట్టి తిరుతేరు

రేకు: 0355-01 సాళంగం సం: 04-321 నామ సంకీర్తన

పల్లవి: మాధవ భూధవ మదనజనక
సాధురక్షణచతుర శరణు శరణు

చ. 1: నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ -
నారసింహ కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరి జయజయతు శరణు శరణు

చ. 2: పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరిరమణ రామ బలరామ పరమపురుష
చండభార్గవరామ శరణు శరణు

చ. 3: దేవ దేవోత్తమ దివ్యావతార నిజ -
భావ భావనాతీత పద్మనాభ
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవసారూప్య శరణు శరణు

రేకు: 0355-02 లలిత సం: 04-322 మనసా

పల్లవి: దొరకినయప్పుడే తుదగాక
మరుగకుమెన్నఁడు మరి మనసా

చ. 1: తనుభోగంబులఁ దనిపినపిమ్మట
వెనుకొని హరిఁ దడవేనంటే
దినమునుఁ దను నింద్రియములచల మిది
తనియుట యెన్నఁడు దగు మనసా

చ. 2: తిరమగునాల దీరినపిమ్మట
తెరలి విరతిఁ బొందే నంటే
మరలని యాశామయ మీచిత్తము
విరతి యెన్నఁడిఁక వెడ మనసా

చ. 3: ముదిసినపిమ్మట మొగి శ్రీవేంకట -
సదయుఁ గొలుతు నిచ్చలునంటే
హృదయము శ్రీవేంకటేశునినెల విది
యిదిగనుటెన్నఁడు యీమహి మనసా

రేకు: 0355-03 లలిత సం: 04-323 శరణాగతి

పల్లవి: తెలిసియుఁ దెలియదు దేరిన చిత్తము
నలినాక్ష గోవింద ననుఁగావవయ్యా

చ. 1: యేఁకట నినుగొలిచి యితరుల వేఁడనేల
వేఁకపుటాసల నాలోవెలితిగాక
చీఁకటివాసినమీఁద చీఁదరగొనఁగనేల
మాఁకువంటివెడబుద్ధి మాన దిదేమయ్యా

చ. 2: పొంచి నీదాసుఁడనై యల్పుల వేఁడఁబోనేల
చంచలగుణములనాజాలిగాక
అంచలఁ దెరువుకని యడవిఁబడఁగనేలా
యించుకంత యేవవుట్ట దేమిపాపమయ్యా

చ. 3: మతిలో నీవుండఁగాను మాయలఁ బొరలనేలా
వెతకి తెలియని నావేఁదురుగాక
గతియై శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
తతి నాతపమనేఁడు దరిచేరెనయ్యా

రేకు: 0355-04 గుండక్రియ సం: 04-324 వేంకటగానం

పల్లవి: తెలియనివారికిఁ దెరమరుఁగు
తెలిసినవారికి దిష్టంబిదియే

చ. 1: కన్నులయెదుటనుఁ గాంచినజగ మిది
పన్నిన ప్రకృతియు బ్రహ్మమునే
యిన్నిట నుండఁగ నిదిగాదని హరిఁ
గన్న చోట వెదకఁగఁబోనేలా

చ. 2: అగపడి యిరువదియైదై జీవునిఁ
దగిలినవెల్లాఁ దత్వములే
నగవుల నిదియును నమ్మగఁ జాలక
పగటునఁ దమలో భ్రమయఁగ నేలా

చ. 3: అంతరంగుఁడును సర్వావతారము
నింతయు శ్రీవేంకటేశ్వరుఁడే
చెంతల నీతనిసేవకులకు మరి
దొంతికర్మములతోడ సిఁకనేలా

రేకు: 0355-05 వరాళి సం: 04-325 వైరాగ్య చింత

పల్లవి: ఏలొకో కర్మమా యిందుకుఁ బాలైతిని
పొలుపడిన యీ జలభ్రమణమువలెను

చ. 1: ధరలోఁ బుట్టినప్పుడే తలఁచ నీ యాత్మ
మరుగఁడు పరమైతే మరచీఁగాని
అరిది దుర్భాషల నలవడ్డనాలికె
హరినామములయందు నలవడదు

చ. 2: జవకట్టి పూర్వవాసనల సంసారమే
చవియే తాఁగాని ముక్తి చవిగాదు
భువిఁగల విషయాలఁ బుంగుడయ్యీఁగాని మతి
వివరించి దైవమును వెదకలేదు

చ. 3: శ్రీవేంకటేశుకృపచేత నింతేకాని
వావాత నివి గైవశము గావు
భావమిప్పుడితని పాదాలు చేరికాని
యేవుపమలనుఁ గాన మిన్నాళ్లును

రేకు: 0355-06 ముఖారి సం: 04-326 వైరాగ్య చింత

పల్లవి: చవి నోరి కేడఁ దెత్తు సంప దేడఁదెత్తు వీని
సవరించుటే నాసంప బిదిగాదా

చ. 1: పచ్చడా లెక్కడఁ దెత్తు పట్టుచీర లేడఁ దెత్తు
వెచ్చనిండ్లేడఁ దెత్తు వెంట వెంటను
తెచ్చిన యీపచ్చడము దేహమిది వెంటవెంట
వచ్చీఁగాక తన్నుఁదానె వద్దనఁగవచ్చునా

చ. 2: దొరతన మేడఁ దెత్తు దొడ్డసొమ్ము లేడఁ దెత్తు
యెరవులసిరుల నేనేడఁ దెత్తు
వెరవున నేనెవ్వరిని వేసరించఁజాలక
దరిచేరుటే దొరతనమిదిగాదా

చ. 3: తోడఁబుట్టువుల నేడఁ దోడితెత్తుఁ జుట్టాల -
నేడఁ దెత్తు సుతులపొందేడఁ దెత్తును
వేడుకైనపొందు శ్రీవేంకటేశుఁ దలఁచుటే
ఈడులేనిబంధుకోటి ఈతఁడెకాఁడా

రేకు: 0356-01 శ్రీరాగం సం: 04-327 హనుమ

పల్లవి: ఓ పవనాత్మజ వో ఘనుఁడ
బాపుబాపనఁగఁ బరగితిగా

చ. 1: వో హనుమంతుడ వుదయాచలని -
ర్వాహక నిజసర్వ ప్రబల -
దేహము మోఁచిన తెగువకు నిటువలె
సాహసమిటువలెఁ జాటితిగా

చ. 2: వో రవిగ్రహణ వో దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపువినతాతనయాదులు
గారవింప నిటు గలిగితిగా

చ. 3: వో దశముఖహర వో వేంకటపతి -
పాదసరోరుహపాలకుఁడా
యీ దేహముతో నిన్నిలోకములు
నీదేహమెక్క నిలిచితిగా

రేకు: 0356-02 ముఖారి సం: 04-328 మనసా

పల్లవి: దిక్కులేనివారు నీవే దిక్కని కొలువఁగా
అక్కరకితఁడు దైవమందురువో నిన్నును

చ. 1: పాలుపడి నిన్నుఁజేరి పట్టి కొలిచినవారి
జాలిపాటు తొలఁగించి జడనువాపి
మూలఁబడనీక తెచ్చి ముద్దుసేసికావఁగాను
మేలెరుఁగుబుధులెల్ల మెత్తురువో నిన్నును

చ. 2: కొండలుఁ గోట్లునైన కోరికలు గలవారి -
యండనే కోరికలిచ్చి యాదరించగా
నిండినదాసులకెల్ల నీవే దైవ మవని
కొండమీఁదనుండినఁ బైకొందురువో నిన్నును

చ. 3: యేకమైనమనసుతో నెవ్వరు దలచినాను
చేకొని కరుణఁ గృపసేయఁగాను
యేకాలము శ్రీవేంకటేశుఁడు మాదైవమని
లోకమెల్లఁ దామే కొలుతురువో నిన్నును

రేకు: 0356-03 వరాళి సం: 04-329 శరణాగతి

పల్లవి: ఏదియుఁగానఁడు నేది గాదందు
ఆదిపురుష నీదాస్యమే చాలనాకు

చ. 1: గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి
సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణమవట తగిలి కొందరికి

చ. 2: వొకటఁ గళాపూర్తి నొనరియుందువట
వొకట నిష్కళుఁడవై వుడివోవట
వొకచో జీవుల నీకొరయ భేదమట
వొకచో నె భేదమట వున్నారట నీకు

చ. 3: అదన నిందరిలోన నంతరాత్ముఁడవట
యెదుట శ్రీవేంకటేశుఁడవట
యిదియిది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలే కనుఁగొంటగాక

రేకు: 0356-04 లలిత సం: 04-330 నామ సంకీర్తన

పల్లవి: మాధవ కేశవ మధుసూదన విష్ణు
శ్రీధరా పదనభం చింతమియూయం

చ. 1: వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో

చ. 2: పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణ యధోక్షజ
నరసింహ హృషీ కేవ నగధర త్రివిక్రమ
శరణాగతరక్ష జయజయ సేవే

చ. 3: మహితజనార్దన మత్స్య కూర్మ వరాహ
సహజభార్గవ బుద్ధ జయతురగ కల్కి
విహితవిజ్ఞాన శ్రీవేంకటేశ శుభకరం
అహమీ తహతద దాస్యమనిశం భజామి

రేకు: 0356-05 గుండక్రియ సం: 04-331 కృష్ణ

పల్లవి: అందిచూడఁగ నీకు నవతారమొకటే
యెందువాఁడవై తివి యేఁటిదయ్యా

చ. 1: నవనీతచోరా నాగపర్యంకా
సవనరక్షక హరీ చక్రాయుధా
అవల దేవకిపట్టివని యశోదకు నిన్ను
నివలఁ గొడుకవనేదిది యేఁటిదయ్యా

చ. 2: పట్టపు శ్రీరమణా భవరోగవైద్య
జట్టిమాయలతోడిశౌరి కృష్ణ
పుట్టినచో టొకటి పొదలెడిచో టొకటి
యెట్టని నమ్మవచ్చు నిది యేఁటిదయ్యా

చ. 3: వేదాంతనిలయా వివిధాచరణా
ఆదిదేవ శ్రీవేంకటాచలేశ
సోదించి తలఁచినచోట నీ వుండుదువట
యేదెస నీ మహిమే యిదేఁటిదయ్యా

రేకు: 0356-06 గుండక్రియ సం: 04-332 వైరాగ్య చింత

పల్లవి: తలపోఁత చిత్తమునఁ దరిగానక బుద్ధి
గలఁగెఁ గావనో మమ్ముఁ గర్మమా

చ. 1: పాపజాతిమేనితోడఁ బడ్డపాటే చాలదా
ఆపదలకేల లోనాయ నిప్పుడు
దీపమైనహరిభక్తి దెలిసియింతటనైనఁ
గాపాడి పరమీవో కర్మమా

చ. 2: చెప్పరానిసుఖములు చెప్పి చెప్పి కని కని
చప్పుడుగా లోకమునఁ జాటి చాటి
దెప్పరపుభవములఁ దిప్పుదీరైతి మిదె
కప్పుకొని కావఁగదో కర్మమా

చ. 3: వేడుకలిన్నియు శ్రీవేంకటాద్రిరాయఁడే
కూడిన మాదైవమని కొనియాడి
యేడఁజూచిననుఁ బుణ్య మెక్కుడాయనని నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా

రేకు: 0357-01 సామంతం సం: 04-333 నామ సంకీర్తన

పల్లవి: సర్వేశ్వరుఁడే శరణ్యము
నిర్వాహకుఁ డిన్నిటఁగాన

చ. 1: బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుఁడే శరణ్యము
అలరిన బ్రహ్మాండ మవిసిననాఁడును
నిలిపె నాతడిన్నిటిఁగాన

చ. 2: అనేకవిధముల నిఖిలజీవులకు
జనార్దనుఁడే శరణ్యము
అనాథనాథుఁ డంతరాత్మకుఁడు
అనాదిపతి యితఁ డటుగాన

చ. 3: తగునిశ్చలులగు తనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుఁజేవయగుశ్రీవేంకటేశుఁడు
అగువరములొసఁగు నటుగాన

రేకు: 0357-02 లలిత సం: 04-334 నామ సంకీర్తన

పల్లవి: సోదించిరిదియె సురలును మునులును
ఆదికి ననాది హరినామం

చ. 1: అరిది వేదశాస్త్రార్థసంగ్రహము
అరయఁగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరిభయంకరము హరినామం

చ. 2: సకలపుణ్యఫలసారవిహారము
అకలంకము హరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది హరినామం

చ. 3: కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యెందును శ్రీవేంకటేశ్వరు కరుణకు -
నందుకోలైన హరినామం

రేకు: 0357-03 సాళంగనాట సం: 04-335 అంత్యప్రాస

పల్లవి: ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను
మన్నించి నీమనసు మరిగించు మనసు

చ. 1: పొలఁతులకాఁకనే పుటమెక్కె మనసు
చలివేఁడిజవ్వనమునందిఁ జిక్కె మనసు
వలరాజుతూపునంజు వడినెక్కె మనసు
మలసి రతిసుఖాలమరపాయ మనసు

చ. 2: పచ్చనికనకముపై భ్రమఁబడె మనసు
చిచ్చువంటివిషయాల శివమెత్తె మనసు
వొచ్చెపుఁ బాపాలకెల్లా నొడిగట్టె మనసు
బచ్చన చెంచెలములఁ బాటిచెడె మనసు

చ. 3: కోరి యంతలో గురుఁడు గూఁటవేసె మనసు
వోరుపుతో నీపాలి కొప్పగించె మనసు
ఈరీతి శ్రీవేంకటేశుఁడ నామనసు
తోరపు విజ్ఞానము తుదకెక్కె మనసు

రేకు: 0357-04 రామక్రియ సం: 04-336 దశావతారములు

పల్లవి: నమ్మితే నితఁడే మన్ననఁ గాచు
యిమ్ముల ధ్రువుని బట్టమేలించినట్లు

చ. 1: తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాద -
మేరీతిఁ గొలిచినా నెవ్వరికిని
చేరరాని యడవిలో శిలలై పడియున్న
భారపుటహల్యశాపము దీరినట్లు

చ. 2: కలుగనిసిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరి
గొలిచినవారికిఁ గోరినట్లే
అలనాఁడు దరిద్రుఁడైన కుచేలుని
బలుసంపదలఁ దెచ్చి బతికించినట్లు

చ. 3: చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో
వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు
యాగనే మాబోంట్లకు నిరవై కోనేటిదండ
మేడెపువరములెల్ల మెచ్చి యిచ్చినట్లు

రేకు: 0357-05 లలిత సం: 04-337 అంత్యప్రాస

పల్లవి: దేవునిమరవకు మంతే మాట చిత్తమా
దీవెనై కలఁడు మాకు దేవుఁడు

చ. 1: అరుదగుజీవుని బ్రహ్మాండగోళములోన
తెరఁగై పుట్టించువాఁడు దేవుఁడు
అరసి కమ్మరవచ్చి యన్నపానాదులు వెట్టి
తిరుగ రక్షించువాఁడు దేవుఁడు

చ. 2: బలుసంసారములోన భ్రమసియుండిన మాకుఁ
దెలిపి చెప్పినవాఁడు దేవుఁడు
తెలియనికర్మములు తెగనిబంధాలు వాపి
తిలకించి కాచువాఁడు దేవుఁడు

చ. 3: తల్లియుఁ దండ్రియునై దాతయై కలఁడు మాకు
తెల్లమి శ్రీవేంకటాద్రిదేవుఁడు
మల్లాడి తనదాసులమతిలోఁ దా నుదయించి
తెల్లవారించేవాఁడు దేవుఁడు

రేకు: 0357-06 ముఖారి సం: 04-338 శరణాగతి

పల్లవి: ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
జాలిదీర నీకే శరణుచొచ్చితిమి

చ. 1: గతి నీవే మతి నీవే కర్తవు భర్తవు నీవే
పతియు నీవే యేపట్టునా మాకు
యితరము లెవ్వరున్నా రెంచిచూడ నిన్నుఁబోల
చతురుఁడ నిన్ననే శరణుచొచ్చితిమి

చ. 2: జననీజనకులు శరణము నీవే
వునికి మనికి నీవే వుపము నీవే
మనసిచ్చి నీవే నన్ను మన్నించుకొంటేనే
చనవి మనవి నీకే శరణుచొచ్చితిమి

చ. 3: లోకసాక్షివి నీవే లోకబంధుఁడవు నీవే
యీకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గావ
సాకారరూప నీకే శరణుచొచ్చితిమి

రేకు: 0358-01 గుండక్రియ సం: 04-339 వైరాగ్య చింత

పల్లవి: నాఁటకమింతా నవ్వులకే
పూఁటకుబూఁటకుఁ బొల్లైపోవు

చ. 1: కోటివిద్యలునుఁ గూటికొఱకె పో
చాటువ మెలఁగేటి శరీరికి
తేటల నాఁకలిదీరినపిమ్మట
పాటుకుఁ బాటే బయలైపోవు

చ. 2: మెఱసేటిదెల్లా మెలుఁతలకొరకే
చెఱలదేహములజీవునికి
అఱమరపుల సుఖమందినపిమ్మట
మొఱఁగుకుమొఱఁగే మొయిలై పోవు

చ. 3: అన్ని చదువులును నాతనికొరకే
నన్నెరిఁగిన సుజ్ఞానికిని
యిన్నిట శ్రీవేంకటేశుదాసునికి
వెన్నెలమాయలు విడివడిపోవు

రేకు: 0358-02 గుండక్రియ సం: 04-340 శరణాగతి

పల్లవి: ఎన్నిటికెన్నిటికని యెక్కడఁ దగిలెదము
మన్నించు దేవ మాకుఁజాలు

చ. 1: ముఖరమై మాఁకులకు మొదలఁబోసిననీరు
శిఖలకుఁ దనువెక్కి చిగిరించినయట్టు
నిఖిలప్రయోజనాలు నీమూలమేకాన
మఖపతి మీసేవే మాకుఁజాలు

చ. 2: వరుసలనిన్నిటా వన్నె బంగారమే
పరపరివిధముల పలుసొమ్ములైనట్లు
నిరతిఁ గర్మఫలాలు నీమూలమేకాన
మరుగురుఁడవు నీవే మాకుఁజాలు

చ. 3: వెలయ శ్రీవేంకటేశ వివిధజంతువులకు
అలవిలేనిభూమే యధారమైనట్లు
నెలవు దేవతలకు నీవేలికవుగాన
మలసి నీశరణమే మాకుఁజాలు

రేకు: 0358-03 రామక్రియ సం: 04-341 మాయ

పల్లవి: మాయలో మోహమున మరచితివిదే హరి
వేయింటికి వింటే వివేకమా

చ. 1: అంతటికినొడయఁడు అఖిలజీవులలోన
అంతర్యామి శ్రీహరియట
యింతటిలో నీకు హితబంధువులు వేరి
వింతవారెవ్వరు నీకు వివేకమా

చ. 2: అరయ నక్షరవాచి యతఁడట యిలలోనఁ
బరమమంత్రాలెపో పలుకులెల్ల
నిరతపునుతి యేది నిందయేది యిందులోన
వెరవెరఁగవుగాక వివేకమా

చ. 3: మొదలను నడుమను ముగిసినర్థములందు
యెదుటను శ్రీవేంకటేశుఁడట
యిది యది యననేల యిచ్ఛాద్వేషమేల
వెదకుము సమబుద్ధి వివేకమా

రేకు: 0358-04 రామక్రియ సం: 04-342 జానపదము

పల్లవి: సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత -
చందమాయఁ జూడరమ్మ చందమామపంట

చ. 1: మునుపఁ బాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుఁగొనచూపులపంట
వినువీధినెగడినవెన్నెలలపంట

చ. 2: వలరాజుపంపున వలపువిత్తినపంట
చలువై పున్నమనాఁటి జాజరపంట
కలిమికామినితోడ కారుకమ్మినపంట
మలయుచుఁ దమలోనిమఱ్ఱిమానిపంట

చ. 3: విరహులగుండెలకు వెక్కసమైనపంట
పరగ చుక్కలరాసిభాగ్యముపంట
అరుదై తూరుపుఁగొండ నారఁగ బండినపంట
యిరవై శ్రీవేంకటేశునింటిలోనిపంట

రేకు: 0358-05 ఆహిరి సం: 04-343 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు
విన్నపమిదె శ్రీవేంకటనాథా

చ. 1: పాసినఁ బాయపు బంధములు
ఆస దేహమున్నన్నాళ్ళు
కోసినఁ దొలఁగవు కోరికలు
గాసిలి చిత్తముగలిగినన్నాళ్ళు

చ. 2: కొచ్చినఁ గొరయవు కోపములు
గచ్చులగుణములుగలనాళ్ళు
తచ్చినఁ దలఁగవు తహతహలు
రచ్చల విషయపురతులన్నాళ్లు

చ. 3: వొకటికొకటికిని వొడఁబడవు
అకట శ్రీవేంకటాధిపుఁడ
సకలము నీవే శరణంటే యిఁక
వికటములణఁగెను వేడుకనాళ్ళు

రేకు: 0358-06 బౌళి సం: 04-344 వైరాగ్య చింత

పల్లవి: ఎంత వెఱ్ఱిఁ గొండదవ్వి యెలుకఁ బట్టెద నేను
పంతపు శ్రీహరి నాభ్రమ వాపవే

చ. 1: పడనిపాట్లఁ బెక్కుపనులఁ దిరుగుటెల్ల
కుడిచేపట్టెఁడు గూటికొర కింతే కా
కడదాఁకాఁ జెలులతోఁ గాఁపురము సేయుటెల్ల
వొడలు మరచియుండే వొక్క నిమిషానికా

చ. 2: ఘనమైన గృహములు గట్టుకొనుటెల్లాను
తనువు మోచేయంతటికే కా
తనివోని మతిలోని తలపోఁత లెల్లాను
యెనసిన బదుకు తా నెంచుటకే కా

చ. 3: యింతలోని పనియని యెరఁగని చేఁతలెల్లా
సంతకూటముల యీసంసారానకా
చెంతలశ్రీవేంకటేశ చేరి నీకే శరణంటే
యింతక మున్నిటినేర మేమనేవో కా

రేకు: 0359-01 లలిత సం: 04-345 శరణాగతి

పల్లవి: నీవే కాచుటగాక నేరుపు నాయందేది
చేవల వేఁపమాను చేఁదు మానీనా

చ. 1: వొరసి దుర్గుణములనుమానిన నాచిత్తము
మరలి మంచిగుణాన ముట్టుపడీనా
హరి నిన్నుఁ దలఁచక యడవిఁబడిన మరి (తి?)
దరిచేరి నిన్ను మతిఁ దలఁచఁబోయీనా

చ. 2: పొలుమాలి యింద్రియాల బారిఁబడ్డ పుట్టువిది
ఆలరి వైరాగ్యసుఖ మందఁబోయీనా
నీలవర్ణ నినుమాని నిత్యసంసారైన నేను
కాలమందే నిన్నెరఁగఁ గలనా నేను

చ. 3: గరిమ సుజ్ఞానము గలిగిన సాత్విక -
మరయ వేరొకచోట వణఁగీనా
యిరవై శ్రీవేంకటేశుఁడ నీకరుణబ్బె
శరణాగతుఁడ నాకు స్వతంత్రమా

రేకు: 0359-02 ముఖారి సం: 04-346 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇందుకు విరహితములిన్నయు సజ్ఞానమని
చందమున గీతలందుఁ జాటీనిదివో

చ. 1: మానావమానములు మాని డంబు విడుచుట
పూని హింసకుఁ జొరక యోరుపు గలుగుటయు
ఆని మతిఁ గరఁగుట యాచార్యోపాసన
తానెప్పుడు శుచియౌట తప్పని విజ్ఞానము

చ. 2: అంచల సుస్థిరబుద్ధి యాత్మవినిగ్రహము
అంచితవిషయనిరహంకారాలు
ముంచినజన్మదుఃఖములు దలపోయుట
కంచపుసంసారము గడుచుటే జ్ఞానము

చ. 3: అరిమిత్రసమబుద్ధి యనన్యభక్తియు
సరినేకాంతమును సజ్జనసంగ విముక్తి
ధర నధ్యాత్మజ్ఞానతత్వము దెలియుట
గరిమలందుట శ్రీవేంకటపతి జ్ఞానము

రేకు: 0359-03 లలిత సం: 04-347 దశావతారములు

పల్లవి: ధ్రువవరదునివలె తుదకెక్కుఁగాక మరి
యివల గర్మఫలంబు లేవైన సతమా

చ. 1: కరి రాజ వరదునకు కడఁగి శరణంటేను
కరిఁగాచినట్లనే కాఁచుగాక
పరదైవముల కెంత భంగపడి మొక్కినా
అరసి రావణు కొసంగి నట్లనే కాదా

చ. 2: శ్రీపతినే అడిగినను జిగి నజామిళువలె
చేపట్టి సిరుల రక్షించుఁగాక
ఆపోక కౌరవుఁడు హరిపరాఙ్ముఖుఁడైన
పైపైనే సంపదలు పార్థుచేఁ బడవా

చ. 3: శ్రీవేంకటేశుఁడిచ్చేయీవరంబులే
వోవలను ధ్రిష్టమై యుండుఁగాక
భావించ నితరములు పరలోకములయందు
కైవశంబగు ననే కథల వలెఁగాదా

రేకు: 0359-04 బౌళి సం: 04-348 మాయ

పల్లవి: ఏమిసేయుదు నింతయు నీ మాయ
సామజవరద నా చందమిది

చ. 1: జలము లోపలనున్నచందురు నీడవలె
నలుగడలఁ గదలీ నా మనసు
పెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
వెలుఁగదు నాలోని విజ్ఞానము

చ. 2: కడఁగి యాకసమున గాలి యణఁగినట్లు
వడిఁగానరాదు నా వైరాగ్యము
ముడిగి ముత్తెపుఁ జిప్పముత్యము విధంబున
జడిసీ నాలోని సాత్వికము

చ. 3: యిప్పుడిట్టె శ్రీ వేంకటేశ నీ కృపవలె
వుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిన నీ సేవవలెఁ గన్న నిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము

రేకు: 0359-05 బౌళిరామక్రియ సం: 04-349 శరణాగతి

పల్లవి: ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవే
కన్ను లెదుటనుండి కరుణింతుగాక

చ. 1: పొడమినయట్టె నిన్ను పొంచికొలిచేనంటే
కడు నాకప్పుడు వివేకము చాలదు
అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁబోతే
వడి జవ్వన మదము వశమిందుగాదు

చ. 2: వెనక నేఁ బ్రౌఢనై విరతిఁ బొందేనంటే
ధనవాంచ నేమియుఁ దడవనీదు
తనువు ముదిసి నీకుఁ దపముసేసేనంటే
వోనర నేమిటికి వోపికలేదు

చ. 3: శ్రీ వేంకటేశ యీ సిలుగులఁబెట్టనేల
కైవశమై నీవు గలిగుండఁగా
నీవే కృపసేసి నేఁడిటుగావకున్న
పావనమైన యీ పదవెందుఁగద్దు

రేకు: 0359-06 సామంతం సం: 04-350 దశావతారములు

పల్లవి: ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు

చ. 1: అరసి ధ్రువుని గాచినట్టి నీవు
కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు
కరిరాజు శరణంటేఁ గాచిన నీవు
కరతలామలకమై కలవుగా నీవు

చ. 2: గట్టిగా విభీషణుఁగాచిన నీవు
అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు
చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు
కట్టిన ముడుపవై కలవుగా నీవు

చ. 3: కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు
కిమ్ముల లోకములు రక్షించే నీవు
నెమ్మది శ్రీ వేంకట నిలయ నీవు మాకు
కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు

రేకు: 0360-01 లలిత సం: 04-351 వైరాగ్య చింత

పల్లవి: దైవమే నేరుచుఁగాక తగిలించ విడిపించ
యీవల సంసారికి నేమిసేయ వచ్చును

చ. 1: ఆస యెచ్చోట నుండు నక్కడ దైన్యము నుండు
వాసులన్నీ నెందు నుండు వన్నెలు నందుండు
వేసట యెక్కడ నుండు వీతరాగ మాడనుండు
యీసుల నీలంకెవాప నెవ్వరికిఁ దరము

చ. 2: అతికోప మేడనుండు నజ్ఞాన మాడనుండు
మతిఁ బంత మెందుండు మత్సర మందుండు
మతకము లేడనుండు మాయలును నందు నుండు
యితరు లెవ్వరు నిందు కేమనఁగలరు

చ. 3: తనభక్తి యెందుండు తపమును నందుండు
మనసెందు నుండు దీమసమును నందుండు
తనివి యెక్కడ నుండు తగు సుఖ మందుండు
తనర శ్రీ వేంకటేశు దైవికము లివియే

రేకు: 0360-02 ముఖారి సం: 04-352 దశావతారములు

పల్లవి: వింతనా నేఁ దనకు వేసాలవాఁడు
కంతునికి గురుఁ డనగలిగినవాఁడు

చ. 1: జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు
వెడమాయలుగ బారి విద్యలవాఁడు
కడుసోద్యములనే కర్మపుఁ జేఁతలవాఁడు
అడరి కంభపుసూత్ర మాడెడివాఁడు

చ. 2: యిలనుండి మిన్ను ముట్టే యింద్రజాలములవాఁడు
తల ద్రుంచి బ్రదికించుతక్కులవాఁడు
తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు
కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు

చ. 3: మగువల భ్రమ యించే మౌన వ్రతముల వాఁడు
వెగటై రాయి గంతులు వేయించేవాఁడు
చిగిరించే వరముల శ్రీ వేంకటాద్రివాఁడు
బగివాయ కిట మమ్ముఁ బాలించేవాఁడు

రేకు: 0360-03 ముఖారి సం: 04-353 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నగవులు నిజమని నమ్మేదా
వొగి నడియాసలు వొద్దనవే

చ. 1: తొల్లిటికర్మము దొంతుల నుండఁగ
చెల్లబో యిఁకఁజేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుఁడ
వొల్లనొల్ల నిఁక నొద్దనవే

చ. 2: పోయినజన్మము పొరుగులనుండఁగ
చీయనక యిందుఁ జెలఁగేదా
వేయినామములవెన్నుఁడ మాయలు
వోయయ్య యిఁకనొద్దనవే

చ. 3: నలి నీనామము నాలికనుండఁగ
తలకొని యితరముఁ దడవేదా
బలు శ్రీవేంకటపతి నిన్నుఁగొలిచి
వొలుకుఁ జెంచలములొద్దనవే

రేకు: 0360-04 మంగళకౌశిక సం: 04-354 శరణాగతి

పల్లవి: భారకుఁ డతఁడే బంధువుఁ డతడే
చేరితి మతనినే చెంచెలమేలా

చ. 1: చెనకునాయుధము చేతఁ గలిగితే
ఘననిర్భయుఁడై కడఁగీనట్ల
అనంతాయుధుఁ డాతుమనుండఁగ
వెనుకొని యెందుకు వెఱవఁగనేలా

చ. 2: భువి నొకరాజునుఁ బొందుగఁ గొలిచిన
యివల నచ్చికం బెరఁగఁడట
భువనరక్షకుఁడె పొదిగొని యేలఁగ
వివరించి యొరుల వేఁడఁగనేలా

చ. 3: తోవ విధానము దొరకినయప్పుడే
యేవిధములు మరి యెంచఁడట
శ్రీ వేంకటపతి చేకొని కావఁగ
భావన నితరోపాయములేలా

రేకు: 0360-05 సామంతం సం: 04-355 ఇతర దేవతలు

పల్లవి: తానే తానే యిందరి గురుఁడు
సానఁ బట్టిన భోగి జ్ఞాన యోగి

చ. 1: అపరిమితములైన యజ్ఞాలు వడిఁ జేయఁ
బ్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మ యోగి

చ. 2: అన్ని చేఁతలును బ్రహ్మార్పణవిధిఁ జేయ
మన్నించు బుద్ధులను మరుగఁజెప్పి
వున్నతపదమున కొనరఁగఁ గరుణించ
పన్నగ శయనుఁడే బ్రహ్మ యోగి

చ. 3: తనరఁగఁ గపిలుఁడై దత్తాత్రేయుఁడై
ఘనమైన మహిమ శ్రీ వేంకటరాయఁడై
వొనరఁగ సంసారయోగము గృపసేయు
అనిమిషగతుల నభ్యాస యోగి

రేకు: 0360-06 కన్నడగౌళ సం: 04-356 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవే
యిరవుగఁ గంటి వింటి నిదివో నీరూపము

చ. 1: పెక్కురోమకూపముల పెనుబ్రహ్మాండాలు మోచే
వెక్కసపు నీకుఁ ద్రివిక్రమాకృతి యేమి
అక్కడ వేదశ్రుతి 'యత్యతిష్ఠద శాంగుల'
మెక్కువయని పొగడీ నిదివో నీరూపము

చ. 2: వెడక జీవులలోనే వేవేలు రూపుల నీకు
యెదిటి దశావతారాలేమి యరుదు
అదె 'విశ్వతోముఖ యనంతమూర్తి'వని
యిదె శ్రుతి వొగడీని యిదివో నీరూపము

చ. 3: బిందుపడి సురలు నీతిరుమేనఁ బొడమఁగ
యిందరు నీవేయవుట యేమి యరుదు
యెందును శ్రీ వేంకటేశ 'యేకో నారాయణ'
యిందులో శ్రుతి చాటీ నిదివో నీరూపము

రేకు: 0361-01 రామక్రియ సం: 04-357 రామ

పల్లవి: భళి భళి రామా పంతపు రామా నీ -
బలిమి కెదురు లేరు భయహర రామా

చ. 1: విలువిద్య రామా వీరవిక్రమ రామా
తలకొన్న తాటకాంతక రామా
కొలయై ఖరుని తలగుండుగండ రామా
చలమరి సమరపు జయరామ రామా

చ. 2: రవికుల రామా రావణాంతక రామ
రవిసుతముఖ కపిరాజ రామ
సవరఁగాఁ గొండలచే జలధిగట్టిన రామ
జవసత్త్వసంపన్న జానకీరామా

చ. 3: కౌసల్యరామా కరుణానిధి రామ
భూసురవరద సంభూతరామా
వేసాలఁ బొరలే శ్రీ వేంకటాద్రి రామ
దాసులమమ్ముఁ గావఁదలకొన్న రామా

రేకు: 0361-02 లలిత సం: 04-358 వేంకటేశ్వరౌషధము

పల్లవి: అన్నిటికి నిది పరమౌషధము
వెన్నుని నామమే విమలౌషధము

చ. 1: చిత్తశాంతికిని శ్రీ పతి నామమె
హత్తిననిజ దివ్యౌషధము
మొత్తపు బంధవిమోచనంబునకు
చిత్తజ గురుఁడే సిద్ధౌషధము

చ. 2: పరిపరి విధముల భవ రోగములకు
హరిపాద జలమె యౌషధము
దురితకర్మములఁ దొలఁగించుటకును
మురహర పూజే ముఖ్యౌషధము

చ. 3: యిల నిహపరముల నిందిరావిభుని -
నలరి భజింపుటె యౌషధము
కలిగిన శ్రీ వేంకటపతి శరణమే
నిలిచిన మాకిది నిత్యౌషధము

రేకు: 0361-03 సామంతం సం: 04-359 వేంకటగానం

పల్లవి: ఎల్లలోకములవారి కేలిక దానే
కొల్లగా వరములిచ్చే గురుతైన దైవము

చ. 1: కొండల కోనల లోన కోనేటి సరిదండ
మెండైన బంగారు మేడలలోన
నిండు జవ్వనము తోడి నెలఁత కౌఁగిటలోన
వుండి జగమెల్ల నేలీ నుద్దండ దైవము

చ. 2: నాలుగు చేతుల తోడ నవ్వుల మోముతోడ
సోలి సంకుఁజక్రముల సొంపుతోడ
నేలమిన్నునొకటై నిలుచున్న రూపుతోడ
పాలుపడి మెరసీని ప్రత్యక్ష దైవము

చ. 3: సంపదలు కడుమించి చవులతో నారగించి
జొంపపు విరుల పూజ సొంపుమించి
యింపుల శ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడు దేవతలతోఁ బ్రతిలేని దైవము

రేకు: 0361-04 లలిత సం: 04-360 శరణాగతి

పల్లవి: బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటిబారి నింకఁ దోయకు మోయయ్య

చ. 1: చిక్కుల భవములఁ జెరఁజిక్కి వోపలేక
నిక్కి నీమరఁగు చొచ్చి నిలిచితిని
అక్కజమై యల్లనాఁడే అప్పులకర్మములెట్ల
ఇక్కడనె చుట్టుముట్టీ నేమిసేతునయ్యా

చ. 2: లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక
యిచ్చట నిన్నుఁగొలిచి యెక్కువై తిని
పొచ్చముల నల్లనాఁటిపూఁట దీరదని కొన్ని
బచ్చన బంధాలు వచ్చెఁ బాఁపగదవయ్య

చ. 3: అంచల నింద్రియముల కలివెట్టి పెట్టలేక
ముంచి నీ పాదాలకు మొరవెట్టితి
పొంచిన శ్రీవేంకటేశ భువన రక్షకుఁడవు
పంచల నున్నాఁడ నన్నుఁ బాలించవయ్యా

రేకు: 0361-05 పాడి సం: 04-361 వైరాగ్య చింత

పల్లవి: కలకాలము నిట్టేకాఁపురపు బదుకాయ
యిలదైవమా నాకెన్నఁడో నిశ్చయము

చ. 1: గుట్టుతో వైరాగ్యమే కోరుదు నే నొకవేళ
అట్టున సంసారపుటాఅడి గోరుదు
ముట్టుపడి యొకచోట మనసెందు నిలువదు
యిట్టె చెంచెలుఁడ నాకు నెన్నఁడో నిశ్చయము

చ. 2: కొంతవడి నే సత్త్వగుణమందు నెలకొందు
అంతలో రాజస గుణినై యుందును
చెంత దామసగుణము చేకొందు నొకవేళ
యింత పలువంచలు నా కెన్నఁడో నిశ్చయము

చ. 3: వివరించి యొకవేళ వివేకివలె నుందు
ఆవల మూఢుఁడనవుదు నంతటిలోనే
తవిలి శ్రీ వేంకటేశ తగ నిన్ను దలఁచంగ
యవలఁ దొల్తేయాయ నెన్నఁడో నిశ్చయము

రేకు: 0361-06 బౌళి సం: 04-362 వైరాగ్య చింత

పల్లవి: మానదు మతిమఱపునుఁ దెలివియు
యేనింక దైవమ యేమిసేయుదును

చ. 1: సకల పురాణాలు శాస్త్రాలు విని విని
వొక వేళ సుజ్ఞాన మొదవును
వికటమై యంతలో విషయసుఖము గని
ఆకట కమ్మర బుద్ధి నవే కతలు

చ. 2: పలు దుఃఖముల బాధఁబడు వారిఁ బొడగని
పలికి సంసారముపై రోసును
నలవంక సిరులలో నటియించువారిఁ జూచి
తలఁచి యాసలవెంటాఁ దగులు నంతటను

చ. 3: యెడప కలమేల్మంగ యీ రీతి నిన్నునే
బడి బడి యలసి తిట్టె పైపై నింక
చిడుముడి నీ మీఁద శ్రీ వేంకటేశ్వర
తడవి యిట్లదయ దలఁచ కుండినను

రేకు: 0362-01 లలిత సం: 04-363 అంత్యప్రాస

పల్లవి: హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
పరగ నీ దాసుఁడే పరతత్త్వవేది

చ. 1: పొలసి మశకమండుఁ బొడమేటి జీవుని
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపోయీనీ
నిలువెంత నీఁటెంత నీమాయ లివి భువి
బలిమిఁ దెలియువాఁడె పరతత్త్వవేది

చ. 2: తగిలి చూచిన నాత్మఁ దనుఁ గానరాదుగాని
జగమెల్ల దానైతే సరి గనీని
చిగురెంత చేగెంత శ్రీపతి యిందులో నీ -
పగటు దెలియువాఁడే పరతత్త్వవేది

చ. 3: యేవంకఁ దనబుద్ధి యెక్కడనుండునోకాని
శ్రీ వేంకటేశ నిన్నుఁ జింతించీని
పూవెంత ఫలమెంత పురుషోత్తముఁడ నీ -
భావమెరుఁగువాఁడె పరతత్త్వవేది

రేకు: 0362-02 సామంతం సం: 04-364 దశావతారములు

పల్లవి: అల్లదెకో విజయధ్వజము జగ -
మెల్లఁ జేకొనియె నీతఁడు

చ. 1: తొక్కనిచోట్లు దొక్కెటి తురగపు
రెక్కలమీఁదటి రేవంతుఁడు
చక్కగ నసురల సంహరించి యిదె
దిక్కులు గెలిచెను దేవదేవుడు

చ. 2: వోడక శంఖము నొగి చక్రముతో
సూడుకుఁ దిరిగేటి శూరుఁడు
యీడనుండి సురలిందరిఁ గాచెను
మేడెపు మన లక్ష్మీ విభుఁడు

చ. 3: శరణన వారలఁ జయ్యన గాచిన
శరణాగత రక్షణ ఘనుఁడు
తిరమై యింతకు దిక్కై నిలిచెను
గరిమెల శ్రీ వేంకట విభుఁడు

రేకు: 0362-03 రామక్రియ సం: 04-365 కృష్ణ

పల్లవి: ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీమహిమకు నెవ్వ రెదురయ్యా

చ. 1: పల్లించి గరుడనిపై నీ వుబ్బుననెక్క
అల్లనాఁడె పారిజాత మడవికెక్కె
పల్లదపురుద్రుఁడును బాణునివాకిలి దొక్కె
చుల్లరి రాక్షసమూఁక సురసుర సుక్కె

చ. 2: గరుడినిపై నీవు కడుఁబేరెములవార
ధరజలధరుల నమృతములు దేరె
నిరతిఁ గంసాదులనెత్తురు టేరులు వారె
పరులు నీకెదిరిన పగయెల్ల దీరె

చ. 3: బంగారు గరుడనిపై నీవు వీదులేఁగ
చెంగట శ్రీ వేంకటేశ సిరులుమూఁగె
సంగతి నలమేల్మంగ సంతసాన విఱవీగె
పొంగారు దేవదుందుభులు పై పై వాఁగె

రేకు: 0362-04 వరాళి సం: 04-366 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సమమతినని నీవే చాటుదువు
రమణ నేరుపు నేరము లెవ్వరిని

చ. 1: రావణాదులైన రాక్షసమితిలో
నీవే, దేవతలలో నీవేకావా
భావింప నసురలు పగ నీకు నేలైరి
యీవల సురులెల్ల హితులైరి

చ. 2: సకల జంతువులకుఁ జైతన్యుఁడవు నీవే
వొకరు నీకుపరాక మొనరించేరా
అకట కొందరిఁ బాపాత్ములఁగాఁ జేసి
వెకలిఁ గొందరిఁ బుణ్యవిధులఁ జేసితివి

చ. 3: అటుగాన ఇట్టాయ నట్టాయననేల
యిటు నీచిత్తముకొలఁ దింతేకాక
గటియించి శ్రీవేంకటపతి నీదాసు
లిటువలె ఘనులై రిదివో నీకృపను

రేకు: 0362-05 ఆహిరి సం: 04-367 నామ సంకీర్తన

పల్లవి: నే నవగుణి నైన నీకుఁ బోదు భువి
లోన భక్తవత్సలుఁడ వటు గాన

చ. 1: పరమ పురుషా భవరోగ వైద్య
ధరణీధర మాధవ కేశవా
అరిది సంసారాన నలసితి నినుఁగను -
తెరు వేదొ వెర వేదొ తెలియ నే నిపుడు

చ. 2: భువనాతీతా పుండరీకేక్షణ
నవనీతప్రియ నారసింహా
యివల నాయపరాధ మెంతైనఁ గలదు నా
వివరము చింతించి వెసఁ గావరాదా

చ. 3: అగుణాసగుణా యాద్యంతరహితా
అగణిత శ్రీ వేంకటాద్రినాథ
నిగమగోచర నేను నీయాధీనమ నింతే
నగుఁబాటు గాకుండ ననుఁగావుమిపుడు

రేకు: 0362-06 కన్నడగౌళ సం: 04-368 మాయ

పల్లవి: తల లేదు తోఁక లేదు దైవమా నమాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము

చ. 1: తను వేఁటిదో యీ తలపోఁత లేఁటివో
యెనయు సంసార సుఖ మిది యేఁటిదో
వెనక ముం దేఁటిదో వివేక మెరఁగక
దినదినమును నేమో తిరిగేము నేము

చ. 2: పుట్టు గిది యెక్కడో పోయేటి దెక్కడో
ఇట్టె యీ సిరులెల్లా నెక్కడెక్కడో
మట్టులేని హరి నిర్మాణ చక్రములోన
దిట్టలమై యేమేమో తిరిగేము నేము

చ. 3: నేరు పేదో నేర మేదో నిలిచిన దొకటేదో
వూరకే నీ దాసులమై వున్నారము
చేరి నన్నేలినయిట్టె శ్రీవేంకటేశ్వర
గారవించి కరుణించి కావఁగదవే

రేకు: 0363-01 మాళవి సం: 04-369 వైష్ణవ భక్తి

పల్లవి: ఇదియే వేదాంత మిందుకంటె లేదు
యిదియే శ్రీ వేంకటేశుని మతము

చ. 1: విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వినకవారెల్ల
విరతిఁబొందకున్న వీడదు భవము

చ. 2: చిత్తమే పాపము చిత్తమే పుణ్యము
చిత్తమే మోక్షసిద్ధియును
చిత్తమువలెనే శ్రీ హరి నిలుచును
చిత్త శాంతి లేక చేరదు పరము

చ. 3: యెంత చదివినా యెంత వెదికినా
యింతకంటె మరి యిఁకలేదు
యింతకంటె శ్రీ వేంకటేశుదాసులౌట
యెంతవారికైన యిదియే తెరువు

రేకు: 0363-02 గుండక్రియ సం: 04-370 వైరాగ్య చింత

పల్లవి: జీవుఁడు నిత్యుఁడు యీ చింత లెట్టు దొరకెనో
భావించ నిది యేఁటి ప్రచారమో

చ. 1: తనువు మోచితినంటా తరుణుల పొందులంటా
దినదిన రుచులంటాఁ దిరిగేము
మొనసి సంసారమే మోహినీగజమై
వెనకఁ దలఁచ మేటి వికారమో

చ. 2: కడుపు నిండినదంటాఁ గమ్మర నాఁకలియంటా
వెడఁగు భోగములంటా వెదకేము
వుడివోని యాసలే వుబ్బుఁగవణములై
విడువదు మతి కేటివిచారమో

చ. 3: దివము రాతిరి యంటా తెలివంటా నిదురంటా
భువిఁ గాఁపురములంటాఁ బొరలేము
ఇవల శ్రీ వేంకటేశ యింతలో నీ దాసినని
వివరము గంటి నెట్టి వివేకము

రేకు: 0363-03 వళవశ్రీ సం: 04-371 వైరాగ్య చింత

పల్లవి: ఇందుకుఁగా నా యెరఁగమి నేమని దూరుదును
అందియు నిను నేఁదెలియక అయ్యో నేనిపుడు

చ. 1: ఆతుమలోననుండి యఖిలోపాయములు
చేతనునకు నీవే చింతించఁగాను
కాతురపడి నేను కర్తననుచుఁ బనులు
యీతలఁ జెప్పఁగఁబూనే నిస్సిరో

చ. 2: తను విటు నీ వొసఁగి తగు భాగ్యము నీవై
అనువుగ జీవుని నీయటు నీవేలఁగను
తనియక నే వొరులు దాతలనుచుఁ బోయి
కనుఁగొని వేడఁగఁ దొడఁగేఁ గటకటా

చ. 3: శ్రీవేంకటాద్రిపై నుండి చేరి కన్ను లెదుటను
సేవగొని యిట్టే కృపసేయఁగాను
సోవలఁ గన్నవారెల్లాఁ జుట్టములంటా నేను
జీవులతోఁ బొందుసేసేఁ జెల్లఁబో

రేకు: 0363-04 సామంతం సం: 04-372 నృసింహ

పల్లవి: ఇట్టిదివో హరికృప యెంచినను
గట్టిగా నాహరి కృపే కలదువో మాకు

చ. 1: బలుహిరణ్యాక్షుఁడు ప్రహ్లాదునిబట్టి
జలధి వేసిన నీరుచట్టై తేలె
కలుషించి కమ్మరాను కడునగ్నిఁ దోసిన
నిలువెల్లఁ జల్లనినీరై తొలఁకె

చ. 2: దిట్టయై యేనుగులచే దీకొలిపిన వాఁటి
నట్టె కొమ్ములు తమురైపోయను
పట్టియెత్తి రాలమీఁద బలుమారు వేసిన
బట్టబయలే దూదిపానుపులై నిలిచె

చ. 3: కడసారెఁ గంభములోఁ గలఁడంటేఁ గలిగి
చిడుముడి రక్కసులఁ జీరివేసె
జడియు శ్రీ వేంకటాచల నారసింహుఁడై
పొడచూపి మాకు దిక్కై పొదలించె నేఁడు

రేకు: 0363-05 శ్రీరాగం సం: 04-373 శరణాగతి

పల్లవి: అది బ్రహ్మాండ మిది పిండాండం -
ఇదుటు జీవులము వున్నార మిదివో

చ. 1: వుదయాస్తమయము లొనరినవలెనే
నిదురలు మేల్కను నియమములు
కదిసి త్రిసంధ్యాకాలంబులవలె
గుదిగొను దేహికి గుణత్రయములు

చ. 2: పుడమి సస్యములు పొదలినవలెనే
వొడలిరోగము లున్న ఇవే
వుడుగని వెలుపటి వుద్యోగమువలె
కొడిసాగేటి మితి కోరికలు

చ. 3: వెలుపలఁగల శ్రీ వేంకట విభుఁడే
కలఁ డాతుమలో ఘనుఁ డితఁడే
చలమున నీతని శరణాగతియే
ఫలమును భాగ్యము బహుసంపదలు

రేకు: 0363-06 గుజ్జరి సం: 04-374 మాయ

పల్లవి: ఏమిసేయవచ్చు హరియెలయించే మాయ లివి
వేమరు నాతనిఁ గొల్చి వీడుకొంటగాక

చ. 1: పాయమే పరచైతేఁ బట్టఁగ నెట్లవచ్చు
రోయుదాఁకా నందులోఁ దిరుగుటగాక
కాయపువోడ తప్పుగాలి విసరినవేళ
పోయినట్టే పోనిచ్చి పానుఁగుటగాక

చ. 2: మనసే మలినమైతే మఱుఁగెట్టు సేయవచ్చు
వొనర విరతిదాఁక నోర్చుటగాక
తన యంతరంగపుటద్దము మాసితే నది
మినుకు విజ్ఞానాన మెరుఁగిచ్చుటగాక

చ. 3: మెచ్చునాలుకఁదీపు మింగ కెట్టుమానవచ్చు
కొంచ్చి కొంచ్చి సారె రుచిగొనుటగాక
నచ్చుల శ్రీ వేంకటేశు నామము నోరనుంటే
పచ్చి తనభాగ్యమంటా బ్రదుకుటగాక

రేకు: 0364-01 లలిత సం: 04-375 నృసింహ

పల్లవి: ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుకఁ బరుషలెల్ల వీధినుండరమ్మా

చ. 1: అల్లదివో వోఁగునూఁతులౌభళేశుపెద్దకోవ
వెల్లి పలనీటిజాలు వెడలేసోన
చల్లనిమాఁకులనీడ సంగడిమేడలవాడ
యెల్లగాఁగ నరసింహుఁడేగీ నింతితోడను

చ. 2: సింగారపుమండపాల సింహాలమునిమంద-
లంగపు తెల్ల గోపుర మదె మిన్నంద
చెంగట నాడు వార్లు చేరి పన్నిద్దరుఁగొల్వ
సంగతిఁ దాఁగొలువిచ్చీ జయనరసింహము

చ. 3: కందువ శ్రీ వేంకటేశు కల్యాణములవేది
అందమై భూములకెల్లా నాదికి నాది
మందల పాలకొండమలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు

రేకు: 0364-02 లలిత సం: 04-376 శరణాగతి

పల్లవి: ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము
సతతపూర్ణునికి శరణ్యము

చ. 1: సర్వలోకముల సాక్షైకాచిన -
సర్వేశ్వరునకు శరణ్యము
వుర్వికి మింటికి నొక్కటఁ బెరిగిన -
సార్వభౌమునకు శరణ్యము

చ. 2: శ్రీకాంత నురముచెంగట నిలిపిన -
సాకారునకును శరణ్యము
పైకొని వెలిఁగేటి పరంజోతియై -
సౌకుమారునకు శరణ్యము

చ. 3: తగనిహపరములు దాసుల కొసఁగేటి
జగదీశ్వరునకు శరణ్యము
నగు శ్రీ వేంకటనాథుఁడ నీకును
సగుణమూర్తి యిదె శరణ్యము

రేకు: 0364-03 దేవగాంధారి సం: 04-377 వైరాగ్య చింత

పల్లవి: ఏద్దైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు
పాదుగ నాతనిమీఁది భక్తే సాధనము

చ. 1: దేహమునకు ఫలము తెగని యాలుబిడ్డలు
దేహాంతరాత్మకును దేవుఁడొకఁడే ఫలము
దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము
వూహల రెంటికి మనసాక్కటే సాధనము

చ. 2: పుట్టినందుకు ఫలము పొందగు భోగములే
పుట్టుగే గెలుచుటకు భువి జ్ఞానమే ఫలము
పుట్టుటకు గర్మము పోవుటే యకర్మము
వెట్టే యీ రెంటికిని విరతే సాధనము

చ. 3: చింతించుటకు ఫలము సిరులెల్లఁ జేకొనుటె
చింత వీడుటకు ఫలము శ్రీ వేంకటేశు సేవే
చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు
కొంత దాఁచనేల శ్రీ గురుఁడే సాధనము

రేకు: 0364-04 ధన్నాసి సం: 04-378 శరణాగతి

పల్లవి: శరణాగత వజ్రపంజర బిరు దది నీది
కరుణానిధివై కావవే నేఁడు

చ. 1: ప్రళయకాలమునాఁడు బ్రహ్మాండకోట్లు
సొలవక నీకుక్షి చొచ్చినట్టు
చెలఁగి నీమరఁగున శ్రీ వేంకటాద్రిమీఁద
యిల నరలోకమెల్ల నెక్కెఁ గావవే

చ. 2: అసురబాధకుఁగా నఖిలదేవతలును
కొసరుచు మొరవెట్టగూడినట్టు
ముసరి కోనేటిదండ మూఁకలు మూఁకలుగట్టి
విసిగి ప్రాణులు విన్నవించేరు గావవే

చ. 3: జీవులఁ బుట్టించునాఁడు చేరి యా యా నెలవుల
నీవలన జనులెల్ల నిలిచినట్టు
శ్రీ వేంకటేశ నిన్నుఁ జేరినట్టివారి నెల్ల
తావుల నిలిపి యిట్టే దయఁగావవే

రేకు: 0364-05 నారాయణి సం: 04-379 నామ సంకీర్తన

పల్లవి: కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన
భావించి నీవని తుదపదమే యెక్కితిమి

చ. 1: కరి రాజ వరద నీకడనున్నవారికి
కలిరాజభయము లెక్కడాఁ బొందవు
సిరుల నీయర్థమే చింతించి చింతించి
నరలోకమెల్ల నీనగమె యెక్కితిమి

చ. 2: కాళింగమర్దన నిన్నుఁగని మనువారికి
కాళింగభయములెక్కడా లేవు
తాలిమితో నిదియే తలపోసి తలపోసి
కేలి మనుజులము నీగిరియె యెక్కితిమి

చ. 3: కందువ శ్రీ వేంకట కటకేశ నీవద్ద -
నెందుఁ గటకేశభయమిఁక లేదు
యిందుకే పో జగమెల్లా నిటు శరణని మూల
కందువ నీదండ శ్రీ వేంకటమె యెక్కితిమి

రేకు: 0364-06 దేశాక్షి సం: 04-380 శరణాగతి

పల్లవి: అతఁడే రక్షకుఁ డందరి కతఁడే
పతి యుండఁగ భయపడఁ జోటేది

చ. 1: అనంతకరము లనంతాయుధము-
లనంతుడు ధరించెలరఁగను
కనుఁగొని శరణాగతులకు మనకును
పనివడి యిఁక భయపడఁజోటేది

చ. 2: ధరణి నభయహస్తముతో నెప్పుడు
హరి రక్షకుఁడై యలరఁగను
నరహరికరుణే నమ్మినవారికి
పరఁదున నిఁక భయపడఁజోటేది

చ. 3: శ్రీ వేంకటమున జీవులఁ గాచుచు
నావల నీవల నలరఁగను
దైవ శిఖామణి దాపగు మాకును
భావింపఁగ భయపడఁజోటేది

రేకు: 0365-01 హిందోళం సం: 04-381 వైరాగ్య చింత

పల్లవి: కరుణించవే నిజగతి బోధించవే
హరి నిన్ను గొలువక యలసీఁ బ్రాణి

చ. 1: కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁ గాంతలతోడి వేడుకలు
లలి నిందుకుఁగా లంపటములఁబడి
పలుమారు నూరక బడలీఁ బ్రాణి

చ. 2: నిన్నటి యాహార నిజరుచివలెనే
అన్నువ నిప్పటి యాహారము
యెన్న నిందుకే యిడుమలఁ బొరలుచు
కన్న గతులఁ గడుఁ గలఁగీఁ బ్రాణి

చ. 3: పరుసముసోఁకినబంగారమువలె
పరమభాగవతపట్టములు
అరయఁగ శ్రీ వేంకటాధిప నీకృప
యిరవుగఁ గని తుదకెక్కీఁబ్రాణి

రేకు: 0365-02 మంగళకౌశిక సం: 04-382 శరణాగతి

పల్లవి: ముట్టితేనే మూయైఁ బట్టితేనే పంతమయీ
ఇట్టె మమ్ముఁగావవే యిందిరారమణ

చ. 1: తీరుగాఁ బుణ్యముసేసితే జన్మబంధమై
తోరపు నాపాపములైతే దుఃఖమైని
వూరకుంటే నీప్రపంచ ముల్లంఘించినట్లై
యేరీతి నడచువార మిందిరారమణ

చ. 2: అంకె దయఁ దలఁచితే నన్నిటికిఁ దగులై
కొంకక కోపంచితేనే క్రూరమ్మైని
మంకున నూరకవుంటే మదోన్మత్తుఁడై
యింకనేమి సేయువార మిందిరారమణ

చ. 3: యిన్ని చిక్కులునేల యిట్టె శ్రీ వేంకటేశ
మిన్నక నీశరణంటే మేలైని
వెన్నెల నీయర్థమే వేదశాస్త్రసమ్మతై
యెన్న నీవే సేయువాఁడ విందిరారమణ

రేకు: 0365-03 శంకరాభరణం సం: 04-383 వైరాగ్య చింత

పల్లవి: ఎప్పు డేబుద్ధి పుట్టునో యెరఁగరాదు
దెప్పరపు మా బ్రదుకు దేవునికే సెలవు

చ. 1: యేడనుండి పుట్టితిమో యింతక తొల్లి యింక -
నేడకు బోయెదమో యిటమీఁదను
వీడని మాయంతరాత్మ విష్ణుఁడు మా -
జాడ జన్మమతనికే సమర్పణము

చ. 2: గతచన్న పితరు లక్కడ నెవ్వరో
హితవై యిప్పటి పుత్రు లిదియెవ్వరో
మతి మాజీవనమెల్ల మాధవుఁడు
అతనికే మాభోగాలన్నియు సమర్పణము

చ. 3: తొడికి స్వర్గాదులు తొల్లియాడవో యీ -
నడచే ప్రపంచము నాకేడదో
కడఁగి శ్రీ వేంకటేశు గతియే మాది
అడఁగు మా పుణ్యపాపా లతని కర్పణము

రేకు: 0365-04 మలహరి సం: 04-384 నామ సంకీర్తన

పల్లవి: ఇదియే సాధనమిహపరములకును
పదిలము మాపాలి పరమవునామం

చ. 1: కలి దోష హరము కైవల్యకరము
అలరిన మా శ్రీ హరి నామం
సులభము సౌఖ్యము శోభన తిలకము
పలుమారును శ్రీ పతి నామం

చ. 2: పాప నాశనము బంధ విమోక్షము
పైపై నిది భూపతి నామం
స్థాపితధన మిది సర్వరక్షకము
దాఁపి రమిది మాధవ నామం

చ. 3: నేమము దీమము నిత్యకర్మమిది
దోమటి గోవిందుని నామం
హేమము శరణము యిన్నిట మాకును
యే మేర శ్రీ వేంకటేశ్వరు నామం

రేకు: 0365-05 పాడి సం: 04-385 వైష్ణవ భక్తి

పల్లవి: నమ్మిన దిదివో నాపితురార్జిత
మిమ్మిఁహిఁ జూడరో యిది మీదిగాదు

చ. 1: నలినదళాక్షుని నామాంకితమే
నిలువున బాఁతిన నిధానము
కలకాలమిదే గాదెల కొలుచులు
నలుగడ నివియే నాలుక రుచులు

చ. 2: శ్రీ పతి రూపమే చింతించు తలఁపే
పై పై మాయింటి భాగ్యములు
పూఁపలమిత్రులుఁబుత్రాదు లిది
వైపగు మాకిదె వ్యవసాయములు

చ. 3: శ్రీ వేంకటపతి సేవిది యొకటే
భావించు నాయుష్యభౌష్యములు
కైవల్యపద మిదె కాయజసుఖమిదె
సావధానముల సంసార మిది

రేకు: 0365-06 భైరవి సం: 04-386 వేంకటగానం

పల్లవి: సందడి సొమ్ముల తోడి సాకారమిదె వీఁడె
యిందరు వర్ణించరే యీ రూపము

చ. 1: చుక్కలతో నాకాశము సూటై నిలువఁబోలు
నిక్కి రత్నాలజలధినీటు గాఁబోలు
మిక్కిలి నానావర్ణ మేఘపంక్తి గాఁబోలు
యిక్కడనే నిలుచున్న దీరూపము

చ. 2: నించిన పంచవన్నెల నీలగిరి గాఁబోలు
అంచల సంధ్యాకాల మది గాఁబోలు
చించ కాతని మెరుఁగుల చీఁకటిది గాఁబోలు
యెంచఁగ నలవిగాదు యీ రూపము

చ. 3: పున్నమ సమాసయు పోగై నిలువఁబోలు
వున్నతి యోగీంద్రుల యూహ గాఁబోలు
పన్నిన బ్రహ్మాండాల భరణిది గాఁబోలు
యిన్నిట శ్రీ వేంకటేశు యీ రూపము

రేకు: 0366-01 ముఖారి సం: 04-387 దశావతారములు

పల్లవి: అతఁడే యెక్కుడుదైవ మందరికంటే
తతినింకాఁ జెప్పిచూప దైవాలు గలవా

చ. 1: జలధి దచ్చేనాఁడు సకల దేవత లుండ
యెలమి నేదేవుఁ జేరె నిందిరాదేవి
అల గజేంద్రుఁడు మూలమని మొరవెట్టునాఁడు
వెలయ నే దేవుఁడు విచ్చేసి కాచెను

చ. 2: పుడమి గొలుచునాఁడు పొడవైన దేవతలు
కెడసి యెవ్వ రడుగు కింద దాఁగిరి
కడలేని జగములు గల్పించే బ్రహ్మదేవుఁ -
డడరి యే దేవు నాభియందుఁ బుట్టెను

చ. 3: యెంచి నాఁడు దేవతల నింద్రియాల జొక్కించే -
పంచబాణుఁ డేదేవునిపట్టి, యిపుడు
కొంచక శ్రీ వేంకటాద్రిఁ గోరిన వరము లిచ్చి
అంచల లోకములేలీ నండ నే దేవుఁడు

రేకు: 0366-02 లలిత సం: 04-388 నామ సంకీర్తన

పల్లవి: నారాయణ నీ నామమె గతి యిఁక
కోరికలు నాకుఁ గొనసాగుటకు

చ. 1: పై పై ముందట భవ జలధి
దాపు వెనకఁ జింతా జలధి
చాపలము నడుమ సంసార జలధి
తేప యేది యివి తెగనీఁదుటకు

చ. 2: పండె నెడమఁ బాపపు రాశి
అండఁ గుడిని పుణ్యపురాశి
కొండను నడుమఁ ద్రిగుణరాశి - యివి
నిండఁ గుడుచుటకు నిలుకడ యేది

చ. 3: కింది లోకములు కీడునరకములు
అందేటి స్వర్గాలవె మీఁద
చెంది యంతరాత్మ శ్రీ వేంకటేశ నీ -
యందె పరమపద మవల మరేది

రేకు: 0366-03 కాంబోది సం: 04-389 మనసా

పల్లవి: కర్మ మెంత మర్మ మెంత కలిగిన కాలమందు
ధర్మ మిది యేమరక తలఁచవో మనసా

చ. 1: చెలువల పొంతనుంటే చిత్తమే చెదురుఁగాని
కలుగనేర దెంతైనా ఘన విరతి
పులుక కగ్గి పొంతనుంటేఁ గాఁకలేకాక
చలువ గలుగునా సంసారులకును

చ. 2: బంగారువోడ గంటేఁ బట్టనాస పుట్టుఁగాని
సంగతి విజ్ఞానపు జాడకు రాదు
వెంగలి యభిని దింటే వెఱి వెఱాటాడుఁగాక
అంగవించునా వివేక మప్పుడే లోకులకు

చ. 3: శ్రీ వేంకటేశు భక్తి చేరితే సౌఖ్యముగాని
ఆవల నంటవు పాపా లతి దుఃఖాలు
చేవ నమృతము గొంటే చిరజీవియగుఁగాని
చావులేదు నోవులేదు సర్వజ్ఞులకును

రేకు: 0366-04 సామంతం సం: 04-390 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఒకరిబుద్ధులు వేరొకరి పనికిరావు
అకలంకుఁ డింతటికి నంతర్యామి

చ. 1: పొడమించు నాతఁడే పొదలించు నాతఁడే
నొడిగించు నాతఁడే నోరఁగొలఁది
గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల
అడియాలమగులోని యంతర్యామి

చ. 2: మతి యిచ్చు నాతఁడే మరపించు నాతఁడే
గతియౌ నాతఁడే కరుణానిధి
వెతమాన్పు నాతఁడే వెలయించు నాతఁడే
అతిశయమగులోని యంతర్యామి

చ. 3: యిహమిచ్చు నాతఁడే యెదురెదురనే వచ్చి
సహజపుఁ బరమిచ్చు సరి నాతఁడే
విహగ గమనుఁడు శ్రీ వేంకటేశుఁ డితఁడే
అహరహమాదరించు నంతర్యామి

రేకు: 0366-05 రామక్రియ సం: 04-391 కృష్ణ

పల్లవి: కేవల కృష్ణావతార కేశవా
దేవ దేవ లోకనాథ దివ్య దేహ కేశవా

చ. 1: కిరణార్క కోటి తేజ కేశవా
హరి లక్ష్మీ నాయక యాది కేశవ
గిరి రాజసుత నుత కేశవ నమో
శరధి గంభీర శాయి జయ జయ కేశవా

చ. 2: కేకిపింఛావతంస కేశవ
శ్రీ కర గుణాభి రామ చెన్న కేశవ
కేక వాహన వరద కేశవ
పాక శాసన వంద్య భళి భళి కేశవా

చ. 3: కింకర బ్రహ్మాది గణ కేశవ నా -
మాంకిత శ్రీ వేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ -
శంకా హరణ నమో జగదేక కేశవా

రేకు: 0366-06 ముఖారి సం: 04-392 నామ సంకీర్తన

పల్లవి: ఒలపక్షము లేనొక్క దేవు(డవు
నలినాక్ష హరీ నమో నమో

చ. 1: నేరిచిన నే నేరకుండిన నీ
కారుణ్య మొక్కటే కలది
పారి ఘంటాకర్ణుభ క్తికి సరిగా
చేరి శుకాదుల( జేకొంటిగాన

చ. 2: సాదనైన నే( జలమతినైనా నీ
పాదమొక్కటే( నే బట్టినది
పొదైన వసిష్ఠు భక్తికి సరిగా
మేదిని వాల్మీకి మెచ్చితి గాన

చ. 3: యేమిటా శ్రీ వేంకటేశ యెంతైన నీ
నామమొక్కటే నే నమ్మినది
సామజము భక్తి సరిగా నీవును
ప్రేమతో( బ్రహ్లాదు( బెంచితిగాన

రేకు: 0367-01 బౌళి సం: 04-393 దశావతారములు

పల్లవి: ఓహో యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి
సాహసపు గుణముల చతురుఁడా యితఁడు

చ. 1: జలధిలోఁ బవళించి జలనిధి బంధించి
జల నిధి కన్యకను సరిఁ బెండ్లాడి
జలనిధిలో నీఁది జలనిధి మథియించి
జలధి వెరించిన చలమరా యితఁడు

చ. 2: ధరణికిఁ బతియై ధరణి గ్రుంగిన నెత్తి
ధరణికూఁతురుఁ దానె తగఁ బెండ్లాడి
ధరణిఁ బాదము మోపి ధరణి భారము దించి
ధరణీ ధరుఁడైన దైవమా ఇతఁడు

చ. 3: కొండ గొడుగుగ నెత్తి కొండఁ దూఁటువడ నేసి
కొండకిందఁ గుదురై కూచుండి
కొండపై శ్రీ వేంకటాద్రి కోనేటిరాయఁడై
కొండ వంటి దేవుఁడైన కోవిదుఁడా ఇతఁడు

రేకు: 0367-02 శుద్ధవసంతం సం: 04-394 వైరాగ్య చింత

పల్లవి: ఏమని చెప్పెద నిటమీఁద హరీ
శ్రీ మంతుఁడ నినుఁ జేరితి మిదివో

చ. 1: వినుచున్నారము వెనకటిపాట్లు
కనుచున్నారము కలఁగేటివారల
దిన దిన భావము తెలిసీఁ దెలియదు
మనసున భయ మిసుమంతయు లేదు

చ. 2: భువి నెరుఁగుదు మిదె పుట్టెడి దెసలను
తవిలి మరణములు దలఁచెద మట్లనె
వివరపు టాసలు విడిచీ విడువవు
నవమగు విరక్తి నాఁటదు వోయె

చ. 3: చదివెద మిదివో సకల శాస్త్రములు
వెదకెద మిదె శ్రీ వేంకటేశ నిను
మదిలోనుండగఁ మరచివుంటి మిదె
యెదుటఁగంటి మిఁక యేలాపనులు

రేకు: 0367-03 లలిత సం: 04-395 శరణాగతి

పల్లవి: ఆచార విచారా లవియు నే నెరఁగ
వాచామ గోచరపు వరదుఁడ నీవు

చ. 1: తపమొక్కటే నాకుఁ దగు నీ శరణనుట
జపమొక్కటే నిన్ను సారెకు నుతించుట
వుపమొక్కటే నీవె వున్నతుఁడవంట
విపరీత విజ్ఞాన విధులేమి నెరఁగ

చ. 2: కర్మమొక్కటే నీ కైంకర్యగతి నాకు
ధర్మమొక్కటే నీ దాసాను దాస్యము
మర్మమొక్కటే నా మతి నిన్నుఁ దలఁచుట
అర్మిలి నింతకంటే నవల నే నెరఁగ

చ. 3: బలిమియొక్కటే నాకు భక్తి నీపైఁ గలుగుట
కలిమి యొక్కటే నీవు గలవని నమ్ముట
యెలమితో శ్రీ వేంకటేశ నీవు గతిదక్క
పలుబుద్దులు నేఁబొరలు భావనలేనెరఁగ

రేకు: 0367-04 లలిత సం: 04-396 శరణాగతి

పల్లవి: పనిలే దేమియు నాకు పంపుడు నీబంట నింతే
యెనపిన తెడ్డు చౌ లెరుఁగునటవయ్యా

చ. 1: మనసు నీ విచ్చితివి మాఁటలు నీ విచ్చితివి
తనువు నీ విచ్చితివి యంతర్యామీ
చెనసి నీదువల్లఁ జేసేకర్మపు బంట
నినుపుఁగణఁజాల నించుకొనవయ్యా

చ. 2: సత్తున నీ విచ్చితివి చలము నీ విచ్చితివి
తత్తర మిచ్చితివి యంతర్యామి
యిత్తల నావల నీవు యెందుకైనఁ బెరరేఁచి
యెత్తుక యేమైన గడియించుకొనవయ్యా

చ. 3: మాయలు నీ విచ్చితివి మదము నీ విచ్చితివి
ఆయపు శ్రీ వేంకటాద్రి యంతర్యామి
యేయెడ నేఁ జేసేటి యిన్నెపరాధాలు
వేయయిన నీ వెనక వేసుకొనవయ్యా

రేకు: 0367-05 బౌళి సం: 04-397 శరణాగతి

పల్లవి: నిచ్చలూ లోకము చూచి నివ్వెరగయ్యీ నాకు
చెచ్చెర శ్రీ హరి నీ చిత్తము నాభాగ్యము

చ. 1: జీవ మతిసూక్ష్మము చిత్తము చంచలము
భావము నిరాకారము భవమెల్ల నెయ్యము
యే విధులఁ బొరలెనో యిది నాబ్రదుకు
దేవుఁడ నీచిత్తము నాతేఁకువైన భాగ్యము

చ. 2: పూరుపెల్ల గాలి నా వుపమెల్ల మాయ
కూరిమెల్ల మొరఁగు నా గుణము విచారము
నేరుపేదో నేరమేదో నిజము దెలియదు
శ్రీ రమణుఁడవు నీ చిత్తము నా భాగ్యము

చ. 3: కాలము పారేటిదాడి కాయము తూంట్లబొంత
ఆలరి శ్రీ వేంకటేశ యది నీచేఁత
యేలాగు లెరఁగను యిటు నీ శరణనుటే
శీలము నాకు నీ చిత్తము నా భాగ్యము

రేకు: 0367-06 పాడి సం: 04-398 విష్ణు కీర్తనం

పల్లవి: అమ్మే దొకటియును యసిమలోదొకటి యని
కమ్ముకొని నీయందే కలిగె నీమాఁట

చ. 1: సరవితో నిను నుపనిషద్వాక్యములయందు
పురుషోత్తముడవనుచుఁ బొగడఁగాను
అరిది నారాయణివియై యమృత మొసఁగుచో
అరయ శ్రుతిదె విరోధంబాయ నీమాఁట

చ. 2: తలపోయ ధర్మసంస్థాపనుఁడవని నిన్ను
చెలరేఁగి శాస్త్రములు చెప్పఁగాను
తలఁక కిటు గోప పరదారగమనము నీవు
యిలఁ జేయ శాస్త్రవిరహితమాయ నీమాఁట

చ. 3: వైకుంఠపతి వనుచు వడిఁ బురాణములెల్ల
యేకమొకటే వశియించఁగాను
యీకడ శ్రీ వేంకటేశ్వరుఁడవైతి విదె
చేకొలఁది నిటు నీకె చెల్లు నీమాఁట

రేకు: 0368-01 గుజ్జరి సం: 04-399 శరణాగతి

పల్లవి: ఇతరములన్నియునడుమంత్రములే యెంచిచూచినను యింతాను
హితవగుబందుగుఁ డీశ్వరుఁడొకఁడే యితని మరవకుమీ జీవాత్మా

చ. 1: భవకూపంబుల బడలెడినాఁడు పాయనిబంధువుఁడితఁడొకఁడే
దివిస్వర్గంబునఁ దేలెడినాఁడు తిరుగఁబాయకెపు డితఁడొకఁడే
నవనరకంబుల నలఁగెడినాఁడు నటనలఁ బాయఁ డితఁడొకఁడే
యివలనవలహృదయేశుఁడు విష్ణుఁడుయీతనిమరవకుమీ జీవాత్మా

చ. 2: పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయనిబందుగుఁ డితఁడొకఁడే
విశదపు దుఃఖపువేళలనైనా విడువనిబంధువుఁ డితఁడొకఁడే
శిశువైనప్పుడు వృద్ధినప్పుడు చిత్తపుబందుగుఁ డితఁడొకఁడే
దశావతారపు విష్ణుఁడొకఁడే యితఁడని తలఁచుమీ జీవాత్మా

చ. 3: భావజకేలినిఁ జొక్కినప్పుడును ప్రాణబంధువుఁ డితఁడొకఁడే
యీవల నావల నిహపరములలో నిన్నిటిబంధువుఁ డితఁడొకఁడే
దైవము దానని శరణనియెడు నను దగ్గరికాచెను యితఁడొకఁడే
శ్రీవేంకటగిరి నాయకుఁ డితఁడే చేరి భజించుము జీవాత్మా

రేకు: 0368-02 తెలుగుగాంబోది సం: 04-400

పల్లవి: తెగఁగోయుటకు హరి దివ్య నామ కీర్తనము
వెగటు నాయుధ మిది విడువకుమీ మనసా

చ. 1: భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి
యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే
తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని
కవగూడఁ దవిలెను కామపాశములు

చ. 2: పమ్మి లోక పురుణాను బంధవు జీవికి
యిమ్ముల సంసార బంధా లివియుఁ గొన్నే
కమ్మరఁ బుణ్య పాప కలుష బంధాలు గొన్ని
సమ్మతించ భోగములే సకల బంధములు

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె
భావించి కొలిచిన పాయును మాయలన్ని
దేవుఁ డితనినమ్మిన తీరుఁబో దుఃఖములు

రేకు: 0368-03 గుండక్రియ సం: 04-401 శరణాగతి

పల్లవి: హరి నీకే శరణని గెలుచుటగాక
యిరవుగ నెరఁగఁగ నెవ్వరి తరము

చ. 1: తను వికారములు తరవులు వెట్టిన
కొనయెరుకైనా కొరతవడు
మనసు వికారము మమతలఁ దగిలిన
యెనసి యెదురుపడ నెవ్వరి తరము

చ. 2: కంతు వికారము కన్నులఁగప్పిన
పంతపు విరతియు బయలౌను
చింతాలహరులు చీఁదర రేఁగిన
యింతయు వీడ్కొన వెవ్వరితరము

చ. 3: అతిగుణవికార మాసలఁ బెట్టిన
సతతయోగములు జడనుపడు
మతి శ్రీ వేంకటపతి నిన్నుఁ గొలిచిన
యితరము దగ్గర నెవ్వరితరము

రేకు: 0368-04 మాళవిగౌళ సం: 04-402 శరణాగతి

పల్లవి: నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీపాదమే గతి గలిగె

చ. 1: చింతా జలధులఁ జిక్కిన దాఁటించ-
నంతట నీ పాద మదె తేప
కాంతల మోహపు కట్లు దెంచఁగ
పంతపు నీ పాద పరశువు గలిగె

చ. 2: అతిదురితపంక మందినఁ గడుగఁగ
మితి నీ పాదమే మిన్నేరు
రతిఁ గర్మజ్జులు రాఁజిన నార్చఁగ
వ్రతము నీపాదమే వానయై నిలిచె

చ. 3: జిగి నజ్ఞానపు చీఁకటి వాయఁగ
తగు నీ పాదము దయపు రవి
నగు శ్రీ వేంకటనాథ నన్నేలఁగ
మిగులఁగ నీ పాదమే శరణంబు

రేకు: 0368-05 మలహరి సం: 04-403 శరణాగతి

పల్లవి: శరణంబితఁడే సకలము నాకును
వెరవున మనసా వెతకవో యితని

చ. 1: అభయం బొసఁగేటియతఁ డెవ్వఁడు మును
యిభరక్షకుఁడతఁ డెవ్వడు
వుభయ విభూతుల కొడయం డెవ్వఁడు
ప్రభువతఁడే నా పాలి దేవుఁడు

చ. 2: శరణాగతులకు సరి దా పెవ్వఁడు
యిరువుగ శ్రీ పతి యెవ్వఁడు
అరి దుష్టదైత్యహంతకుఁ డెవ్వడు
పరమును నతఁడే నాపాలి దేవుఁడు

చ. 3: ఆది శంఖ చక్రాయధుఁ డెవ్వఁడు
యే దెసఁ బూర్ణు డెవ్వఁడు
వేదమయుఁడు శ్రీ వేంకటపతియై
పాదాయ నిదె నాపాలిదేవుఁడు

రేకు: 0369-01 గుండక్రియ సం: 04-404 మాయ

పల్లవి: ఎఱఁగఁడు పరసుఖ మీశ్వర నీమాయ
నెఱి విచారముల నెగడిన దాఁక

చ. 1: అతిహేయములో నడరు వరాహము
అతిహేయము సుఖమని తలఁచు
మతి సంసారంబే మరగిన యాతుమ
పతిలేని దిదే పరమని తెలియు

చ. 2: పొరి విషయములోనఁ బొడమిన కీటము
అరిది విషమ తీపని తినును
పరగ యోని సంభవమగు దేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును

చ. 3: యింతేసి నిన్నియు నెరఁగిన యీయాతుమ
అంతరాత్మ నీవని తలఁచి
యింతట శ్రీ వేంకటేశ్వర నిన్నే
రంతుల శరణనె రక్షించవే

రేకు: 0369-02 భూపాళం సం: 04-405 నామ సంకీర్తన

పల్లవి: ఇవియే పో ప్రద్యుమ్న యిహ పర సాధనము
భవ జలధుల తేప పరమయోగులకు

చ. 1: వామన గోవింద విష్ణు వాసుదేవ హరి కృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా
నీమహిమ గానలేము నిన్నెంచఁగలేము నీ -
నామజపమే చాలు నాలుక సులభము

చ. 2: అనిరుద్ధ పురుషోత్తమాధోక్షజ ఉపేంద్ర
జనార్ధన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగ లేము నిన్నుఁ దెలియఁగ లేము
నునుపై నీనామమే నోటికి సులభము

చ. 3: నారాయణ పద్మనాభ హృషీకేశ
నారసింహ మధుసూదన త్రివిక్రమ
నీరూపు భావించలేము నిక్కపు శ్రీ వేంకటేశ
ఆరయ నీనామజప మన్నిటా సులభము

రేకు: 0369-03 లలిత సం: 04-406 శరణాగతి

పల్లవి: కన్ను లెదుటిదే ఘన వైకుంఠము
వెన్నుని గొలిచిన విజ్ఞానికిని

చ. 1: తలఁచినదెల్లాఁ దత్వ రహస్యమే
తెలిసిన యోగికి దినదినము
పలికినవెల్లా పరమ మంత్రములె
ఫలియించిన హరి భక్తునికి

చ. 2: పట్టినదెల్లా బ్రహ్మాత్మకమే
పుట్టుగు గెలిచిన పుణ్యునికి
మెట్టినదెల్లా మిన్నేటినిధులే
అట్టడితెగువ మెఱయు వానికిని

చ. 3: వినినవియల్లా వేదాంతములే
ఘనుఁడగు శరణాగతునికిని
యెనసిన శ్రీ వేంకటేశుఁడే యింతా
కొనకెక్కిన నిజ కోవిదునికిని

రేకు: 0369-04 సామంతం సం: 04-407 మాయ

పల్లవి: బాపు బాపు దేవుఁడా పంతపు వోమనసా
వోపెఁగా యిందుకు జీవుఁ డోహో నామాయ

చ. 1: నిన్నటిదినము నేఁడు నిజమో కల్లో
కన్నులఁ గన్నట్లాయఁ గానఁగరాదు
యెన్నఁగ రేపటిదిన మేమో యెట్లో
వున్నట్టు దెలియఁగరాదు వోహో నీమాయ

చ. 2: బాలఁనాటి పుట్టుగిది భ్రమయో నిజమో
గాలినె కాలముఁ బోయ కతలాయను
యీలీల మీఁదిమరణ మేమో యెట్టో
వోలిఁ దెలియఁగరాదు వోహో నీమాయ

చ. 3: నెక్కుఁ మింగినకడి నిజమో కల్లో
గక్కున రుచియుఁ దోచె కానఁగరాదు
యెక్కువ శ్రీ వేంకటేశ యిన్నియు నీదాసుఁడైతే
వొక్కటఁ గానఁగవచ్చు నోహో నీమాయ

రేకు: 0369-05 గుండక్రియ సం: 04-408 అంత్యప్రాస

పల్లవి: వెరగుతో మరచితే వెనక లేదు
కలి వరదుఁడే తక్క గతి యొండు లేఁడు

చ. 1: ఆస విడిచినఁగాని యధిక సుఖము లేదు
యీసు విడిచినఁగాని యిహము లేదు
వాసి విడిచినఁ గాని వైపగు విరతి లేదు
వాసు దేవ భక్తిఁగాని వరముక్తి లేదు

చ. 2: చలము మానినఁగాని సాత్వికగుణము లేదు
పలుశంక వోకకాని ఫలము లేదు
సిలుగింద్రియాల గెలిచినఁగాని త్రోవ లేదు
జలజాక్షుచింతఁగాని సమబుద్ధిలేదు

చ. 3: దైవము కరుణనెకాని తగువిజ్ఞానము లేదు
భావించి చూచినఁగాని బలిమి లేదు
యీవల శ్రీ వేంకటేశుఁ డితడె దైవ మితని
సేవించినంతఁగాని సిద్ధి మరి లేదు

రేకు: 0369-06 భైరవి సం: 04-409 మనసా

పల్లవి: హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా

చ. 1: నలినాక్షుని శ్రీ నామము
కలి దోష హరము కైవల్యము
ఫలసారము బహుబంధ మోచనము
తలఁచవో తలఁచవో తలఁచవో మనసా

చ. 2: నగధరు నామము నరక హరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా

చ. 3: కడఁగి శ్రీ వేంకటపతి నామము
బడిబడినే సంవత్కరము
అడియాలంబిల నతి సుఖ మూలము
తడవవో తడవవో తడవవో మనసా

రేకు: 0370-01 దేవగాంధారి సం: 04-410 శరణాగతి

పల్లవి: ఇందుకు ధ్రువాదు లిటు సాక్షి
చెంది నమ్మవో జీవుఁడ నీవు

చ. 1: కొండలవంటివి ఘోరపాపములు
ఖండించును హరి ఘన నామ జపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడె పరమపదంబు

చ. 2: జలధులవంటివి జననబంధములు
తొలఁగించును హరితూరిన భక్తిది
వెలిఁగించును ఘన విజ్ఞానంబులు
చెలఁగించును బహు సిరిసంపదలు

చ. 3: తోవరాని బహుదుఃఖము లణఁచును
శ్రీ వేంకటపతిఁ జేరిన శరణము
పావనంబుగాఁ బచరించు గుణము
కైవశమగు లోకములెల్లాను

రేకు: 0370-02 భూపాళం సం: 04-411 శరణాగతి

పల్లవి: చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁ బ్రపంచముల
తక్కిన భోగములెల్లా దైవమే యెరుఁగు

చ. 1: అంతరంగమునఁ దాను హరిఁ దలఁచినఁ జాలు
అంతటి మీఁదటి పనులాతఁ డెరుగు
పంతమున నాతనిపై భారము వేసినఁ జాలు
వింత వుద్యోగములు గోవిందుఁడే యెరుఁగు

చ. 2: చేకొని యాతనిరూపు సేవించినఁ జాలు
ఆకడి యీకడి కర్మా లాతఁ డెరుఁగు
తేఁకువ నచ్యుతభక్తి తిరమయ్యినఁ జాలు
దీకొని పరము చూప దేవుఁడే యెరుఁగు

చ. 3: సాధించి మాధవుని శరణుచొచ్చినఁ జాలు
ఆదియు నంత్యములెల్లా నాతఁ డెరుఁగు
పోదియై శ్రీ వేంకటేశుఁ బూజించినఁ జాలు
పాదుకొని రక్షించఁ బరమాత్ముఁ డెరుఁగు

రేకు: 0370-03 లలిత సం: 04-412 మనసా

పల్లవి: మఱచితిమంటే మరిలేదు
తఱితోఁ దలఁచవో దైవపు మనసా

చ. 1: పుట్టుచు నున్నది పోవుచు నున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరినామము
గుట్టున దలఁచవో గొనకొని మనసా

చ. 2: పొద్దు వొడుచునదె పొద్దు గుంకునదె
తిద్దిన జగముల దినదినము
అద్దపు నీడల యంతర్యామిని
వొద్దనె తలఁచెనొనరవొ మనసా

చ. 3: లోపల వెలుపల లోఁగొనివున్నది
శ్రీపతి మహిమల సృష్టియిదే
యేపున శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడే
దాపని నమ్ముచుఁ దలఁచవో మనసా

రేకు: 0370-04 సామంతం సం: 04-413 హనుమ

పల్లవి: చెల్లె నీచేఁతలు నీకే చేరి మేడెగుడిదిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతురాయ

చ. 1: జంగ చాఁచినట్టి నీ సంగడి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁజేర్చినచేయి
అంగమాయ నీ సొబగు హనుమంతరాయ

చ. 2: పెరిగినవాలము పెద్దైన పిరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారు కాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీవునికి హనుమంతరాయ

చ. 3: స్వామి కార్యపుఁ జింత జానికి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామ నామ జపముతో రతి శ్రీ వేంకటపతి-
కా మేటి బంటవైతివి హనుమంతరాయ

రేకు: 0370-05 లలిత సం: 04-414 గురు వందన, నృసింహ

పల్లవి: నేనై విడువవద్దు తానై తగులవద్దు
తానే తానై వుంటేఁ దగులెల్ల నూడు

చ. 1: పొద్దు వొద్దు హరిఁ దలఁపున దలపోయఁగ
వొద్దికైన పలుచేత లున్న వెల్లా మరచును
నిద్దిరించువాని చేత నిమ్మ పంటివలెనే
బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును

చ. 2: పలుమారు గురుసేవఁ బరగఁగా బరగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానముఁ బొడచూపు
కలగన్నవాఁడు మేలుకనిన కలవలెనే
పలుసంసారములెల్ల భావనలై యుండును

చ. 3: పక్కన శ్రీ వేంకటేశుపై భక్తి వొడమఁగా
అక్కజపు టిహపరా లరచేతివి యౌను
చొక్కపు పరుసమంటి సొంపుగానిలోహము
నిక్కఁ బైఁడైనట్టు నెరుసెల్లఁ దొలఁగును

రేకు: 0370-06 శంకరాభరణం సం: 04-415 నృసింహ

పల్లవి: పరగీనదివో గద్దెపై సింహము వాఁడె
పరమైన యౌభళ నారసింహము

చ. 1: తెల్లని మేని సింహము దేవ సింహము
మెల్లని చిరునవ్వుల మేటిసింహము
చల్లేటియూరుపులతో జయసింహము వాఁడె
బల్లిదుఁడై వెలసే యౌభళ నారసింహము

చ. 2: నిలుచున్నసింహము నిత్యసింహము
అలరుఁ గొండలమీఁది యాదిసింహము
వెలుపలి కడపపై వీరసింహము
పలుకుఁ బంతము (ల) యౌభళనారసింహము

చ. 3: పుట్టుజడలసింహము పూర్ణసింహము
అట్టడి యార్పుల యాఅడిసింహము
జట్టి గొన్న దాసులకు శాంత సింహము
పట్టపు శ్రీ వేంకటయౌభళ నారసింహము

రేకు: 0371-01 బౌళి సం: 04-416 శరణాగతి

పల్లవి: అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
తడతాఁకులతాపత్రయము మానుపుటకు

చ. 1: శరణు శరణు వోసర్వేశ్వర నీకు
మరణభయములెల్ల మానుపుటకొఱకు
మొరయొ మొరయొ నీకు ముకుంద మాధవ
దురితములిన్నియుఁ దొలఁగించుటకు

చ. 2: దండము దండము నీకు దైవశిఖామణి
పండియుఁ బండని మతి పాకముసేయు కొరకు
అండనే దాస్యము దాస్యము నీకు నేనైతి
నిండు నీకరుణ నాపై నించేటి కొరకు

చ. 3: అభయ మభయము శ్రీయాదినారాయణ
వుభయకర్మము నాకు నూడుచుట కొరకు
విభుఁడ శ్రీ వేంకటేశ వినుతి సేసెద నిన్ను
శుభములన్నియు మాకుఁ జూపేటి కొరకు

రేకు: 0371-02 గుండక్రియ సం: 04-417 అధ్యాత్మ

పల్లవి: నీచమైననావల్ల నెరవై దైవమా
చీ చీ యిన్నివిధులఁ జిక్కువడె బదుకు

చ. 1: యెదుటివేమైనఁ గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమటపడుఁ దాను
కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంక తుంగ విధమాయ మనసు

చ. 2: యెక్కడికైన నేఁగు నెరఁగక తనువు
అక్కడ దుర్లభమైతే నంతలో వేసారు
దక్కి యందే సుఖమైతేఁ దానే విఱ్ఱవీఁగు
గక్కున రొంపలోని కంభమాయఁ దనువు

చ. 3: యెందుకైన సమ్మతించు నిరవైన జీవుఁడు
చెందిన పసిఁడికి చెలులకే మత్తుఁడౌను
కందువ శ్రీ వేంకటేశ కరుణించవయ్య యింక
పొంది పూటచెలమాయఁ బుట్టుగుల సివము

రేకు: 0371-03 లలిత సం: 04-418 శరణాగతి

పల్లవి: హరి నీమయమే అంతాను
అరసి నీకు శరణనియెద నేను

చ. 1: యెదుట నెవ్వరిఁక నేమాటాడిన
అది నీ ఘన నామాంకితమే
అదివో సకల శబ్దాఖ్యుఁడవని నిన్ను
పొదలి చదువులు పొగడీఁగాన

చ. 2: యెవ్వరిఁ బొడగని యెక్కడనుండిన
నివ్వటిల్ల నది నీ రూపే
నెవ్వటీర నిదె నిను విశ్వరూపుఁ
డెవ్వల నని శ్రుతులెంచీఁ గాన

చ. 3: భావన యిది నీ బ్రహ్మాత్మకమే
శ్రీ వేంకటేశ నాచింత యిదే
ఆవల నిను సర్వాంతర్యామెని
దేవ శాస్త్రములు తెలిపీఁ గాన

రేకు: 0371-04 బౌళిరామక్రియ సం: 04-419 శరణాగతి

పల్లవి: కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁ బాడెద నేను

చ. 1: నీ పాద తీర్థము నీరజ భవుని
పై పై కమండల పానీయము
చేపట్టి శంభుని చిరు జడలలో
దీపించు గంగా తీర్థరాజము

చ. 2: ఘన నీ నామమె గౌరి నాలికపై
పనిగొన్న మంత్రపాఠము
అనుఁగువాణికి నాదిచదువులఁ
జొనఁచే మొదలి బీజాక్షరము

చ. 3: శ్రీ వేంకటేశ్వర చేరి నీ దాసుల
సేవ నా పాలిఁటి జీవనము
ఆవిటించి శరణాగతులకును
త్రోవయైన దిదె దోషహరము

రేకు: 0371-05 కన్నడగౌళ సం: 04-420 దశావతారములు

పల్లవి: ధరలోను జనహితము నానా భక్తరక్షణము నడపఁ గదయ్యా

చ. 1: హరీ నీకు నాగపాశబంధనమది నీమహిమకు నటు వెలితా
తరవాతను రావణాది యసురల తలలు నరకుట ప్రతాపముగాదా

చ. 2: మును నీపై నొక భూతము నడచిన మొగి నీమహిమకు నది వెలితా
ఘనహుంకారము మాత్రమున డచినందు నే కడకుఁ దరముట ప్రతాపముగాదా

చ. 3: కలియుగమున శ్రీవేంకటగిరిపైఁ గదిసిన నీమహిమకు వెలితా
కలిమల మథనుఁడ కల్క్యవతారము గయికొనుటచటఁ బ్రతాపముగాదా

రేకు: 0371-06 దేవగాంధారి సం: 04-421 అంత్యప్రాస

పల్లవి: హరి నీకేనే రుణ మత్తుఁగాక తగవైతే
వొలిమ నొకరియ్యఁగ నొకరికి బిద్దుటా

చ. 1: మొలచు జననలోకమునకు నుదుట వ్రాసే
బలుఁడ నీచే నేఁ బత్రసాల మందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు రుణము
యిల నత్తునట యివి యేనాటి రుణము

చ. 2: యేయెడ నేమిసేసి యేలోకమందున్నా
పాయని నీవే నాకు ప్రాణబంధుఁడవైతి
కాయపుఁ జుట్టరికాలు ఘన కరుణానుబంధ
మీయెడఁ గలిగెనట యేనాటి రుణము

చ. 3: శ్రీవేంకటేశ నీవీ చిక్కులఁబెట్టి నాకు
కావిరిఁ గర్మాలు మెడఁ గట్టితివిగా
సోవల నీ శరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాఁటి రుణము

రేకు: 0372-01 శ్రీరాగం సం: 04-422 నామ సంకీర్తన

పల్లవి: విన్నప మిదే నీకు వేవేలు విధముల
నన్నుఁ గావవే హరి నమో నమో

చ. 1: నీగుణము నేనెరిఁగి నిన్నుఁ గొలువనేర
నాగుణము నీవెరిఁగి నన్ను నేలుకొనవయ్య
సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
నాగశయనుఁడ హరి నమో నమో

చ. 2: నీవున్నచో టెరిఁగి నిన్నుఁ దలఁచనేర
నావున్నచో టెరుఁగుదు నన్ను నీవు దలఁచవే
కోవిదుఁడ నారఁ బేరుకొన్నవానిఁగాచినట్టు
నావొడయ హరిహరి నమో నమో

చ. 3: మనసులో నున్న నిన్ను మరవకుండ నేర
మనసులోని నీవే నామరపు దెలుపవయ్య
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీ వేంకటేశ నమో నమో

రేకు: 0372-02 సామంతం సం: 04-423 శరణాగతి

పల్లవి: ఇన్నివిధాలు యిఁకనేల ప్ర -
పన్నుఁడై మీఁద బహువిధులేలా

చ. 1: సతతభూతదయ సత్యవాక్యము గలితే
కుతిలపు ధర్మాలగొడవలేలా
ప్రతిలేనివిజ్ఞానభావశుద్ధి గలిగితే
మతకపుఁ గర్మాలు మరియేలా

చ. 2: పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను
సందడిలోఁ దీర్థాచరణలేలా
నిందమాని యాసమాని నిర్మలచిత్తులయితే
వందడైన వుపవాస వ్రతము లేలా

చ. 3: శ్రీ వేంకటపతి చింతనము గలిగితే
పావనపు శాస్త్రాల పఠనలేలా
ఆవల నీతని దాసులందుఁ బ్రేమ గలిగితే
కావరపుటితర సంగతులేలా

రేకు: 0372-03 లలిత సం: 04-424 సంస్కృత కీర్తనలు

పల్లవి: తథాకురుష్వ ముదా మామద్యేవ
అధోక్షజస్తే అనుదాసోహం

చ. 1: తవాస్మి శరణం దహరాహం
భవదురితాని భంజ మమ
భువి కృతం చ యా పురా ప్రతిజ్ఞాం
జవన దదామి సర్వేభ్య ఇతి

చ. 2: వ్రజామి శరణం వరద తవాహం
త్యజితానుబంధ దర్మ మమ
భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యామీతి

చ. 3: చింతితం మయా శ్రీ వేంకటేశ
కింతు త్వం మయి కృపాంకురు
తంతుహి పురాకృతం ప్రతిజ్ఞాం
అంతగతిం నయామీతి మహి

రేకు: 0372-04 భూపాళం సం: 04-425 నామ సంకీర్తన

పల్లవి: నీనామమే మాకు నిధియు నిధానము
నీనామమె యాత్మనిధానాంజనము

చ. 1: నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదన
నమో త్రివిక్రమ నమో వామనా

చ. 2: నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ
నమో ప్రద్యుమ్నతే నమో యనిరుద్ధా

చ. 3: నమో పురుషోత్తమ నమో యధోక్షజ
నమో నారసింహ నమో యచ్యుత
నమో జనార్దన నమో ఉపేంద్ర
నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణా

రేకు: 0372-05 రామక్రియ సం: 04-426 అంత్యప్రాస

పల్లవి: ఎంతలేదు చిత్తమా యీఁతలేల మోఁతలేల
వంతులకుఁ బారనేల వగరించనేలా

చ. 1: దక్కనివి గోరనేల తట్టుముట్టు పడనేల
చిక్కినంతకే సంతసించరాదా
ఒక్కమాఁటే వుప్పుదిని వుపతాప మందనేల
చక్కజాడఁ దగినంతే చవిగొనరాదా

చ. 2: పారి పారి వేఁడనేల బడలిక పడనేల
మీరి దైవమిచ్చినంతే మెచ్చరాదా
వీరిడై పొడవెక్కి విరుగఁబడఁగనేల
చేరి యందినంతకే చేచాఁచరాదా

చ. 3: జీవులఁ గొలువనేల సిలుగులఁ బడనేల
శ్రీవేంకటేశుఁ డాత్మఁ జిక్కివుండఁగా
దావతి పడఁగనేల దప్పులం బొరలనేల
కైవశమైనందుకే గతిగూడరాదా

రేకు: 0372-06 వరాళి సం: 04-427 రామ

పల్లవి: శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే
దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే

చ. 1: పదునాలుగేండ్లును బాసి నీ కెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి
కదిసి నీ శరణంటే కరి రాజు నెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి

చ. 2: ప్రక్కన నహల్య శాప విమోచనముగాఁగ
అక్కర తోడుతను బ్రత్యక్షమైతివి
చక్కఁగాఁ దపము సేసే శబరియెదుట నీవు
అక్కడ నాఁ డందునుఁ బ్రత్యక్షమైతివి

చ. 3: భావించినట్టు మతిఁ బరమ యోగులకెల్ల
తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి
శ్రీ వేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు
దైవమవై యిప్పుడే ప్రత్యక్షమైతివి

రేకు: 0373-01 రామక్రియ సం: 04-428 వైరాగ్య చింత

పల్లవి: తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ

చ. 1: తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశమె ట్టోరిచెనో
కట కటా యిట్లాయఁ గలి కాల మహిమ

చ. 2: అంగలాచే కామినుల యంగ భంగపు దోఁపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టుచూచెనో
పొంగు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయఁ కలికాలమహిమ

చ. 3: అరుదు గోహత్యలు సేయఁగ దూడ లంగలావ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధన చూరకెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాలమహిమ

చ. 4: దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత వుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలి కాలమహిమ

చ. 5: నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలే కలికాలమహిమ

చ. 6: వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దుఃఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుఁబాపాలు నిండెఁ గలికాలమహిమ

చ. 7: తలలు వట్టీడువఁగా తల్లులు బిడ్డలవేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కలుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ

చ. 8: దీనత లోఁబడి గుండెదిగు లసురుసురులు
వానినెట్లు లోఁగొనో వాయుదేవుఁడు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ

చ. 9: పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ

రేకు: 0373-02 లలిత సం: 04-429 వైష్ణవ భక్తి

పల్లవి: నీవు నాసొమ్మువు నేను నీసొమ్ము
యీవల నీవెపుడు మాయింటనుండఁ దగవా

చ. 1: హరి నీరూపము నాకు నాచార్యుఁడు మున్నె
కెరలి నాపాల నప్పగించినాఁడు
నరహరి నిను నే న్యాయమునఁ దెలియను
పొరఁబడి నీ కెందుఁ బోఁదగునా

చ. 2: జనని నీదేవి లక్ష్మి జనకుఁడవు నీవె
తనువులు నాత్మబాంధవము నీవె
అనయము నేనెంత యపరాధినైనాను
పనివడి నీవు నన్నుఁ బాయఁదగునా

చ. 3: బహువేదములు నిన్ను భక్తవత్సలుఁడవని
సహజబిరుదు భువిఁ జాటీని
యిహమునఁ శ్రీ వేంకటేశ యిది దలఁచైన
విహితమై నాకడకు విచ్చేయవే

రేకు: 0373-03 బౌళి సం: 04-430 భక్తి

పల్లవి: ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మాకిటువలె
పొంది యీతనిఁ బూజించ బొద్దాయనిపుడు

చ. 1: ధారుణి మైరావణు దండించి రాముఁదెచ్చి
నేరుపుమించిన యంజనీతనయా
ఘోరనాగపాశములఁ గొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా

చ. 2: నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పొనిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడై కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండినుంచుకొన్న పొటుబంట యర్జునా

చ. 3: శ్రీ వల్లభునకు నశేషకైంకర్యముల
శ్రీ వేంకటాద్రి వైన శేషమూరితీ
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే

రేకు: 0373-04 తోడి సం: 04-431 భక్తి

పల్లవి: స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే -
నతికమై యాడినట్లు ఆడఁబోయేవా

చ. 1: యెంత నీ మనసును యెట్టుండె నట్లనే
అంతయుఁ జేయవయ్య మాకదే చాలు
అంతకంటే నెక్కుడు నేమంటిమివో యటమీఁదఁ
జెంతల మా చెప్పినట్టు సేయఁబోయేవా

చ. 2: కమ్మి నీవు మునుప సంకల్పించినట్లనే
కిమ్ముల నా రీతిఁ జిత్తగించవయ్య
అమ్మరో నేమందుకుఁ గాదనినను నీవు
సమ్మతించి మాతలఁపు సాగనిచ్చేవా

చ. 3: పొంచీదేహమున మమ్ముఁ బుట్టించినట్లనే
పెంచి నీపై భక్తిమాకుఁ బెనచవయ్య
నించిన శ్రీవేంకటేశ నేనే పదరితిఁగాక
మంచితనములు నీవు మానఁబోయేవా

రేకు: 0374-01 సామంతం సం: 04-432 గురు వందన, నృసింహ

పల్లవి: వెనకముందరికిఁ బెద్దలకెల్లను వివరపుసమ్మతి యీ వెరవు
వెనుకొని తనగురునాథుని యనుమతి వేదోక్తంబగు నీ తెరువు

చ. 1: కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొకతెరువు
వనితల భ్రమలను వలలఁ దగులని మది వైకుంఠమునకు నొకతెరువు
మునుకొపముఁ బెడఁబాసిన మతి మోక్షంబునకును నొకతెరువు
యెనసి యిందుప హరిఁదలఁచినమతి యిన్నిటికెక్కుడు యీ తెరువు

చ. 2: నిరతి విషయముల నణఁచిన దృఢమతి నిశ్శ్రేయమున కొకతెరువు
విరతితోడ నెలవై నమతి విభవపుఁ బరమున కొకతెరువు
వెరపున నిందరిమీఁదటిసమమతి విష్ణులోకమున కొకతెరువు
యిరవెరిఁ గంతట హరి నమ్మినమతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు

చ. 3: పన్నినకోరిక తెగఁగోసినమతి పరమపదమునకు నొకతెరువు
వున్న విచారములుడిగించినమతి వున్నతపదమున కొకతెరువు
సన్నుతి భగవద్దాసుల దాస్యమె చలమతి ముక్తికి నొకెతెరువు
యిన్నిట శ్రీవేంకటపతిశరణమె హితమతి నెక్కుడు యీ తెరువు

రేకు: 0374-02 గుజ్జరి సం: 04-433 మాయ

పల్లవి: కూడుదు రూరకె వొకచో గుమి విత్తురు వేరొకచో
యేడకో తెరువులు నడతురు యేఁటిదో హరిమాయ

చ. 1: కొందరు జీవులు పురుషులు కొందరు కాంతలు
కొందరు గొందరు నానాకువలయజంతువులు
యిందరుఁగూడుక భువిలో నేమోయేమో చేసెద -
రెందును నేమియుఁ గానరు యిట్టిది హరిమాయ

చ. 2: జననంబులు మరణంబులు జమునుదయాస్త మయంబులు
జనులివిగనుచునె కనకము సరినార్జింపుదురు
పొనుగుచు నిలిచినదేదో పోయినదేదో కానము
యెనగొని వెరగయ్యీనిదె యిట్టిది హరిమాయ

చ. 3: జీవులకీ బ్రహ్మాండము చీమలపుట్ట విధంబున
కావరమిటు గప్పున్నది కాలత్రయములను
తావుల శ్రీవేంకటపతి దాసులు చొరకిటు నవ్వఁగ
యీవల నావలఁ బొదిగీ నిట్టిది హరిమాయ

రేకు: 0374-03 శోకవరాళి సం: 04-434 గురు వందన, నృసింహ

పల్లవి: నడవరో జడియక నవ్యమార్గ మిది
మడుఁగిది వైష్ణవమార్గ మిది

చ. 1: ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది
జనకాదులు నిశ్చలమార్గ మిది
సనత్కుమాఁరుడుజరపుమార్గ మిది
మనువుల వైష్ణవమార్గ మిది

చ. 2: నలుగడ వసిష్ఠు నడుచు మార్గమిది
యిల వేదవ్యాసుల మార్గం బిది
బలిమిగలుగు ధ్రువ పట్టపు మార్గము
మలసిన వైష్ణవ మార్గ మిది

చ. 3: పరమమార్గం బిదె ప్రపంచమార్గము
గురుమార్గం బిదె గోప్య మిదే
గరిమెల శ్రీ వేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గ మిదే

రేకు: 0374-04 ముఖారి సం: 04-435 అధ్యాత్మ

పల్లవి: సమ్మతించి కనుకొండ సరుస నిశ్చలబుద్ధి
యెమ్మె నెంత బోధించినా నెక్కుడేల కలుగు

చ. 1: తలఁపులో కొలఁది దైవము, తనవల్ల
గల విరతికొలఁది ఘనసుఖము
తెలిసిన కొలఁదే తేటల విజ్ఞాన, మందు -
నెలమి నెవ్వరికైన నెక్కుడేల కలుగు

చ. 2: తపము కొలఁదియే తరువాతి ఫలమును
వుపమ కొలఁదియే యోగమును
ప్రపత్తి కొలఁదియే భాగవత భక్తియును
యెపుడు నెవ్వరికైనా నెక్కుడేల కలుగు

చ. 3: చెంది చేసిన కొలఁదే శ్రీ వేంకటేశు సేవ
అంది పొందిన కొలఁదే యానందము
కందువ నీతని కృప గల కొలఁదే యింతాను
యెందును దక్కిన వారి కెక్కుడేల కలుగు

రేకు: 0374-05 బౌళి సం: 04-436 నామ సంకీర్తన

పల్లవి: వెదకిన నిదియే వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు

చ. 1: మునుకొని అవయవములు యెన్నైనా
పనివడి శిరసే ప్రధానము
యెనలేని సురలు యెందరు గలిగిన
మునుపటి హరియే మూలంబు

చ. 2: మోవని యింద్రియములు యెన్నైనా
భావపు మనసే ప్రధానము
యీవల మతములు యెన్ని గలిగినా
మూవురలో హరి మూలంబు

చ. 3: యెరవగు గుణములు యెన్ని గలిగినా
పరమ జ్ఞానము ప్రధానము
యిరవుగ శ్రీ వేంకటేశ్వరు నామమే
సరవి మంత్రముల సారంబు

రేకు: 0375-01 బౌళి సం: 04-437 వైరాగ్య చింత

పల్లవి: ఎప్పటిజీవుఁడే యెప్పటిజగమే యెంతగాలమును నీరీతే
కప్పుకవచ్చితి వనాదినుండియు కర్మమ యింకా వేసరవా

చ. 1: మఱచితివా తొలుజన్మంబుల మరణకాలములదుఃఖపుబాట్లు
మఱచితివా యమకింకరులయి మర్దించిన బహుతాడనలు
మఱచితివా నరకకూపముల మాఁటికి మాఁటికిఁ బరచిన బాధలు
మఱియును సుఖమని భవమే కోరెదు మనసా ముందరగానవుగా

చ. 2: తలఁచవుగా జననకాలమునఁదనువిదియే యిటుపుట్టిన రోఁతలు
తలఁచవుగా బాల్యంబునఁ దల్లితండ్రుల శిక్షలు వ్యాధులును
తలఁచవుగా సంసారమునకును దైన్యంబును యాచించేటి యలమట
తలఁపుననిదియే వలెనని వోమెదు తనువా యింకా రోయవుగా

చ. 3: కంటివిగా మలమూత్రాదుల కడుగఁగఁ దీరని దినదినగండము
కంటివిగా కనురెప్పలనే కాలముగడచేటికడత్రోవ
కంటివిగా శ్రీవేంకటపతి కరుణచేత నీ వివేకభావము
అంటి యిటువలెనె సార్వకాలమును అంతరాత్మ నినుఁదలఁచగా

రేకు: 0375-02 లలిత సం: 04-438 గురు వందన, నృసింహ

పల్లవి: అన్నిమంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశు మంత్రము

చ. 1: నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహ మంత్రము
కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము
వేరె నాకుఁగలిగె వేంకటేశు మంత్రము

చ. 2: రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుఁడు జపించె
నంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము

చ. 3: యిన్ని మంత్రములకెల్ల యిందిరా నాథుఁడే గురి
పన్ని నదిదియే పర బ్రహ్మమంత్రము
నన్నుఁ గావఁ కలిగెఁబో నాకు గురుఁడియ్యఁగాను
వెన్నెలవంటిది శ్రీ వేంకటేశు మంత్రము

రేకు: 0375-03 వరాళి సం: 04-439 వైరాగ్య చింత

పల్లవి: హరిఁ గొలిచినఁగాని ఆపద లణఁగవని
యెరఁగక పొరలితి మిందేమి నిజము

చ. 1: పుట్టిన దేహమొకటి పొందిన వికారాలఁ
బట్టిన జీవుఁడొకఁడు ప్రాణములేడు
కట్టిడి చిత్తమొకటి కరణములైతేఁ బది
యిట్టిదివో మాజన్మ మిందేది నిజము

చ. 2: మొదలి ప్రకృతొకటి ముంచిన గుణాలు మూఁడు
కదియు మోహ మొకటి కర్మాలు పెక్కు
పొదలుఁగర్మ మొకటి భోగా లనంతములు
యిదివో మా జన్మ మెంచ మిందేది నిజము

చ. 3: అంతరాత్మ శ్రీ వేంకటాద్రీశుఁ డొక్కఁడే
చింతించ జీవులైతే సేనాసేన
అంతలో నీతని శరణని బ్రతికితిఁగాక
యెంతలేదు మాజన్మ మిందేది నిజము

రేకు: 0375-04 ముఖారి సం: 04-440 శరణాగతి

పల్లవి: ఇదివో తెరమరఁ గిహ పరములకును
వెదకి కన్నమీఁదఁ విచారమేలా

చ. 1: హరికుక్షిగతమే యఖిలలోకములెల్ల
నరకము స్వర్గమన్న నయమెంచనేలా
యిరవై యుండినచోనే యిటు హరిదాసుఁడైతే
పరమ పదము నదే భ్రమయఁగనేలా

చ. 2: అందరి లోపల హరి యంతరాత్ముఁడై యుండ
యిందును నరసురలని యెంచఁగనేలా
అందిన మనసులో హరి భక్తి గలిగిన-
నందునే మోక్షము దప్ప దనుమానమేలా

చ. 3: ఘటన శ్రీ వేంకటేశుక ల్పితమై జన్మములు
యిటు సుఖదుఃఖములు యెంచుకొంటేలా
సటలేక యాతని శరణము చొచ్చితేనే
పటు జీవన్ముక్తి యదే పలు మాటలేలా

రేకు: 0375-05 దేశి సం: 04-441 విష్ణు కీర్తనం

పల్లవి: హరి నీవే సర్వాత్మకుఁడవు
యిరవగు భావన యియ్యఁగదే

చ. 1: చూడక మానవు చూచేటి కన్నులు
యేడనేవైనా యితరములు
నీడల నింతా నీ రూపములని
యీడువడని తెలి వియ్యఁగదే

చ. 2: పారక మానదు పాపపు మన సిది
యీరసములతో నెందైనా
నీరజాక్ష యిది నీమయమేయని
యీరీతుల తలఁ పియ్యఁ గదే

చ. 3: కలుగక మానవు కాయపు సుఖములు
యిల లోపలఁ గల వెన్నైనా
అలరిన శ్రీ వేంకటాధిప నీకే
యిలనర్పితమను యిహ మియ్యఁగదే

రేకు: 0376-01 లలిత సం: 04-442 శరణాగతి

పల్లవి: అతఁడేయెరుఁగును మముఁబుట్టించిన యంతరాత్మయగు నీశ్వరుఁడు
అతికీ నతుకదు చిత్తశాంతి యిదె ఆత్మవిహారం బిఁక నేదో

చ. 1: కనుచున్నారముసూర్యచంద్రులకుఘనవుదయాస్తమయములు
వినుచున్నారము తొల్లిటి వారల విశ్వములోపలికథలెల్లా
మనుచున్నారము నానాఁటికి మాయలసంసారములోన
తనిసీఁదనియము తెలిసీఁదెలియము తరువాతి పనులిఁక నేవో

చ. 2: తిరిగెద మిదివో ఆసలనాసల దిక్కుల నర్థార్జన కొరకు
పొరలెద మిదివో పుణ్యపాపములభోగములందే మత్తులమై
పెరిగెద మిదివో చచ్చెడి పుట్టెడి భీతిగలుగు దేహములోనే
విరసము లెరఁగము మరచీ మరవము వెనకటికాలము విధియేదో

చ. 3: అట్టెనారము హరినుతిచే నాఅడి గురువనుమతిని
పట్టినారమిదె భక్తిమార్గమిదె బలువగు విజ్ఞానముచేత
గట్టిగ శ్రీవేంకటపతి శరణని కంటి మిదివో మోక్షము తెరువు
ముట్టిముట్టము పట్టీపట్టము ముందటి కైంకర్యంబేదో

రేకు: 0376-02 మాళవిగౌళ సం: 04-443 హనుమ

పల్లవి: ఇతఁడే యతఁడు గాఁబో లేలిక బంటును నైరి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు

చ. 1: జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరకే దాఁటె హనుమంతుఁడు
అలుకతో రావణుని యద టణఁచె నతఁడు
తలఁచి మైరావణుని దండించె నితఁడు

చ. 2: కొండ వెల్లగించెఁ దొల్లి గోవర్ధనుఁ డతఁడు
కొండతో సంజీవియెత్తెఁ గోరి యితఁడు
గుండు గరఁచె నహల్యకొరకు సీతాపతి
గుండు గరఁగఁగఁ బాడె కోరి యితఁడు

చ. 3: అంజనా చలముమీఁద నతఁడు శ్రీ వేంకటేశుఁ
డంజనీ తనయుఁ డాయ ననిలజుఁడు
కంజాప్తకులరామఘనుఁడు దాను దయా -
పుంజమాయ మంగాబుధి హనుమంతుడు

రేకు: 0376-03 సామంతం సం: 04-444 హనుమ

పల్లవి: మంగాంబుధి హనుమంతుని శరణ
మంగవించితిమి హనుమంతా

చ. 1: బాలార్కబింబము ఫల మని పట్టిన
ఆలరి చేఁతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలిఁజేకొనిన వో హనుమంతా

చ. 2: జలధిదాఁటి నీ సత్యము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమిఁ బెరిగితివి భళీ హనుమంతా

చ. 3: పాతాళము లోపలి మైరావణు -
నాతలఁ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి-
నీతలఁ గొలిచే హిత హనుమంతా

రేకు: 0376-04 శంకరాభరణం సం: 04-445 శరణాగతి

పల్లవి: కదిసి యాతఁడు మమ్ముఁగాచుఁగాక
అదె యాతనికె శరణంటే నంటి నేను

చ. 1: యెవ్వని వుదరమున నిన్నిలోకములుండు
యెవ్వని పాదము మోచె నిల యలను
యెవ్వఁడు రక్షకుఁ డాయ నీ జంతుకోట్లకు
అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు

చ. 2: సభలో ద్రౌపదిఁ గాచె సర్వేశుఁ డెవ్వఁడు
అభయహస్త మొసంగె నాతఁ డెవ్వఁడు
ఇభవరదుఁ డెవ్వఁడు యీతనికే వొడిగట్టి
అభినవముగ శరణంటే నంటి నిప్పుడు

చ. 3: శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు
అరిది యజునితండ్రి యాతఁ డెవ్వఁడు
యిరవై శ్రీ వేంకటాద్రి యెక్కి నాతఁ డితఁడే
ఆరసి యితనికే శరణంటే నంటి నిప్పుడు

రేకు: 0376-05 భైరవి సం: 04-446 అంత్యప్రాస

పల్లవి: అనాది విషయ విహారము గన ఆతుమ
అనేకమై వీఁగె నందుకే యీ యాతుమ

చ. 1: అన్నిట కర్మపుఁబంక మంటిన దీయాతుమ
మున్ను కోప దుర్గంధములఁ బాఁగె నీ యాత్మ
పన్ని భవముల తుప్పు పట్టిన దీయాతుమ
యెన్నఁడు సుజ్ఞాన మింక నెరిఁగీనో యాత్మ

చ. 2: చెంచెలపుఁ దిప్ప పెంటఁ జివికిన దీయాత్మ
పంచలయాసల నురిఁబడిన దీయాత్మ
కంచపు భోగపుఁగాఁక గరివడీ నీయాత్మ
యెంచి విజ్ఞానమెన్నఁ డెరిఁగీనో యాత్మ

చ. 3: యెలమితో శ్రీ వేంకటేశు కృప నీ యాత్మ
తెలిసి యించుకించుక తేటపడె నాత్మ
అలరి యాచార్యుని అధీనమైనాత్మ
మలసి యజ్ఞానమెట్టు మరచెనో యాత్మ

రేకు: 0377-01 లలిత సం: 04-447 శరణాగతి

పల్లవి: నిఖిలమింతయు మేలు నేనే తీలు
మఖరక్షకుఁడ నన్ను మన్నించవే

చ. 1: నిండును జలనిధులైనా నెఱి నేటిమొత్తములచే
నిండదు నామనసైతే నిచ్చా యాసల
పండును లోకములోని బహువృక్షతతులైనాఁ
బండదు నామనసైతే బహువిషయముల

చ. 2: తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి
తనియదు నామనసు ధనకాంక్షల
వొనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు
పొనిగి యే పొద్దు శాంతిఁబొందదు నామనసు

చ. 3: లోకములోఁ గఠినపు లోహమైనాఁ గరఁగును
కై కొని నామతి గరఁగదు భ్రమసి
యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను
నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే

రేకు: 0377-02 గుండక్రియ సం: 04-448 ఉపమానములు

పల్లవి: సిబ్బితి పడఁగనేల చింతలఁ బొరలనేల
గొబ్బున మొదలి నీరు కొనకెక్కదా

చ. 1: నెలవై తత్త్వార్థము నే నెరఁగకుండినాను
తలఁపులోపలివాఁడు తా నెరుఁగుఁగా
అలసి దేహమున నే నశుచినై యుండినాను
యిల నాయంతరియామి యెప్పుడూ శుచేకా

చ. 2: తిరమై నేను దివ్యదేశముల నుండకున్న
ధర నాలోఁ బరమాత్మ తానుండుఁగా
నిరతి గుణముల నే నీచుఁడనైనాను
అరయ నాపాలిహరి యధికుఁడేకా

చ. 3: వొగి నేఁ బరతంత్రుఁడనై వుండినాను నాలోన
తగిన స్వతంత్రుఁడు తాఁ గలఁడు గా
వెగటై నే నుండినా శ్రీ వేంకటేశుఁ డెదుటనే
వగలెల్లఁ దీర్చి కైవశమాయగా

రేకు: 0377-03 భైరవి సం: 04-449 మాయ

పల్లవి: ఒక్కటికొక త్రివి యోగములు
యిక్కడ మాబుద్ధు లెక్కడఁ గొలుపు

చ. 1: పాయపు మతిలో బలువగు నాసలు
కాయము భువిలోఁ గలదాఁకా
ఆయము సంసార మందుకు మూలము
యేయుపాయములు యెక్కడఁ గొలుపు

చ. 2: మానదు కోపము మతి చెంచెలమును
కాని కర్మ మిది గలదాఁకా
ఆనిన మనసే యందుకు మూలము
యే నేరుపు లిఁక నెక్కడఁ గొలుపు

చ. 3: అందదు మోక్షం బవ్వల నివ్వలఁ
గందువ నిను మతి గనుదాఁకా
అందితి శ్రీ వేంకటాధిప నీ కృప
యెందలి మాయలు యెక్కడఁ గొలుపు

రేకు: 0377-04 గుజ్జరి సం: 04-450 శరణాగతి

పల్లవి: హరిహరి నిను సకలాంతర్యామివి ఆత్మఁదలఁచుటేయోగంబు
శరణాగతరక్షామణి నిన్నే శరణని యెడిదే తుదిపదము

చ. 1: నీయందే యీసచరాచరమును నీవే చరాచరమందు నిత్యమును
పాయక వుండుట గని తలపోయుట పరమార్థంబుల సారంబు
కాయము జీవుఁడు నీయధీనమై కలుగఁగఁ బ్రకృతియుఁ బురుషునిఁగానిటు
మాయల ముంతువు మాయకుఁ జొరవని మతిఁ దలపోయుట సుజ్ఞానంబు

చ. 2: తనలోఁ బరతత్వపు నీవును తా నీపరతత్వములోపలఁగా
మనసునఁ దలఁచుట వేదాంతంబుల మంతనముల సన్మార్గంబు
ఘనమునకును మరి ఘనమై యందే కడుసూక్ష్మమునకుఁ గడు సూక్ష్మంబై
యెనసిన పూసలలోదార మవని యెన్నుటె పరమరహస్యంబు

చ. 3: ఆతుమలోపల ఘనవైకుంఠము ఆతుము నీ వైకుంఠములోపల
యీతల నాతల సరిగాఁదెలియుట యిదియే బ్రహ్మానందంబు
శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నీ భజియించెద
దాతవు దైవమవై ననుఁగావుము తలఁచెద మిదియే తత్వంబు

రేకు: 0377-05 గౌళ సం: 04-451

పల్లవి: వలసిన వారికి వై పులివి
చలమున మానుటే జయమర్మం

చ. 1: తనలోనే పో దైవము
ఘనమే యణువై కనినది
కనవలె నీతనిఁ గనుటకు
మనసు లయమౌటే మర్మం

చ. 2: భావములోనే పరమము
తావై తలఁపే తగిలినది
కైవశమై యిది గలుగుటకు
కేవల శాంతం కృతమర్మం

చ. 3: హృదయములోనే యింతాను
తుదిపదమై మదిఁ దోఁచీని
యెదుటనే శ్రీవేంకటేశ్వరుని
కదిసి భుజించుటే ఘనమర్మం

రేకు: 0377-06 బౌళి సం: 04-452 రామ

పల్లవి: రామ మిందీవరశ్యామం పరాత్పర -
ధామం సుర సార్వభౌమం భజే

చ. 1: సీతా వనితా సమేతం
పీత వానర బల వ్రాతం
పూత కౌసల్యా సంజాతం
వీత భీత మౌని విద్యోతం

చ. 2: వీరం రణరంగధీరం
సార ధర్మకులోద్ధారం
క్రూరదానవ సంహారం
శూరాధారాచార సుగుణోదారం

చ. 3: పావనం భక్త సేవనం
దైవిక విహగవధావనం
రావణానుజ సంజీవనం
శ్రీ వేంకట పరిచితభావనం

రేకు: 0378-01 ముఖారి సం: 04-453 దేవుడు-జీవుడు

పల్లవి: పట్టినవ్రతము నీవే పరిపాలింతువుగాక
బట్టబయలింతే నేను బలిమున్నదా

చ. 1: దేవ నీవు మనసు సోదించఁగా నే ధీరుఁడనై
ఆవలఁ జలించకుండే యంతవాఁడనా
పూవు వంటి చిత్త మింతే పొల్లువంటికాయ మింతే
భావించ నిందులఁ బస వున్నదా

చ. 2: అంతరాత్మవై నీవు యటు మరఁగులుసేయ-
నంతనె నినుఁ దెలిసే యంతవాఁడనా
గంతివంటిగుణ మింతే గాలివంటిప్రాణ మింతే
యింతరట్టుసేయ నిందు నెడమున్నదా

చ. 3: మచ్చిక శ్రీ వేంకటేశ మాట నీవై యుండఁగాను
అచ్చపు నిన్ను నుతించే యంతవాఁడనా
గచ్చువంటియిహ మింతే గనివంటి పర మింతే
ముచ్చట కిందుకుఁ దుద మొద లున్నదా

రేకు: 0378-02 పాడి సం: 04-454 దశావతారములు

పల్లవి: నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నాశత్రుల సంహరించవే

చ. 1: బావ తిట్లకు శిశుపాలునిఁ జంపిన-
యేవ కోపకాఁడవు నేఁ డెందు వోతివి
నీవాఁడనని నన్ను నిందించి శత్రువును
చావఁగొట్టి వానినిట్టే సంహరించవే

చ. 2: దాసుని భంగించేటి తరిఁ గస్యఁపుఁ జంపిన
యీసు కోపకాఁడ విపు డెందువోతివి
మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే
సాసించి శత్రువును సంహరింపవే

చ. 3: కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁజంపిన
యెల్లగాఁగఁ గోపకాఁడ వెందువోతివి
యిల్లిదె శ్రీ వేంకటేశ యీ నీ మీఁదిపాటలు
జల్లన దూషించు శత్రువు సంహరింపవే

రేకు: 0378-03 వరాళి సం: 04-455 అంత్యప్రాస

పల్లవి: ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి
హరిదాస్యం బదియే సుఖము

చ. 1: వెతలఁబొరలే ఘన విభవముకంటే
అతి పేదరిక మది సుఖము
గతి నెరవుల సింగారము కంటెను
సత మగు తన నిచ్చలమే సుఖము

చ. 2: పలుబాములఁబడు పగలిటికంటే
తెలిసి నిద్రించు రాతిరి సుఖము
అలమట గడించు నమృతముకంటే
కలపాటి తనకు గంజే సుఖము

చ. 3: పరపీడలొసఁగు భవమునకంటే
ధరఁ బొడమని చందము సుఖము
గరిమల శ్రీ వేంకటపతి నీకే
శరణని యెడి నాజన్మమే సుఖము

రేకు: 0378-04 బౌళి సం: 04-456 అంత్యప్రాస

పల్లవి: పుట్టఁగా బుట్టిన నాభోగపుటాస
పట్టి యేమిగట్టుకొంటి బదుకవో యాసా

చ. 1: వూరు దిప్పినట్టి యాస వుగముదిప్పిన యాస
చేరవచ్చి దైన్యమందించిన యాస
భారపెట్టి దేహమెల్లా బడిలించిన యాస
పారి మమ్మేఁచితి వింత బదుకవో యాసా

చ. 2: నాలుక రుచుల యాస నాతులకాఁకల యాస
కాలకాసుకైన బొంకు గరుపే యాస
వోలిఁ బుణ్య తపమెల్ల వొరులకమ్మించు నాస
పాలుమాలించితి వింక బదుకవో యాసా

చ. 3: కిందుపరచేటి యాస గేలిసేయించేటి యాస
పొందియట్టే సంతసానఁ బొదిపే యాస
కందువ శ్రీ వేంకటేశుఁ గని శరణంటి నేను
పందతనమొల్ల నింక బదుకవో యాసా

రేకు: 0378-05 సామంతం సం: 04-457 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఆ రూపమునకే హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి

చ. 1: ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు
సోలి నగ్నియును సూర్యచంద్రులును
నీలో నుండఁగ నెరిఁ గనెఁ గిరీటి
మూల భూతి వగు మూర్తివి గాన

చ. 2: అనంత శిరసుల ననంత పదముల-
ననంత నయనము లనంత కరముల
ఘన నీ రూపము గనుఁగొనెఁ గిరీటి
అనంత మూరితి వన్నిటఁ గాన

చ. 3: జగము లిన్నియును సకల మునీంద్రులు -
నగు శ్రీ వేంకటనాథుఁడ నిన్నే
పొగడఁగఁ గిరీటి పొడగనె నీ రూపు
అగణిత మహిముఁడ వన్నిటఁగాన

రేకు: 0378-06 రామక్రియ సం: 04-458 హనుమ

పల్లవి: ఆంజనేయ యనిలజ హనుమంత నీ -
రంజకపుఁ జేఁతలు సురల కెంచ వసమా

చ. 1: తేరిమీఁద నీ రూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు
కౌరవుల గెలిచె నంగర భూమిని
సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట
నీరోమములు గావా నిఖిల కారణము

చ. 2: నీమూలమునఁగాదె నెలవై సుగ్రీవుఁడు
రామునిఁ గొలిచి కపిరాజాయను
రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను

చ. 3: బలుదైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁగలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనే మంగాఁబుధి -
నిలయపు హనుమంత నెగడితిగా

రేకు: 0379-01 శంకరాభరణం సం: 04-459 హనుమ

పల్లవి: ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

చ. 1: మొదల నింద్రుఁడు నీ మోమునకెల్లా రక్ష
యిదె నీ శిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదరని మేనికెల్ల శ్రీ రామరక్ష

చ. 2: పిరుఁదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడఁడు నీకరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీ రామ రక్ష

చ. 3: వడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేద రాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష

చ. 4: నలువ నీగళ రక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీసంధులకు హరుఁడు రక్ష
పలు నీరోమములకు బహుదేవతలు రక్ష
చెలఁగు నీచేఁతలకు శ్రీ రామరక్ష

చ. 5: అంగవు నీతేజమున కగ్నిదేవుఁడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీ సతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీ కేకాలము
చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీ రామరక్ష

రేకు: 0379-02 బౌళి సం: 04-460 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడొకో సుజ్ఞానము యీ యాత్మకు
కన్ను లెదిటివి చూచి కాలము నిట్టాయను

చ. 1: హేయములో సుఖము యెంగిలిలో సుఖము
కాయము నమ్మికదా కష్టపడెను
పాయములో చవులు పాపములో చవులు
మాయలు నమ్మికదా మనసూనిట్టాయను

చ. 2: కల్లలోని బదుకు కాసు వీసపు బదుకు
కల్లరి ప్రాణాలు నమ్మి కట్టుపడెను
యెల్లి నేఁటి తలఁపు యింద్రియాల తలఁపు
కొల్ల సంసారముఁగూడి గుణమునిట్టాయను

చ. 3: అంగడిఁబెట్టే సిరులు యలయింపులో సిరులు
దొంగజీవుఁడు యిట్లానే తొట్రుపడెను
అంగపు శ్రీవేంకటేశుఁడంతలో మన్నించఁగాను
ముంగిలెల్లా మోక్షమాయ ముచ్చటే యిట్టాయెను

రేకు: 0379-03 లలిత సం: 04-461 భక్తి

పల్లవి: ఏమిటివాఁడఁ గాను యిఁకనేను నా -
సామపుఁ గర్మము నీకే సమర్పయామి

చ. 1: తలఁపులోపలనున్న తత్త్వము యిట్టె
వెలినుండే నాపాలి విష్ణుమూర్తి
పలుకు లోపల నుండే పరమాత్ముఁడా నా
చలమరి మతి నీకే సమర్పయామి

చ. 2: పుట్టుగులిచ్చినయట్టి పురుషోత్తమా తుద -
ముట్టించు మోక్షపుమురమర్దనా
గుట్టుతో నిహముచూపే గోవిందుఁడా నా
జట్టి చైతన్యము నీకే సమర్పయామి

చ. 3: అరిదిభోగములిచ్చేయంతరాత్ముఁడా నాకు
శరణమైనయట్టి సర్వేశ్వరా !
వెరసి నన్నేలిన శ్రీ వేంకటేశుఁడా నా
సరవులన్నియు నీకే సమర్పయామి

రేకు: 0379-04 పాడి సం: 04-462 హనుమ

పల్లవి: ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవమౌనా
యెక్కడా హనుమంతుని కెదురా లోకము

చ. 1: ముందట నేలేపట్టమునకు బ్రహ్మాయినాఁడు
అందరు దైత్యులఁ జంపి హరి పేరైనాఁడు
అంది రుద్రవీర్యము దానై హరుఁడైనాఁడు
యెందు నీ హనుమంతుని కెదురా లోకము

చ. 2: చుక్కలు మోవఁ బెరిగి సూర్యుఁడు దానైనాఁడు
చిక్కుఁ బాతాళము దూరి శేషుఁడైనాఁడు
గక్కన వాయుజుఁడై జగత్ర్పాణుఁడై నాఁడు
యెక్కువ హనుమంతుని కెదురా లోకము

చ. 3: జలధిఁ బుటమెగసి చంద్రుఁడు దానైనాఁడు
చెలఁగి మేరువుపాంత సింహమైనాఁడు
బలిమి శ్రీ వేంకటేశు బంటై మంగాంబుధి -
నిల యీ హనుమంతుని కెదురా లోకము

రేకు: 0379-05 దేశాక్షి సం: 04-463 నామ సంకీర్తన

పల్లవి: ఏమరక తలఁచరో యిదే చాలు
కామించినవి యెల్లఁ గక్కుననే కలుగు

చ. 1: దురితములెల్లఁ దీరు దుఃఖములెల్ల నణఁగు
హరియని వొకమాఁటు అన్నాఁజాలు
సురలు వూజింతురు సిరులెల్లఁ జేరును
మరుగురునామ మటు పరుకొన్నఁ జాలు

చ. 2: భవములిన్నియుఁ బాయు పరము నిహముఁజేరు
అవల నారాయణయన్నాఁ జాలు
భువి యెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు
తవిలి గోవిందు నాత్మఁదలఁచినఁ జాలు

చ. 3: ఆనందము గలుగు నజ్ఞానమెల్లఁ బాయు
ఆనుక శ్రీ వేంకటేశ యన్నాఁ జాలు
యీ నెపాన నారదాదు లిందరు నిందుకు సాక్షి
దానవారి మంత్రజప తపమే చాలు

రేకు: 0380-01 బౌళి సం: 04-464 మాయ

పల్లవి: ఎందును బోరాటీ సంసారము
కందువ నీ మాయ గడవఁగ వశమా

చ. 1: కలిమే చిత్త వికార హేతు విది
అలర లేమి దైన్య హేతువు
పలు లంపటములు బంధ హేతువులు
తలఁగిన నడవదు తనుపోషణము

చ. 2: మదవికార మిదె మహిత యౌవనము
తుద వార్ధకమే దురంతము
యిదె యర్థార్జన యాతాయాతన
అదియు మానితే నాఁకలి ఘనము

చ. 3: యెన్ని గడియించే వెన్నిట ముంచే -
విన్నిట శ్రీ వేంకటేశ్వరుఁడ
అన్నిట నంతర్యామివి నీవే
కన్ను దనియ ననుఁ గావఁగదే

రేకు: 0380-02 దేవగాంధారి సం: 04-465 మేలుకొలుపులు

పల్లవి: వారిధి శయన వో వటపత్ర పరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే

చ. 1: ఘన యోగి హృదయపు కమలాలు వికసించె
వొనర విజ్ఞాన సూర్యోదయమాయ
మును జీవ పరమాత్మముల జక్కవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే

చ. 2: కలుషముల నేటి చీఁకట్లెల్లఁ బెడఁబాసె
నలువంక వేద కీరనాదము మ్రోసె
అలరి యితర ధర్మాల నేటి చుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతి మోము చూడవే

చ. 3: కపట రాక్షస నేత్ర కలు హారములు మోడ్చె
యిపుడే సుకర్మముల యెండలు గాసె
అపురూప శ్రీ వేంకటాద్రీశ మేలుకొని
నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁ గావనవే

రేకు: 0380-03 శుద్ధవసంతం సం: 04-466 నృసింహ

పల్లవి: చేకొన్న భక్తుల పాలి చింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుడు

చ. 1: వాఁడిగోళ్లచేత వడి హిరణ్యుని( జంపి
వేడుక నెత్తురు లెల్ల వెదచల్లుచు
పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె
మూఁడు మూర్తులకును మూల మీతఁడు

చ. 2: కొండమీఁద( గూచుండి కోప ముపసంహరించి
అండనున్నదేవతల కభయమిచ్చి
మెండుగ సులభుఁడై మెరయుచు నున్నవాఁడు
దండి జగముల కెల్ల దైవ మీతఁడు

చ. 3: వేవేలు చేతులను వెస నాయుధాలు వట్టి
చేవ మీరి ప్రతాపాన సిరులు మించి
యీవల నహోబలాన నిరవై యున్నవాఁడు
శ్రీ వేంకటాద్రి మీఁది సిద్ధమూర్తి యీతఁడు

రేకు: 0380-04 సామంతం సం: 04-467 హనుమ

పల్లవి: కలశాపురముకాడ కందువ సేసుకొని
అలరుచు నున్నవాఁడు హనుమంత రాయఁడు

చ. 1: సహజాన నొక జంగ చాఁచి సముద్రము దాఁటె
మహిమ మీరఁగ హనుమంతురాయఁడు
యిహమున రాము బంటై యిప్పుడూ నున్నవాఁడు
అహరహరమును దొడ్డ హనుమంత రాయఁడు

చ. 2: నిండు నిధానపు లంక నిమిషాన నీరుసేసె
మండిత మూరితి హనుమంత రాయఁడు
దండితో మగిడివచ్చి తగ సీత శిరోమణి
అండ రఘుపతి కిచ్చె హనుమంతరాయఁడు

చ. 3: వదలని ప్రతాపాన వాయుదేవు సుతుఁడై
మదియించినాఁడు హనుమంత రాయఁడు
చెదరక యే పొద్దు శ్రీ వేంకటేశు వాకిట-
నదివో కాచుకున్నాఁడు హనుమంత రాయఁడు

రేకు: 0380-05 లలిత సం: 04-468 కృష్ణ

పల్లవి: వేవేల చందాలవాఁడు విఠలేశుఁడు
భావించ నలవిగాని పరమాత్ముఁ డితఁడు

చ. 1: సతతము రుక్మిణీ సత్యభామల నడుమ
రతికెక్కిన సింగారరాయఁ డితఁడు
చతురత సనకాది సంయమీంద్రులమతి-
నతిశయిల్లేటి పరమానంద మితఁడు

చ. 2: దేవతల కెల్లాను దిక్కు దెసై వెలుఁగొంది
తావుకొన్న యట్టి యాధార మీతఁడు
మూవంక గొల్లెతలు మున్ను సేసిన తపము
కైవశమై ఫలించిన ఘన భాగ్య మితఁడు

చ. 3: వరముతో యశోద వసు దేవాదులకు
పరగిన కన్నులపండు గీతఁడు
పిరులు మించినయట్టి శ్రీ వేంకటాద్రిమీఁది-
నిరతి దాసుల పాలి నిధాన మితఁడు

రేకు: 0380-06 తోడి సం: 04-469 నృసింహ

పల్లవి: సుగ్రీవ నారసింహ సులభుఁడ వందరికి -
నగ్రేసరుఁడ నీ వవధారు దేవా

చ. 1: సనకాదు లొకవంక జయవెట్టుచున్నారు
యెనసి సురలు చేతులెత్తి మొక్కేరు
ముసు లిరుమేలానుండి మునుకొని నుతించేరు
అనుపమాలంకార అవధారు దేవా

చ. 2: గంగాది నదు లెల్లఁ గడిగీ నీ పాదములు
పొంగుచు సప్త రుషులు పూజించేరు
సంగతి వాయుదేఁడు సరినాల వట్టమిడీ
అంగజ కోటి రూప యవధారు దేవా

చ. 3: పరగ నారదాదులు పాడేరు నీ చరితలు
పరమ యోగీంద్రులు భావించేరు
సిరులు మించిన యట్టి శ్రీ వేంకటాద్రిమీఁద-
నరుదుగ నున్నాఁడవు అవధారు దేవా

రేకు: 0381-01 మాళవి సం: 04-470 హనుమ

పల్లవి: అరుదీ కపీంద్రుని యధిక ప్రతాపము
సురలకు నరుల కీ సుద్దు లెందుఁ గలవా

చ. 1: వుదయాచలము మీఁది నొక్కజంగ చాఁచుకొని
వుదుటున నపరాద్రి నొక్కజంగ చాఁచుకొని
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివెఁ బెద్ద హనుమంతుఁడు

చ. 2: వొక్క మొలగంట చంద్రు డొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్లఁ బెరిగెను పెద్ద హనుమంతుఁడు

చ. 3: పడికిలించిన చేత బిరుదుల పండ్ల గొల
తడయక కుడి చేత దశ దిక్కుల
జడియక శ్రీ వేంకటేశ్వరునిమన్ననబంటు
బెడిదపు మహిమల పెద్ద హనుమంతుఁడు

రేకు: 0381-02 బౌళి సం: 04-471రామ

పల్లవి: నమో నమో రఘు కుల నాయక దివజ వంద్య
నమో నమో శంకర నగజనుతా

చ. 1: విహిత ధర్మపాలక వీర దశరథ రామ
గహనవాసినీ తాటకా మర్దన
అహల్యా శాపమోచన అసుర కుల భంజన
సహజ విశ్వామిత్ర సవన రక్షకా

చ. 2: హరి కోదండహర సీతాంగనా వల్లభ
ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణి తనూజాది తరుచర పాలక
శరధి లంఘన కృత సౌమిత్రి సమేతా

చ. 3: బిరుద రావణ శిరో భేదక విభీషణ-
వరద సాకేత పుర వాస రాఘవ
నిరుపమ శ్రీ వేంకేటనిలయ విజనగర
పురవరవిహార పుండరీకాక్షా

రేకు: 0381-03 సాళంగనాట సం: 04-472 రామ

పల్లవి: చిత్తా అవధారు జియ్య పరా కెచ్చరికె
హత్తి కానుక లిచ్చేరు అదె రాజరాజులు

చ. 1: రామ రఘు కుల వీర రాజీవ లోచన
కోమల శ్యామల వర్ణ కొలువు వేళ
వామ దేవాది మునులు వారె, సుగ్రీవుఁడు వాఁడె
వేమారును వానర వీరులు మొక్కేరు

చ. 2: దేవ సీతాస మేత ధీర లోక నాయక
భావించ నవధరించు పొఁజువేళ
పావని యల్లవాఁడె భల్లూకపతి వీఁడె
సేవించీని భరతునిఁ జేకొను శత్రుఘ్నుని

చ. 3: శ్రీమదయోధ్యా విహార శ్రీ వేంకటనివాస
సామజ వాజి రథాల సందడివేళ
సౌమిత్రి యీవంక విభీషణుఁడు నావలివంక
నీ మహిమలెల్లా మెచ్చి నీకు విన్నవించేరు

రేకు: 0381-04 గుజ్జరి సం: 04-473 మాయ

పల్లవి: హేయ మేమీలేదు జగమింతా రుచికరమే
మాయావికార మిది మనసెట్టి రోసును

చ. 1: కాయధారణము లింపు కాంతలభోగము లింపు
ఆయతమై వారివారి యాహారా లింపు
సోయగపుఁ గన్నులను చూచేటి వేఁడుక లింపు
చాయ మనసాడఁబడి సమ్మతించితేను

చ. 2: పలుకులెల్లా నింపు భావములెల్లా నింపు
చెలరేఁగి తమ తమ చేఁత లింపు
జలమల సంగతుల సహజము లవి యింపు
వొలిసి తమ మనసాడఁబడి తేను

చ. 3: తగిన జన్మము లింపు తమ చక్కఁదనా లింపు
జగతి వారికి వారి జాతు లింపు
నిగిడి శ్రీ వేంకటేశ నీ మహిమలే యివి
వొగరు లేక మనసాడఁబడి వుంటేను

రేకు: 0381-05 సామంతం సం: 04-474 శరణాగతి

పల్లవి: ఎందలివారమో నేము యెఱఁగ వసముగాదు
సందడి విష్ణునకే శరణు చొచ్చెదము

చ. 1: తెర దీసినట్టుండు తెలిసితే జ్ఞానము
మరుగక మఱచితే మరఁగై తోఁచు
వురియై తగులుఁ గర్మ మూడిచితే నూడును
యిరవైన హరి మాయలెల ఇంపు చున్నవి

చ. 2: కడుఁ బుణ్య వశమై కాచుకుండు స్వర్గము
నడుమఁ బాపమూలము నరకము
తడవితే నంటును దాఁటేదే నేరుపు
యెడయ కచ్యుతు మాయలెల ఇంపు చున్నవి

చ. 3: పట్టితేఁ దన మనసు పరమాత్మఁ గనిపించు
చుట్టుకొంటే బంధమై సూడు సాధించు
ఒట్టి శ్రీ వేంకటేశ్వరుఁ డోపి మమ్మునేలెఁ గాని
ఇట్టె యా దేవుని మాయలెల ఇంచును

రేకు: 0381-06 ధన్నాసి సం: 04-475 వేంకటగానం

పల్లవి: పరమ వివేకులాల బంధువులాల
తెరదీసి మాకు నిది తెలుపరో

చ. 1: యేడు జానల మేనిలో నిందిరా నాథుఁ డున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో
పూడిచి వున్నది మతిఁ బొందుగ వైకుంఠము
చూడరో ధ్యానము సేసి సోదించరో

చ. 2: కొడిదెఁడు బయలిలో గోవిందుని నెలవఁట
చిడిముడి తో నిట్టే చేరి పట్టరో
అడఁచి దాఁచివున్నది అందే బ్రహ్మానందము
విడువరో యీ ముడియ వెలయఁ జేపట్టరో

చ. 3: వూని నల్లెఁడు నాలికలో నుండు శ్రీ వేంకటేశుఁ -
డానుకొని బత్తి తోడ నటు నిల్పరో
నానఁబెట్టివున్నది నామ కీర్తనములందు
తానకముగా నేపొద్దుఁ దలఁచుకోరో

రేకు: 0382-01 సాళంగనాట సం: 04-476 వైష్ణవ భక్తి

పల్లవి: నీగురుతులు చూచుకో నీబిరుదు లెంచుకో
యీగతిని కలబంట నిఁకనన్నుఁ గావవే

చ. 1: కానిలే నేనెంత కఠినచిత్తుఁడనైన
నానొసల నివే పట్టెనామములు
మేను తోలునెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మితులసి పూసల పేరులు

చ. 2: భ్రమసి నేఁజేసినవి పాపకర్మములైనాను
జమళి భుజాల నివే శంఖచక్రాలు
అమరఁ దఱచుగా నే నాడేవి కల్లలైనా
తమిఁ బాడీ నాలిక నీతగు సంకీర్తనలు

చ. 3: తలఁచితే నావోజ తామస గుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీవేంకటేశ అన్నిటనే దుష్టనైనా
తలకొనె నా యందు దాసరి తనములు

రేకు: 0382-02 మాళవి సం: 04-477 రామ

పల్లవి: చెప్పితే నాశ్చర్యము సేసినచేత లితఁడు
ముప్పిరి మనుజ వేషమునఁ బుట్టె నీతఁడు

చ. 1: రాముఁ డుదయించె దశరథునికిఁ దమ్ములతో
గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞము గాచె హరుని విల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లి యాడెను

చ. 2: మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁ బట్టము గట్టెను

చ. 3: సీతాదేవితో నయోధ్య సింహాసనంబెక్కె
పోతరించి కుశలవపుత్రు లఁగాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీ వేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాఁచెను

రేకు: 0382-03 లలిత సం: 04-478 శరణాగతి

పల్లవి: ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్నుఁ గక్కసించనేఁటికి

చ. 1: యిహపరములలో నీ వెందు నన్నుఁ బెట్టినాను
నిహితమై రెంటిలోనా నీవు గలవు
వహి కెక్క నేలినవాఁడెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువుకుత్తరువే బంటుకును

చ. 2: పాప పుణ్యములలో నేపని నన్నుఁ జేయించినా
కాపాడి రెండు నీవు కల్పించినవే
యేపున మగఁడైన వాఁ డేమి సేయించినాను
దాపగుఁ బతివ్రతా ధర్మమే యాలికిని

చ. 3: కల్ల నిజములలో నొక్కటి నన్ను నాడించినా
చెల్లించ రెంటికి నీవే శ్రీ వేంకటేశా
తల్లిదండ్రులే బాస దగ నాడ నేర్పినాను
తెల్లమిగ నాడేది తేకువే బిడ్డనికి

రేకు: 0382-04 వరాళి సం: 04-479 భక్తి

పల్లవి: శ్రీ సతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు
చేసే నా చేఁతలెల్లా నీసేవలె సుమ్మీ

చ. 1: ఆనుక జగద్రూపుఁడవని నిన్నందురుగాని
నేనిట్టే చూచిన వెల్లా నీ రూపులే
నా నా శబ్దవాచ్యుఁడ వెన్నఁగ నీ వటుగాన
వీనుల విన్నవల్లా నీ విష్ణు కథలే

చ. 2: అట్టే విశ్వభుజుఁడవైతివి తొల్లే కనక
నెట్టన నా రుచులెల్లా నీ ప్రసాదాలే
గుట్టుతో సర్వ వ్యాపకుఁడవు నీ వటుగాన
ముట్టిన నాతను భోగములు నీకే సెలవు

చ. 3: ప్రక్కన జీవుల కెల్ల ప్రాణమవు నీవే కాన
ముక్కున నాయాఘ్రాణములెల్లా నీవే
నెక్కొని శ్రీ వేంకటేశ నీవే లోకకుటుంబివి
తక్కక నా సంసారధర్మమెల్లా నీవే

రేకు: 0382-05 లలిత సం: 04-480 వైరాగ్య చింత

పల్లవి: బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని
యెడయని చుట్టరికా లెవ్వరికీ లేవు

చ. 1: వన్నె సతుల రూపులు వారివద్దనే వుండఁగా
కన్నులఁ జూచే వారికి కళరేఁగును
యెన్నిక వారి గుణాలు యెడ మాటలాడఁగాను
విన్నవారికి నూరకే వేడుకలు పుట్టును

చ. 2: అంతా నింతాఁ గమ్మవిరు లంగళ్లలో నుండఁగాను
సంత వార లూరకే వాసన గొందురు
బంతి వారి కంచాలలో పలు రుచు లుండఁగాను
వింత వారలందుకుఁగా వెస నోరూరుదురు

చ. 3: వెరవిడి దేహాలు వేరే వేరే వుండఁగాను
సురతాన సోఁకితేనే చొక్కుదురు
ఇరవై శ్రీ వేంకటేశుఁ డిన్నిటికి సూత్రధారి
సరి నితని దాసులు జడియ రిందుకును

రేకు: 0382-06 కన్నడగౌళ సం: 04-481 వైరాగ్య చింత

పల్లవి: వట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము
నెట్టుకొని వివేకింప నేరవలెఁగాని

చ. 1: కట్టుకొంటే నెంతైనాఁ గలదు సంసారము
పట్టి చేసితేఁ గలవు పనులెన్నైనా
చుట్టుకొంటే నూరఁగల చుట్టరికముఁగలదు
అట్టె మోక్షము గడించే దరు చింతేకాని

చ. 2: చేసేనంటేఁ గలవు సేనా సేన పనులు
లాసి తగిలించు కొంటే లంపటా లంటు
ఆసలు పెంచ జూచితే నంత కంతకుఁ బెరుగు
వేసిరి శాంతిఁబొందుటే వేడు కింతేఁకాని

చ. 3: పనిగొంటేఁ బెనుగొనుఁ బంచేంద్రియంబులు
వెనుకొంటేఁ జిమ్మిరేఁచు వేడుకలు
తనిసి శ్రీ వేంకటేశు దసానుదాసుఁడై
కొన కెక్కఁగ నాతనిఁ గొలువవలెఁగాని

రేకు: 0383-01 రామక్రియ సం: 04-482 విష్ణు కీర్తనం

పల్లవి: ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము
వేమరు నో పుణ్యులాల వినరో యీ కతలు

చ. 1: అనంత సూర్య తేజుఁడట కాంతి చెప్ప నెంత
దనుజాంతకుఁడట ప్రతాప మెంత
మనసిజ గురుఁడట మరి చక్కఁదన మెంత
వనజజుఁగనినట్టి వాఁడట ఘన తెంత

చ. 2: గంగా జనకుఁడట కడుఁ జెప్పే పుణ్య మెంత
చెంగట భూ కాంతుఁడట సింగార మెంత
రంగగు లక్ష్మీశుఁడట రాజసము లెంచ నెంత
అంగవించు సర్వేశుఁడట సంప దెంత

చ. 3: మాయానాథుఁడట మహిమ వచించు టెంత
యేయెడఁ దా విష్ణుఁడట యిర వెంత
పాయక శ్రీ వేంకటాద్రిపతియై వరములచ్చే
వేయి రూపులవాఁడట విస్తార మెంత

రేకు: 0383-02 గౌళ సం: 04-483 హనుమ

పల్లవి: తలఁచరో జనులు యీతని పుణ్య నామములు
సులభముననే సర్వశుభములు గలుగు

చ. 1: హనుమంతుడు వాయుజుఁ డంజనా తనయుఁడు
వనధి లంఘన శీల వైభవుఁడు
దనుజాంతకుఁడు సంజీవనీ శైల సాధకుఁడు
ఘనుఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 2: లంకా సాధకుఁడు లక్ష్మణ ప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవ సచివుఁడు
పొంకపు రాముని బంటు భూమిజసంతోష దూత
తెంకినే కలశాపుర దేవ హనుమంతుడు

చ. 3: చటులార్జున సఖుఁడు జాతరూప వర్ణుఁడు
ఇటమీఁద బ్రహ్మ పట్ట మేలేటి వాఁడు
నటన శ్రీ వేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపుర ప్రాంత హనుమంతుఁడు

రేకు: 0383-03 లలిత సం: 04-484 శరణాగతి

పల్లవి: ఇన్నిళ్ళు నెఱఁగక యిందులోనే వోలాడితి
మన్నించఁగా నీవల్లనే మరిగితి నిన్నును

చ. 1: ముందు నేఁజేసినకర్మములు దోలుకరాఁగాను
అంది మరఁగుఁ జొచ్చితి నందుకే నీకు
కందువఁ బంచేంద్రియాలు కదిమి పై కొనఁగాను
చందములన్నిటా నీకు శరణంటిని

చ. 2: వెనకటి సంసారము విడువక వుండఁగాను
వినయాన నీడాగు వేసుకొంటిని
ఘనమైన జన్మములు కాణాచియై తగులఁగ
మొనసి నీ పాదాలకు మొక్కితి నేను

చ. 3: జీవుల సంగాతాలు చిమ్మి రేఁచి యంటుకోఁగా
భావించి నీ మీఁదటిబత్తి వట్టితి
శ్రీ వేంకటేశుఁడవు నీదేవు లలమేలుమంగ
నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని

రేకు: 0383-04 దేవగాంధారి సం: 04-485 రామ

పల్లవి: ఎంతని నుతియింతు రామరామ యిట్టినీప్రతాపమురామరామ
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ

చ. 1: బలుసంజీవనికొండరామరామ బంటుచేఁ దెప్పించితివిరామరామ
కొలఁదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ
వెలయ నెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ
పెలుచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ

చ. 2: శరణంటే విభీషణుని రామరామ చయ్యనఁగాచితివటరామరామ
బిరుదులరావణుని రామరామ పీఁచమడఁచితివట రామరామ
ధరలోఁ జక్రవాళము రామరామ దాఁటి వచ్చితివఁట రామరామ
సురలు నుతించిరట రామరామ నీచొప్పు యిక నదియెంతో రామరామ

చ. 3: సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులుఁ దమ్ములట రామరామ
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ
శ్రీమంతుఁడ వన్నిటాను రామరామ శ్రీవేంకటగిరిమీఁది రామరామ
కామితఫలదుఁడవు రామరామ కౌసల్యానందనుఁడవు రామరామ

రేకు: 0383-05 లలిత సం: 04-486 హనుమ

పల్లవి: బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుడు
సిరులతో రామునికి సీతాదేవికిని

చ. 1: మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు
వాఁడె హనుమంత దేవరఁ జూడరో
పోఁడిమి దైత్యుల గెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు

చ. 2: ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు
సవరనై పెనుజంగ చాఁచుకున్నాఁడు
భువిఁ గవచ కుండలంబులతోఁ బుట్టినవాఁడు
వివరించ నేకాంత వీరుఁడైనవాఁడు

చ. 3: పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాఁడు
ఘనుఁ డిన్నిటా స్వామి కార్యపరుఁడు
వినయపు శ్రీ వేంకటవిభునికి హితవరి
యెనసి మొక్కఁగదరో యెదుట నున్నాఁడు

రేకు: 0384-01 దేవగాంధారి సం: 04-487 గురు వందన, నృసింహ

పల్లవి: నమ్మితిఁజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ
ముమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమే జపంచుమీ

చ. 1: తలఁచకుమీ యితరధర్మములు తత్వజ్ఞానము మఱవకుమీ
కలఁగకుమీ యేపనికైనను కడుశాంతంబుననుండుమీ
వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబున నుండుమీ
కొలువకుమీ యితరదైవములు గోవిందునినే భజించుమీ

చ. 2: కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ
మీరకుమీ గురువులయానతి మెఱయఁ బురాణములే వినుమీ
చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ

చ. 3: వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుఁడవగుమీ
మఱవకుమీ యలమేల్మంగకుమగఁడగుశ్రీవేంకటపతిని
కెఱలకుమీ మాయారతులను కేవలసాత్వికుఁడవుగమ్మీ
తొఱలకుమీ నేరములను సింధురక్షకునినే సేవించుమీ

రేకు: 0384-02 సాళంగనాట సం: 04-488 నృసింహ

పల్లవి: దాసుల పాలిటి నిధానమై వున్నాఁ డదిగో
ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు

చ. 1: నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు
పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి
మృగరూపై గద్దెమీఁద మెఱసీవాఁ డదిగో
అగవూఁ దగవెఱిఁగి యహోబలేశుఁడు

చ. 2: తేరిచూచీ నదిగో దేవాదిదేవుఁడు
ఘోరపు నెత్తురు గోళ్ళఁ గురియఁగాను
నేరుపుతోఁ బేగుల జన్నిదాలవాఁ డదిగో
ఆరితేరి కొలువున్నాఁ డహోబలేశుఁడు

చ. 3: కరుణించీవాఁ డదిగో కమలాపతి దేవుఁడు
సురలు గొలువఁగాను సొంపుతోడను
యిరవై లోకములెల్లా నేలుచున్నాఁ డదిగో
హరి శ్రీవేంకటాద్రియహోబలేశుఁడు

రేకు: 0384-03 సామంతం సం: 04-489 నృసింహ

పల్లవి: సముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాదవరదా

చ. 1: తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి యిందిరాదేవి
బడిఁ జెలులు సోబానఁ బాడేరు
నడుమ వీణె వాఇంచీ నారదుఁ డల్లవాఁడె
అడరి చిత్తగించు ప్రహ్లాదవరదా

చ. 2: గరుడోరగాదు లూడిగములు నీకుఁ జేసేరు
యిరుమేలాఁ గొలిచేరు యింద్రాదులు
పరమేష్ఠి యొకవంక పనులు విన్నవించీ
అరసి చిత్తగించు ప్రహ్లాదవరదా

చ. 3: పొదిగొని మిమ్మునిట్టే పూజించేరు మునులెల్లా
కదిసి పాడేరు నిన్ను గంధర్వులు
ముదమున నహోబలమునను శ్రీ వేంకటాద్రి -
నదె చిత్తగించుము ప్రహ్లాదవరదా

రేకు: 0384-04 మాళవిగౌళ సం: 04-490 హనుమ

పల్లవి: అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె
భువిలోన గలశాపుర హనుమంతుఁడు

చ. 1: రామ నీ సేవకుఁ డిదె రణరంగ ధీరుఁడు
ఆముకొన్న సత్వగల హనుమంతుఁడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామిత ఫలదుఁడు యీ ఘన హనుమంతుఁడు

చ. 2: జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుఁడు
పూని చుక్కలెల్లా మొలపూసలుఁగాఁగఁబెరిగి
భాను కోటి కాంతితోఁ జొప్పడు హనుమంతుఁడు

చ. 3: యినవంశ శ్రీ వేంకటేశ నీ కరుణతోడ
అనుపమ జయశాలి హనుమంతుఁడు
పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ -
యనుమతిఁ గాచుకున్నా డదె హనుమంతుఁడు

రేకు: 0384-05 పాడి సం: 04-491 రామ

పల్లవి: దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీ రఘురామా

చ. 1: రవికులాంబుధిసోమ రామ లక్ష్మణాగ్రజ
భువి భరత శత్రుఘ్నపూర్వజ
సవనపాలక కౌసల్యానందవర్ధన
ధవళాబ్జనయన సీతారమణా

చ. 2: దనుజ సంహారక దశరథ నందన
జనక భూపాలక జామాత
వినమిత సుగ్రీవ విభీషణసమేత
మునిజన వినుత సుముఖ సుచరిత్రా

చ. 3: అనిలజవరద యహల్యా శాప మోచన
సనకాది సేవిత చరణాంబుజ
ఘనతర శ్రీ వేంకటగిరి నివాస
అనుపమోదార విహార గంభీరా

రేకు: 0385-01 రామక్రియ సం: 04-492 నృసింహ

పల్లవి: కొలువరో మొక్కరో కోరినవరము లిచ్చీ
సులభుఁ డిన్నిటా వీఁడె సుగ్రీవ నరహరి

చ. 1: కంబములోనఁ బుట్టి కనకదైత్యునిఁ గొట్టి
అంబరపు దేవతల కభయ మిచ్చి
పంబి సిరిఁ దన తొడపైఁ బెట్టుక మాటలాడీ
అంబుజాక్షుఁ డైనట్టి యాదమ నరహరి

చ. 2: నానా భూషణము లున్నతి తోడ నిడుకొని
పూనికతో ప్రహ్లాదుని బుజ్జగించి
మానవులకెల్లను మన్నన చాలా నొసఁగి
ఆనందముతో నున్నాడుఁ అదిగో నరహరి

చ. 3: మిక్కిలి ప్రతాపముతో మించిన కాంతులతోడ
అక్కజపు మహిమల నలరుచును
తక్కక శ్రీ వేంకటాద్రిఁ దావుకొని వరాలిచ్చీ
చక్కఁదనముల కెల్లాఁజక్కని నరహరి

రేకు: 0385-02 సాళంగనాట సం: 04-493 హనుమ

పల్లవి: ఈతని దెంతప్రతాప మీతని దెంతవుదుట
యీతఁడు రామునిబంటు యీతని సేవించరో

చ. 1: వుదయాస్త నగముల కొకజంగ చాఁచినాఁడు
చదివె రవితో సర్వ శాస్త్రములు
తుద బ్రహ్మాండము మోవఁ దోఁక మీఁది కెత్తినాఁడు
పెద పెద కోరల పెను హనుమంతుఁడు

చ. 2: కుడిచేత దనుజులఁ గొట్ట నూఁకించినాఁడు
యెడమచేఁ బండ్లగొల పిడికిలించె
వుడుమండలము మోవ నున్నతిఁ బెరిగినాఁడు
బెడితపు మేనితోడఁ బెనుహనుమంతుఁడు

చ. 3: పుట్టుఁ గవచ కుండలంబులతోడ నున్నవాఁడు
గట్టి బ్రహ్మపట్టానకుఁ గాచుకున్నాఁడు
ఇట్టే శ్రీ వేంకటేశు నెదుటఁ బనులు సేసీ
బెట్టిదపు సంతోసానఁ బెనుహనుమంతుఁడు

రేకు: 0385-03 లలిత సం: 04-494 రామ

పల్లవి: నమో నమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత అసద్విఖ్యాతకీర్తే

చ. 1: రామ రఘువర సిత రాజీవ లోచన
భూమిజా రమణ త్రిభువన విజయ
కోమలాంగ శ్యామ కోవిద రణరంగ
భీమ విక్రమ సత్యబిరుద ప్రవీణ

చ. 2: దళిత దైతేయ కోదండ దీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణ రక్షక
కలిత దశరథ తనయ కౌసల్యానంద
సులభ వానర ముఖ్య సుగ్రీవ వరద

చ. 3: చారులక్ష్మణ భరత శత్రఘ్నపూర్వజ
తారక బ్రహ్మ నిత్య స్వరూప
ధీర శ్రీ వేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేత పుర నివాసా

రేకు: 0385-04 నాట సం: 04-495 నృసింహ

పల్లవి: ఎక్కడఁ జొచ్చెదరింక రక్కసులు
చిక్కి చెడుఁడు నరసింహునిచేత

చ. 1: వుడుగని కోపపుటుగ్రపుఁ జూపుల
మిడుగురు లెగయఁగ మిన్నంది
పిడుగుల మ్రోఁతలఁ బెళపెళ నార్చుచు
వెడలెఁ గంభమున వీరసింహుఁడు

చ. 2: కాలాగ్ని కీలలు గక్కెడి చక్రము
కేలఁ బూని కుల గిరు లదర
భాల లోచనము ప్రకటింపుచు లయ -
కాలుఁడై వెలసెఁ గడిఁది సింహుఁడు

చ. 3: కుటిల నఖంబుల ఘోరాకారత
తొటతొట నెత్తురు దొరుగఁగను
చటుల దానవులఁ జదుపుచు శ్రీవేం-
కటమున నిలిచె సాకారసింహుఁడు

రేకు: 0385-05 గుజ్జరి సం: 04-496 మనసా

పల్లవి: కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు వీఁడే
నిండుకున్నాఁడు తలఁచు నెమ్మదినో మనసా

చ. 1: నన్నుఁ బుట్టించే దేవుఁడు నాలోనున్నాఁడు దేవుఁడు
కన్నచోటులనే వుండే కాచే దేవుఁడు
వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు
యెన్నెని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు

చ. 2: సిరులిచ్చన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు
గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు
మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు
ఇరవై మాయింటనున్నాఁడీ దేవుఁడు

చ. 3: దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు
రూపు చూపె నిదివో బోరున దేవుఁడు
శ్రీ పతియైన దేవుఁడు శ్రీ వేంకటాద్రి దేవుఁడు
చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు

రేకు: 0385-06 సామంతం సం: 04-497 నృసింహ

పల్లవి: ఔనయ్య జాణఁడవు ప్రహ్లాదవరదా
ఆసలు వెట్టకుము ప్రహ్లాదవరదా

చ. 1: వేసరక శ్రీ సతితో వేడుక నవ్వులు నవ్వి
ఆసలు చూపేవు ప్రహ్లాదవరదా
సేసవెట్టిన చేతుల చెఱఁగువట్టి తీసేవు
ఆ సుద్దులే చెప్పేను ప్రహ్లాదవరదా

చ. 2: నంటునఁ దొడమీఁదను నలినాక్షి నెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరదా
గెంటక యేపొద్దును కేలుగేలుఁ గీలించుక
అంటువాయ వదివో ప్రహ్లాదవరదా

చ. 3: కందువతోఁ గాఁగిలించి కైవసము సేసుకొంటి -
నందముగ నీకెను ప్రహ్లాదవరదా
పొంది శ్రీవేంకటమున పొంచి యౌభళములోనా
అంది వరాలిచ్చేవు ప్రహ్లాదవరదా

రేకు: 0386-01 రామక్రియ సం: 04-498 కృష్ణ

పల్లవి: కంటిఁగంటి వీఁడివో కని కృతార్థుఁడనైతి
వింటి నిందరిచేతా నీ విట్ఠలేశు సుద్దులు

చ. 1: యీతఁడా గోవర్ధనమెత్తిన పసిబాలుఁడు
కాతరీఁ డీతఁడా గోపికా వల్లభుఁడు
పూతన నీతఁడా పట్టి పొరిగొన్నయట్టివాఁడు
చేత గచ్చకాయలాడీ శ్రీ విట్ఠలేశుఁడు

చ. 2: యీ దేవుఁడా కుచేలుని కిష్ట సంపదిచ్చినాఁడు
పోదిగొని యీ దేవుఁడా భూభార మడఁచినాఁడు
వేదమయుఁ డీ దేవుఁడా విశ్వరూపు చూపినాఁడు
సేదదేరీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు

చ. 3: యీ మూరితా పాండురంగ మిరవై వుండినవాఁడు
కామించీ మూరితి శ్రీ వేంకటగిరి నున్నవాఁడు
దోమటి నీమూరితే యాధ్యులుపాట మెచ్చినాఁడు
క్షేమముతో వరాలిచ్చీ శ్రీ విట్ఠలేశుఁడు

రేకు: 0386-02 నాట సం: 04-499 హనుమ

పల్లవి: సరిలే రితనికి సాహస విక్రముఁ డీతఁ -
డరయ కలశాపుర హనుమంతుఁడు

చ. 1: వుదధి లఘించినాఁడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్ట నడుమఁ బూజ గొన్నాఁడు
సదరాననే లంక సాధించి వచ్చినాఁడు
అదివో కలశాపుర హనుమంతుఁడు

చ. 2: సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు
భంజించి వానరుల బదికించినాఁడు
అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యేపనుల-
నంజఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 3: బలు రాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు
ఇల రామునికిఁ గడు హితుఁడైనాఁడు
చెలఁగి శ్రీ వేంకటేశు సేవ సేయుచున్నవాఁడు
అలరి కలశాపుర హనుమంతుఁడు

రేకు: 0386-03 సాళంగనాట సం: 04-500 నృసింహ

పల్లవి: సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో
వావిరిఁ బ్రహ్లాదునికి వరదుఁడు వీఁడే

చ. 1: జగన్నాథుఁడు వీఁడే సర్వరక్షకుఁడు వీఁడే
నిగమవేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే
సగుణవంతుఁడు వీఁడే సర్వకాముఁడు వీఁడే
నగు మొగము సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

చ. 2: మరు జనకుఁడు వీఁడే మహిమాధికుఁడు వీఁడే
పరగ శ్రీ లక్ష్మీపతి వీఁడే
సురల కేలికె వీఁడే శుభ మూరితి వీఁడే
నరసఖుఁడ సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

చ. 3: భువనాధిపతి వీఁడే పురుషోత్తముఁడు వీఁడే
వివిధ ప్రతాప కోవిదుఁడు వీఁడే
ఇవల శ్రీ వేంకటాద్రి నిరవైనతఁడు వీఁడే
నవమూర్తి సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

రేకు: 0386-04 బౌళి సం: 04-501 హనుమ

పల్లవి: ఎంతని పొగడవచ్చు నితని ప్రతాపము
పంతము లెల్లా మెరసి ప్రతాపించీ వాఁడే

చ. 1: చేతులనే పెరికి సంజీవి కొండ దెచ్చినాఁడు
ఆతఁడువో తొల్లి పెద్ద హనుమంతుఁడు
ఘాతలఁ దానొక్కఁడే లంక సాధించి వార్ధి దాఁటి
యీతలకి వచ్చినాఁడు ఇదివో వాఁడే

చ. 2: ముదమున బ్రహ్మ లోకము దాఁకాఁ బెరిగినాఁడు
అదివో ఇప్పుడు పెద్ద హనుమంతుఁడు
వదలక తోఁక చక్రవాళ పర్వతము వెంటా
వుదుటునఁ జుట్టుకొని వున్నాఁడు వాఁడే

చ. 3: మెల్లనే జంగ చాఁచి మెడ నిక్కించుకొన్నాఁడు
అల్లదివో మించే పెద్ద హనుమంతుఁడు
వెల్లవిరైనాఁడు శ్రీ వేంకటేశ్వరుని బంటై
చల్లఁగా లోకములేలీ సంతతము వాఁడే

రేకు: 0386-05 పాడి సం: 04-502 రామ

పల్లవి: ఎంత ప్రతాపము వాఁడు యెంతటి నేరుపరి
యెంతని పొగడవచ్చు నీ రాముని

చ. 1: వాలి నొక్క కోలనేసి వారిధి గట్టిన వాఁడు
తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు
పాలించి విభీషణునిఁ బట్టము గట్టిన వాఁడు
యేలుమని లంక కెల్లా నీ రాముఁడు

చ. 2: కుచ్చి పర మొండెముగా కుంభ కర్ణుఁ గొట్టినాఁడు
హెచ్చి రాకాసులఁ జంపె నీ రాముఁడు
తచ్చి రావణాసురుని తలలు చెండాడినాఁడు
ఇచ్చ కొలఁదుల నిట్టె యీ రాముఁడు

చ. 3: సీత తో విమాన మెక్కి చేరి యయోధ్యకు వచ్చి
యీతలఁ బట్ట మేలినాఁ డీ రాముఁడు
శ్రీ తరుణితోఁగూడి శ్రీ వేంకటేశుఁడైనాఁడు
యీతఁడే దరసించరో యీరాముఁడు

రేకు: 0386-06 లలిత సం: 04-503 రామ

పల్లవి: సర్వరక్షకుఁడైన సర్వేశుఁడేకాక
వుర్విమీఁద నందరిలో నొక్కఁడా రాముఁడు

చ. 1: కొండ పొడవులైన ఘోర వానర బలము
గుండుగా వారిధి దండఁ గూడఁబెట్టి
నిండు జెలనిధి గట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁ డనవచ్చునా

చ. 2: అన్నిటా దేవతలకు నసాధ్యమైన రావణు -
నెన్నికగాఁ బుత్ర మిత్ర హితుల తోడ
పన్నుకొని శస్త్రాస్త్ర పంక్తులనే ఖండించె
సన్నుతి నిట్టే రాముని జనుఁడన వచ్చునా

చ. 3: చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి
బలువుగ సీతఁగూడి పట్టమేలి
యిలలో శ్రీ వేంకటాద్రి నిరవై లోకము గాచీ
నలువంక రాముఁడు నరుఁడనవచ్చునా

రేకు: 0387-01 లలిత సం: 04-504

పల్లవి: కంటిమి నేఁ డిదె గరుడా చలపతి
యింటి వేలుపగు యీశ్వరుఁ డితఁడు

చ. 1: శ్రీ నరసింహుఁడు చిన్మయ కాంతుఁడు
దానవాంతకుఁడు దయానిధి
నానా మహిమల నమ్మిన వారిని
పూనుక కాచే పోషకుఁ డితఁడు

చ. 2: దేవాది దేవుఁడు దినకర తేజుఁడు
జీవాంత రంగుఁడు శ్రీ విభుఁడు
దైవ శిఖామణి తలఁచినవారిని
సేవలు గొని కాచే విభుఁడితఁడు

చ. 3: పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుఁడు
కరుణానిధి బుధ కల్పకము
పరగు శ్రీ వేంకటపతి తన దాసుల-
నరుదుగఁ గాచే యనంతుఁ డితఁడు

రేకు: 0387-02 రామక్రియ సం: 04-505 నృసింహ

పల్లవి: అల్లవాఁడే గద్దె మీఁద నౌభళపు గుహలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు

చ. 1: వుక్కుఁగంభములోఁ బుట్టి వుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి
గక్కనఁ గడుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంధ్యాలుగా వేసుకొన్నాఁడు

చ. 2: కోరలు దీఁడుకొంటాను ఘోర నారసింహుఁడు
సారె సారె నెత్తురులు చల్లుకొంటాను
వీరులైన దానవుల వెదకి వెదకి కొట్టి
గోరి కొనఁ గండలెల్లాఁ గోయుచున్నాఁడు

చ. 3: విచ్చిన విడిని శ్రీ వేంకటనారసింహుఁడు
పచ్చిదేర నట్టే పకపక నవ్వి
కచ్చు పెట్టి దేవతలఁగాచి యభియమిచ్చి
పెచ్చు రేఁగి సంతోసానఁ బెరుగుచున్నాఁడు

రేకు: 0387-03 మాళవిగౌళ సం: 04-506 హనుమ

పల్లవి: ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో
పొంతనిదే కలశాపుర హనుమంతుఁడు

చ. 1: పిడికిటఁ బట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులఁ గొట్టినది వలకేలు
పొడచూపీఁ గలశాపుర హనుమంతుఁడు

చ. 2: సందడి సమరానకు చాఁచినది పెనుజంగ
అందముగ నిక్కించినదదే వురము
కుందక వీర రసమే కురిసేటిది మొగము
పొందగువాఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 3: వుదుటన మెలఁగేవి వొద్దికైన పాదాలు
త్రిదశుల మెప్పించేది దివ్యరూపము
అదె శ్రీ వేంకటేశు బంటయి నిలుచున్నాఁడు
వొదలుచుఁ గళశాపుర హనుమంతుఁడు

రేకు: 0387-04 శంకరాభరణం సం: 04-507 కృష్ణ

పల్లవి: ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి
చెంతనుండి మమ్మునేలే శ్రీ విట్ఠలేశుఁడు

చ. 1: తుంగభద్రా తటమున తొంటి పర బ్రహ్మము
అంగవించి సాకారమై వున్నాఁడు
సంగతితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు

చ. 2: అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ -
డందరికిఁ బ్రత్యక్షమై యున్నాఁడు
సందడించి గోపికా జనముల తోడుత
చెంది వున్నాఁడిదివో శ్రీ విట్ఠలేశుఁడు

చ. 3: వెలసి వనాల లోన వేద వేద్యుఁడైన హరి
అలరి కృష్ణావతారమై యున్నాఁడు
యెలమి శ్రీ వేంకటేశుఁ డితఁడే పదారువేల
చెలులతోఁ గూడినాఁడు శ్రీ విట్ఠలేశుఁడు

రేకు: 0387-05 నాట సం: 04-508 నృసింహ

పల్లవి: ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు
నట్టనడుమ నీ సుగ్రీవ నారసింహుఁడు

చ. 1: పగలూ రాతిరీఁ గాని పటు సంధ్యా కాలమందు
మొగిఁ బచ్చీ వెచ్చీగాని మొనగోళ్ళచే
గగనమూ నేలాఁ గాని గనమైన తొడమీఁద
నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహ దేవుఁడు

చ. 2: వెలుపలా లోనాఁ గాని వెడఁగుగడపమీఁద
తలి తండ్రి గాని యట్టి తావునఁ బుట్టి
మొలచి చిగిరించని ముదురుఁగోరలతోడ
నలి హిరణ్యు జంకించె నరసింహ దేవుఁడు

చ. 3: మానిసీ మెకమూఁగాని మంచి యాకారముతోడ
పూని యిల్లూఁ బందిలీఁ గాని గుహలో
ఆనుక హిరణ్యుని నడఁచీ శ్రీ వేంకటాద్రి
నానా దిక్కుల నేలిన నరసింహ దేవుఁడు

రేకు: 0387-06 బౌళి సం: 04-509 హనుమ

పల్లవి: అదె చూడరయ్యా పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా

చ. 1: వుదయాస్త శైలములు వొక జంగగాఁ జాఁచె
అదివో ధ్రువ మండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతని మహి మేమని చెప్పేమయ్యా

చ. 2: దండిగా బ్రహ్మాండముదాఁకఁ దోఁక మీఁదికెత్తె
మెండగు దిక్కులు నిండ మేను వెంచెను
గుండుగూడ రాకాసులఁ గొట్టఁగఁ జేతులు చాఁచె
అండనీతని ప్రతాప మరుదరుదయ్యా

చ. 3: దిక్కులు పిక్కటిలఁగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకుఁ బ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీ వేంకటేశు హితవరిబంటాయ
మిక్కిలి నీతనిలావు మేలు మేలయ్యా

రేకు: 0388-01 రామక్రియ సం: 04-510 నృసింహ

పల్లవి: నరులాల మునులాల నానా దేవతలాల
పరబ్రహ్మ మీతఁడే ప్రత్యక్షమై వున్నాఁడు

చ. 1: భావించి చూడరో వీఁడె ప్రహ్లాద వరదుఁడు
సేవించరో తొడమీఁది శ్రీ సతిని
వావిరి నుతించరో వరశంఖచక్రాలవె
కోవిదుఁడు గద్దెమీఁదఁ గొలువై వున్నాఁడు

చ. 2: చెలఁగి మొక్కరో వీఁడె శ్రీ నరసింహ దేవుఁడు
తెలియరో యీతని తేజోరూపము
అలరి పూజించరో అనంతహస్తము లవె
కొలఁది మీరి విష్ణుఁడు కొలువై వున్నాఁడు

చ. 3: యిదె శరణనరో హిరణ్యదైత్యహరుని
అదన జపించరో యీ హరినామము
యెదుట శ్రీ వేంకటాద్రిని యహోబలమునందు
కొదలే కాదిమూరితి కొలువై వున్నాఁడు

రేకు: 0388-02 పాడి సం: 04-511 నృసింహ

పల్లవి: ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీ నరసింహుఁడు

చ. 1: సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా
సొరిది మోములు తోఁగి చూచుకొంటాను
విరులచెండులఁగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీ నరసింహుఁడు

చ. 2: భవనాశి లోని నీరు పైఁ జల్లులాడుకొంటాను
నవకపు సిరులను నవ్వుకొంటాను
జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను
ఛివన నిందిరనంటె శ్రీ నరసింహుఁడు

చ. 3: వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా
ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా
ఆముక శ్రీ వేంకటాద్రి నౌభళాన నిలిచిరి
శ్రీ మహాలక్ష్మి తోడ శ్రీ నరసింహుఁడు

రేకు: 0388-03 బౌళి సం: 04-512 నృసింహ

పల్లవి: సులభుఁడై వున్నాఁడు సుగ్రీవ నారసింహుఁడు
నెలకొన్నదాసులకు నిధానము వీఁడే

చ. 1: తుంగభద్రా తటమున తొడపై నిందిర తోడ
సింగారించుకొన్నవేల్పుసింహము వీఁడే
సంగతిగా దేవతలు జయవెట్టి కొలువఁగా
చెంగటనే మహిమలఁ జెలరేఁగీ వీఁడే

చ. 2: చలువ బండలమీఁద చక్కని కొండల దండ
అలరీని వీరనరహరి వీఁడె
వెలయు శంఖచక్రాల వేవేలు హస్తములతో
బలవంతుఁడై వున్నాఁడు పంతముతో వీఁడే

చ. 3: పువ్వులతోఁటలనీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజ కేసరి వీఁడె
ఇవ్వల శ్రీ వేంకటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వుమోముతోడ భువనము లేలీ వీఁడే

రేకు: 0388-04 నాట సం: 04-513 నృసింహ

పల్లవి: వినరయ్య నరసింహ విజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును

చ. 1: మొదలఁ గొలువుకూటమున నుండి కశిపుఁడు
చదివించెఁ బ్రహ్లాదుని శాస్త్రములు
అదన నాతఁడు నారాయణుఁడే దైవమనె
అదరిపడి దైత్యుఁడు ఆతనిఁ జూపుమనె

చ. 2: అంతటఁ బ్రహ్లాదుఁడు 'అన్నిటానున్నాఁ'డనియె
పంతమున దానవుఁడు బాలునిఁ జూచి
యెంతయుఁ గడఁకతోడ 'ఇందులోఁ జూపు'మని
చెంతనున్న కంబము చేతఁగొని వేసె

చ. 3: అటమీఁదట బ్రహ్మాండం బదరుచు
కుటిల భయంకర ఘోషముతో
చిట చిట చిటమని పెట పెట పెటమని
పటపట మనుచును బగిలెఁ గంబము

చ. 4: కులగిరు లదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తల్లడిలి
కలఁగెను జగములు కంపించె జగములు
ప్రళయ కాలగతిఁ బాటిల్లె నపుడు

చ. 5: ఘననారసింహుఁ డదె కంబము నందు వెడలె
కనుపట్టె నదిగో చక్ర జ్వాలలు
మునుకొని వెడలెఁ గార్ముకముక్త శరములు
కనకకశిపునకుఁ గలఁగె గుండియలు

చ. 6: అడరె నద్దేవుని కోపాగ్నులు బెడిదపు -
మిడుఁగురుల తోడుత మిన్నులుముట్టి
పిడుగులురాలేటి భీకర నఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె

చ. 7: తొడికి పట్టి విష్ణుఁడు తొడమీఁద నిడుకొని
కడుపు చించెను వాని గర్వమడఁగ
వెడలెఁ జిల్లున వాని వేఁడి నెత్తురు నింగికి
పొడి వొడియాయ శత్రు భూషణము లెల్లను

చ. 8: నెళ నెళన విరిచె నిక్క వాని యెముకలు
పెళ పెళ నారిచి పెచ్చు వెరిగె హరి
జళిపించి పేగులు జంద్యాలుగా వేసుకొనె
తళుకుఁ గోరలు తళ తళమని మెరిచె

చ. 9: పెటలించి నరములు పెరికి కుప్పలువేసి
గుటగుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కలు వారఁజెండి
కుటిల దానవుఁ జూచి 'ఖో' యని యార్చెను

చ. 10: తెంచి శిరోజములు దిక్కులకు వాని -
పంచ ప్రాణములు గొనెఁ బరమాత్ముఁడు
అంచెల నీ రీతిని ప్రహ్లాదుని పగ నీఁగె
మించి దేవతలు మితిమీఱి జయవెట్టిరి

చ. 11: అప్పు డిందిరాదేవి యంకమునఁ గూచుండె వొప్పుగ శాంతమందె నహోబలేశుఁడు
తప్పక కోనేటిదండఁ దానై యిందును నందు చిప్పిల వరములిచ్చీ శ్రీ వేంకటేశుఁడు

రేకు: 0389-01 మాళవిగౌళ సం: 04-514 రామ

పల్లవి: అదె లంక సాధించె నవని భారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితఁడు

చ. 1: రవి వంశ తిలకుఁడు రాముఁ డితఁడు
భువిఁ బుట్టె దశరథ పుత్రుఁ డితఁడు
భవుఁడెంచెఁ దారక బ్రహ్మ మీతఁడు
పవనజు కిచ్చినాఁడు బ్రహ్మపట్ట మీతఁడు

చ. 2: బలువుఁడు సీతాపతి యితఁడు
తలకొన్న వాలి మర్దనుఁ డితఁడు
విలసిల్లె నేకాంగ వీరుఁ డితఁడు
చలమరి కోదండ దీక్షా గురుఁ డితఁడు

చ. 3: శరణాగత వజ్రపంజరుఁ డితఁడు
సరిలేని యసుర భంజకుఁ డితఁడు
వరదుఁడు శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడు
అరయ విజయనగరాధీశుఁ డీతఁడు

రేకు: 0389-02 రామక్రియ సం: 04-515 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు

చ. 1: చెలువపు రూపమున జితకాముఁడు
మలసీ బిరుదున సమర భీముఁడు
పొలుపైన సాకేతపుర ధాముఁడు
యిలలోఁ బ్రజలకెల్లా హితధాముఁడు

చ. 2: ఘనకాంతుల నీల మేఘ శ్యాముఁడు
అనిశము నుతుల సహస్ర నాముఁడు
కనుపట్టు కపి నాయక స్తోముఁడు
తనునెంచితే దేవతా సార్వభౌముఁడు

చ. 3: సిరుల మించిన తులసీ దాముఁడు
కరుణానిధియైన భక్త ప్రేముఁడు
వురుతర మహిమల నుద్దాముఁడు
గరిమల శ్రీ వేంకటగిరి గ్రాముఁడు

రేకు: 0389-03 సామంతం సం: 04-516 అధ్యాత్మ

పల్లవి: అదిగాన నీతి శాంతాలన్నిటికిఁ గారణము
పదిలమై వివేకించి బ్రదుకఁగ వలయు

చ. 1: తఱచు మాఁటలాడితే తప్పులెన్నైనాఁ దొరలు
పఱచై తిరిగితేను పాప మంటును
మెఱసి తిరిగాడితే మిక్కిలి దూరు ముట్టు
యెఱకగలవాఁ డిందు నేమఱ డెప్పుడును

చ. 2: కన్నవెల్లాఁ జూచితే కడునాస లుప్పతిలు
కన్నెలు పెక్కుగూడితే కరఁగు మేను
సన్నలు సారెకునైతే చవుకౌ దొరతనము
యిన్నిట నేర్పరైనవాఁ డేమఱఁ డెప్పుడును

చ. 3: మట్టుమీరి నవ్వితే మచ్చరా లూరకే పుట్టు
గుట్టులేక నడచితేఁ గొంచపడును
నెట్టినె శ్రీ వేంకటేశ నీకు శరణుచొచ్చి
యిట్టె నీ దాసుఁడైనవాఁ డేమరఁ డెప్పుడును

రేకు: 0389-04 సాళంగనాట సం: 04-517 రామ

పల్లవి: జయము మనది వనచరులాల
రయమున దర్మదారలు తుత్తుతూ

చ. 1: రక్కసుల మీఁద రాముఁడలిగె నలు-
దిక్కుల నడవుఁడు తిడిం తిడిం
యెక్కుఁడు సేనలు యిటు మొరయింపుఁడు
ఢక్కా నినదము ఢమఢమఢమం

చ. 2: కుటిలదానవులఁ గొట్టుఁడు కోటలు
తటుకున దాఁటుఁడు ధణం ధణం
పటుగతినార్చుచు పట్టుఁడు లగ్గలు
పెటులు చూఁడఁ డదె పెట పెట పెటల్

చ. 3: గుట్టున నుండక కూలె రావణుఁడు
పట్టుఁడు సంకులు భం భం భం
యిట్టె శ్రీ వేంకటేశుఁడు గెలిచెను
దిట్టలై యాడుఁడు ధిం ధిం ధిం

రేకు: 0389-05 శంకరాభరణం సం: 04-518 రామ

పల్లవి: వినుఁ డిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షస బాధ లుడిగెను

చ. 1: కులగిరు లదరెను కుంభిని వడఁకెను
యిల రాముఁడు రథమెక్కినను
కలఁగె వారిధులు కంపించె జగములు
బలు విలునమ్ములు వట్టినను

చ. 2: పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిఁబడి బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు
యెడపక రావణు నేసినను

చ. 3: చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసుర తల దుంచినను
గక్కన శ్రీ వేంకటగిరి నిలువఁగ
అక్కజమగు శుభ మందరి కొదవె

రేకు: 0389-06 బౌళిరామక్రియ సం: 04-519 రామ

పల్లవి: ఇతఁడే పరబ్రహ్మ మిదియే రామకథ
శత కోటి విస్తరము సర్వ పుణ్య ఫలము

చ. 1: ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్య వాసుల కెల్లా నభయమిచ్చె
సొరిది ముక్కుఁ జెవులు చుప్పనాతిని గోసె
ఖర దూషణులను ఖండించి వేసె

చ. 2: కినిసి వాలిఁ జంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణ కుంభ కర్ణాదులను జంపి
వనితఁ జేకొని మళ్ళి వచ్చె నయోధ్యకును

చ. 3: సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుఁడుఁ గొలువఁగ
భూమి యేలె కుశలవ పుత్రులఁ గాంచె
శ్రీ మంతుఁడై నిలిచె శ్రీ వేంకటాద్రిమీఁద
కామించి విభీషణ లంకకుఁ బట్టము గట్టె

రేకు: 0390-01 మాళవిగౌళ సం: 04-520 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను

చ. 1: తటుకన మారీచు తలపైఁ బోయఁ గర్మము
కుటిల శూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను

చ. 2: తరగె రావణు పూర్వతపములయాయుష్యము
ఖర దూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తుకు చినిఁగె నంతటను

చ. 3: పారిఁ గుంభకర్ణునికి పుట్టిన దినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీ వేంకటేశుచేఁతలెల్లా దక్కెను

రేకు: 0390-02 సాళంగనాట సం: 04-521 నృసింహ

పల్లవి: జయము జయము ఇఁక జనులాల
భయములు వాసెను బ్రదికితి మిపుడు

చ. 1: ఘన నరసింహుఁడు కంభమున వెడలె
దనుఁజులు నమసిరి ధర వెలసె
పొనిఁగె నధర్మము భూభారమడఁగె
మునుల తపము లిమ్ముల నీడేరె

చ. 2: గరిమతో విష్ణుఁడు గద్దెపై నిలిచె
హిరణ్య కశిపుని నేపడఁచె
అరసి ప్రహ్లాదుని నన్నిటా మన్నించె
హరుఁడును బ్రహ్మయు నదె కొలిచేరు

చ. 3: అహోబలేశుఁడు సిరి నంకమున ధరించె
బహుగతి శుభములు పాటిల్లె
యిహపరము లొసఁగె నిందును నందును
విహరించెను శ్రీవేంకటగిరిని

రేకు: 0390-03 రామక్రియ సం: 04-522 నృసింహ

పల్లవి: గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగీఁ జూడరో చింతామణి యీపె

చ. 1: పాల జలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీ నరసింహులక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీ లీల లోకములేలే యిందిర యీపె

చ. 2: ఘన సంపద లొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశమఁ బాయని మహా హరి ప్రియ యీపె
ధన ధాన్య రూపపు శ్రీ తరుణి యీపె

చ. 3: రచ్చల వెలసినట్టి రమా వనిత యీపె
మచ్చిక గలయలమేల్‌మంగ యీపె
యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలుఁ దావు కొనిన నిధాన మీపె

రేకు: 0390-04 సామంతం సం: 04-523 రామ

పల్లవి: సమసె రావణుఁడు సమరములోపల
అమరులు కడు ముదమందిరి మెరసి

చ. 1: బెరగిరి రాముని శరముల కసురలు
సురిగిరి పోట్లచురుకునను
తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన
తిరిగిరి తరుమఁగ దిక్కులకు

చ. 2: కూలిరి భల్లూకుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి
వీలిరి యంగదు వివిధనాదముల
తూలిరి సుగ్రీవు దోర్బలమునను

చ. 3: దాఁగిరి లక్ష్మణు దాకకు నులుకుచు
వీఁగిరి వనచర వితతికిని
పొఁగి శ్రీ వేంకటపతి కృపా రసమునఁ
దోఁగిరి జనులు సంతోసంబునను

రేకు: 0390-05 శంకరాభరణం సం: 04-524 నృసింహ

పల్లవి: ఆదిమూర్తి యీతఁడు ప్రహ్లాద వరదుఁడు
యేదెసఁ జూచినాఁ దానె యీతఁడిది దేవుఁడు

చ. 1: నవ్వుల మోము తోడ నరసింహ రూపు తోడ
జవ్వని తొడ మీఁదట సరస మాడ
పువ్వుల దండలు యిరు బుజాలపై వేసుకొని
వువ్విళ్ళూరఁ గొలువై వున్నాఁడు దేవుఁడు

చ. 2: సంకుఁ జక్రములతోడ జమళి కోరల తోడ
అంకెలఁ గటియభయహస్తా లెత్తి
కంకణాలహారాలతో ఘన కిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపానఁ బొదిలీ నీ దేవుఁడు

చ. 3: నానా దేవతల తోడ నారదాదుల తోడ
గానములు వినుకొంటా గద్దెపై నుండి
ఆనుక శ్రీ వేంకటాద్రి నహోబలము నందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుఁడు

రేకు: 0390-06 బౌళిరామక్రియ సం: 04-525 హనుమ

పల్లవి: వీఁడివో కలశాపుర వీరహనుమంతుడు
వాఁడిమి మెరసినట్టి వజ్రపాణి యితఁడు

చ. 1: చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తల కొన్న రాముని ప్రతాపపువాఁడు
యెలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు
కలగుండు వడ లంకఁ గాలిచినవాఁడు

చ. 2: మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయమువాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాఁడు
పగటున మీఁది బ్రహ్మ పట్టమేలే వాఁడు

చ. 3: యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు
చెప్పఁగొత్తైనమహిమ జెన్నొందువాఁడు
ముప్పిరి శ్రీ వేంకటేశు మూల బలమైన వాఁడు
వొప్పగు వరా లిందరి కొసగేటివాఁడు

రేకు: 0391-01 రామక్రియ సం: 04-526 కృష్ణ

పల్లవి: వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు
మూఁడు మూర్తుల తేజపు మూల మీతఁడు

చ. 1: పంతముతో పాండవపక్షపాతి యీతఁడు
వింతలేని విదురునివిందు యీతఁడు
మంతు కెక్కిన ద్రౌపదీ మాన రక్షకుఁడీతఁడు
చెంతనే వుద్ధవు పాలి చింతామణి యీతఁడు

చ. 2: మంద గొల్లెత లకెల్లా మంగళసూత్ర మీతఁడు
కందువ నక్రూరుని భాగ్యం బీతఁడు
నంద గోప యశోదల నవ నిధాన మీతఁడు
అందపు రుక్మిణీ మనోహరుఁ డీతఁడు

చ. 3: దేవకీ వసుదేవుల దివ్యపద వీతఁడు
భావింప నందరి పర బ్రహ్మ మీతఁడు
కైవశమై దాసులకు కల్ప వృక్ష మీతఁడు
శ్రీ వేంకటాద్రి మీఁదిశ్రీ పతి యీతఁడు

రేకు: 0391-02 లలిత సం: 04-527 నృసింహ

పల్లవి: ఈతని మహిమలు యెంతని చెప్పెద
చేతులమొక్కెదఁ జెలఁగుచు నేను

చ. 1: శ్రీ నరసింహుడు చిన్మయమూరితి
నానావిధకరనఖరుఁడు
దారుణ దైత్య విదారుఁడు విష్ణుఁడు
తానకమగు మా దైవంబితఁడు

చ. 2: అహోబలేశుఁడు ఆదిమ పురుషుఁడు
బహు దేవతా సార్వభౌముఁడు
సహజానందుఁడు సర్వ రక్షకుఁడు
యిహ పరము లోసఁగు యేలిక యితఁడు

చ. 3: కేవలుఁడగు సుగ్రీవ నృసింహుఁడు
భావించ సుజన పాలకుఁడు
శ్రీ వేంకటేశుఁడు చిత్తజ జనకుఁడు
వేవేలకు నిలువేలుపు యితఁడు

రేకు: 0391-03 సాళంగనాట సం: 04-528 హనుమ

పల్లవి: పెరిగినాఁడు చూడరో పెద్ద హనుమంతుఁడు
పరగి నానా విద్యల బలవంతుఁడు

చ. 1: రక్కసుల పాలికి రణరంగ శూరుఁడు
వెక్కసపు యేకాంగ వీరుఁడు
దిక్కులకు సంజీవి దెచ్చిన ధీరుఁడు
అక్కజమైనట్టి యాకారుఁడు

చ. 2: లలి మీరిన యట్టి లావుల భీముఁడు
బలు కపికుల సార్వభౌముఁడు
నెలకొన్న లంకానిర్ధూమధాముఁడు
తలంపున రామునాత్మారాముఁడు

చ. 3: దేవకార్యముల దిక్కు వరేణ్యుఁడు
భావింపఁగఁ దపః ఫల పుణ్యుఁడు
శ్రీ వేంకటేశ్వరు సేవాగ్రగణ్యుఁడు
సావధానుఁడు సర్వ శరణ్యుఁడు

రేకు: 0391-04 దేసాక్షి సం: 04-529 కృష్ణ

పల్లవి: వెన్న ముద్ద కృష్ణుఁడు వేవేల చేఁతల వాఁడు
పిన్నవాఁడై వున్నవాఁడు బిరుదైన బాలుఁడు

చ. 1: బాలెంత చన్ను గుడిచి బండి విరుగఁగఁ దన్ని
గాలి రక్కసుని ములుగఁగ మోఁది
రోలఁగట్టువడి యట్టె రూఢిగా మద్దిమాఁకులఁ
గూల దొబ్బె తొల్లి వీఁడె గుట్టు తోడి బాలుఁడు

చ. 2: కొండ గొడుగుగఁ బట్టి గోకులమునెల్లఁ గాచి
మెండగు గొల్లెతలతో మేల మాడి
అండనే నోరు దెరచి యశోదకు లోకములు
దండిగాఁ జూపె నితఁడె దంటయైన బాలుఁడు

చ. 3: పరమేష్ఠికి మారొడ్డి పసి బాలకులఁ దెచ్చి
ధరఁ బదారు వేలు కాంతలఁబెండ్లాడి
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి
సిరితో వెలసె నిదే చెలువపు బాలుఁడు

రేకు: 0391-05 నాట సం: 04-530 రామ

పల్లవి: అదె వచ్చె రాఘవుఁ డాతని దాటి ముట్టె
యెదిరించరాదు మీకు నేది దెరు విపుడు

చ. 1: భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు
అవల మీకు దిక్కేది యసురలాల
తివిరి మిమ్ము వెదకె దివ్య బాణాలాతనివి
రవళి నెందు చొచ్చేరు రాకాసులాల

చ. 2: చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట
తల చూపరాదు మీకే దైత్యులాల
వలగొని దేవతలు వానరులై వచ్చిరట
నిలువరా దిఁక మీకు నిశాచరులాల

చ. 3: రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక
దావతిఁ బారరో మీరు దానవులాల
యీ వేళ శ్రీ వేంకటేశుఁడితడే విభీషణుని
లావున శరణనరో లంకావాసులాల

రేకు: 0391-06 గుజ్జరి సం: 04-531 దేవుడు-జీవుడు

పల్లవి: ఏలికె చెప్పినపని కెదురాడేనా
నీలీల లివియని నిండుకుండే నేను

చ. 1: నీవు నాలోనున్నాఁడవు నే నున్నాఁడ సముఖాన
కావరపుటింద్రియాలు కాకు సేసీని
దేవర నీయప్పణో తెలియనానతీ నాకు
ఆవిధమైతేనే అపరాధము లేదు

చ. 2: జగదీశుడవు నీవు శరణాగతుఁడ నేను
జిగిఁ గామ క్రోధాలేల చిమ్మిరేఁచీని
నగుతా నప్పగించేవో నాకది గాదన రాదు
తగునిట్లానే యైతే తప్పులేదు మాకును

చ. 3: పుట్టించేవాఁడవు నీవు పుట్టుగులు నాసొమ్ము
చుట్టి సుఖదుఃఖా లేల సూడువట్టీని
నెట్టన శ్రీవేంకటేశ నీనటనో మంచిదాయ
యిట్టయితే మావంక నిఁక నేరమి లేదు

రేకు: 9004-01 ఆహిరి సం: 04-532 ఇతర దేవతలు

పల్లవి: తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడినూఁగీని శ్రీరంగశిశువు

చ. 1: కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగకిటు రంగమధ్యపు తొట్టెల
పలుమారుఁదనునూఁచి పాడఁగానూఁగీని
చిలుపాల సెలవితో శ్రీ రంగ శిశువు

చ. 2: అదివో కమలజుని తిరువారాధనంబనఁగ
అదనఁ గమలభవాండమనుతొట్టెల
ఉదధులు తరంగములనూఁచఁగా మాఁగీని
చెదరని సిరులతోడ శ్రీ రంగశిశువు

చ. 3: వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీ దేవితోఁగూడి శ్రీ వేంకటేశుఁడై
సేద దేరెడి వాఁడె శ్రీ రంగశిశువు

రేకు: 9013-01 శ్రీరాగం సం: 04-533 నృసింహ

పల్లవి: వెరపు దెలుపునీ వేగిరిమే నీ
వెఱిఁగియు నెఱఁగక యేమంటివో

చ. 1: గోరపురుధిరము గురియు గోళ్ళ నీ
తోరమైన యా తొడమీఁద
గోరంటగోళ్ళ కోమలి నిలువఁగ
ఈరసమందక యేమంటివో

చ. 2: నెత్తురుఁ బెదవుల నీ మొకమలరఁగ
బిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరిగమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటివో

చ. 3: ఆననరౌద్రము నట్టహాసమును
పూనిన నినుఁగని బొమముడితో
లేనగవుల నదలింపెడి సిరితో
హీనాధికముల నేమంటివో

చ. 4: పెద పెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగు జారుసతి
యెదురెదురను నీవేమంటివో

చ. 5: చింప నెరుల నీ శిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతివై
లంపటమందుచు లక్ష్మీసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో

రేకు: 9016-01 రామక్రియ సం: 04-534 అధ్యాత్మ

పల్లవి: అందరి వసమా హరి నెరుఁగ
కందువగ నొకఁడుగాని యెరఁగఁడు

చ. 1: లలితపు పది గోట్ల నొకఁడుగాని
కలుగఁడు శ్రీ హరిఁ గని మనఁగ
ఒలిసి తెలియు పుణ్యుల కోట్లలో
ఇలనొకఁడుగాని యెరఁగడు హరిని

చ. 2: శ్రుతి చదివిన భూసుర కోట్లలో
గతియును హరినె యొకానొకఁడు
అతి ఘనులట్టి మహాత్మ కోటిలో
తతి నొకఁడుగాని తలఁచఁడు హరిని

చ. 3: తుది కెక్కిన నిత్యుల కోట్లలో
పొదుగు నొకఁడు తలపున హరిని
గుదిగొను హరి భక్తుల కోట్లలో
వెదకు నొకఁడు శ్రీ వేంకటపతిని

రేకు: 9016-02 ఆహిరి సం: 04-535 వైరాగ్య చింత

పల్లవి: మాయల కగపడి మతిగెడి ప్రాణులు
రోయఁ దలఁచియును రోయఁగలేరు

చ. 1: మిస మిస మెరువఁగ మెల్లన చేరిరి
ముసిఁడిమాని ఫలములు చూచి
రసమని సంసారపు బాలికులిదె
విసిగి చేఁదుగని విరుగఁగలేరు

చ. 2: బలు విష మొలికెడి పాముఁ బట్టుకొని
అలరుచు నలుగడ నాడేరు
పొలసి యాసలూర్పులు నిగుడించఁగ
తెలిసియు నింకాఁ దెలియఁగలేరు

చ. 3: తేనెదెచ్చి కత్తికి దారఁ బెట్టి (న)
నానా విధముల నాఁకేరు
దీన తలఁణఁపెడి తిరు వేంకటపతి
చేని పంటలకుఁ జెయి చాఁచలేదు

రేకు: 9016-03 బౌళి సం: 04-536 నామ సంకీర్తన

పల్లవి: కందర్పజనక గరుడగమన
నందగోపాత్మజ నమో నమో

చ. 1: వారిధి శయన వామన శ్రీధర
నారసింహ కృష్ణ నమో నమో
నీరజ నాభ నిగమ గోచర
నారాయణ హరి నమో నమో

చ. 2: పరమ పురుషా భవ విమోచన
వరద వసుధావధూవర
కరుణా కాంతా కాళిందీ రమణ
నరసఖ శౌరీ నమో నమో

చ. 3: దానవ దమన దామోదర శశి
భాను నయన బల భద్రానుజ
దీన రక్షక శ్రీ తిరు వేంకటేశ
నానా గుణమయ నమో నమో

రేకు: 9018-01 ఆహరి సం: 04-537 వైరాగ్య చింత

పల్లవి: ఏమి దిరిగేమెందైనను ఊర
కోమితిమి దేహమోహోబదుకు

చ. 1: బ్రహ్మ కల్పము దాఁక బ్రదికేమో, కాక
బ్రహ్మానందంబుఁ బడసేమా
బ్రహ్మ మీ దేహలంపట మనుచు పరం
బ్రహ్మంబు వదలితిమి బాపు బ్రదుకు

చ. 2: ఒడిలితో నిట్టనే వుండేమా, కాక
చెడని పుణ్యములెల్లఁ జేసేమా
యెడయకమరపదం బేలేమా, వృథా
చెడిపోయె దినములిన్నీ బదుకా

చ. 3: ఆపదలు లేని సుఖమందేమా, కాక
పాపంబు లేని మతిఁ బరగేమా
ఏపు మీరిని వేంకటేశ్వరునిఁ గొలువ
నోపకిట్టైతిమయ్యో బదుకా

రేకు: 9019-01 శ్రీరాగం సం: 04-538 వేంకటగానం

పల్లవి: కప్పురమునకుఁ గప్పురమై
చిప్పిలుఁదావి మించె నితఁడు

చ. 1: బంగారమునకు బంగారమై
శృంగార మమరె శ్రీ హరికి
అంగమయిన మొల పీతాంబరంబున
కొంగు బంగారై కూడె నితఁడు

చ. 2: తట్టు పుణుఁగునకుఁ దట్టు పుణుఁగయి
ఘట్టిమేన మించెఁగా యితఁడు
నెట్టన నొసల నిండిన కస్తురి
బొట్టు చెమటతోఁ బొలెనికతఁడు

చ. 3: పన్నీట పాదాన పన్నీరే తానయి
యిన్నిట శ్రీ వేంకటేశుఁడిదే
ఉన్నతి జలధి నుదయమున
కన్నియ కౌఁగిట ఘనుఁడితఁడు

రేకు: 9020-01 లలిత (అవతారాలు ) సం: 04-539 దశావతారములు

పల్లవి: అరుదైన భవదూరుఁడగు నీతఁడు
అరిది భవములందునతఁడు వో యితఁడు

చ. 1: కొడుకుటెక్కెమురూపు కోరి కైకొని పెద్ద
కొడుకు కొరకుఁగా గోరపడి
కొడుకువైరి భక్తిఁ గూడిన యాతని
నడవిలోఁ జంపిన యతఁడు వో యితఁడు

చ. 2: ఆలి తమ్ముని రాక కలరి మెచ్చెడిచోట
ఆలుఁ దానును నుండి యందులోన
ఆలిచంటికింద నడ్డమువడుకున్న
ఆలవాలమువంటి అతఁడు వో యితఁడు

చ. 3: సవతి తమ్ముఁడు గోవుఁ జంపఁ బట్టుక పోయి
సవతి తమ్మునియింట సడిఁబెట్టఁగా
సవతులేనిపంటఁ జప్పరించివేసి
అవల యివల సేసి నతఁడు వో యితఁడు

చ. 4: తొడ జనించిన యింతి దొరకొనాపద సేయ
దొలఁగి తోలాడెడి దొడ్డవాని
తొడమీఁద నిడి వానికడుపులో తొడవులే
యడియాలమగు మేని యతఁడు వో యితఁడు

చ. 5: పదము దానొసఁగుచుఁ బదమడుగగఁ బోయి
పదము వదము మౌవఁ బరగఁ జేసి
పదముననె దివ్యపదమిచ్చి మనుమని
నదిమి కాచినయట్టి అతఁడు వో యితఁడు

చ. 6: అత్తకొడుకుపేరి యాతనిఁ దనకూర్మి
యత్తయింటిలోన నధికుఁ జేసి
మత్తిల్లు తనతోడ మలసిన యాతని
నత్తలిత్తల సేసినతఁడు వో యితఁడు

చ. 7: పాముతోడుతఁ బోరి పంతముగొనువాని
పాముకుఁ బ్రాణమై పరగువాని
ప్రేమపుఁ దనయుని బిరుదుగా నేలిన
ఆమాటనిజముల అతఁడు వో యితఁడు

చ. 8: ఎత్తుక వురవడినేఁగెడి దనుజుని
యెత్తుకలుగు మద మిగుర మోఁది
మత్తిల్లు చదువుల మౌనిఁ జం.......................................
అత్తలేని యల్లుఁడతఁడు వో యితఁడు

చ. 9:	బిగిసి మేఁకమెడ పిసికెడి మాటలు
పగలుగాఁగ రేయివగలు సేసి
జగములోన నెల్ల జాటుచుఁ బెద్దల
అగడుసేయఁ బుట్టినతఁడు వో యితఁడు

చ. 10:	మెట్టనిచోట్ల మెట్టుచుఁ బరువులు
పెట్టెడిరాయ..................................
కట్టెడికాలము కడపట నదయుల(?)
నట్టలాడించిన అతఁడు వో యితఁడు

చ. 11:	తలఁకకిన్నియుఁ జేసి తనుఁగాని యాతని
వలెనె నేఁడు వచ్చి వసుధలోన
వెలుఁగొంది వేంకటవిభుఁడై వెలసిన
యలవిగాని విభుఁడతఁడు వో యితఁడు

రేకు: 9022-01 శ్రీరాగం సం: 04-540 విష్ణు కీర్తనం

పల్లవి: చండ ప్రచండాది జయ విజయులన్
అండఁ బూజించి హరి కటుగదా పూజ

చ. 1: కూర్మ భూమ్యాదులను గోరికఁ బ్రతిష్ఠించి
ధర్మముఖ్యంబుల నధర్మాదులన్
కర్మగతిఁ జామర గ్రాహిణులఁ బూజించి
మర్మంబుగా హరికి మరికదా పూజ

చ. 2: గరుడ సేనేశులను ఘనుని శేషుని మరియు
వరమతులఁ బాదసంహినులను
కరమొప్ప శంఖచక్రగదాసి శార్ఙ్గముల
అరసి పూజించి హరికిన పుడుగా పూజ

చ. 3: నవకిరీటమును గుండలహార కౌస్తుభము
లవిరళపుఁ బీతాంబరాదులలర
వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరు పూజ
యివదఁ దళిగలు పెట్టుఁడిదిగదా పూజ

రేకు: 9022-02 ధన్నాసి సం: 04-541 వైరాగ్య చింత

పల్లవి: కాయముల కాణాచి కాఁపులము
చాయల మా సుఖము జయమేఁటిదయ్యా

చ. 1: పంచ మహా పాతకాల బైరు విత్తి దేహాల
కంచపుఁ గొలుచులుగా గాదెలఁబోసి
చంచలాలు జవ్వనాలు చవులైన కూరలుగా
నించి భుజియించే మానిజమేఁటిదయ్యా

చ. 2: ఉడివోని లంపటాన నూళ్ళుఁ బల్లెలు నెక్కి
యిడుమల మమతల నిండ్లు గట్టి
గొడవలానానసల కూరిమి సంపదల
పొడవైన మామతి పొందేఁటిదయ్యా

చ. 3: పనిలేని మమతల్ల పాపములు బందాలు
గొనకొని ధనములు గూడపెట్టి
కని నేఁడు తిరు వేంకటపతి కృపతోడ
తనియని మాతోడి తగువేఁటిదయ్యా

రేకు: 9022-03 లలిత సం: 04-542 విష్ణు కీర్తనం

పల్లవి: ఇటువలెనె పో యింకా మాకు
వటపత్రశాయి మమ్ము వదలీనా

చ. 1: యన్నఁడు దెల్లవారెనో యాడఁ బొద్దు పొడచెనో
యన్నట్లనుండితి మహర్నిశము
యన్నిటాఁ గడమలేక యెక్కడ నెదురులేక
పన్నగ శయనుని కృపనేకాదా

చ. 2: ఏడ వోవువ్యాధులెటు వచ్చి నిలిచెనో
కూడిన యాలరులెల్ల కొండలవలె
నీడలే నిలువులెల్ల నెలవులై యున్నచోట
యీడులేనివివి హరి యీవులేకావా

చ. 3: ఎవ్వరిచేత దాఁచితిమెచ్చట నిధానములు
ఇవ్వలా మాతలఁచిన యిన్నియు నబ్బె
రవ్వగు వెంకటగిరిరాయఁడు మాతలఁపులో
పువ్వక కాచి పండిన భోగమేకాదా

రేకు: 9022-04 ముఖారి సం: 04-543 వేంకటగానం

పల్లవి: ఎన్నటి కెవ్వరికితఁడే
అన్నిటానున్న అధికుఁడు

చ. 1: ఆతుమ కంతర్యామీ స్వామీ
యేతరినైనా నితఁడే
పాతక శూరుఁడు పారశరీరుఁడు
పూతన ప్రాణ ఘాతకుఁడు

చ. 2: అక్కర దీరచ నందాఁ జెందా
యెక్కడనైనా నితఁడే
పుక్కిటి లోకాలు పొందుగా నించి మా
దిక్కైనా పరదేవుఁడు

చ. 3: నేరమి నేరుపు నించాఁ బెంచా
నేరీతినైనా నితఁడే
కారుణ్యనిధి వేంకట విభుఁడు మా
చేరువై యున్న చెలువుఁడు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రేకు: | 9028-01 | భూపాళం | సం: | 04-544 | | వైరాగ్య చింత |

పల్లవి: ఏమో తెలిసెఁ గాని యీ జీవుఁడు
నేమపు నెరవిద్య నేరఁడాయ

చ. 1: కపటాలే నేరిచెఁ గాని జీవుఁడు
ఎపుడైన నిజ సుఖం బెరఁగఁడాయ
కపురులే చవిగొనెఁ గాని జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ

చ. 2: కడలేక తిరిగీఁ గాని జీవుఁడీ
నడుమ మొదలు చూచి నడవఁడాయ
కడుపుకూటికిఁ బోయీఁ గాని జీవుఁడీ
చెడని జీతముపొంతఁ జేరఁడాయ

చ. 3: కనియుఁ గానక పోయెఁ గాని జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలకె చొక్కెఁ గాని జీవుఁడు
తనియ నిట్టేమంచి దరిఁ జేరడాయ

రేకు: 9028-02 సామంతం సం: 04-545 అద్వైతము

పల్లవి: ఏమనవచ్చును గొందరికింపౌఁ బులుసులుఁదీపులు
సోమరితనమున నిన్నిటఁ జొరదీ నా తలఁపు

చ. 1: పదిలంబుగ సర్వాత్మక భావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీవల్లభుఁడున్నాఁడుండిన
హృదయము చంచలమిన్నిట నెనయదు నామనసు

చ. 2: ఎక్కడఁ జూచినఁ బ్రాణులకిన్నియు నాచారములే
చిక్కక యిన్నియుఁగైకొని చేయక పోరాదు
మక్కువ నిన్నియు శ్రీ హరి మతములె కానీ అయినా
ఒక్కటియే చాలును నాకొడఁబడవితరములు

చ. 3: ఏరీతులనటు చూచిన నిందరు బలుదైవములే
కూరిమినందరినటువలెఁ గొలువకపోరాదు
ధారుణి వేంకటపతిచేఁతలు ఇవియైనాఁగాని
కోరిక నా కితఁడే మరి కొరకొరలిన్నియును

రేకు: 9028-03 ఆహిరి సం: 04-546 శరణాగతి

పల్లవి: ఓపనయ్య వోపనయ్య
వోపనయ్య యీ వొప్పులే తప్పులు

చ. 1: ఎక్కడికి నెక్కడ యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు తక్కువే దారణ

చ. 2: ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తప్పులే యీ రవ్వలు చివ్వలే సిగ్గులు

చ. 3: బొంకులే పొందులు కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీజంకెలే జంపులు

రేకు: 9029-01 సామంతం సం: 04-547 వేంకటగానం

పల్లవి: పొడైన యెరుకతో బంధమోక్షములొక్క
గాడిఁగట్టుట తెలివిగానకేకాదా

చ. 1: భావించి నినుఁ బరబ్రహ్మమని వేదములు
వేవేలు విధుల మొరవెట్టఁగాను
కేవలపు నిన్ను దక్కిన దైవములఁ గూర్చి
సేవింపుటిది తప్పు సేయుటేకాదా

చ. 2: సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా
త్పరుఁడవని నలుగడలఁ బలుకఁగాను
వరుసతోఁ బెక్కు దైవములు సంగడి నిన్ను
తొరలఁ గొలుచుట మహా ద్రోహమేకాదా

చ. 3: ఎందుఁ జూచిన పురాణేతిహాసములు నీ
చందమే యధికమని చాటఁగాను
చందర్ప జనక వేంకటగిరి స్వామి నీ
కందు వెఱఁగనిది యజ్ఞానమేకాదా

రేకు: 9029-02 సామంతం సం: 04-548 వైరాగ్య చింత

పల్లవి: కొంచపడితినొక కొన్నాళ్ళు
ఇంచుకించుకిపుడెరిఁగితి నేను

చ. 1: ముట్టుపాఁతవలె మురిగిన దేహము
గుట్టున దాఁచితిఁ గొన్నాళ్ళు
ఇట్టే సుఖమని యిన్నిటి యోనుల
ఒట్టుక కాఁపురముండితి నేను

చ. 2: మురికి కడువలే ముంచిన హేయము
కురిసితి నేనొక కొన్నాళ్ళు
తెరపి లేక యీ దేహమురోఁతల
మొరఁగి దాఁచితిని మూలల నేను

చ. 3: విప్పుచు ముడుచుచు వెంట్రుకతుట్టెల
కొప్పులె పెట్టితి గొన్నాళ్ళు
అప్ప వేంకటనగాధిప మీకృప
యిప్పుడు వెలసితి నిదివో నేఁడు

రేకు: 9029-03 నాట సం: 04-549 వైరాగ్య చింత

పల్లవి: తనకేఁటి యేతులిందరిలోన
పెనఁగుచు నూరక బిగిసీఁగాక

చ. 1: మరచెనా తనపాటు మాలజీవుఁడు దొల్లి
కొరమాలి బహుయోనికూపముల
పొరలి హేయములోనె పుంగుడువడి వచ్చి
మొరఁగి తా దొరనంట మురిసీఁగాక

చ. 2: పాసెనా తనపాటు పాపదేహి తా
గాసిఁ బడిన భంగములెల్ల
చేసిన తనతొంటి చేఁతలన్నియును
మాసెననుచు నిట్టె మలసీఁగాక

చ. 3: విడిచెనా తన పాపవిధులు ప్రాణుఁడు మున్ను
అడరి మానుష రూప మైనంతనే
చెడక వేంకటపతి సేవించి సకలము
కడుగుకొనెడి బుద్ధి కనవలెఁగాక

రేకు: 9029-04 రామక్రియ సం: 04-550 వైరాగ్య చింత

పల్లవి: అంటుకోకురో యమ్మలాలా యీ
మంటవడ్డ కోరికల మాఁటు వారము

చ. 1: మాసిన యాసలనెడి మాలెత వెంట వెంటనే
పాసి వుండలేక బాధఁబడ్డవారము
బేన బెల్లి యెంగిలైన పదవినంజుడు నోరఁ
దీసి తీసి సారె సారెఁ దిన్నవారము

చ. 2: ఇట్టు నట్టు ముట్టరాని హేయమైన తోలుఁదోలు
కుట్టి కుట్టి సిగ్గులమ్ముకొన్నవారము
ముట్టు సేయుచోటనే మూలమూల సారె సారెఁ
బుట్టి పుట్టి యాపదలఁ బొందువారము

చ. 3: చంపి చంపి జీవులనే చవులంటఁ జెడ్డతోలుఁ
గొంపలోనఁ దెచ్చి పెట్టుకొన్నవారము
ఇంపుల నిప్పుడు వేంకటేశుఁజేరి భవముల
చింపి యింటి హరిభక్తి చరవారము

రేకు: 9030-01 దేవగాంధారి సం: 04-551 కృష్ణ

పల్లవి: ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు - వాని
బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలువోయరే

చ. 1: గామిడై పారితెంచి కాఁగెడి వెన్నలలోన
చేమ పూవు కడియాల చేయిపెట్టి
చీమ గుట్టెనని తన చెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయే వాని వెడ్డు వెట్టరే

చ. 2: ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగఁ బెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే

చ. 3: ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పఁడైన వేంకటాద్రి అసవాలకుఁడు గాన
తప్పకుండఁబెట్టె వాని తలకెత్తరే

రేకు: 9030-02 భూపాలం సం: 04-552 మేలుకొలుపులు

పల్లవి: మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన

చ. 1: లేదు వేదవిధి లేశమును
మేదిని భరమై మించినది
పొదుపడదు చూపరకు భువి
గాదిలి సుతుపై గనలె జనకుఁడు

చ. 2: కనకము చవి చెడెఁ గడుఁగడును
ఘనన్నృపబాధలు గదిమినవి
దనుజుల కతివలు దలఁకెదరు
ఎనయ బలాధికులెవ్వరు లేరు

చ. 3: అసుర సతుల పుణ్యము ఘనము
కస మసఁగెడి కలికాలమహిమ
పసగల వేంకటపతి యిఁకను
వసుధలోని నెవ్వగలుడుపఁగను

రేకు: 9034-01 సామంతం సం: 04-553 అధ్యాత్మ

పల్లవి: లోకములోపల లూటిబెట్టి - ఇది
కైకొని హరి యెఱఁగవుగా నీవు

చ. 1: ములుగుచు వెనకయు ముందరయును నొచ్చి
పలుమారుఁ గుంటెడి వసురము
నెలకొని వెదకేము నిన్నమాపటినుండి
నలిననాభుఁడ కానవుగా నీవు

చ. 2: భంగించి తొల్లియు బలుమారు గొనిపోయి
దొంగలు విడిచిన తురగము
ముంగిటలేదు యేమూల నొదిగినదో
అంగజపతి అరయవుగా నీవు

చ. 3: కొంకక యడవి మాఁకులుఁ గంపలు మేసి
జింక మెడలి పారు పెనుమృగము
వేంకటపతి దీని వెదకి కానలేము
సంకె వాయఁ దేర్చవుగా నీవు

రేకు: 9035-01 భూపాళం సం: 04-554 వేంకటగానం

పల్లవి: అన్నివిభవముల అతఁడితఁడు
కన్నులు వేవేలుగల ఘనుడితఁడు

చ. 1: వేదాంతకోట్ల విభుఁ డితఁడు
నాదబ్రహ్మపు నడుమితఁడు
ఆది నంత్యములకు నరుదితఁడు
శ్రీ దేవుఁడు సరసిజ నాభుఁడితఁడు

చ. 2: భవములణఁచు యదుపతి యితఁడు
భువనములిన్నిటికిఁ బొడవితఁడు
దివికి దివమైన తిరమితఁడు
పవనసుతు నేలినపతి యితఁడు

చ. 3: గరుడని మీఁదటి ఘనుఁడితఁడు
సిరులిందరికి నిచ్చే చెలువితఁడు
తిరువేంకటనగము దేవుఁడితఁడు
పరమపదమునకుఁ బ్రభుఁడితఁడు

రేకు: 9035-02 బౌళిరామక్రియ సం: 04-555 అంత్యప్రాస

పల్లవి: అదరీ బెదరీ నంతనంత
అదవదలై మాయామృగము

చ. 1: పొలసీ మలసీఁ బొదలీఁ గదలీ
నెలసీఁ బలుమారు నెలవులను
కలసీ మృగములఁ గ్రమ్మర బెదరీ
అలసీనటు మాయామృగము

చ. 2: దాఁగీ లోఁగీఁ దటుకన వెనుకకు
వీఁగీ నేఁగీ విసవిసనై
రేఁగీగతి వచరింపుచుఁ జూపుల
నాఁగీనదె మాయామృగము

చ. 3: వెంకటగిరి రఘువీర నీముందర
కొంకీఁ గొసరీఁ గొనగొనల
జంకెల బాణాసన బౌణంబున
సంకెలఁ బడె మాయామృగము

రేకు: 9037-01 సామంతం సం: 04-556 శరణాగతి

పల్లవి: ధనముగని మరికదా ధనికుఁడౌట - మొదల
తనుఁ దానెఱుఁగలేని తలుపేఁటి తలఁపు

చ. 1: మచ్చికల నినుఁగొలిచి మరికదా సుఖులౌట
యెచ్చోట నేవేల్పులెవ్వరైన
అచ్చుపడ నటువంటి హరి నిన్నుఁ గొలిచి నీ
మెచ్చువడయఁగలేని మేలేఁటి మేలు

చ. 2: కందువగ నినుఁ గొలువఁగనికదా ఘనులౌట
యెందునరుదగు వేల్పులెందరైన
అందముగ పరదైవమని నిన్నుఁ గనలేక
గొందిఁబడి పొరలేటి కూడేఁటి కూడు

చ. 3: వేరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ
దాసులై మరికదా ధన్యులౌట
వాసి వట్టముకొరకు వదలి దినములచేతఁ
బాసి పోయినవెనక పరమేడ పరము

రేకు: 9042-01 ఆహిరి సం: 04-557 అధ్యాత్మ

పల్లవి: ఇట్టి సంసారికేదియు లేదాఁయ
తట్టువడుటేకాని దరిచేరలేదు

చ. 1: ములిగి భారపుమోపు మోఁచేటివాఁడు
అలసి దించుకొను నాడాడను
అలరు సంసారికి నదియు లేదాయ
తొలఁగని భారమెందును దించలేదు

చ. 2: తడవి వేఁపచేఁదు త్రావెడివాఁడు
ఎడయెడఁ దినుఁ దీపేమైనను
అడరు సంసారికి నదియు లేదాయ
కడుఁ జేఁదెకాని యెక్కడఁ దీపులేదు

చ. 3: దొరకొని హేయమే తోఁడేటివాఁడు
పరితవించును మేనఁ బరిమళము
అరిది సంసారికి నదియు లేదాయ
ఇరవు వేంకటపతి నెఱుఁగలేఁడు

రేకు: 9046-01 ఆహిరి సం: 04-558 వైరాగ్య చింత

పల్లవి: చాలదా నా సంసారము
గాలియుయ్యెలలఁ దొలఁగక యూఁగవలసె

చ. 1: పాపపుణ్యములనెడి బల్లిదుల వెంటనే
దీపించు బంటనై తిరిగి తిరిగి
పైపైనె దేహంపుఁ బల్లెలొసఁగిన నరక
కూపముల మడి దున్నుకొని బ్రదుకవలసె

చ. 2: చిత్తమను విభుఁజేరి చెలఁగి విషయంబులకు
కొత్తగమికాఁడనై కొలిచి కొలిచి
హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గత్తంపు మొగసాలఁ గలదించవలసె

చ. 3: గాటంపు దురితములకై జీతగాఁడనై
చేటైన కోరికలఁ జేరిచేరి
ఈటాడఁ దిరు వేంకటేశుఁ గనకిన్నాళ్ళు
కోటకొమ్మలకెగసి గుంపించవలసె

రేకు: 9047-01 శోకవరాళి సం: 04-559 వేంకటగానం

పల్లవి: వేంకటగిరి గోవిందుఁడా
యింకా నొకరో యిద్దరో మీరు

చ. 1: పచ్చలు దాచిన బాహుపురులతో
అచ్చపుఁ గరముల అందముతో
అచ్చలు నిచ్చలు నలను (రు?) దురిదివో
నిచ్చలు నీవో నీవో కాని

చ. 2: నిలుచుండుటయును నెరిఁ బవళింపుచు
నలరుటయును మీరటు నిటును
జలజాక్షులు దొడ చరచఁగ నొరపుల
వెలయగ నిద్రో విభవమిదో

చ. 3: తిరు వేంకటగిరి దిగువ తిరుపతిని
పరమానందపు బహుసిరులు
అరుదుగఁ బొందుచు అధికములందుచు
ఉదగశయనుఁడవొ వొడయఁడవో

రేకు: 9047-02 సామంతం సం: 04-560 వైరాగ్య చింత

పల్లవి: ఏమిసేయవచ్చుఁ గర్మమిచ్చినంత కాని లేదు
తాముసేసినంత వట్టు తమకుఁ బోరాదు

చ. 1: ఇట్టు నట్టు మిట్టిపడ్డ నించుకంతా లేదు - వీఁపు
పట్టగట్ట మోఁపు మోఁచి పాటువడ్డ లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొన్న లేదు
తెట్ట తెరువున నోరుదెరచిన లేదు

చ. 2: అడిగిపరుల బతుకాసపడ్డ లేదు - భీతి
విడిచి నెత్తుటఁ దోఁగి వీరుఁడైన లేదు
అడవులెల్లఁ దిరిగి అలమటించిన లేదు
ఇడుమపాటుఁజొచ్చి యియ్యకొన్న లేదు

చ. 3: వచ్చి వచ్చి వనితల వలపించుకొన్న లేదు
మెచ్చుల గుఱ్ఱమునెక్కి మేటియైన లేదు
ఎచ్చరకఁ దిరువేంకటేశుఁ గొలువకుంటే
ఇచ్చటచ్చట సుఖమించుకంత లేదు

రేకు: 9047-03 కాంబోది సం: 04-561 జోల

పల్లవి: వాగె బలువు దైవపురాయా - నీ
రాగె జతనము పరాకెచ్చరికె

చ. 1: మించులఁ దురగము మిన్నులు మోపఁగ
నంచలఁ గురుచల నాడఁగను
కంచు మించుగా గక్కనఁ దోలితి
పంచాస్త్రగురుఁడ పాదెచ్చరికె

చ. 2: పెక్కువతేజిటు పేరెమువారఁగ
తొక్కనిచోట్లు దొక్కఁగను
చుక్కలు మోపఁగ సొంపుగఁ దోలితి
తొక్కుల దేవరదేవెచ్చరికె

చ. 3: అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి
లంకెల జాఁగు భళా యెచ్చరికె

రేకు: 9049-01 కాంబోది సం: 04-562 ఉపమానములు

పల్లవి: తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్టు నా
పల్లదా లెవ్వరి పాలయ్యీనో తాము

చ. 1: మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు
ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా
గాదిలి కర్మములేడఁ గంటివో తాము

చ. 2: కాఁపుటూరి మంగలోజు గడిమీఁది రాజుగాఁగ
కాఁపులెల్లాఁ బనిమాని కందినయట్టు
ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా
పాపము లెవ్వరి పంచపాలయ్యీనో తాము

చ. 3: ఒట్టిన మోఁపులు మోవనోపక వూరువిడిచి
వెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు
ఇట్టె నేను శ్రీవేంకటేశుఁ గొలువఁగ నా
చుట్టము లిందరు నేడఁ జొచ్చేరో తాము

రేకు: 9049-02 పాడి సం: 04-563 నామ సంకీర్తన

పల్లవి: నారాయణతే నమో నమో
నారద సన్నుత నమో నమో

చ. 1: మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ
పరమ పురుష భవ బంధ విమోచన
నర మృ గశరీర నమో నమో

చ. 2: జలధి శయన రవిచంద్ర విలోచన
జలరుహాభవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో

చ. 3: ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహన రూప
వేదోద్ధర శ్రీ వేంకటనాయక
నాదప్రియ తే నమో నమో

రేకు: 9050-01 శ్రీరాగం సం: 04-564 నామ సంకీర్తన

పల్లవి: త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా

చ. 1: వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీ సతీశ సరసిజ నేత్ర
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయవసన జగన్నాథా

చ. 2: బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలి దోష హరణ జగన్నాథా

చ. 3: వటపత్ర శయన భువనపాలన జంతు
ఘటకార కరుణ శృంగారాధిప
పటుతర నిత్య వైభవ రాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా

రేకు: 9050-02 పళమంజరి సం: 04-565 జోల

పల్లవి: పాలజలనిధిలోఁ బాయని
నీలవర్ణుఁడవట నీవా యిపుడు

చ. 1: వెదచల్లుమణుల వేయిపడగలను
చెదరని మెరుఁగుల శేషునిపై
మృదువుఁ బరపుగా మెల్లనె పొరలుచు
నిదురవోదువట నీవా యిపుడు

చ. 2: పరమ మునీంద్రులుఁ బద్మభవాదులు
ఇరువంకల నుతియించఁగను
అరవిరిమోమున నల్లన నవ్వెడి
నిరతమూర్తివట నీవా యిపుడు

చ. 3: పగటున సిరియునుఁ బరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకఁగను
తగు వేంకటగిరిఁ దనరుచు జెలఁగెడి
నిగమమూర్తివట నీవా యిపుడు

రేకు: 9053-01 సామంతం సం: 04-566 వైరాగ్య చింత

పల్లవి: సంతత దుఃఖపు జడులాల శ్రీ
కాంతుని మరవక కనరాదా

చ. 1: మలజలధులఁ బలుమరుఁ దేలుచుఁ గడు
దలఁకుచు నొరలుఁ బాతకులార
నలువున శ్రీహరి నామామృతమే
కొలఁది మీరఁ బేర్కొనరాదా

చ. 2: భవ పంకము లోపలఁ బడి ముణుఁగుచు
చవి దలఁచెడి దుర్జనులాల
భవరోగములకుఁ బండితుఁడవు మా
ధవుని నాత్మఁ జెందగఁరాదా

చ. 3: కడుఘోరపు మార్గంబున నలయుచు
వడినేఁగెడి తెరువరులాల
చెడని పదవొసఁగు శ్రీవేంకటపతిఁ
దడవి సుఖముల జెందఁగరాదా

రేకు: 9054-01 సామంతం సం: 04-567 కృష్ణ

పల్లవి: బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁ గన్నట్టివాడుఁ పిన్నవాడు

చ. 1: బిరుసైన దొకకొండ పెనుబాముతోఁ జుట్టి
బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు

చ. 2: బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోగూడ
పెడచేతనే వేసెఁ బిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపే పిన్నవాఁడు

చ. 3: ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై
పెక్కురూపములైన పిన్నవాఁడు
ఇక్కడఁ దిరువేంకటేశుఁడై జగమెల్ల
పిక్కిటిల్లినవాడు పిన్నవాఁడు

రేకు: 9056-01 నాట సం: 04-568 సంస్కృత కీర్తనలు

పల్లవి: ఆది పురుషా అఖిలాంతరంగా
భూ దేవతా రమణ భోగీంద్ర శయనా

చ. 1: భవపాథోనిధి బాడబానల
భవజీమూత ప్రభంజనా
భవ పర్వత ప్రళయ భయద నిర్ఘాత దు
ర్భవ కాలకూటభవ బహువిశ్వరూప

చ. 2: భవఘోరతిమిరదుర్భవకాలమార్తాండ
భవభద్ర మాతంగ పంచానన
భవ కమలభవ మాధవరూప శేషాద్రి
భవన వేంకటనాథ భవరోగవైద్య

రేకు: 9058-01 సాళంగం సం: 04-569 దశావతారములు

పల్లవి: నీవు తురగముమీఁద నేర్పు మెరయ
వేవేలు రూపులై వెదచల్లితపుడు

చ. 1: పదిలముగ నిరువంకఁ బసిడి పింజల యంప
పొదల తరకసములొరపులు నెరపఁగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైనవపుడు

చ. 2: సొరిది శేషుని పెద్దచుట్టు పెనుఁగేవడము
సిరి దొలఁక నొకచేతఁ జిత్తగించి
దురమునకుఁ దొడవైన ధూమకేతువు చేత
ఇరవైనబల్లెమై యేచెనందవుడు

చ. 3: కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిఁట నిన్నుఁ దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువుమని
మెరుఁగుఁగుచకుంభముల మిసిమితో నపుడు

రేకు: 9058-02 మలహరి సం: 04-570 జోల

పల్లవి: నిద్దిరించీఁ బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీ రమణునికి నొత్తరే పాదములు

చ. 1: వేఁగుదాఁక జిత్తగించి విద్దెలెల్లనాదరించి
బాగుగాఁ గృపారసము పంచి పంచి
యేగతిఁ బవళించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను

చ. 2: వాలుగన్నుల రెప్పల వడదాఁకి తను తావి
చాలుకొన నూర్పుకలు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత
కాలము కన్నుల దిప్పీఁ గప్పరే దోమతెర

చ. 3: సరగున యోగనిద్ర చాలించి లోకమెల్ల
కరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁడాయె మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు

రేకు: 9066-01 శంకరాభరణం సం: 04-571 దశావతారములు

పల్లవి: దురితమృత్యువట దొంగలట
సిరివరుఁడట దయసేసీనా

చ. 1: మలయుచునె చేరిన మధుకైటభులను
సెల నెత్తురు వడిచినయట్ల
ఖలులఁ బిడిచి రక్తము వడిఁగ్రోలక
విలయాంతకుఁడట విడిచీనా

చ. 2: కారించి కనక కసిపుని నఖములఁ
జీరి కడుపు చించిన యతఁడు
ఈరసపసురల యెముకలు విరువక
వీరసింహుఁడట విడిచీనా

చ. 3: చెనకి దశముఖుని చేతులుఁ దలలును
చినికండలు గోసిన యతఁడు
ఘనుఁడట తిరువేంకటపతి దుష్టులు
తనువులఁ జెండక తడసీనా

రేకు: 9066-02 శ్రీరాగం సం: 04-572 ఇతర దేవతలు

పల్లవి: ఒక్కఁడవె లోకానకొడయడఁవు నీవె
దిక్కుగా నెవ్వరులేరు తిమ్మినాయఁడా

చ. 1: బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా
దొడ్డగాఁ బండఁగఁ జూచి దోసకారి మొండిదొర
దిడ్డిఁదీసి కొంటఁబోయ తిమ్మినాయఁడా

చ. 2: పాలకొల్ని చందిరెడ్డి పంటసేయఁ బొద్దులేక
గాలివీటి కాపుఁరానఁ గసుగందఁగా
కోలుపుచు దినమూ నీకొండమీఁది నాయకులు
తీలుపరచేరుగదే తిమ్మినాయఁడా

చ. 3: కామకొల్ని మారిరెడ్డి కనుచూపువారినెల్ల
కోమలపు చెలుపలు గోరు మొత్తఁగా
ప్రేమముతోఁ గేదారి పెరిగి పండిన పంట
తేమ రేఁగి ఊటువట్టె తిమ్మినాయఁడా

చ. 4: గుండుఁగంటి దేవిరెడ్డి కొలిచిన వండిపెట్టు
కుండఁ గాపరింటనింట కూడుమోయఁగా
పండిన బండ్లఁగొట్టి పంటలెల్ల నానాఁటి
తిండికొక్క కొలఁదాయ తిమ్మినాయఁడా

చ. 5: వెలిగొండ కాపిరెడ్డి వేఁకపు జీవనమెల్ల
తలమోఁచి తిరిపెమై తల్లడించఁగా
తెలిసి యాతనితో నొక్కటిగాఁగ నీగుట్టు
తెలిసె వేంకటగిరి తిమ్మినాయఁడా

రేకు: 9069-01 కన్నడగౌళ సం: 04-573 సంస్కృత కీర్తనలు

పల్లవి: త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన

చ. 1: కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమథన

చ. 2: మయా వా తవ మధురగతి
భయాదిక విభ్రాంతోహం
తయా విమలం దాతవ్యా
దయా సతతం ధరణీరమణ

చ. 3: ఘనం వా మమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనాద్భున వేంకటగిరిరమణ

రేకు: 9074-01 లలిత సం: 04-574 అధ్యాత్మ

పల్లవి: భవములు వీడఁగఁ బాలించి
చవి మరపెను మోక్షము తెరువు

చ. 1: కర్మకోట్లకు గడిచీటిచ్చెను
నిర్మలమతులకు నేఁడిపుడే
ధర్మమార్గమునఁ దడవి నడచుటకు
నర్మిలిఁ బుణ్యములందుటకు

చ. 2: ముంజేతద్దము మూలదాముగా
సంజీవని సరసత నొసఁగె
గొంజ సుకృతములు కుమ్మరించి హరి
రంజించెను సర్వజనులకు

చ. 3: పట్టముగట్టెను ప్రాణులకెల్లను
గట్టిగఁ దిరు వేంకట విభుఁడు
ఒట్టిన యాపదలూడఁదోలి జను
లిట్టే నిజసుఖమిచ్చుటకు

రేకు: 9074-02 ఆహిరి సం: 04-575 నామ సంకీర్తన

పల్లవి: నన్నునింత సేయుకంటె నవ్వులున్నవా పంట
మన్నుపైఁడిముద్దగాఁగ మన్నుపూసె నితఁడు

చ. 1: పంచమహాపాతకులఁ బరమపావనులఁగా
వించఁ బూనె నిందుకంటె విద్యలున్నవా
ఇంచుకంత హరినామమింతలోననె ముట్టు
పెంచు దెచ్చి మాణికపుబిల్ల సేసె నితఁడు

చ. 2: మాలవాని కష్టవిద్య మందవెట్టి బ్రహ్మవిద్య
పాలుసేసె నిందుకంటె బ్రతుకున్నదా
నాలుకందునున్న విష్ణునామమంత్రము చెప్పు
తోలుబిల్ల మాడకంటె దొడ్డసేసె నన్నును

చ. 3: కుక్క దెచ్చి గంగిగోవు కొదమగాఁగ భూమిలోన
ఒక్కమాట యింతసేయ నోపవచ్చునా
దిక్కులందు వేంకటేశు దివ్యనామము రోఁత
కక్కుఁగూటి నమృతజలధిఁ గావించె నన్నును

రేకు: 9074-03 భూపాళం సం: 04-576 ధనుర్మాసం

పల్లవి: ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయమలర భజింపరో మీ రిటు ధనుర్మాసముల విధులన్

చ. 1: వేగ నాలుగు ఘడియలనఁగా వేదవేద్యులు లేచి సరగున
నాగమోక్తవిధులను తమదేహానుగుణములుగా
వేగమున సంధ్యాదులొగిఁ గావించి విమలాంభోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడపక ధనుర్మాసముల విధులనె ఘనులు

చ. 2: పరగు చీనాంబరములను నతి పరిమళమ్ముల బుష్పముల కడు
వెరవుగా వేంకటపతి వేద్యసంగతుల అరుదుగా
ధూపముల బహుదీ పాదులను తాంబాలవిధులను
పరగఁ బూజింపుఁడు సమస్త ప్రభు ధ్రనుర్మాసమున విధుల ఘనులు

రేకు: 9074-04 మేచబౌళి సం: 04-577 కృష్ణ

పల్లవి: అచ్చపు రాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ

చ. 1: ఊరుఁగాయలును నొద్దిక చద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవులు గొంటివి కృష్ణా

చ. 2: ఆకసంబున కాపుర ముఖ్యులు
నాకలోకపు నాందులును
కైకొని యజ్ఞకర్త యాతఁడని
జోకఁ గొనియాడఁ జొక్కితి కృష్ణా

చ. 3: పేయలు లేవు పిలువుఁడనుచు
కోయని నోరఁ గూఁతలను
మాయల బ్రహ్మము మతము మెచ్చుచు
చేయని మాయలు సేసితి కృష్ణా

రేకు: 9075-01 -- సం: 04-578 కృష్ణ

పల్లవి: ఈతఁడే హరుఁడు యీతఁడే యజుఁడు
ఈతనికి నీచేఁతలెంత ఘనమటుగాన

చ. 1: కడుఁ బెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన
కడుపలో నిడుకొన్న ఘనుఁడు
వెడలి పూతకిచంటివిషము దాఁగినయంత
వడిఁ దనకు నేమాయ వట్టిబూమెలు గాక

చ. 2: ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు
డుల్లసిల్లుచు నీతఁడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుఁడవని నిన్నుఁ బరిణమింతురుగాన

చ. 3: తిరువేంకటేశ్వరుఁడు దేవదేవోత్తముఁడు
పరిపూర్ణుఁ డచ్యుతుఁ డభవుఁడు
శరణాగతుల రక్షసేయు వాడను మాఁటి
గురుతుగాఁ దలపోసి కొనియాడఁగా వలసె

రేకు: 9075-02 -- సం: 04-579 వైష్ణవ భక్తి

పల్లవి: నీ కథామృతము నా నిరత సేవన నాకు
చేకొనుట సకల సుఖ సేవనంబటుగాన

చ. 1: ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన

చ. 2: ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహితమార్గము
ఇదియె బహులోకహితభేషజము నాకు
ఇదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన

చ. 3: ఇదియె దానఫలమియ్యఁ జాలును నాకు
ఇదియె తపవిరహిత కర్మము
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటుగాన

రేకు: 9079-01 దేశాక్షి సం: 04-580 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరుగల రెవ్వరికి
ఇవ్వల నవ్వల నితఁడేకాక

చ. 1: ముద్ద సేసినటు మొదలఁ గడుపులోఁ
బెద్దగాఁ దాఁ బెరుగునాఁడు
ఒద్దనెవ్వరుండిరొకరైనా
ఒద్దికైన బంధుఁడొకఁడేకాక

చ. 2: వరతఁ బోవునట్టి వడిసంసారపు
తెరలఁ దగిలి తాఁ దిరుగునాఁడు
వెరవకుమని భావించువారెవరు
తరితోడ నీతఁడె కాచుఁగాక

చ. 3: ఉడుకఁ బెట్టినట్టి వుడివోయిన నరకాల
నుడుకుచుఁ దానుండునాడు
తడవువారెవ్వరంతటఁ దన్ను
కడవేగ వేంకటపతిగాక

రేకు: 9080-01 ముఖారి సం: 04-581 వైరాగ్య చింత

పల్లవి: కనుఁగాక పుణ్యాలు కడఁబడెనా
తనువు లేదో చేతనము లేదో

చ. 1: మోసపోతిననేల మురుగ వగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మెనా
దాసుఁడుఁగా దా లేఁడొ తలఁప శ్రీహరి లేఁడొ
వీసమంతగాలమైన విధిలేదో

చ. 2: తల్లడించి పడనేల దైవము దూరనేల
చెల్లఁబో నేఁడే పండి పొల్లవోయెనా
ఉల్లములో హరి లేఁడో ఒద్దికతోఁ దా లేఁడో
కొల్లలాడఁ బుణ్యములకోరిక లేదో

చ. 3: చచ్చి చచ్చి పుట్టనేల జముబారిఁ బడనేల
నొచ్చి నొచ్చి మరుచేత నొగులనేల
యిచ్చలేదొ తిరువేంకటేశుఁడొద్దనె లేఁడో
నిచ్చ నిచ్చఁ దనకింత నేరుపు లేదో

రేకు: 9080-02 పాడి సం: 04-582 పోలికలు

పల్లవి: కలుషపు చీకటి గలుగఁగను
వెలుగు లోకముల వెలసిన యట్లు

చ. 1: మునుకొని పాతకములు గలుగఁగఁబో
జనులకుఁ బుణ్యము చవులాయ
ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి
కనకము ప్రమోదకరమైనట్లు

చ. 2: జగములోపల విషముగ గలుగఁ బో
మిగులఁగ నమృతము మేలాయ
వగపు గలుగఁగా వడి సంతోషం
బగపడుటిందరి కబ్బురమాయ

చ. 3: బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో
మహిమల శ్రీహరి మనసాయ
విహగ గమనుఁడగు వేంకటేశ్వరుడు
ఇహమియ్యఁగఁ బరమిచ్చైనట్లు

రేకు: 9080-03 -- సం: 04-583 వైరాగ్య చింత

పల్లవి: ఓపనయ్య వోపనయ్య
ఓపనయ్య యీ యొప్పులే తప్పులు

చ. 1: ఎక్కడికి నెక్కడ - యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు - తక్కువే దారణ

చ. 2: ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తవ్వులే యీరవ్వలు - చివ్వలే సిగ్గులు

చ. 3: బొంకులే పొందులు - కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీ - జంకెలే జంపులు

రేకు: 9082-01 శంకరాభరణం సం: 04-584 వైరాగ్య చింత

పల్లవి: అధమునికి నను విధాయకులు విధియించరో
విధిలోనఁ గొంత దుర్విధి నెరపినాఁడ

చ. 1: పాతకుని పాపాలు పరిహరింపించరో
భూతంబులాల తోఁబుట్టులాల
యేతులకు హరి దలఁచి యిటువంటి యీ మేన
బూతుఁజేతలనె పొరపులు నెరపినాఁడ

చ. 2: పాపకర్మునికి భృగుపతనంబు చూపరో
తాపత్రయములాల తమ్ములాల
దీపించు హరి దలఁచి ధృతిలేక మరి మనో
వ్యాపారములు గొన్ని వడిఁ దలఁచినాఁడ

చ. 3: చంచలున కేది నిశ్చయవిధి విధించరో
పంచేంద్రియములాల బంధులాల
ఎంచనరుదగు వేంకటేశ్వరుఁ బొగడునోర
కాంచి యితరుల నాలికకుఁ జేర్చినాఁడ

రేకు: 9082-02 లలిత సం: 04-585 అధ్యాత్మ

పల్లవి: హితమిదియే కాకిఁక లేదు - మా
గతిఁ జెలి నీకృపె కలదిది యెల్లా

చ. 1: పాతకకోట్లం బాయునుపాయం
బేతరిఁ జూచిన నిఁక లేదు
చైతన్యాత్మక సకలేశ్వర నీ
చేతిదె ప్రాణుల జీవనమెల్లా

చ. 2: భవబంధంబులఁ బాయునుపాయం
బివల నవల మాఱికిఁక లేదు
ధ్రువవరదుఁడ కౌస్తుభధర నీకృప
చవిచేతివె మా సంపద లెల్ల

చ. 3: పరమ పదం బగపడు విభవము నీ
కరుణే కానిఁకఁ గడలేదు
తిరు వేంకటగిరి దేవుఁడ నీకే
భరము జంతువుల పనులివి యెల్లా

రేకు: 9082-03 గుండక్రియ సం: 04-586 వైరాగ్య చింత

పల్లవి: పాయమంట ముదిమంటా బహురూపము-యిఁక
నేయెడఁ గాచెదు మము నిందిరారమణ

చ. 1: అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
పన్నుకొని తిరిగేరు బహురూపాలు
ఎన్నిక దినములలో నెవ్వరికి నేమేమి గల
రిన్నిటికి నీవె నాకు నిందిరారమణ

చ. 2: చుట్టమంటా పక్కమంటా సుఖమంటా దుఃఖమంటా
పట్టులేక తెచ్చుకొన్న బహురూపము
వట్టివెతలఁ బడి వాడుదేరేము
ఎట్టు సేసినను జేయుమిందిరారమణ

చ. 3: తల్లులంటాఁ దండ్రులంటా తప్పులంటా నొప్పులంటా
బల్లిదులఁ జేయలేని బహురూపాలు
వెల్లిగొన్న కృపతోడి వేంకటేశుఁడ నాకు
నెల్లనాఁడు నీవే కలవిందిరారమణ

రేకు: 9084-01 దేవగాంధారి సం: 04-587 వైరాగ్య చింత

పల్లవి: ఈజీవునకు నేది గడపల తనకు
నేజాతియును లేక యిట్లున్నవాఁడు

చ. 1: బహుదేహ కవచములఁ బారవేసినవాఁడు
బహుస్వతంత్రముల నాపద నొందినాఁడు
బహుకాలముల మింగి పరవశంబైనాఁడు
బహుయోనికూపములఁ బడి వెడలినాఁడు

చ. 2: పెక్కుబాసలు నేర్చి పెంపు మిగిలినవాఁడు
పెక్కు నామములచే బిలువఁబడినాఁడు
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ
పెక్కులాగులఁ బెనఁగి బెండుపడినాఁడు

చ. 3: ఉండనెన్నఁడుఁ దనకు ఊరటెన్నఁడు లేక
యెండలకు నీడలకు యెడతాఁకినాఁడు
కొండలలో నెలకొన్న కోనేటిరాయని
యండ చేరెదననుచు నాసపడినాఁడు

రేకు: 9084-02 వరాళి సం: 04-588 వేంకటగానం

పల్లవి: దిక్కులేకపోయే నిట్టే దినదినము
వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వడో

చ. 1: గుత్తముగ నెల్లవారు కుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టుకొని బయటవేసిన
మెత్తనిదంటాఁ బట్టు మింగె నెవ్వడో

చ. 2: బంతిగాఁగ నెల్లవాఁరు పండేటిమంచము
గుంతలో విరుగఁదోసె గూళఁడెవ్వడో
దొంతుల కడవలోన తొరలి దాఁచిన పెద్ద
పొంతకూటికుండఁ గొంటఁ బోయెనెవ్వఁడో

చ. 3: సొరిది సంతలలోని సుద్దులెల్ల విని విని
విరసములెల్లఁ బాపే విభుఁడెవ్వఁడో
తిరువేంకటగిరి దేవుఁడై యిందరికిఁ
గరుణ లోకము గాచే ఘనుఁడెవ్వఁడో

రేకు: 9084-03 దేశాక్షి సం: 04-589 వేంకటగానం

పల్లవి: కంటి నఖిలాండ కర్త నధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి - నిజమూర్తిఁ గంటి

చ. 1: మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజ నవ రత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె కంటి

చ. 2: పావనంబైన పాప వినాశనము గంటి
కైవశంబగు గగన గంగ గంటి
దైవికపుఁ బుణ్య తీర్థములెల్లఁ బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరిఁ గంటి

చ. 3: పరమ యోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరి చూపు దివ్యహస్తము గంటి
తిరు వేంకటాచలాధిపుఁ జూడఁగంటి

రేకు: 9086-01 దేసాళం సం: 04-590 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నాళ్ళున్నా నిట్టె కదా
విన్నని వెరగులె వేఁడుకలాయ

చ. 1: భువి నెట్టుల్లాఁ బోయేదే కా
చవులకుఁ జవియగు శరీరము
ధ్రువమని యీ సుఖదుఃఖ రోగములు
భవముల కిదియే బందములాయ

చ. 2: ఎంత వొరలినా నిదే తాఁగద
కంతల కంతల కాయమిది
బొంత దగులుచుక పొరలఁగఁ బొరలఁగ
సంతకూటములె సరములాయ

చ. 3: కైపుసేసినా ఘనమౌనే కా
పాపముఁ బుణ్యముఁ బైపైనే
యీ పుట్టుగునకు ఈ వెంకటపతి
దీపించఁగఁ బెనుఁదెరువొకటాయ

రేకు: 9086-02 ఆహరి సం: 04-591 వైష్ణవ భక్తి

పల్లవి: కలియుగంబునకుఁ గలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె

చ. 1: బోధల హరినుతి పాడమెను శూద్ర
స్సాధని కలిదోషము మాన్ప
రాధా మాధవ రచన సకలజన
సాధువేదమే జగమునఁ గలిగె

చ. 2: పరమగు వేదము బహుళము చదివియు
హరి నెరిఁగిన వారరుదనుచు
తిరువాముడియై దివ్యమంత్రమై
వెలసిన పంచమ వేదమె కలిగె

చ. 3: బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకె దీరదెచ్చట ననుచు
సంకీర్తనమే సకలలోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె

రేకు: 9087-01 శ్రీరాగం సం: 04-592 వేంకటగానం

పల్లవి: కత్తరాలు చిమ్ముచుండెఁ గదలుచుండె
చిత్తజ జనకుఁడైన శ్రీ మూరితి

చ. 1: కన్నులఁ జొక్కుచునుండె కంపితము మీఁటుచుండె
సన్నపు సొలపు నిగ్గు సళుపుచుండె
అన్నువ నడిమి యింతి నక్కున నొత్తుచునుండె
ఉన్నతిఁ గోనేటిదరినున్న మూరితి

చ. 2: మేసులు ముట్టుచునుండె మేడమీఁద నిలుచుండె
కీసిన గోక గిలిగింపుచునుండె
నేసకొప్పురమణికి చెక్కులు నొక్కుచునుండె
తీసిన లంఘితముల దివ్యమూరితి

చ. 3: కిలకిల నవ్వుచుండె కిన్నెర వట్టుచునుండె
పలుమెరుఁగులు దోఁప బాడుచుండె
అలమేలుమంగమీఁద నలరి యొరగి యుండె
వెలయ వేంకటగిరి వేదమూరితి

రేకు: 9105-01 ముఖారి సం: 04-593 వైష్ణవ భక్తి

పల్లవి: మొక్కరో మీరు మోసపోక - మీకు
దిక్కుదెసైన ఆదిదేవునికి

చ. 1: మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు
జీరాన గుండెలు గోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు
ఊరకే మీవారమని వున్నఁ జాలు

చ. 2: సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడి బడి పగ్గాలఁ బారవద్దు
సిడిమీఁద బిత్తరపు బిమ్ములు చిమ్మఁగవద్దు
కడనుం............................ దారి గన్నఁ జాలు

చ. 3: బగ్గన యెక్కడ డొక్కపడునో యేమరవద్దు
బగ్గివడ్డ యమబాధఁ బడవద్దు
ఎగ్గు సిగ్గులేక వేంకటేశుని దాసులఁజేరి
అగ్గలపు పాదరేణువైనఁ జాలు

రేకు: 9106-01 శ్రీరాగం సం: 04-594 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరిఁ దలఁపఁడు ఎవ్వరి నొల్లఁడు
నవ్వుల తెరువులె నడచీఁ బ్రాణి

చ. 1: కలుషముఁ బుణ్యము కర్మపుఁ జేనను
వెలయఁగ జీవుఁడు విత్తుచును
కలిగిన సుఖదుఃఖములను గాదెల
కొలుచులు నించుక కుడిచీఁ బ్రాణి

చ. 2: చెడని ప్రపంచము శెశెదిదిలో
నిడుపు గురుచలుగ నేసినది
వడి దేహములను వన్నెల వన్నెల
గడనల చీరలె కట్టీఁ బ్రాణి

చ. 3: కూరిమిఁ గామక్రోధాదులు మతి
చూరలఁ గొనియెడి చుట్టములే
గారవముల వేంకటపతిఁ గొలువక
చేరి కాఁపురము సేసీఁ బ్రాణి

రేకు: 9108-01 ధన్నాసి సం: 04-595 విష్ణు కీర్తనం

పల్లవి: ఏలయ్య పరమాత్మ యేలికవు మాకునై నాలినే పెట్టితివి నాడూను
కాలునికి మమ్ము సరిగాఁపులే కమ్మనుచు నేలనే తిప్పేవు నేఁడూను

చ. 1: భారమగు నీటిలోఁ బవళించి నీ వాది నారాయణుఁడవైతి నాఁడూను
పైరుగా నిందరిని ప్రకృతి లోపలఁదెచ్చి నారుగాఁ బోసితివి నాఁడూను
నారు పేరిడి తండ్రి నందనుని బిలవఁ గరుణారసము నించితివి నాఁడూను
చేరి కడు మమ్ము రక్షింపనోపక వట్టి నేరములె యెన్నేవు నేఁడూను

చ. 2: దట్టముగఁ జొచ్చి యిందరిదేహములలోన నట్టనడుమెక్కితివి నాఁడూను
అట్టలుగ బ్రహ్మాండమవియించి జంతువుల నట్టేట ముంచితివి నాఁడూను
ఒట్టి యిందరికి సరయూదరిని మోక్షంబు నట్టు కొట్టితి గొంత నాఁడూను
పొట్ట పొరుగునఁ దెచ్చి భూతముల మెడగట్టి నిట్టి పిడినేఁపేవు నేఁడూను

చ. 3: పొలువుగా మమ్మిట్లఁ బుట్టించుకొరకునే నలిన నాభుఁడవైతి నాఁడూను
పలువేలుపులకెల్ల పదవులిన్నియు నొసగి నలుగడల నునిచితివి నాఁడూను
చలముకొని దానవులఁ జక్కాడి దేవతల నలఁకువలు దీర్చితివి నాఁడూను
చెలఁగి యిందరిఁగావ శ్రీ వేంకటాద్రిపై నెలకొనిటు నిలిచితివి నేఁడూను

రేకు: 9108-02 సామంతం సం: 04-596 వైరాగ్య చింత

పల్లవి: గద్దరి జీవుఁడు కామధేనువు మాని
యెద్దుఁ బిదుకఁ జొచ్చె నేది దెరఁగు

చ. 1: మటమాయములఁ దనమనసె చంచలమంది
ఇటునటుఁ దిరిగిన నేది దెరఁగు
కటకట వూరేలు కర్తే దొంగలఁగూడి
యెటువలెఁ జేసిన నేదిదెరఁగు

చ. 2: కల్లలాడఁగఁ జొచ్చెఁ గలుషపుమతి సత్య
మిల్లు వెడలగొట్టె నేదిదెరఁగు
చెల్లఁబో నోరే చేఁదుమేయఁగఁ జొచ్చె
నెల్లవారికి నింక నేదిదెరఁగు

చ. 3: తియ్యని వెంకటాధిపుఁ బాసి పరసేవ
కియ్యకొనెడిఁ జిత్తమేది దెరఁగు
అయ్యో చక్కనిపతి నాలు విడిచిపోయి
యెయ్యెడఁ దిరిగిన నేదిదెరఁగు

రేకు: 9108-03 భూపాళం సం: 04-597 నామ సంకీర్తన

పల్లవి: నందకధర నందగోపనందన
కందర్పజనక కరుణాత్మ

చ. 1: ముకుంద కేశవ మురహర
సకలాధిప పరమేశ్వర దేవేశ
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకటవిభవ నమో పరమాత్మ

చ. 2: ధ్రువ పాంచాలీ స్తుతివత్సల మా
ధవ మధుసూదన ధరణిధరా
భువనత్రయ పరిపోషణ తత్పర
నవనీతప్రియ నాదాత్మ

చ. 3: శ్రీమన్ వేంకటశిఖరనివాస మ
హమహిమన్ నిఖిలాండపతే
కామితఫలభోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మన్

రేకు: 9111-01 ముఖారి సం: 04-598 హనుమ

పల్లవి: నెరబిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగనమదివో నీ బంటు

చ. 1: ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవఁగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు

చ. 2: గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు

చ. 3: ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు

రేకు: 9116-01ముఖారి సం: 04-599 గురు వందన, నృసింహ

పల్లవి: నేర్పుకంటెఁ బెన్నిధి గద్దా
ఓర్పుకంటె సుఖమొకటిఁక గద్దా

చ. 1: కరుణకు నెక్కుడు గతి యిఁకఁ గద్దా
సరసతకెక్కుడు సరి గద్దా
గురుమతిఁ జత్తము కూరిమి నిలిపిన
వెరవుకంటె విధమిక గద్దా

చ. 2: కలిమి కంటెఁ జీఁకటి మరి కద్దా
బలిమికంటె నాపద గద్దా
గెలుప (గఁ) దెలిసి లంకించిన మతితోఁ
జెలఁగుకంటె నిజసిరి యిఁకఁ గద్దా

చ. 3: పోయముకంటె నపాయము గద్దా
కాయపు రోఁతకుఁ గడ గద్దా
పాయక వేంకటపతి కృప గోరిన
యీయభిమతమున కెదురిఁకఁ గద్దా

రేకు: 9116-02 సామంతం సం: 04-600 వేంకటగానం

పల్లవి: మునుకలుగఁ జీలిచీ మూఁడు లోకాలు
ధనము బందెలచేతఁ దగనందుకొనుచు

చ. 1: పరుసవారిఁ బిలువ బడిబడిఁ బారితెంచి
ఒరసు దైవాల మిండఁడూళ్ళ వెంట
సిరసు పంచెముపాగఁ జెరిగిన చుంగులతో
గరుసుమీరిన యీవిఁ గప్పములు గొనుచు

చ. 2: లాట భోట కుకుర మరాట దేశాల ఘనుల
కూటువలు గూడించి కోట్లసంఖ్య
పేటలుఁ బేటలు పెనుఁగూటములుగాఁ దెచ్చి
చాటువైన వరములు చల్లువెదలాడుచు

చ. 3: గక్కన నెదురువచ్చి కనిపించుకొను వాఁడె
వెక్కసపు మహిమల వేంకటేశుఁడు
పక్కల వనములెల్లఁ బసిఁడిగాదెల నించి
మొక్కులు గైకొని వరములు గోకొండనుచు

రేకు: 9116-03 శ్రీరాగం సం: 04-601 విష్ణు కీర్తనం

పల్లవి: ఇందిరకు నురము మీఁదిచ్చిన నాఁడు
విందువలె హరి యిందు విచ్చేసె నాఁడు

చ. 1: పరమపదమునందు బహుదివ్యవరణాలు
హరి గరిమలు పొలువలరు నాఁడు
గరుడఁడు నసంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులై రిందు నాఁడు

చ. 2: పాల జలధిలోనఁ బవళించి హరి వచ్చి
భూ లోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించి నేలయు మిన్ను బహు దివ్య దేశాలు
గాలించి కోనేటిదరి గైగొంట నాఁడు

చ. 3: నరసురోరగులెల్ల నలువంకఁ గొలువంగ
పురవైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపద మిదని పాలించె నాఁడు

రేకు: 9116-04 దేవగాంధారి సం: 04-602 అంత్యప్రాస

పల్లవి: కలిగినమతి వృథ గాకుండా
అలరుటె పుణ్యంబగు ఫలము

చ. 1: ఒనరిన యీ భవము సురనకుండ
ఘనుఁడీ జీవుఁడు గలఫము
తనువు మోచి చైతన్యాత్ముని మతిఁ
గనుటె వివేకముగల ఫలము

చ. 2: చేసిన పుణ్యము చెడిపోకుండ
శ్రీ సంపద మెరసిన ఫలము
ఈసుల రేసుల యితర దూషణలఁ
బాసుటె అపురూపపు ఫలము

చ. 3: హరిఁ గొలిచియు మిథ్య గాకుండ
విరసముడిగి చదివిన ఫలము
తిరు వేంకటగిరి దేవుని సరిగా
పరులఁ గొలువనిదె బహు ఫలము

రేకు: 9117-01పాడి సం: 04-603 సంస్కృత కీర్తనలు

పల్లవి: పృథుల హేమ కౌపీనధరః
ప్రథితవటుర్మే బలం పాతు

చ. 1: సూపాసక్తః శుచి స్సులభః
కోప విదూరః కులాధికః
పాప భంజనః పరాత్పరోయం
గోపాలో మే గుణం పాతు

చ. 2: తరుణః ఛత్రీ దండకమండలు
ధరః పవిత్రీ దయాపరః
సురాణాం సంస్తుతి మనోహరః
స్థిరస్సుధీర్మే ధృతిం పాతు

చ. 3: త్రి విక్రమః శ్రీ తిరు వేంకట గిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమల మసృణ కబళప్రియో మే
దివా నిశాయాం ధియం పాతు

రేకు: 9117-02 కేదారగౌళ సం: 04-604 మనసా

పల్లవి: నారాయణుని శ్రీ నామమిది
కోరినవిచ్చీఁ గోవో మనసా

చ. 1: శుక వరదుని సొంపుగఁ దలఁచుటె
సకల భవ విజయము
అకలంకము మహా భయ హరణ
మొకటి నొకటి వోహో మనసా

చ. 2: పక్షిగమన శుభము దలఁచుటే
అభయభోగ విహారమ్ము
వక్షపు లక్ష్మీవరుసే సిరులు
లక్షలు గోట్లొల్లవొ మనసా

చ. 3: ఇంకా నీతలఁపులెన్ని గలిగిన
వేంకటాధిపు సేవించఁగదో
అంకెలకిన్నియునైన యీ
మంకపు గాక నమ్మవో మనసా

రేకు: 9117-03 శ్రీరాగం సం: 04-605 తిరుపతి క్షేత్రం

పల్లవి: పొల్లమెల్లఁ దిరిగిన బోడెద్దు
గరిమెలో తో నెవ్వరికి దగ్గరి రాని యెద్దు

చ. 1: పురములు సాధించ బూనినప్పుడు భూమి
భరమెత్తి నిలచిన బండెద్దు
పరివోని మందల పసులఁ బోఁదోలి శ్రీ
వరుఁడై రోలఁ గట్టువడినెద్దు

చ. 2: ఒడలెత్తి నాలుగుయుగముల బడిఁ
బడి ధర్మదేవతై పరగినెద్దు
తడవి దేవరలను దామెర లను గట్టఁ
గడఁగి మానిసిరూపు కపిలెద్దు

చ. 3: గోవైన భూదేవి గూరిమిఁ జేకొని
లావైన వృషభాచలపు టెద్దు
మోపఁగ వేదాలు మొల్లమై సిరితోడ
శ్రీ వేంకటాద్రి మించిన మాయలెద్దు

రేకు: 9117-04 లలిత సం: 04-606 దేవుడు-జీవుడు

పల్లవి: అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగ నధికులె యెసఁగఁగను

చ. 1: పరంపరలగు భవములఁ బొడమియు
చిరంతనుసే జీవులిదే
ధురంధరులే దురిత సుకృతముల
జరామరణ విశారదులే

చ. 2: సదా బహుల విషయమత్తులయ్యు
మదాతురులే మనుజులిదే
ముదాసక్తులే మోహవిదూరులే
చిదానందులే చిరయశులే

చ. 3: భృశం సుఖులే పుణ్యులందరు
సుశాంతాత్ములే శుభమతులే
విశారదులే వేంకటరమణుని
వశంవదులే వరిష్ఠులే

రేకు: 9117-05 రామక్రియ సం: 04-607 కృష్ణ

పల్లవి: ఓయమ్మ యెట్టుసేసె నొకటొకటే
మాయలెల్లఁ జేసినాఁడు మరియింకనెట్టో

చ. 1: చన్నుదాగి పూతనను సగ్గుడుగాఁ జప్పరించె
మిన్నుదాఁకె సుడిగాలి మెడ దొక్కెను
వెన్న ముచ్చిరిం చి గొల్లవెలఁదులనెల్ల మెచ్చి
పిన్ననాఁడె యింతసేసెఁ బెద్దయైన నెట్టో

చ. 2: మద్దిమాఁకులు విరిచె మామయింటికేఁగి పెద్ద
యెద్దులఁ జీఁచమణఁచె నేమి వెప్పరు
చద్దికూటి ముద్దలోనె జలజాసనుని మాయ
వద్దనక పతిసేసె వాఁడివో నేడెట్టో

చ. 3: కొండవంటి పామునోరు కొచ్చి కొచ్చి చంపి చంపి
మెండుకొని వుక్కణంచె మేనమామను
కొండల వేంకటపతి కోనేటిరాయఁడు
నిండు కృప మముఁ గాచేనేరుపిఁక నెట్టో

రేకు: 9121-01ఆహిరి సం: 04-608 అంత్యప్రాస

పల్లవి: కటకటా మీరితివి కలికాలమా - పుణ్య
ఘటన గరవై పోయెఁ గలికాలమా

చ. 1: భూసురుల కామినులు బోయల నామి కులఁ
జేసుకొని యీండ్లై చిచ్చురికిరి
యీసునను నీవలన నెక్కువకులములెల్ల
కాసు సేయకపోయె గలికాలమా

చ. 2: అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి
వన్నె సెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితిని యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా

చ. 3: అరుదగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు
దొరలకమ్ముడు వోయి తొత్తులైరి
చిరకాల సుకృ.త్తమునఁ గొంతైన
కరుణ మార్చితివిగా కలికాలమా

చ. 4: కోవిదుల మను దొరల కులరాణి వాసములు
త్రోవలనె లంజలై తుదిమీరిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబు
గావు వట్టితివిగా కలికాలమా

చ. 5: పట్టభద్రుల నతులు పలుమారు నింద
................రిపెంబులై దీనులైరి
దిట్టైనఁ దిరువేంకటేశుదాసులు నిన్నుఁ
గట్టవేతురు సుమీ కలికాలమా